
edu bee foundation presents

Vasireddy Publications
innovation

1947 నాటి చరిత్రాత్మక వీర తెలంగాణ ప్రేమకథ

# ఒక నజియా కోసం..



a novel by NAGESH BEEREDDY

నగేష్ బీరెడ్డి

1947 నాటి చరిత్రాత్మక వీర తెలంగాణ ప్రేమకథ

# ఒక నజియా కోసం..

## నగేష్ బీరెడ్డి

వాసిరెడ్డి పబ్లికేషన్స్
హైదరాబాద్

**OKA NAZIA KOSAM ..**
***A NOVEL BY NAGESH BEEREDDY***

© Author

**ISBN 978-81-924128-9-4**

**Price: Rs. 150/-**

*First Edition:* **23 Aug 2015**

*For copies: All leading book stores.*
*For online bookings : flipkart.com*
*For e-book: www.kinige.com*
*For mobile book :* www.ebooks.newshunt.com


*Author Contact :*
**Nagesh Beereddy**
email : beereddy12 @gmail.com
*Cell No : 80966 77177*

*Publisher:*
***Vasireddy Publications,***
*B-2, Telecom Qtrs, Kothapet, Hyderabad - 500060*
*Cell No : 90005 28717*

*Visual Promos Director:*
Prani Arts **Praneeth Yendluri**
*Cover Concept:*
**Shravan Kumar Beeram**
*Cover Design:*
**G. Vinod Kumar**
www.gvkgraphics.com
*Page Layout:*
**Kiran Kumar Dasari**

*Printed at:*
**Om Sai Graphics,**
Narayanaguda, Hyderabad.

అమ్మానాన్నలకు..



✍ **కట్టా శేఖర్ రెడ్డి**
ఎడిటర్,
నమస్తే తెలంగాణ దినపత్రిక

# జీవితాన్వేషణ

**కాలానికి** జీవితం ఉంటుంది. జీవితం గతం నుంచి వర్తమానానికి ఒక ప్రవాహమై సాగిపోతుంది. భావోద్వేగాలు కాలాతీతాలు. జీవిత బాధ్యతలకు, బంధాలకు బందీ అయి ఎక్కడో ఒకచోట స్థిరపడిపోవచ్చు.

అయినా గతం ఒక స్మృతిగా వెంటాడుతూ ఉంటుంది. ఎప్పుడో, ఎక్కడో మనసు పొరల్లో క్షిప్తమైన వెనుకటి ప్రేమ పాశాలు ఒకప్పుడు మధురంగా, మరోసారి దుర్భరంగా మెలిపెడుతూ ఉంటాయి. తీరని రుణశేషాలై వేధిస్తుంటాయి. తియ్యని జ్ఞాపకాలై సాధిస్తుం టాయి. వాటిని తవ్వుకుంటూ వెళ్లే కొద్దీ ప్రబంధాలు చేతికొస్తాయి.

ఒక స్వేచ్ఛా పోరాటంతో మొదలైన ఒక తరం జీవితం మరో పోరాటం తలుపుతట్టి కొత్త తరానికి అనేక పాఠాలు, పన్నీరు, కన్నీరు పంచి తెరమరుగైపోతుంది. మూలాలకోసం అన్వేషిం చడంలో మనిషి తనను తానూ కోల్పోతాడు. జీవిత పరమార్థాన్ని తెలుసుకుంటాడు.

పాత అవతారం చాలిస్తాడు... కొత్త జీవితం ప్రారంభిస్తాడు.. ఈ జీవితం శృంఖల అభేద్యంగా కొనసాగుతూ ఉంటుంది. ఇది నా(న)జియా కోసం అన్వేషణ కాదు, నాస్టాల్జియా కోసం అన్వేషణ.. విస్మృత దారులవెంట ఎడతెగని ప్రయాణం..

ఎక్కడ ఎలా ముగుస్తుందో, అసలు ముగుస్తుందో లేదో తెలియని ఉద్వేగాల యాత్ర..

మీరూ యాత్ర మొదలుపెట్టండి!

# అనన్యపర్వం

*'Shl v meet 2day 4 lunch'* ఒక మెసేజ్ ఎప్పుడో వచ్చి సెల్‌ఫోన్ ఇన్‌బాక్స్‌లో కూర్చుంది.

ఎవరు పంపింద్రో. ఊరు లేదు. పేరు లేదు. ఆలోచిస్తూ *'Bt who r u?'* రిప్లై ఇచ్చా.

*'Ananya'* రిప్లై వచ్చింది.

అనన్య? ఎవరీ అనన్య?? ఆరు సెకన్ల కంటే ఎక్కువ పట్టలేదు గుర్తుచేసుకోవడానికి. టక్కున తట్టింది.

యస్.. అనన్య. షార్ట్ ఫిల్మ్‌మేకర్. ముంబై.

మంచి సందేశంతో షార్ట్ ఫిల్మ్ తీసింది, నిర్భయ గురించి. రెండు వారాల క్రితం.. యూట్యూబ్‌లో చూశాను.

'జిందగీ'కి స్టోరీ చేయాలనిపించింది. ఫేస్‌బుక్‌లో వెతికి పట్టుకుని, ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించాను. కానీ యాక్సెప్ట్ చేయలేదు. తర్వాతి రోజు మెసేజ్ పెట్టాను. ఇంటర్వ్యూ కావాలని.. ఇన్‌బాక్స్‌లో.

తెలియని అమ్మాయిలు వెంటనే రిప్లై ఇవ్వరు అనుకున్నాను.. కానీ అనన్య ఇచ్చింది.

*'Tnq boss! mi mes chusi shock ayya. adenti nenu vetukutunna vyakti naake mes pettarani. it's a miracle!'* అంది మెసేజ్‌లో.

'Wt ☹? Nannu vetukutunnara? surprising! bt y?'

'Chepta bt ippudu kaadu ☺'

ఫ్రెండ్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసింది. ఆ రోజు నుంచి నా ప్రతి పోస్టుకు లైక్‌లు, కామెంట్లు కొడుతూనే ఉంది. అప్పుడప్పుడు ఛాటింగ్ చేస్తూనే ఉన్నాం. హైదరాబాద్ వచ్చినప్పుడు ఇంటర్వ్యూ ఇస్తానంది. కానీ ఒక కండీషన్ మీద. అదేంటో ఇప్పటికీ చెప్పలేదు. తను నన్ను ఎందుకు కలుసుకోవాలనుకుంటుందో ఎంతకీ అర్థం కాలేదు.

తన టైమ్‌లైన్‌లోకి వెళ్లి చాలాసార్లు చూశాను. ఫొటోస్ కూడా చూశాను.. ఒకటికి నాలుగుసార్లు.

చాలా అందమైన అమ్మాయి. అల్ట్రా మోడ్రన్ గర్ల్. బోల్డ్ క్యారెక్టర్. ఓపెన్ మైండెడ్. తన ఎఫ్‌బీ పోస్టులు కూడా అలాగే ఉంటాయి. 'ఫేస్‌బుక్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది

మైండ్' అంటారుగా. తన గురించి పెద్ద రీసెర్చ్ చేశాను. ఏదైనా యూనివర్సిటీ వారు చూసి ఉంటే గౌరవ డాక్టరేట్ కూడా ఇచ్చేవారేమో.

రీసెర్చ్ ముచ్చట తర్వాత. తను రిప్లై గురించి ఎదురు చూస్తుందేమో అని..

'Hey! hi ananya. wlcm 2 hyd. wn did u come?' మెసేజ్ పెట్టా.

'Ster day evng. lunch ki kaluddama dinnarka?' అని వెంటనే బదులు.

అమ్మాయిలతో లంచ్ కంటే డిన్నర్ బావుంటుంది. కానీ నాకు ఆ అవకాశం కానీ, అదృష్టం కానీ లేవు. (కారణాలు అడక్కండి) అందుకే 'Lunch' అని స్మైలీ యాడ్ చేసి మాడిన మొహంతో రిప్లై ఇచ్చాను.

'Cho.. chweet.. wr?'

'Nuvve cheppali?' - మీరూ, సారూలాంటి గౌరవవాచకాలు ఎప్పుడో పోయాయి మామధ్య. అంత ఛాటింగ్ ఆల్రెడీ చేశాం.

'Dinner kaite nene cheppedaanni. lunch kaabatti nuvve cheppali'

డిన్నర్ అంటే పోయేదేమో. అందమైన అమ్మాయితో డిన్నర్ చేసే అవకాశం పోగొట్టుకున్నాను.. అనుకుంటూ 'Servy.. near my office' అని మెసేజ్ ఇచ్చాను.

'Servy.. wr is it?'

'Road no 1, Banjara hills'

'K, i wl search in google. v r going 2 meet by 1 o'clok. m i r8?'

'Hey! Yummy.. sure 👍'

'☺'

'☺'

♦

మొబైల్ పక్కన పెట్టి అద్దం ముందుకు వెళ్లా. నాకు నేనే కొత్తగా కనిపించా, పాత మొహమే అయినా. సినీ తారల్ని ఇంటర్వ్యూ చేసిన అనుభవం ఉంది. కానీ సినిమా స్టార్‌లాంటి అమ్మాయితో లంచ్ చేసే అవకాశం ఎప్పుడూ రాలేదు. అందుకే ఈ ఎగ్జయిట్‌మెంట్.

పిచ్చిగడ్డం. ఎన్నడూ లేనిది ట్రిమ్మింగ్ చేసుకున్న. ఫ్రెషప్ అయ్యాక నాలుగైదు రకాల చొక్కాలు మార్చిచూశా.

ట్రిమ్మింగ్ చేయడం.. చొక్కాలు మార్చడం.. దువ్విన తలనే దువ్వడం.. మా ఆవిడ గమనించినట్టుంది 'ఓర్నీ ఏశాలూ..' అన్నట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చింది. కాస్త అనుమానంగానే ఉంది ఆ చూపు. అది నాకు అవమానంగా అనిపించింది. అందుకే ఇక ఓ టీషర్ట్‌కు

*ఫిక్స్ అయిపోవాల్సి వచ్చింది. అది మా మార్క్ జూకెర్‌బర్గ్‌కు ఇష్టమైన టీషర్ట్.*

*సమయం పదయింది.*

*ఇంకా 180 నిమిషాలు.. 10800 యుగాలు ఉంది.. తనను కలవడానికి.*

♦

*నేను నమస్తే తెలంగాణ దినపత్రికలో ఫీచర్స్ పేజీ 'జిందగీ' ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్నాను. రేపు జిందగీలో ఫ్యాషన్ పేజీ. అందుకే ఈ రోజు పెద్దగా ఒత్తిడి ఉండదు మాకు.*

*'నేను రావడానికి సమయం పట్టొచ్చు. పేజీ చూసుకోండి' అని మా టీమ్‌కు చెప్పి బయలుదేరా. 'సర్వీ' దగ్గర డ్రాప్ చేయడానికి అజ్జూ కార్ డ్రైవ్ చేస్తున్నాడు. వాడు నా తమ్ముడు. ఆఫీసులో.. బయటా.*

*'I hav started' అని అనన్యకు మెసేజ్ పెట్టాను. అజ్జూ సర్వీ దగ్గర నన్ను దించి తిరిగి బయలుదేరాడు. అక్కడ కార్ పార్కింగ్‌కు కాస్త ప్రాబ్లమ్ ఉంటుంది. తను ఎక్కడ పార్క్ చేస్తుందో ఏమో. ముందే చెప్పాల్సి ఉండె. అయినా హైదరాబాద్‌లో అమ్మాయిలు వెహికిల్ పార్కింగ్ గురించి పెద్దగా ఇబ్బంది పడాల్సి ఉండదు.*

*'15 mins' అని అనన్య నుంచి 15 నిమిషాల క్రితం వచ్చిన మెసేజ్ చూసి 'వెయిటింగ్ ఫర్ యు. థర్డ్ ఫ్లోర్, టేబుల్ నంబర్ 5' అని రిప్లై ఇచ్చా.*

*'lift 1st floor' రిప్లై వచ్చింది.*

*అది నా గుండె వేగం పెంచింది. నేను ఎంట్రన్స్ డోర్ వైపే చూస్తున్న. కాస్త టెన్షన్‌గా ఉంది. ఎందుకలా ఉన్నానో నాకే అర్థం కాలేదు. వాష్‌రూమ్‌కు వెళ్లి అద్దంలో నాకు నేను 'కంట్రోల్' చెప్పుకున్న.*

*'కూల్ బేబీ కూల్.. 1.. 2.. 3..' అని నంబర్లు లెక్కబెట్టుకుంటూ టేబుల్ దగ్గరికొచ్చి కూర్చున్న.*

*తను ఈపాటికే వచ్చి కూర్చుందేమో అనుకున్న. ఇంకా రాలేదు.*

*ఎంట్రన్స్ వైపు చూశాను. తను అప్పుడే గ్లాస్ డోర్ దగ్గరికి వచ్చింది. బ్లూ జీన్స్ మీద వైట్ టాప్ వేసుకుంది. మఫ్టీలో వచ్చిన దేవకన్యలా.. గాగుల్స్ పెట్టుకున్న గంధర్వ కన్యలా ఉంది. బేరర్ డోర్ తెరిచాడు. వెధవ. నేను వచ్చేటప్పుడు పట్టించుకోలేదు. నేనే డోర్ నెట్టుకుని వచ్చా. తనతో వస్తే నన్ను వేరేలా ట్రీట్ చేసేవాడేమో.*

*తను లోపలికి వచ్చి కళ్లజోడు తీసి హాల్ అంతా కలియ చూస్తున్నది.*

*ఇంతలో మేనేజర్ పరుగున ఆమె దగ్గరకు వెళ్లాడు. 'కాన్ ఐ హెల్ప్ యూ మేమ్?' అన్నాడు.*

*నేను అప్పటి వరకు టేబుల్ మీద చేతులు పెట్టి కూర్చున్నాను. తనని చూడగానే*

వెనక్కి ఆనుకున్నాను. కాలు మీదికి కాలు, చేతిలోకి మొబైల్ వాటంతట అవే వచ్చాయి. ఎవరికైనా కాల్ చేయాలనిపించింది. ఎందుకో తెలియదు, కానీ ఎవరికి?

ప్రవీణ్ నంబర్ కనిపించింది. డయల్ చేశా. వీడు నా పెద్ద తమ్ముడు.

మేనేజర్‌తో 'టేబుల్ నంబర్ 5' చెప్పింది అనన్య.

మేనేజర్ నావైపు చూపించాడు.

'ఇడియట్. వీడేమో ఫోన్ తీయడం లేదు. లిఫ్ట్ చెయ్యరా బాబు.. తను వస్తోంది..' అని మనసులో అనుకుంటూ అనన్య వైపు చూస్తున్నాను.

తను టేబుల్ వైపు, ఆ తర్వాత నావైపు చూసింది. స్మైల్ ఇస్తూ.. అడుగు ముందుకు వేసింది. దాంతో పాటే ప్రవీణ్ లిఫ్ట్ చేశాడు. థ్యాంక్ గాడ్!

నేనూ స్మైల్ చేస్తూ.. 'యా ప్రవీణ్.. ఏం జరుగుతోంది?' అని అడిగాను.. స్మైల్ ఇవ్వడం సహజం. స్మైల్ చేయడం కృత్రిమం.

'అన్నా! పేజీ నడుస్తుందన్న' చెప్పాడు ప్రవీణ్.

'ఓకే.. కంటెంట్ ఏం పెడుతున్నరు'– ఈ వాక్యం చివరలో ప్రశ్నార్థకం పెట్టాలో, ఆశ్చర్యార్థకం పెట్టాలో అర్థం కాలేదు. ఆ వాక్యాన్ని అలా పలికాను మరి. నా పరిస్థితి అలాంటిది .

'అన్నా! చెప్పినవ్‌గా ఫ్యాషన్ పేజీగదా.. ఏముందన్న అయిపోతది..'

అనన్య దగ్గరికి వచ్చి 'ఏ.. హాయ్' అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చింది.

నేను కనుబొమ్మలతో హాయ్ చెప్తూ లేచాను. తను చిన్న హగ్ ఇచ్చింది..

ట్రాన్స్‌ఫార్మర్‌ని వాటేసుకున్నట్లు షాక్ కొట్టింది.

'ప్ర.. వీ.. ణ్..' పిలుపు లయ తప్పింది.

'అ.. న్నా..' వాడూ నన్ను అనుకరించే ప్రయత్నం చేశాడు.

'ఒక్క నిమిషం'

'అన్నా'

'గ్లాడ్ టూ మీట్ యూ.. ప్లీజ్ బీ సీటెడ్' అనన్యకు కుర్చీ చూపించా. పిచ్చి మర్యాద కాకపోతే తనకు తెలియదా.. కుర్చీ ఉందని.. కూర్చోవాలని. 'థ్యాంక్యూ' అంది కూర్చుంటూ.

'ప్రవీణ్'

'అన్నా'

'ఒక్క నిమిషం రా'

'అన్నా'- వీడికి రచయిత ఎందుకో ఈ సన్నివేశంలో ఆ ఒక్క డైలాగే ఎక్కువసార్లు రాశాడు.

'వన్ మినిట్ ప్లీజ్' ఫోన్ మూస్తూ అనన్యని రిక్వెస్ట్ చేశా.

'యా షూర్' అంది తనూ ఫోన్ తీస్తూ. తన ముంగురులు మొహం మీదికి వచ్చాయి. కుడిచేత్తో నుదుటి మీంచి ఎడమ చెవి వెనకాలకు తోస్తూ.. నా వైపు చూసింది. తన కుడిచేతికి టర్కోసీ బ్రేస్‌లెట్ గమనించాను.

'ప్రవీణ్!'

'అన్నా

'అదీ.. యా.. ఏం పెడుతున్నరా?'

'అన్నా..'

'అదేరా పేజీలో ఏం పెడుతున్నరు?'

'తెల్సుకదన్న.. ఫ్యాషన్ బొమ్మలు' వాడు కాస్త చిరాకు పడ్డట్లు అనిపించింది.

'ఆ, ఓకే ఓకే, నేను వచ్చేసరికి లేట్ కావొచ్చు. ఇంపార్టెంట్ పర్సన్‌తో మీటింగ్. పేజీ జాగ్రత్తగా చూస్కోండి. కంటెంట్.. డిస్‌ప్లే, కలర్స్, బ్యాలెన్సింగ్, హెడ్డింగ్స్, లీడ్.. అన్నీ జాగ్రత్తగా చూస్కోండి' రెండో వాక్యంలో మొదటి రెండు పదాలు నేను కాస్త గట్టిగా పలకడం తను గమనించిందో లేదో.

ప్రవీణ్ మాత్రం 'ఓకే అన్న' అని ఫోన్ పెట్టేశాడు. నా పరిస్థితి అర్థం చేసుకోకుండా.

అమ్మాయిల్ని ఇంప్రెస్ చేయడానికి అబ్బాయిలు ఇలాంటి అనవసరపు బిల్డప్‌లు ఇస్తారని తెలుసు. కానీ నేనూ అలా చేస్తానని నాకే తెలియదు. సహజంగానే మగాడి హార్మోన్స్ అలా పనిచేస్తాయేమో.

ఫోన్ పక్కన పెడుతూ 'సారీ అనన్య.. ఎనీవే గ్లాడ్ టూ మీట్ యూ' అన్నాను. ఎంత అమ్మాయి అయినా ఇన్నిసార్లు గ్లాడ్ టూలు అవసరం లేదేమో.

ఫోన్ హ్యాండ్‌బ్యాగ్‌లో పెడుతూ 'నిజంగా చాలా హ్యాపీగా ఉంది ఇవ్వాళ. మిమ్మల్ని ఇలా కలవడం.. కానీ ఎందుకు ట్రిమ్ చేశారు. బియర్డ్‌లోనే బావున్నారు' అంది అనన్య.

ఈ గడ్డం ముచ్చటకంటే.. 'మిమ్మల్ని'.. ఈ పదమే ఎందుకో నాకు ఇబ్బందిగా.. ఇబ్బంది కూడా కాదు.. దీనికి అటు ఇటు పదం నిఘంటువులో వెతకాలేమో? మనుషులు దగ్గరయినప్పుడు సాన్నిహిత్యం దూరం అవుతుందా?- ఈ సందేహంతోనే 'థ్యాంక్యూ' అని అనేశా.

'ఎందుకు?' అడిగింది ఆశ్చర్యపోతూ.

'మిమ్మల్నీ.. అన్నారుగా.. అందుకు?'- మిమ్మల్ని అనే పదం నొక్కి మరీ చెప్పాను.

'సారీ.. మరి నువ్వు.. అన్నారూ..' రూ.. ని చాలాసేపు సాగదీసింది. కొంచెం గ్యాప్ తీసుకున్నాక 'సరే చెప్పు' అంది.

'మీరే చెప్పాలి.. సారీ నువ్వే చెప్పాలి'

'ఇంటర్వ్యూ అడిగింది నువ్వు'

'అడిగింది నేనే. కానీ కండీషన్స్ అప్లై అన్నది నువ్వు కదా. ఇంతకీ ఏంటా కండీషన్?'

'కండీషన్ కాదు.. కంపల్సరీ.. ఇట్స్ ఏ నెసెసిటీ'

'తప్పనిసరియా.. ఏంటది? ల్యాగ్ అయిపోతోంది అనన్య, కొంచెం స్ట్రెయిట్‌గా మాట్లాడుకుందామా?'

'ఇదిగో! నీకు స్ట్రెయిట్‌గానే కూర్చున్నాగా..' తను జోక్ వేశాననుకుంది. కానీ నా ముఖకవళిక గమనించి 'ఓకే బాబా.. అర్థమైంది.. చెప్తాను. కానీ.. ముందు ఆర్డర్ చెప్పు.. బేరర్ అప్పట్నించీ మనల్ని తినేలా చూస్తున్నాడు' అంది. నేను పిలిచి చెప్పేలోపు 'హైదరాబాద్ వస్తే బిర్యానే కదా.. కొత్తగా ఆర్డర్ ఇచ్చేదేముంది? పహెలే బిర్యానీ.. బాద్‌మే ఖుర్బానీ' అని తనే ఆర్డర్ ఇచ్చి.. మొదలెట్టింది.

'హుం.. చూడు బాస్! అసలు విషయానికి వస్తున్న. మ్యాటర్ ఏంటంటే.. నువ్వొక స్టోరీ రాయాలి. నా గురించి కాదు. నా ఫ్రెండ్ గురించి. ఇదే కండీషన్'

'స్టోరీనా. తప్పకుండా. ఎవరా అమ్మాయి?'

'అమ్మాయి కాదు.. అబ్బాయి.. కార్తీక్ రామస్వామి'

'అబ్బాయా! అయ్యో మాది మహిళల పేజీ కదా?'

'నేను అడిగేది నీ జిందగీ పేజీలో రాయడానికి కాదు'

'ఒక కథ. కార్తీక్ కథ. అది రాయాలి. పుస్తకంగా..' అన్నది రెండు చేతులతో జుట్టు సర్దుకుంటూ. అప్పుడు తన మెడలో వేలాడుతున్న చెయిన్‌కు రెండు పెండెంట్స్ ఉండడం గమనించాను. ఆ గొలుసు తన బ్రేస్‌లెట్‌కి మ్యాచింగ్‌గా ఉంది.

'పుస్తకమా? నేనా??' ఊహించని పరిణామం ఎదురైనప్పుడు కలిగే ఆశ్చర్యం తాలూకు అనుభూతి కలిగిన అనుమానంతో అడిగా సంతూర్ మమ్మీలా. 'నేనా.. కాలేజా?' అన్నట్లు.

'అరవై ఆరేళ్ల తర్వాత ఒక ఉత్తరం తిరిగి వస్తుంది. ఒక తాత తన ప్రేయసికి రాసిన ఉత్తరం అది. ఆవిడెవరో తెలుసుకునేందుకు మనవడు బయలుదేరతాడు. ఇదీ స్టోరీ లైన్ దీన్ని ఒక నవలగా రాయాలి'

'నవలా? ఏం మాట్లాడుతున్నావ్ తల్లీ. నేనేదో జిందగీ పేజీకి రాసుకుని బతికేటోడ్ని. నాకెందుకు చెప్పు ఈ నవలలు, కథలు..?'

'అవును మరి. మీకెందుకు ఈ కథలు..? అపరిచితులు కదా మీరు..?' చివరి

పదాలు దీర్ఘం తీసింది. గౌరవవాచకం కూడా కలిపింది.

'అపరిచితులు?' ఇది ఎక్కడో తడుతోంది.

'అవును. అపరిచితులు.. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా.. అపరిచితులు..' అంది.

'ఓ.. అదా? అది నేను రాసిన మొదటి కథ. అదొక్కటే రాశా. ఆ తర్వాత ఎప్పుడూ రాయలేదు' అన్నాను నేనేదో తప్పుచేసినట్లు.

'తెలుసు. మొదటి దానికే అవార్డ్ వచ్చింది కదా, యువతరం విభాగంలో ఇంటర్నేషనల్ అవార్డ్! అందుకే కనెక్ట్ అయ్యా' అంటూ బ్యాగ్‌లోంచి ఫైల్ తీసింది. తను తీస్తున్నప్పుడు మెడలో వేలాడుతున్న పెండెంట్స్‌లో ఒకదానిపై 'ఎ', రెండో దానిపై 'ఎన్' అనే ఆంగ్లాక్షరాలు గమనించా.

'అప్పటి నుంచే నిన్ను గమనిస్తున్న. ఐదొందలకు పైగా వ్యాసాలు.. మూడొందల మంది జీవితాలు.. 140 ఎపిసోడ్లు.. మూడు స్పెషల్ కాలమ్స్.. 36 కవర్‌స్టోరీలు.. ఒక కథ.. ఒక అవార్డు.. ఎన్నో రివార్డులు.. చివరగా ఒక పుస్తకం.. అదీ వర్షన్ టు పాయింట్ జీరో కూడా.. తొమ్మిదేళ్ల జర్నలిజంలో ఇదీ నువ్వు చేసింది. చూశావా నీ మీద పెద్ద రీసెర్చే చేశా కదా. ఈ ఫైల్ ఏదైనా యూనివర్సిటీ వాళ్లకు ఇస్తే నాకు గౌరవ డాక్టరేట్ కూడా ఇస్తారేమో' అంది నవ్వుతూ.

గౌరవ డాక్టరేట్.. ఈ పదం నాదే. నాకు రెండు నిమిషాల నుంచి డైలాగు లేదని అర్థమైంది. అందుకే 'ఎందుకు ఇదంతా?' అని అడిగా.

'ఒక అన్వేషణ.. ప్రతి చర్యకూ ప్రతిచర్య ఉంటుంది. న్యూటన్ మూడో సూత్రం. కార్తీక్ ఇంటికి ఒక ఉత్తరం వచ్చింది. దాని ప్రతిచర్యగా నజియా దొరికింది. కార్తీక్ నాకు కలిశాడు. దాని పర్యవసానం నువ్వు దొరికావ్. నేను నిన్ను కలిశాను. దీని పరిణామంగా.. ఒక పుస్తకం రావాలి' తను కళ్లలోకి సూటిగా చూస్తూ చెప్తున్నది.

నేను ఒక నిట్టూర్పు శ్వాసతో పాటు తన సూటి చూపుల్నీ వదులుతూ 'చూడమ్మాయ్.. నువ్వు ఏదైనా చెప్పుగానీ.. ఈ కథలు, పుస్తకాలు నా వల్ల కాదు. నేను, నా జిందగీ, నా గూగుల్ గాడు.. ఇది చాలు నా జీవితానికి..'

'మరి ఎందుకు రాశావ్ ఆ కథ?' నిందిస్తుందో.. నిలదీస్తోందో అర్థం కాలేదు.

'అదీ.. ఏదో సందర్భంలో అపార్ట్‌మెంట్ కల్చర్‌కు కనెక్ట్ అయి రాశాను. ఇప్పుడు చెప్పనా? నువ్విలా న్యూటన్ మూడో సూత్రం మూటగట్టుకుని వస్తావని తెలిస్తే రాసేవాడ్నే కాదు. నాకంత టైమ్ ఉండదు.. అనన్య?'

'టైమ్.. కరెక్టే.. ఫేస్‌బుక్ గైడ్ అనే పనికిరాని పుస్తకం రాయడానికి కూడా టైమ్ వుండదు.. కదా..?' పెదవి విరిచింది.

'పనికిరాని పుస్తకం'– అని తను నన్ను టెంప్ట్ చేయాలని చూస్తోంది. రెచ్చగొడితే రెచ్చిపోయే రకం కాదు నేను. విగ్రహంలాంటి నిగ్రహం.. దీనికి పర్యాయపదంగా నా పేరు రాసుకోవచ్చు.

'అదేం పనికిరాని పుస్తకం కాదు. యుటిలిటీ వాల్యూ ఉన్న పుస్తకం' చెప్పా మొహం తిప్పుకుంటూ.

'తెలుసు. సారీ.. పనికిరాని పుస్తకం అన్నందుకు. అంతలా ఆదరణ ఉంది కాబట్టే వెర్షన్ టు పాయింట్ జీరో అని కూడా వేశారుగా.. అదేదో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ అయినట్లు..' తను పొగుడుతుందో, తిడుతుందో అర్థం కావట్లేదు.

'అదేదో.. సరదాగా..' నేను చెప్పబోతుండగానే.. పదాల మధ్య కామాలా దూరి 'వెర్షన్ 3.0 కూడా రాస్తావా?' అంది. అది హేళనో.. ఇంకేదో. ప్రతిసారీ ప్రాస దొరకదు.

'ఏమో.. రాస్తానేమో.. మా బంగారం మాష్టారు అడగాలేగానీ.. ఫోరు.. ఫైవు.. కూడా రాస్తానేమో'

'అవునా? బంగారం! మీ బంగారం.. మరి ఈ బంగారం కోసం రాయలేవా? రాయకూడదా?' తను అమాయకంగా, ముద్దుగా అడిగింది. తన మొహం చిన్నప్పుడు 'ఇంకో ముద్ద తిను నాన్నా..' అంటూ గోరుముద్దలు తినిపించిన మా అమ్మ మోములా కనిపించింది.

కనిపించిందో.. అనిపించిందో తెలియక నవ్వాను ముసిముసిగా. ఆ తర్వాత గట్టిగా. పట్టరాని ఆనందం తాలూకు నవ్వు అది. కానీ నేనేం ఆనందంగా లేను. పైగా ఈ అమ్మాయి నా మీద ఏదో కుట్ర పన్నుతోంది. అది తన నవ్వులో కూడా కనిపిస్తున్నది.

బేరర్ బిర్యానీ తెచ్చాడు. మధ్య మధ్యలో వచ్చి ఓసారి గ్లాసులు, ఇంకోసారి ప్లేట్లు.. మరోసారి ఉల్లిగడ్డ, నిమ్మకాయ ముక్కలు పెట్టి వెళ్లాడు. బిర్యానీ వడ్డిస్తున్నప్పుడు అనన్య ఫైల్ తన ఎడమవైపు కుర్చీలో పెట్టింది. దాన్ని ఎవడైనా ఎత్తుకెళ్లిపోతే బాగుండు అనిపించింది నాకు.

'మనం తింటూ కూడా మాట్లాడుకోవచ్చు' అన్నది నేను మౌనంగా రెండు ముద్దలు తిన్న తర్వాత.

నేను తన వైపు చూసి **స్మైల్ చేశాను**.

తను ఒక సిప్ మంచినీళ్లు తాగి గ్లాస్ పక్కన పెడుతూ 'ఒక విషయం చెప్పనా?'అంది.

'చెప్పు' అన్నట్లు తల ఊపి తనవైపు, గ్లాసువైపు చూశాను. తన లిప్‌స్టిక్ కొంచెం గ్లాసు అంచున అంటుకుంది.

'నీ బ్లాగ్, ఫేస్‌బుక్, గతంలో రాసిన ఆర్టికల్స్.. అన్నీ చదివాను. వాటి నుంచే ఈ కథ రాయడానికి నువ్వే కరెక్ట్ అనిపించింది' మళ్లీ మొదలెట్టింది.

'నేనే ఎందుకు? కథలు, నవలలు రాసేవారు వేరే ఉన్నారుగా, చాలామంది. చాలా గొప్ప రచయితలు..'

'ఉన్నారు. లేరని నేనట్లేదు.. కానీ సంతూరు సబ్బు కోసం పొరుగూరు వెళ్లం కదా. అందుకే నిన్ను అడుగుతున్నాను. జర్నలిస్టులు కూడా చాలామంది ఉన్నారు. కానీ నేను నిన్నే ఎందుకు అడుగుతున్నాను?'

'అవును! ఎందుకు అడుగుతున్నావ్?' అడిగాను సంతూరు, పొరుగూరు.. ఏంటో అర్థంకాక.

'రెండు కారణాలున్నాయి' అన్నది కుర్చీలోంచి ఫైల్ తీసి టేబుల్ మీద పెడుతూ. 'మొదటిది.. నీ కాన్సెప్ట్ –ఒక స్టోరీ.. మల్టీ స్క్రీన్‌ప్లేలు. అది నాకు బాగా నచ్చింది. ఒక కథని అన్ని రకాలుగా  చెప్పడం ఆకట్టుకుంది. కథ ఒక్కటే.. కానీ ఎవ్వడి వెర్షన్ వాడికి ఉంటుంది. నువ్వోలా చెబుతావ్. నేనోలా చెబుతా. కాపీ, ప్లజరిజమ్ అనేవి సోది మాటలు అన్నావ్‌గా. ఆ లైన్ కూడా నచ్చింది' అన్నది. ఫైల్‌లోని ఒక పేపర్ క్లిప్పింగ్ చూపిస్తూ 'ఇక రెండోది.. ఫీనిక్స్ జ్యోతి.. ఈమె గురించి చాలామంది చాలాసార్లు రాసి ఉండొచ్చు. కానీ నువ్వు రాసిందే రీప్రింట్ ఎందుకు వేశారు? పదివేల కాపీలు! అంతకుముందు సాక్షిలో కూడా రాశారు కదా.. వాళ్లనెందుకు అడగలేదంటావ్.. ఆ వందేమాతరం ఫౌండేషన్ వాళ్లు..'

వందేమాతరం ఫౌండేషన్, రీప్రింట్.. ఈ విషయాలు తనకెలా తెలుసో అర్థం కాలేదు. అవి కాన్ఫిడెన్షియల్ కదా? ఇక్కడ సందేహం తీర్చుకోవడం కంటే ముందు సమాధానం ఇవ్వాల్సి ఉంది. పరిస్థితి అలాంటిది. అందుకే 'అది వేరు. అది ఫీచర్స్ స్టోరీ. కావాలంటే కార్తీక్ కథతో అలాంటి ఫీచర్ స్టోరీ రాస్తా'

'రాస్తావ్. మీ పేపర్లో. బట్. టుడేస్ న్యూస్‌పేపర్ ఈజ్ టుమారోస్ వేస్ట్ పేపర్. నువ్వు నీ ఫీచర్ చూస్తున్నావ్. నేను ఫ్యూచర్ చూస్తున్న' అన్నది.

వేస్ట్ పేపర్ అనడం ఎక్కడో తగిలింది. హర్ట్ అయ్యా. నా నోట మాట రాలేదు. నోట్లోకి బిర్యానీ కూడా వెళ్లలేదు.

'చూడు నాగ్! ఎవ్రీ లవ్ స్టోరీ ఈజ్ బ్యూటీఫుల్, బట్ అవర్స్ ఈజ్ మై ఫేవరెట్. చాలా ప్రేమకథలుంటాయి ఈ ప్రపంచంలో. కానీ అది మనదైనప్పుడు.. మనవాళ్లదైనప్పుడు ఆ కిక్కు.. ఆ థ్రిల్లు.. ఆ ఫీలింగే వేరు. చాలా గొప్పగా వుంటుంది. ఇదీ అలాంటి కథే. ప్రపంచ చరిత్రలో చెప్పుకోదగ్గ పోరాటం.. తెలంగాణ సాయుధ పోరాటం.. అలాంటి ఉద్యమ నేపథ్యమున్న ప్రేమకథ మరుగున పడిపోకూడదు. నువ్వు ఫీచర్ రాయి. కాదనను. కానీ ప్రతి ఏడాది వాలెంటైన్స్ డే రోజు పబ్లిష్ చేసే ప్రేమకథల్లో ఒకటిగా అది మిగిలిపోకూడదు. ఒక పుస్తకంగా.. వీలైతే.. ఓ సినిమాగా రావాలి. అదీ నా తపన'

'పుస్తకం.. సినిమా? రాయొచ్చు కానీ..' తను బిర్యానీ కంటే వేగంగా నన్నే తింటోంది.

నామాట పూర్తికాకుండానే మళ్లీ మొదలెట్టింది, ఫైల్ చూపిస్తూ..

'ఇదిగో ఇక్కడ చూడు. ఇక్కడివాళ్లు ఎందుకు రాయడం లేదో. రాసిన కథని ముట్టుకోకుండా.. వంద.. వంద కథలు రాసుకోవచ్చు అన్నారు విజయేంద్ర ప్రసాద్ గారు. ఎస్ఎస్ రాజమౌళి వాళ్ల డాడీ. ఇది చదివినప్పుడు నీకేం అనిపించలేదా నాగ్? ఈ ఇంటర్వ్యూ మీ 'జిందగీ'లోనిదేగా?' తను తినడం ఆపి చాలాసేపైంది. ప్రతి దానికి ఫైల్‌లో ఓ ప్రూఫ్ చూపిస్తోంది. సమాధానం ఇవ్వడం తప్ప వాదనకి నాకు అవకాశం లేదని, అవసరం రాదని అర్థమవుతున్నది.

'అనిపించింది. కానీ కథ రాయడానికి.. చాలా ఉండాలి. సబ్జెక్ట్‌తో కనెక్ట్ అవ్వాలి. అందుకు బాడీలో ఓ ఎలిమెంట్ ఉండాలి. అది బల్బులో ఫిలమెంట్ లాంటిది. ఫిలమెంట్ ఉంటేనే బల్బు వెలుగుతుంది. ఎలిమెంట్ ఉంటేనే కథ బావుంటుంది'

'అంటే..? నాకర్థం కాలేదు' తను తినడం మొదలెట్టింది. బిర్యానే!

'ఐ మీన్.. నువ్వు చెప్పే కథ.. ఈ పోరాటాలు.. ఉద్యమాలు.. గతం.. చరిత్ర.. ఇవన్నీ యాంటిక్ సబ్జెక్ట్స్.. ఓ అరవై ఏళ్లు వెనక్కి వెళ్లాలి. నేను కాంటెంపరరీకే ఎక్కువ కనెక్ట్ అవుతా. సింపుల్‌గా చెప్పాలంటే.. నేను యాంటికిటీ ఫుల్ బాటిల్‌కు కనెక్ట్ అయినంతగా.. ఈ యాంటికిటీకి అవ్వలేను'

'అంటే రాయడం ఇష్టమే. కానీ ఈ సబ్జెక్ట్ రాయడం ఇష్టం లేదన్నమాట'

'నాట్ లైక్ దట్! బట్. మేబీ.. ఇంచు మించు అంతే' నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలియలేదు.

'లేదు.. నువ్వు కనెక్ట్ అవుతావ్'

'ఎలా చెప్పగలవ్?'

'చెప్తా చెప్తా' తను ఫింగర్ బౌల్ కోసం ఎదురు చూస్తూ.. 'అయ్యావ్.. రాశావ్ కూడా.. రాణీ రుద్రమ నుంచి.. వీరనారి సిరీస్. అంతకుముందు వాహ్ హైదరాబాద్.. ప్యారానాపూల్.. ముచ్‌కుందా.. ఆపరేషన్ సెప్టెంబర్ 17.. ఇలా చాలా ఉన్నాయ్.. ఇంతకుమించి ఏం చెప్పాలి? ఏం చూపించాలి. రాశావ్. చాలా. అందుకే నువ్వు చెప్పే సోకాల్డ్ ఎలిమెంట్ నీలో ఉందని అంటున్నాను.'

'ఫింగర్ బౌల్‌లో చేయి పెడుతూ 'సోకాల్డ్?' అన్నాను కాస్త గట్టిగానే.

'యస్. సోకాల్డ్. కనెక్ట్ అవుతావని ప్రూవ్ చేస్తే ఒప్పుకుంటావా?' అంది తను టిష్యూ తీసుకుంటూ.

ముందు ఇష్యూ క్లోజ్ అవ్వాలని.. 'ఓకే.. తప్పకుండా' అన్నాను.

'ప్రామిస్?' అన్నది చేయి చాస్తూ.

'ప్రామిస్‌లు ఎందుకుగానీ.. చెప్పు' – ఏం ప్రూఫ్ తెచ్చిందో ఏంటో ఈ మహాంకాళమ్మ.

'మనం ఇక్కడికొచ్చి హాఫెన్ హవర్ అయింది. ఇక్కడ ఎన్ని ఉన్నాయో చూడు. టేబుల్స్.. చెయిర్స్.. గ్లాసెస్... బౌల్స్.. ప్లేట్స్.. ఇన్ని ఉన్నాయి కదా. ఇక్కడ బ్యూటీఫుల్ ఫ్లవర్ వాజ్ ఉంది. అక్కడ చూడు సాలిడ్ డిజిటల్ క్లాక్ ఉంది.. అంతకుమించి నీకు ఎదురుగా ఒక అందమైన అమ్మాయి ఉంది. కానీ నువ్వు అప్పటి నుంచి ఆ మూలకున్న ఆ హుక్కానే ఎందుకు చూస్తున్నావ్? 30 నిమిషాల్లో 49 సార్లు?'

'ఆశ్చర్యం.. అంతకు మించి ఇంకేదో! 49 సార్లు నిజమో కాదో తెలియదు. కానీ, నేను నిజంగానే దాన్ని చూస్తున్నాను. ఈ విషయం పైకి చెప్పలేకపోయినా, లోపల అర్థమవుతున్నది. నిజమే.. అనన్య తర్వాత ఇక్కడ నన్ను ఆకట్టుకున్నది.. అదే. బాల్యమిత్రుడు బార్‌లో కలిసినట్లు.. ఏదో గొప్ప ఫీలింగ్. మళ్లీ హుక్కా వైపు చూశాను. తన లెక్క ప్రకారం 50వ సారి. అంతకంటే ఎక్కువసార్లు తనని చూశానని తను గమనించలేదా? అమ్మాయిలు ఇంతేనా? ఆడవారి మాటలకు అర్థాలే వేరులే అన్నట్లే ప్రవర్తిస్తారా?' – ఒక కన్‌ఫ్యూజన్.

మనుషుల్ని కన్విన్స్ చేయలేనప్పుడు కన్‌ఫ్యూజ్ చేయాలి.

తను నన్ను కన్విన్స్ చేయడానికి ప్రయత్నించింది. ఇప్పుడు కన్‌ఫ్యూజ్ చేసేసింది. దాని నుంచి ఓ క్లారిఫికేషన్ వచ్చింది. కనెక్ట్ అయ్యాను.

తననే చూస్తున్నాను. కళ్లలోకి సూటిగా.

తనూ అలానే చూస్తూ 'చెప్పు' అన్నది.

ఏం చెప్పాలి. ఎలా చెప్పాలి.. తెలియక చూపుతిప్పుకున్న. తల తిప్పుతున్నప్పుడు నా చూపు తన పెండెంట్స్ మీద పడింది. 'హుం.. ఇందాకటి నుంచి అడుగుదామను కుంటున్నాను.. ఆ రెండు పెండెంట్స్‌లో ఏ ఫర్ అనన్య కావొచ్చు.. మరి ఎన్ అంటే..?' అడిగాను కొత్త అనుభూతిలో విహరిస్తూ.

'ఎన్ ఫర్.. ఎన్ ఫర్ నగేష్ బీరెడ్డి..' అంది మొహాన్ని వృత్తాకారంలో ఒక రౌండు తిప్పుతూ.. 'హా హ హా..' అని నవ్వింది.

'ఎందుకా నవ్వు?' అని అడగాలన్న ప్రశ్న నాలో ఉదయించేలోపు పెండెంట్ తీస్తూ.. 'కాదు.. ఎన్ ఫర్ నజియా.. కార్తీక్ రామస్వామి అన్వేషణ.. ఈ నజియా కోసమే.. ఇప్పటి వరకు ఈ బరువు నా మీద ఉండె. ఇప్పుడు ఆ బాధ్యత నీ చేతిలో పెడుతున్నా' అంటూ నా కుడిచేయి లాగి అరచేతిలో పెట్టింది. 'చెప్పు. నీ సోకాల్డ్ ఎలిమెంట్ దొరికిందా?' అని అడిగింది, నా చేయి మూసి తన చేతితో కప్పుతూ.

తను భారం దించుకుంది. నా గుండె బరువెక్కింది.

'చెప్పనా?' తన చేయిపై నా ఎడమ చేతిని వేసి.. తన కళ్లలోకి చూస్తూ 'ఆభరణాల్ని అవయవాలుగా భావించే ఆడవారు.. అవి మనకు ఆప్యాయంగా ఇస్తున్నప్పుడు కలిగే

ఫీలింగ్ ఎలా ఉంటుందో తెలుసా?' అని అడిగాను.

'ఇలాగే ఉంటుంది. చాలా గొప్ప అనుభూతి ఇది. తల్లి చనుబాలు.. భార్య మురిపాలు.. వేర్వేరు. కానీ దేనికదే ప్రత్యేకం. ఇదీ అలాంటి మరో ప్రత్యేక సందర్భం' తను కళ్లతో మౌనంగా మట్లాడుతున్నది. తన మనసు నుంచి ఈ మాటలు నా గుండెకు చేరాయి... చేతుల మీదుగా. మధ్యలో నజియా ఉంది. తన కోసం మా ఈ చారిత్రక భేటీని అరచేతుల మధ్య చీకట్లోంచి చూస్తున్నది.

'కార్తీక్.. కార్తీక్ రామస్వామిని ఎప్పుడు పరిచయం చేస్తున్నావ్?'

'చేస్తా. థ్యాంక్యూ నాగ్. నేను నమ్మాను. నువ్వు రాస్తావని. నేను రాయించగలనని. ఆ హుక్కా వెలిగిస్తే కిక్కొస్తది. నిన్ను రగిలిస్తే బుక్కొస్తది. తెలుసు నాకు..' తను నవ్వింది. హుక్కావైపు, నా వైపు చూస్తూ. ఇద్దరిది ఇంచు మించు ఒకే నవ్వు.

సుఖాంతంగా ముగిసే సినిమాలో శుభం కార్డు పడే ముందు నటీనటులంతా కలిసి నవ్వుతున్నట్లు ఉన్నది మా నవ్వు.

♦

రింగుల జుట్టు, మాసిన గడ్డం, బోల్డ్ ఫ్రేమ్ కళ్లద్దాలు, ఖద్దరు కుర్తాలో చాలా సాదాసీదాగా ఉన్న కార్తీక్ రామస్వామిని కలిశాను. ముంబైకి చెందిన ఓ కోటీశ్వరుడి కొడుకంటే ముందు నమ్మలేదు నేను. తన కథ చెప్పాక నమ్మక తప్పలేదు. నజియా కోసం తన అన్వేషణను ఇక తనే మీకు చెబుతాడు. ***ఈ కథ ఎక్కడ మొదలవుతుందో అక్కడే ఆగిపోతుంది.*** కార్తీక్ చెప్పే తన కథ పక్క పేజీలో మొదలవుతుంది. తనతో కలిసి మీరూ ప్రయాణం చేస్తున్నందుకు కృతజ్ఞతలు.

# 1

# ముంబై, 2009

'రేయ్! నీకేమైనా పిచ్చా? ఆ అమ్మాయి రాదురా! వెయిట్ చేయడం వేస్ట్' వినోద్ ఎప్పటిలాగే అరుస్తూ వచ్చాడు.

**'లేదు. ప్రియా వస్తుంది. ఇక్కడ ఎదురు చూడడం ఇది ఇరవయ్యో రోజు. జీవితంలో ఏదైనా పని వరుసగా ఇరవై ఒక్క రోజులు చేస్తే ఇక ఆ పని వారికి అలవాటైపోతుందట. అలాగే ఆరు నెలలు చేస్తే జీవితంలో ఒక భాగమైపోతుందట. ఇది డాక్టర్ మాక్స్వెల్ మాల్ట్స్ థియరీ అని వినోద్ చెబుతుంటాడు. ఇది నిజం కాదని చెప్పే ఫిలిప్పా లాలే అధ్యయనం గురించి కూడా వాడు వివరిస్తుంటాడు. కానీ నేనిప్పుడు ఎదురు చూస్తున్నది ఫిలిప్పా గురించో, ప్రియ కోసమో కాదు"** – నేను నా ఐప్యాడ్‌లో కొత్తగా వచ్చిన ఎవర్‌నోట్ రాసుకుంటున్నాను. ఆనందంగా ఉన్నప్పుడు ప్రమాణాలు చేయకూడదు. కోపంగా ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదు. బాధలో ఉన్నప్పుడు సమాధానం ఇవ్వకూడదు. నేనిప్పుడు బాధలో ఉన్నాను. సమాధానం ఇవ్వలేకున్నాను. అందుకే ఇలా రాసుకుంటున్నాను.

"హలో బాస్! రాయడం అయిందా? ఏదో ముఖ్యమైన విషయం అన్నావ్. ఎర్లీగా

రమ్మన్నావ్. ప్రియ గురించేనా? చెప్పరా' అంటూ వినోద్ ఐప్యాడ్ లాక్కున్నాడు.

'ప్లీజ్ విన్నూ!" అనాలని ఉంది. 'లెట్ మీ కంప్లీట్' అని లాక్కునే ప్రయత్నం చేశాను. కానీ లాభం లేదు. వాడు తీసుకెళ్లిపోయాడు.

**దూరంగా పార్క్ చేసిన కార్ల వైపు వెళ్తున్నాడు. రెడ్ కలర్ ఆడీ ఏ6 కాబ్రియోలెట్. వాడికి కార్లంటే ఇష్టం. కాదు పిచ్చి. వాడి కారు పక్కనే నా కార్ మెర్సిడాస్ బెంజ్ ఏ 180 సీడీఐ పార్క్ చేసి ఉంది. బ్లాక్ కలర్. ప్రియకి ఆ రంగంటే చాలా ఇష్టం.**

**మేం మా హోటల్ భాగమతి వెనకాల రోజూ కలుసుకునే స్పాట్‌లో ఉన్నాం. చర్చిగేట్ రోడ్‌లో ఉండే ఈ ప్రదేశానికి రావడానికి అందరికీ అనుమతి ఉండదు. ఈ ఇరవై రోజుల నుంచే కాదు. మా కాలేజ్ డేస్ నుంచి కూడా ఇదే మాకు ఇష్టమైన ప్రదేశం. ఇక్కడి గుల్మొహర్ చెట్లకు, వాటి చుట్టూ వేసిన సిమెంటు కుర్చీలకు, బీన్ బ్యాగులకు మేమూ, మా కార్లు పరిచయమే. ప్రియకు కూడా ఈ ప్లేస్ బాగా నచ్చేది. ఈ ఇరవై రోజుల్నించి తనని మర్చిపోలేకపోతున్నాను. రోజూ ఎదురుచూస్తున్నాను. కానీ నేను ఇవాళ రోజులా లేను. ఇప్పుడు ఎదురుచూస్తున్నది ప్రియ కోసం కాదు. అనన్య కోసం. ఇదీ అమ్మాయి పేరే కానీ తను అమ్మాయి మాత్రమే కాదు. ఆడబాంబు. ఏం చేస్తాం. మ్యాన్యుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్. మేం చేసే అన్ని పనులూ చేస్తుంది. సిగరెట్ తాగుతుంది. కలిసి మందు కొడుతుంది. అందుకే తనని మేం అమ్మాయిలా ట్రీట్ చేయం. ఈపాటికి వచ్చి ఉండాలి. కానీ ఇక్కడ ఇరవై రోజులుగా కొత్తగా ఏం జరగడం లేదు. అంతకు ముందిక్కడ రోజుకో ప్రళయం జరిగేది. కొత్త స్టార్టప్‌లు, ఐడియాలు, డిస్కషన్లు, ప్లాన్లు, ప్రాజెక్టులు.. ఇరవై రోజులుగా అలాంటివేం లేవు. దానికి నేనే కారణం. కాబట్టి అందరికీ నా మీద కాస్త కోపం ఉంది. వారికింకా తెలియదు. ఈ రోజు త్వరగా రమ్మని మెసేజ్ ఎందుకు పెట్టానో?** – వినోద్ ఐప్యాడ్ తీసుకెళ్లాడు కానీ ఆండ్రాయిడ్ ఫోన్ కూడా లాక్కెళ్లడం మర్చిపోయాడు. నేనిప్పుడు అందులోనే ఎవర్‌నోట్ రాస్తున్నాను.

**అప్పుడప్పుడూ వినోద్‌ను చూస్తున్నాను. అనన్య కోసం కూడా పార్కింగ్ వైపు ఓ కన్ను ఉంచాను. వినోద్ సిగరెట్ అంటించాడు. బహుశా ఇది మూడోది కావొచ్చు. ట్యాబ్ కార్‌లో విసిరి వేశాక క్యాంటిన్ ముందు అటూ ఇటూ కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ ఫోన్ మాట్లాడడం మొదలెట్టాడు. కచ్చితంగా అమ్మాయితోనే మాట్లాడుతున్నాడు. ఎందుకంటే అలాంటప్పుడే ఎన్ని సిగరెట్లు కాలుస్తాడో వాడికే కాదు, పాన్‌షాప్ పాషాకు కూడా తెలియదు.**

**హారన్ పెద్దగా మోగింది.**

**అది అనన్య కార్. వచ్చేముందు కార్ హారన్ పెద్దగా మోగించడం తనకు అలవాటు.**

**తుఫాను వచ్చేముందు ఒకటో నంబరు హెచ్చరికలా ఉంటుందా హారన్.**

'ఒకటో నంబర్ హెచ్చరిక. వచ్చిందిగానీ ఇకనైనా ఆపి ఇక్కడ్రారా బాబు' వినోద్ నా ట్యాబ్‌లో ఎవర్‌నోట్ అప్‌డేట్ చూశాడు. సిగరెట్ తన రెడ్‌చీఫ్ బూట్లకింద నలుపుతూ పిలుస్తున్నాడు. నేను వెళ్లలేదు.

తనే వచ్చి పక్కన కూర్చుంటూ.. 'వచ్చిందిగా సైతాన్. ఇప్పుడైనా ఆపి నోరు విప్పుతావా?' అన్నాడు. తనవైపు చూసి ఓ కృత్రిమ నవ్వు విసిరాను. నా నిజమైన నవ్వుకంటే ఇదే బావుంటుందని వాడు అప్పుడప్పుడూ అంటుంటాడు.

అనన్య కార్ దిగింది. బ్లాక్ షార్ట్ మీద పింక్ కలర్ స్లీవ్‌లెస్ టాప్ వేసుకుంది. బ్లాక్ కలర్ బ్యాక్‌ప్యాక్ బావుంది. ఎవరు సెలెక్ట్ చేస్తారో ఏమోగానీ తన డ్రెస్సింగ్ స్టైలే వేరు. ఎందుకంటే అబ్బాయిల జీన్స్ అమ్మాయిలకూ బావుంటాయి. కానీ అమ్మాయిల డ్రెస్ అబ్బాయిలు వేసుకుంటే తేడాగా ఉంటుంది కదా! అదేంటో అన్నూకి అవీ భలే సూట్ అవుతాయి.

అన్నూ వచ్చేటప్పుడు తన చుట్టూ నిశ్శబ్దాన్ని కూడా మోసుకుంటూ వస్తుంది. ఎందుకంటే తను వస్తున్నప్పుడు చుట్టుపక్కల వాళ్లకు ఆమెను చూడడమే సరిపోతుంది. ఇంకేం మాట్లాడుకునే అవకాశం ఉండదు. క్యాంటీన్‌లో సాసర్లు పగిలిపోతుంటాయి. ఒకరో ఇద్దరో కాఫీ మీద పోసుకుంటుంటారు. సిగరెట్‌తో పాటు వేళ్లు కూడా కాల్చుకుంటారొకరు. బాయ్‌ఫ్రెండ్‌ను తిట్టేసి ఒక అమ్మాయి వెళ్లిపోతుంది.. పక్కన అమ్మాయిని పెట్టుకుని మరో అమ్మాయిని చూస్తుంటే ఎవరు ఊరుకుంటారు!? ఇలాంటివి మా కళ్లకు అలవాటే. కొత్తవాళ్లకే జీర్ణం అవ్వడానికి కాస్త సమయం పడుతుంది.

అన్నూ వస్తూ వస్తూనే పాకెట్‌లోంచి సిగరెట్ తీసింది. బ్యాక్ పాకెట్‌లో, బ్యాక్‌ప్యాక్‌లో వెతికింది. లైటర్ లేనట్టుంది. ఒక అబ్బాయిని అడిగింది. ఇవ్వడం తప్ప అబ్బాయికి ప్రత్యామ్నాయం లేదు. అన్నూ సిగరెట్ వెలిగిస్తున్నది. కానీ నాకు మాత్రం ఆ మంట లైటర్ ఇచ్చిన అబ్బాయి గాళ్‌ఫ్రెండ్ మొహంలో కనిపించింది. ఆమె గుండెలో వెలిగించినట్లు అనిపించింది.

అనన్య రెండు పఫ్‌ల పొగ ముంబై వాతావరణ కాలుష్యంలో కలిపేసింది. మూడో దమ్ముకు మా దగ్గరికి చేరి పొగ నా మొహాన ఊదింది. ఇదే పొగ ప్రియా ఊదితే నా పరిస్థితి ఇంకోలా ఉండేది. కానీ ఇక్కడ అన్నూ కదా.. నాలో హార్మోన్లకు పొగ కేరాఫ్ అడ్రస్ తెలుసు. అందుకే అవి స్పందించలేదు.

'ఇంపార్టెంట్! ఏంట్రా ఇంపార్టెంట్? త్వరగా రమ్మన్నావ్. ఏంటి విషయం?' అన్నూ మరో దమ్ము లాగుతూ అడిగింది.

'చాలా ఇంపార్టెంట్' గంటన్నర తర్వాత నా మౌనదీక్ష వదిలి.. ఎవర్‌నోట్‌లోంచి బయటికి వచ్చాను.

'మరీ! ఎంబీబీఎస్ చదివి మెడికల్ షాప్ పెట్టుకున్నవాడిలా ఫేస్ అలా పెట్టకు, చిరాగ్గా ఉంది.. విషయమేంటో చెప్పు..' అది అన్నూ ప్రశ్న కాదు. ఆర్డర్‌కు, వార్నింగ్‌కు మధ్య పదమేదో అది. పాత సామెతల్ని కొత్తగా చెప్పడం తన ప్రత్యేకత. అవి సందర్భాన్ని బట్టి సింక్ అవుతాయో లేదో అన్నూని కాదు, దయచేసి నన్నూ, విన్నూని కూడా అడగొద్దు.

'తాతయ్య పరిస్థితి బాలేదు. హార్ట్ ఎటాక్. రాత్రి హాస్పిటల్‌లో జాయిన్ చేశారు'

'ఓ గాడ్.. సారీ సారీ.. పదా వెళ్దాం. తాతయ్య హాస్పిటల్‌లో ఉంటే.. నువ్విక్కడికి రమ్మన్నావేంటి?' అన్నూ సిగరెట్ ఆర్పుతూ అన్నది.

'లేదు. నీతోనే పని. ఇది నువ్వు మాత్రమే చెయ్యగలవ్. ఇదిగో ఇది చూడు' జేబులోంచి ఉత్తరం తీసిచ్చాను.

'అంతేరా! నేను ముందొచ్చాను.. నేనడిగితే చెప్పలేదు. ఇదేమో మనల్ని వెయిట్ చేయించింది. దీనికిస్తున్నావ్. ఏంట్రా ఇది?' అన్నూ ఉత్తరాన్ని పరిశీలిస్తున్నప్పుడు వినోద్ లాక్కున్నాడు, సందర్భంలో సీరియస్‌నెస్ తెలియక.

'చిల్లర కోసం చిల్డ్ బీర్ కొన్నట్లు.. ఎందుకా తొందర.. విన్నూ! ఇలా ఇచ్చెయ్. నేనింకా చూడలేదు' తిరిగి లాక్కునే ప్రయత్నం చేసింది.

'ఇద్దరు కలిసి దాన్ని చింపేసేర్రా. అది లెటర్ కాదు.. లైఫ్. ఒక లైఫ్.. తాతయ్య జీవితం' – ఎవరో స్టాట్యూ అన్నట్లు.. ఇద్దరూ ఫ్రీజ్ అయిపోయారు నా మాట విని. ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. నా వైపు చూస్తూ.. 'లైఫా! తాతయ్య లైఫా?' వాక్యం ఒకటే.. కానీ ఇద్దరి నోట్లోంచి వేర్వేరుగా వచ్చింది. రెండూ ఒకేరకమైన స్వరాలు. కానీ రెండింటి మధ్య డెసిబెల్స్ తేడాగా ఉన్నాయి.

వినోద్ ముడత పడిన ఉత్తరాన్ని సరి చేస్తున్నాడు. ఇస్త్రీలాంటి ప్రయోగమేదో అరచేతుల్లో కానిస్తున్నాడు.

'ఆ లెటర్ ఎప్పటిదో చూడండి. తాతయ్య రాసింది. ఒకావిడకి..' నా గొంతులో

వ్యత్యాసం కనిపించింది. జీరబోయింది. అవరోహణ క్రమంలో నా స్వరం తగ్గినట్లు నాకే అనిపించింది. ఇద్దరూ నా పక్కన కూర్చున్నారు. ఉత్తరాన్ని అటూ ఇటూ తిప్పి చూస్తున్నారు.

'రాత్రి చాలా జరిగాయ్. అందుకే మిమ్మల్ని తొందరగా రమ్మన్నాను. పబ్ నుంచి లేట్ నైట్ ఇంటికెళ్లానా? ఇంట్లో ఎవరూ లేరు. తాతయ్యను హాస్పిటల్‌కు తీసుకెళ్లారని వాచ్‌మ్యాన్ చెప్పాడు. ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు అలాగే వెళ్లి పోయాను. తాతయ్య ఐసీయూలో ఉన్నారు. డాడీ పక్కన హాల్లో కూర్చున్నారు. చేతిలో ఉత్తరం ఉంది. కళ్లలో నీళ్లు. నన్ను చూసి ఇంకా ఎమోషనల్ అయ్యారు. నాతో ఏదో చెప్పారు. చాలాసేపు చెప్పారు. చెప్తూనే ఉన్నారు.. కానీ ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలియదు. ఉదయాన్నే లేపారు. 'కార్తీక్ ఆర్ యూ ఓకే.. వేకప్ రే. కాస్త మాట్లాడాలి' అన్నారు. నేను సారీ చెప్తూ లేచాను. ఫేస్‌వాష్ చేసుకునొచ్చి కూర్చున్నా. 'కార్తీక్! ఈ ఉత్తరం చూడు' అని ఇది చేతికిచ్చారు డాడీ. పాతబడిన ఆ ఉత్తరం ఇంకుతో రాసింది. చదివేలోపే చిరిగిపోయేలా ఉంది. 'ఏంటి డాడీ ఇది?' అడిగాను. 'ఉత్తరం.. తాతయ్య రాసింద'ని చెప్పారు. 'వాట్.. తాతయ్య రాసిందా? ఎవరిక'ని అడిగాను. 'ఇది చూశాకే తాతయ్య ఇలా అయిపోయారు. ఇప్పుడు ఆ పేరే కలవరిస్తున్నారు. ఇదిగో రాత్రి ఏదో చెప్పబోయారు. కానీ మాటరాలేదు. ఇలా రాసిచ్చార'ని డాడీ జేబులోంచి విజిటింగ్ కార్డ్ తీసిచ్చారు. కార్డు వెనకాల నజియా– డైరీస్ – హైదరాబాద్ అని చిందరవందరగా రాసి ఉంది. నేను అటూ ఇటూ తిరుగుతూ సిగరెట్ కాలుస్తూ చెప్తున్నాను. ఇదంతా చెప్పేటప్పుడు నా పదాలకు, వాక్యాలకు మధ్య సందులో అన్నూ ఉత్తరం చదువుతున్నదనేది గమనిస్తూనే ఉన్నాను. మాలో తెలుగు చదవగలిగింది తనొక్కతే. హైదరాబాదీ.

"నజియా.. టు అడ్రస్‌లో కూడా ఇదే పేరు. ఉత్తరం రాసింది ఈమెకే. కానీ చేరలేదు. ఇది చూడగానే ఎమోషనల్ అయ్యారు. 'అంటే ఏంటి విషయం?' అని నేను ఆలోచిస్తుండగానే.. 'కార్తీక్ ఆలస్యం చెయ్యకు. యూ హ్యావ్ టు గో హైదరాబాద్' అన్నారు డాడీ. ఎందుకంటే నజియాను తీసుకురావాలన్నారు. తాతయ్య పరిస్థితి బాగోలేదు. రెండు మూడు రోజుల కంటే ఎక్కువ బతకరు. ఈలోపు నువ్వు హైదరాబాద్ వెళ్లి రావాలన్నారు. 'అసలు ముందు ఈ లెటర్‌లో ఏం రాసిందో చూద్దాం డాడ్.. నాకు కాస్త టైమ్ ఇవ్వండి' అన్నాను. అందుకే మీకు మెసేజ్ పెట్టాను' ఈ ఉద్రిక్తత మధ్య నా ఉద్వేగ పూరిత ఉపన్యాసం పూర్తయ్యేసరికి అన్నూ ఉత్తరం చదవడం పూర్తిచేసింది.

'ఓ గాడ్! ఏంట్రా ఇది. ఎవరీ నజియా?' అన్నూ నన్ను గట్టిగా హగ్ చేసుకుంది. 'కార్తీక్.. సిక్స్‌టీ ఇయర్స్ బ్యాక్.. గ్రేట్ లవ్ స్టోరీ బేబ్..' నా కళ్లలోకి చూస్తూ

చెబుతున్నప్పుడు తన కళ్లు పెద్దవయ్యాయి. చేతులు నా భుజాల్ని పట్టుకున్నాయి. ఎగ్జయిటింగ్‌గా వుంది. తనకు మొదటి లవ్ లెటర్ వచ్చినప్పుడు కూడా అంతలా ఫీలవ్వలేదోమో!

'అన్నూ! నాకు ఈ ఉత్తరంలో ఏం రాసి ఉందో కావాలి. ఆమె ఎవరో తెలియాలి' అన్నూ బుగ్గల్ని చేతుల్లో పట్టుకుని అడిగాను. అప్పుడు తన మొహం ఎల్‌ఐసీ లోగోలో చేతులు మధ్య దీపంలా కనిపించింది. ఇంతకంటే ఉపమానం ఇక్కడ అవసరం లేదోమో అనిపించింది.

'ఓకే ఓకే.. చదువుతా.. బట్.. గుడ్డు పగలకుండా ఆమ్లెట్ వేసినట్లు.. వాట్ ఏ మిరాకిల్! ఈ ఉత్తరం ఇంతకాలం తర్వాత ఎక్కడి నుంచి రాశారో అక్కడికే తిరిగి ఎలా వచ్చిందంటావ్?' అన్నూ నా లోగోను చెరిపి.. కాస్త దూరంగా జరిగింది.

'వస్తుంది. నాకు తెలుసు. అది తర్వాత చెప్తాగానీ ముందు లెటర్ చదువు' వినోద్‌లో కూడా ఆసక్తి కనిపించింది.

ఇలాంటి సమయంలో ఫోజ్ కొట్టడం అన్నూకు బాగా అలవాటు. కానీ ఈసారి అలా ఏం చేయలేదు. పరిస్థితి అలాంటిది. అందుకే వెంటనే బీన్ బ్యాగ్ మీద కూర్చుని ఉత్తరం చదవడం మొదలెట్టింది.

''టు..

నజియా కేరాఫ్ చంద్రకిషోర్,

ఇంటి నంబర్ 12 డాష్ 12 బై 5, ఇసామియా బజార్,

కోఠి, హైదరాబాద్

తారీఖు : 2 డాష్ 9 డాష్ 1948

నజియా!

నేను క్షేమంగానే ఉన్నాను. నువ్వు క్షేమంగానే ఉన్నావని ఆశిస్తున్నాను. నేనిక్కడ బొంబైలో తిరుగుతున్న గానీ నా దిల్ పూరా హైద్రబాదుల్నే ఉన్నది. నువ్వే యాదికొస్తున్నవ్. నిన్ను ఎప్పుడెప్పుడు సూస్తానా అనే ఎదురు చూస్తున్న. నాకు రావాల్ననే ఉంది. కానీ ఆడ పరిస్థితులు ఎట్లున్నయో ఎర్కయితలేదు. గిప్పుడనిపిస్తున్నది, మేం నిజాం మీద బాంబు ఎయ్యకుండా ఉండాల్సింది. ఆపరేషన్ సీతాఫల్ బర్బాద్ అయితదని అనుకోలే. పవార్,

గంగారంను ఇంకా ఇడిసిపెట్టలేదంటగా. నేనొస్తే నన్నూ బీ గిరఫ్తార్ సేస్తరు. దానికేం భయపడ్తలే. కానీ నేను జైలుకుబోతే నువ్వేమైపోతవోని సోంచాయిస్తున్న. పరిస్థితులు సద్దుమణిగినంక వచ్చి నిన్ను ఈడ్కి తీసుకొస్త. నువ్వన్నావ్ 'ఏక్ ఆద్మీ గురించి నువ్వు ఆగిపోకు.. ఇంతమందికి మేలు చేసే పన్జేస్తున్నరు.. నిజాంను చంపాలనుకుంటే సాహసం అవుతది, కానీ చంపితే మనకు స్వాతంత్ర్యం వస్తది..' అని. 'మనందరి సుఖూన్ కోసం ఇంతమందికి ఆజాద్ ఇవ్వాలనుకుంటున్న నీ ఆశయం కోసం మనం కొంతకాలం దూరం అయినా భరిస్తా' అని కూడా అన్నవ్. అందుకే నేను ముందడుగు ఏసిన. కానీ భరించాల్సిన పరిస్థితులు ఇంత భయంకరంగా, దారుణంగా ఉంటాయని.. మా పథకం విఫలం అవుతుందని అనుకోలే. ఒక్కటే మాట నజియా.. మన ప్రేమ నిజం. మనల్ని ఎవరూ విడదీయలేరు. పోలీసు సైన్యాలు ఒస్తున్నయంట. ఇంగ హైదరాబాద్‌కు బీ సొతంత్రం వస్తదని ఈడ అనుకుంటుండ్రు. జల్దిగనే మనం కలుస్తం. అంతా మంచిగనే అయితది. నీ ఉత్తరం కోసం ఎదురుసూస్తుంట. అప్పటిదాంక పైలం.

ప్రేమతో..

వేయి కనులతో ఎదురుచూస్తూ..

నీ రామస్వామి

ఇంటి నంబర్ : 11, రంగప్పనగర్, దట్టపాడ రోడ్, బోరావలి, బొంబై

అన్నూ ఫ్రమ్ అడ్రస్ చదువుతున్నప్పుడు ఒక్కసారిగా గాలి వీచింది. గుల్మొహర్ చెట్లది పులకింతో, పూనకమో తెలియదుగానీ.. అటూ ఇటూ ఊగడం మొదలెట్టాయి. పూలు రాలిపడుతున్నాయి. ఆ పూలతోపాటు అన్నూ చేతిలో ఉత్తరం కూడా కొట్టుకుపోయింది.

విన్నూ, నేను దాన్ని పట్టుకునేందుకు పరుగుతీశాం. అన్నూ మాత్రం అలాగే కూర్చుంది.

వినోద్ చేతికి ఉత్తరం దొరికింది. తిప్పి తిప్పి చూస్తూ ఆగిపోయిన నా దగ్గరకు వచ్చాడు. కళ్లలోకి చూస్తూ ఓ నవ్వు నవ్వాడు. వీపు తట్టాడు. భుజం మీద చెయ్యి వేసి అన్నూ దగ్గరికి తీసుకెళ్లాడు.

అన్నూ ఇంకా 1948లో నజియా దగ్గరే ఉన్నట్లుంది. నా వైపు విన్నూ వైపు చూసి 'ఏంటి? అన్నట్లు చేయి ఆడించింది. కానీ మాటలు లేవు. ఎగ్జయిటింగ్‌గా ఉంది. ఏదో భావోద్వేగం. ఎలా మాట్లాడాలో తెలియడం లేదు. ఇంచుమించు ముగ్గురి పరిస్థితి ఒకేలా ఉంది.

'సో.. వేయి కనులతో వేచి చూస్తూ.. నీ రామస్వామి..' తెలుగు రాకపోయినా వినోద్ ఉత్తరం చదువుతున్నాడు. అన్నూ చదివిన ఎండ్ లైన్ అంత టచింగ్‌గా ఉంది. తనలా. తన మాటల్లా. అంతకుమించి ఈ ఉత్తరంలో మ్యాటర్‌లా.

'ఆ కనులు ఇంకా అలా వేచి చూస్తూనే ఉన్నాయి కార్తీక్! అప్పు చేసి డబ్బు అకౌంట్‌లో దాస్తారా ఎవరైనా? ఇలాగే ఉంది మ్యాటర్. సమ్‌థింగ్ ఈజ్ దెయిర్. యూ హ్యావ్ ఏ గ్రేట్ రూట్స్. ఆమె ఇప్పటి మీ నాయనమ్మ కాదు. అంటే ఈ ఉత్తరం అసలు హైదరాబాద్‌లో ఆమెకు చేరలేదు. ఇక్కడ మీ తాతయ్యేమో వేరొకర్ని పెళ్లి చేసుకున్నాడు. ఏదో జరిగింది? అసలేమై ఉంటుంది? అంతగా ప్రేమించిన నజియాను వదిలేసి మీ తాతయ్య ఎందుకు ఇక్కడే ఉండిపోయారు?' అన్నూ ప్రశ్నల వర్షం.. మమ్మల్ని తడిపేస్తున్నది. ఈ తడి రాత్రి డాడీ కళ్లలో చూసిన గుర్తు. నేను నిన్నటి జ్ఞాపకాలు గుర్తు చేసుకోవడం తప్ప ఏమీ మాట్లాడలేకపోతున్నాను.

'అన్నూ! దీనీ మీద డేట్ చూడు. సెప్టెంబర్ 2, 1948.. ఒక ఉత్తరం ఒక చిరునామాకు వెళ్లినప్పుడు అక్కడ సంబంధిత వ్యక్తులు లేకపోతే తిరిగి ఏ చిరునామా నుంచి వెళ్లిందో అక్కడికే వస్తుంది. ఇదీ అలాగే జరిగింది. కానీ ఇంతకాలం ఎందుకు పట్టిందో అర్థం కావడం లేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. అరవై సంవత్సరాలు. దీనికి ప్రత్యేక కారణాలు ఉండొచ్చు' వినోద్ చివరి మాటను బాగా సాగదీశాడు.

'ఇంకో విషయం తెలుసా? మీ తాతయ్యకు, నిజాంకు ఏదో ఉంది. ఆయన పట్టుకుని బంధిస్తాడని ఇక్కడికి వచ్చి దాక్కున్నాడు. అంటే.. అక్కడికి వెళ్లే పరిస్థితులు రాలేదు. కుదరలేదన్నమాట. ఈ అన్నింట్లో మనకిప్పుడు కావాల్సింది ఏంటో తెలుసా? నజియా ఏమైపోయింది.. ఇప్పుడుందా? లేదా? ఉంటే ఎలా ఉంది?' అన్నది అన్నూ.

'ఇదే డాడీ అడిగింది. అర్జెంటుగా తీసుకురావాలట. అందుకే మనంహైదరాబాద్ వెళ్లాలి. ముందు ఇందులో ఉన్న విషయం డాడీకి చెప్పాలి'

'పళ్లు లేని కుక్క కరిస్తే సూది లేని ఇంజిక్షన్ ఇచ్చినట్టు.. ఇంత సడన్‌గా హైదరాబాద్‌కా? ఇదే విషయం మార్నింగ్ చెబితే లగేజ్‌తో వచ్చేవాళ్లం కదా?!' అన్నూ నిట్టూర్చింది.

'లేదు.. నేను హాస్పిటల్‌కు వెళ్లి ఈ విషయం ముందు డాడీకి చెప్పాలి. వెళ్లాల్సిన అవసరం ఉందో లేదో మాట్లాడాలి. బట్.. మీరు మాత్రం వెళ్లేందుకే ఫిక్స్ అయిపోండి'

'నేను ఫిక్స్ అయ్యా' అన్నది అన్నూ.

♦♦♦

# 2

# ఆపరేషన్ హైదరాబాద్

'డాడ్ నజియా ఉందో లేదో? తెలియదు. అలాంటప్పుడు వెళ్లడం అవసరం అంటారా?'

'వెళ్లాలి కార్తీక్! వెళ్లాలి. రేపు బతికి ఉంటామో లేదో మనకు తెలియదు. కానీ ప్రతి రాత్రి పడుకునే ముందు మొబైల్‌లో అలారమ్ పెట్టుకుని పడుకుంటాం. ఎందుకు? రేపు ఉంటామనే ఆశ. నజియా ఉంటుందని ఆ ఆశతోనే వెళ్లు. తప్పక దొరుకుతుంది'

'దొరకొచ్చు. కానీ ఆమె ఇంకా దాదా కోసమే ఎదురు చూస్తూ ఉంటుందా? అసలు ఈయన గుర్తుంటారంటారా? ఎవర్నో పెళ్లి చేసుకుని ఎక్కడో హ్యాపీగా ఉండి ఉండొచ్చు. మర్చిపోవడం అమ్మాయిలకు చాలా ఈజీ డాడీ!' అన్నాను.

'మే ఐ కమిన్ సర్' అని వినిపిస్తే మేమిద్దం డోర్ వైపు చూశాం. మేనేజర్ రాఘవన్. ఫైల్స్ మీద ఏవో సంతకాలు కావాలని వచ్చారు. డబ్బున్నోళ్లకు ఇవి ఎప్పుడూ తప్పవు. నన్ను అటు కూర్చొమ్మంటూ సైగ చేశారు డాడీ.

నేను డాడీకి ఎదురు సోఫాలో కూర్చున్నాను. ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో మాకిచ్చిన స్పెషల్ హాల్‌లో ఉన్నాం మేం. ఐసీయూలో దాదాను చూసి వచ్చాక నజియా గురించి,

హైదరాబాద్ ప్రయాణం గురించి మాట్లాడుకుంటున్నాం.

రాత్రంతా నిద్రలేదు. డాడీ నీరసంగా కనిపిస్తున్నారు.

భగత్ రామస్వామి మా డాడీ పేరు. భాగమతి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఎమ్‌డీ. మాకు అన్నీ ఉన్నాయి. కోట్ల రూపాయలు.. భూములు.. ఫ్యాక్టరీలు.. బంగ్లాలు.. హొటళ్లు, రిసార్టులు.. స్టాక్‌మార్కెట్ షేర్లు..

లేనిది ఒకటే.. సంతృప్తి. అందుకోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటారు డాడీ.

ఎప్పుడూ బిజీగా ఉండేవాళ్లకెప్పుడూ స్వేచ్ఛ దొరకదు. టైమ్ లేదని తరచూ చెప్పే వారికెప్పుడూ సమయం దొరకదు. ఏదైనా పని రేపటికి వాయిదా వేసేవారికోసం రేపనేది ఎప్పుడూ రాదు. ఈ మాటలు డాడీ ఎప్పుడూ చెబుతుంటారు. అనుకున్న పని వెంటనే మొదలెట్టాలనే తత్వం ఆయనది. పరిస్థితులు ఎలా ఉన్నా జరగాల్సిన పనులు జరుగుతూ ఉండాలి. ఇప్పుడూ అంతే. నేను హైదరాబాద్ వెళ్లాలట! వెళ్లడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ తను ఉందో లేదో.. ఉంటే ఎక్కడుందో.. ఎలా వెతికేది? ఉన్నా.. ఇంకా దాదా కోసమే ఎదురు చూస్తూ కూర్చుంటుందా? ఎవర్నో పెళ్లి చేసుకుని ఎక్కడో హ్యాపీగా ఉండి ఉంటుంది. ఈ ప్రేమ.. దోమ అనేవి పెద్ద ట్రాష్.

ప్రియానే చూడండి.. ఇలా వొచ్చి అలా వెళ్లిపోయింది నా జీవితంలోకి. **'నువ్వంటే నాకిష్టం. కానీ నీ మొహం ఇంకెప్పుడూ నాకు చూపించకు'** అంది. డాడీ నాకు అన్నీ ఇచ్చారు. సగటు మనిషి బతకడానికి అవసరమైన వాటికంటే చాలా ఎక్కువ. చాలా ఎక్కువే ఇచ్చారు. ఆస్తులు, అంతస్తులు, కార్లు, కార్డులు.. అంతకుమించి పొగరు, స్వేచ్ఛ కూడా ఇచ్చారంది ప్రియా. నాకిచ్చిన స్వేచ్ఛను నేను వృథా చేస్తున్నానన్నది.

ఒక్కమాట అడిగినందుకు, ఇన్ని మాటలన్నది. నేనడిగిందేం కొత్త మాట కాదు. నా జీవితంలో మొదటిసారిగా అడిగిన మాట అంతకన్నా కాదు. చాలామందిని చాలాసార్లు అడిగిన మాటే. కానీ ఈ అమ్మాయి ఏమైనా ఆకాశం నుంచి ఊడిపడిందా?

నువ్వు మనిషివి కాదంది. నీకు మనసే లేదన్నది. పొగరన్నది. బలుపన్నది. నాకు డబ్బు కంటే పనికి రాని ఇలాంటివి చాలానే ఉన్నాయని మొదటిసారి సర్టిఫికెట్ ఇచ్చింది. లేకపోతే ఏంటి?

ఆరు నెలల క్రితం నేను ఇలా ఉండేవాడ్ని కాదు. ఆ కార్తీక్ వేరు. ప్రియా నా జీవితంలోకి వచ్చినప్పుడు అర్థం కాలేదు. తను వెళ్లిపోయాక తెలుస్తున్నది.

రైలు వచ్చే ముందు గేటు వేస్తారా? గేటు వేశాక రైలు వస్తుందా?– అనే సందేహం లాంటి ఫీలింగ్స్ నావి. ప్రియా కూడా నాకు ఇలాంటి క్వశ్చన్‌మార్కే. తను వచ్చాక నేను మారానా? నేను మారే ముందు తను వచ్చిందా?

కార్తీక్ నువ్వు మునుపటిలా ఉండడం లేదంటోంది మమ్మీ. 'కార్తీక్ ఆర్ యూ ఓకే'.. అని పదే పదే అడుగుతున్నారు డాడీ. నా జీవితంలో నుంచి వెళ్లిపోయిన ఏ అమ్మాయి గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. కానీ ప్రియా గురించి ఎందుకు ఆలోచిస్తున్నానో నాకే తెలియడం లేదు. అన్నీ ఇచ్చిన అమ్మాయిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాం. కానీ అన్నీ ఇచ్చినట్లే ఇచ్చి వెళ్లిపోయిన అమ్మాయిని ఎప్పటికీ మర్చిపోలేం. ప్రియా నన్ను మర్చిపోయిందా? మరి మిగిలిన అమ్మాయిలు?! అందరూ మర్చిపోయే ఉంటారు. పాసింగ్ క్లౌడ్స్!

మర్చిపోవడం అమ్మాయిలకు చాలా సులభం. అలా మర్చిపోగలగడం వాళ్లకు దేవుడిచ్చిన గొప్ప వరం కాబోలు. నజియా కూడా తాతయ్యని ఎప్పుడో అలాగే మర్చిపోయి ఉంటుందని నేను అనుకుంటున్నాను. తను కూడా అప్పుడు అమ్మాయే కదా.

డాడీ ఫైల్స్ మూసి రాఘవన్‌కు ఇస్తూ 'కమ్ బేటా!' అని పిలిచారు. నేను సోఫాలోంచి లేచి ఆయన పక్కకు వెళ్లి కూర్చున్నాను. రాఘవన్ హాల్ డోర్ క్లోజ్ చేస్తూ.. 'సార్ కాస్త బ్రేక్‌ఫాస్ట్ అయినా చేయండి. పార్సిల్ అక్కడ పెట్టాను, మర్చిపోకండి సార్' అని చెప్పి వెళ్లిపోయాడు.

'తింటావా?' పార్సిల్ వైపు చూపిస్తూ అన్నారు డాడీ.

'వెళ్తా డాడీ!' ఆకలికంటే ఎక్కువగా ఈ ఆలోచనలే ఉన్నాయి మనసులో. 'వెళ్లడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ..?'

'కానీ వాట్? వెళ్లాలి కార్తీక్! నాకోసం, నీకోసం కాదు. దాదా కోసం. అది మన బాధ్యత. ఆమె ఉందా లేదా అనేది తర్వాత విషయం. ఒక నిజం సమాధి కాకూడదు. మనకోసం దాదా ఏదో త్యాగం చేశారు. అందులో ఆమె బలైందా? బతికే ఉందా? ఇది మనం తెలుసుకోవాల్సిన ప్రశ్న కాదు. చూసుకోవాల్సిన బాధ్యత. ఇది నీకిప్పుడు అవసరం కూడా.. ఇంకా ప్రియా గురించి ఆలోచిస్తూ కూర్చోకు. నిన్నెప్పుడూ ఏమీ అడగలేదు. ఈ ఒక్కటి అడుగుతున్నాను. ఇది నువ్వు చెయ్యాలి బేటా!' అన్నారు.

'కానీ డాడ్.. ద ఫ్లో దట్ హ్యాస్ పాస్డ్ విల్ నెవర్ పాస్ ఎగైన్ డాడ్.. కాలం నదిలాంటిది. ప్రవాహంలో ఒకసారి తాకిన నీటిని మనం మళ్లీ తాకలేం. ఏ ప్రవాహం మళ్లీ వెనక్కి రాదు'

'కావొచ్చు.. మరి అలాంటిప్పుడు నువ్వు ప్రియా కోసం ఇంకా ఎందుకు ఎదురుచూస్తున్నావ్. ఫ్లో అనుకోవచ్చుగా, జస్ట్ లైక్ పాసింగ్ క్లౌడ్..'

'డాడ్! నేను తన కోసం ఎదురు చూడడం లేదు. మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నాను. మర్చిపోవడం అమ్మాయిలకు చాలా ఈజీ డాడ్.. అబ్బాయిలకే కష్టం. దాదా చూడు

ఇంకా మర్చిపోలేకపోతున్నారు ఆమెను? మరి ఆమె??'

డాడీ మౌనంగా ఉండిపోయారు కాసేపు. మా మధ్య సంభాషణకు, కడుపులో ఆకలికి, మనసులో అలజడికి సంబంధం లేదు. దాదా చావుబతుకుల్లో ఉన్నారు. మాకు రాత్రి నుంచి తిండి లేదు. నిద్రలేదు. నీరసంగా ఉన్నాం. మాట్లాడే ఓపిక లేదు. ఇలాంటి సమయాల్లో ఓపిక ఉండడానికి విటమిన్లు, ప్రొటీన్లతో సంబంధం ఉండదేమో. మమ్మల్ని మాట్లాడిస్తున్నది ఓపిక, సహనం కాదు.. మరేంటో తెలుసా? ఒక ఉత్తరం! ఒక ఊపిరి!! ఒక నజియా!!!

'కార్తీక్! లైఫ్ అంటే ఏంటో తెలుసా నీకు? ఈ కార్లు, బంగాళాలు, పేరు, ప్రతిష్ట.. వీటి కోసం వెంపర్లాటలు.. ఇది కాదు జీవితం. ఇవన్నీ మనిషిని మరమనిషిని చేస్తాయి. సమాజం గురించి, ఇరుగు పొరుగు గురించి.. చివరికి అయినవాళ్ల గురించి కూడా ఆలోచించకుండా కట్టడి చేస్తాయి. ఇది నా జీవితంలో ప్రతి క్షణం జరుగుతూనే ఉంటుంది. డబ్బు సంపాదనలో పడి.. నా జీవితాన్ని నేను పూర్తిగా కోల్పోయాను. అందుకే నీకు అన్నీ ఇవ్వాలనుకున్నాను. ఇచ్చాను. కానీ అయినవాళ్లని మాత్రం ఇవ్వలేకపోయాను.. లేరు. ఏం చేయాలి. ఇప్పుడు ఉన్నారని తెలిశాక ఎలా వదిలెయ్యాలి? నీకో కథ చెబుతా విను..' డాడీ మౌనం తర్వాత మరో మౌనానికి మధ్య ఇదంతా చెప్పి కథ మొదలెట్టారిలా..

'ఒక బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ జరుగుతోంది. సిక్స్‌టీన్ ఫ్లోర్స్..

సూపర్‌వైజర్ టాప్ ఫ్లోర్‌లో ఉన్నాడు. ఒక కూలీ గ్రౌండ్ ఫ్లోర్ దగ్గర పనిచేస్తున్నాడు. అతన్ని పిలిచేందుకు సూపర్‌వైజర్ ప్రయత్నిస్తున్నాడు. ఎంతకీ వినిపించుకోవడం లేదు. అందుకే సూపర్‌వైజర్ ఏదైనా విసరాలనుకున్నాడు. జేబులో ఓ పది రూపాయల నోటు తీసి కూలీ మీద పడేలా విసిరాడు. అది తగిలితేనైనా చూస్తాడేమోనని. కానీ ఆ కూలీ నోటు తీసుకుని, జేబులో పెట్టుకున్నాడు. మళ్లీ పనిచేసుకోవడం మొదలెట్టాడు. సూపర్‌వైజర్ ఈ సారి వంద రూపాయల నోటు వేశాడు. అయినా కూలీ పెద్దగా స్పందించలేదు. మళ్లీ మౌనంగా జేబులో పెట్టుకుని యథావిధిగా పనిచేసుకోవడం మొదలెట్టాడు. ఈసారి నోటు విసరలేదు. ఒక చిన్న రాయి.. కంకరరాయి విసిరాడు. అది కూలీకి తగిలింది. కూలీ పైకి చూశాడు. సూపర్‌వైజర్ తాను చెప్పాలనుకున్నది కూలీకి చెప్పాడు.

ఈ కథలో కూలీలాగే బతికేస్తున్నాం మనమంతా.

పైనుంచి పిలిచేవాడు.. ఇక్కడ దేవుడో, కాలమో.. కాదు ఇంకేదో శక్తి అనుకో. అది ఏదైనా మనతో 'కమ్యూనికేట్' అవ్వాలని చేసే ప్రయత్నం అది. కానీ మనం మన పనుల్లో బిజీగా ఉంటాం. కథలో నోటు విసిరినట్లుగానే పైవాడు మనకు కొన్ని

బహుమతులు, కానుకలు, మనుషుల్ని ఇస్తుంటాడు. అలాంటి పరిస్థితులు కలిపిస్తుంటాడు. వాటిని మనం తీసుకుని, ఎదుర్కొని మళ్లీ మన పని మనం చేసుకుంటుంటాం. అంతేకానీ అవి ఎక్కడి నుంచి ఎందుకు వస్తున్నాయో ఎప్పుడూ అర్థం చేసుకోం. అంతా మన అదృష్టం అనుకుంటాం. కాలం కలిసొచ్చింది అనుకుని మురిసిపోతాం. తర్వాత మర్చిపోతాం. కానీ మన మీద చిన్న రాయి పడినప్పుడు.. అవి కష్టాలు అనుకుని కన్నీరు పెట్టుకుంటాం. పైకి చూస్తాం. కమ్యూనికేట్ అవుతాం. బాధలు తీర్చమని వేడుకుంటాం. తీరిపోగానే మర్చిపోతాం. మళ్లీ ఎప్పటిలాగే మన పనులు మనం చేసుకుంటుంటాం. మళ్లీ రాలి పడే నోట్ల గురించి.. కలిసొచ్చే కానుకల గురించి ఎదురుచూస్తూ ఉంటాం.

ఇదీ మన లైఫ్.

అరవై ఏళ్ల తర్వాత ఒక ఉత్తరం వొచ్చింది. ఎందుకు తిరిగొచ్చిందంటావ్? సరే వచ్చిందేదో వచ్చింది. అది చూసి తాతయ్య ఆమెనే కలవరిస్తూ హాస్పిటల్ బెడ్ మీద ఎందుకు ఉన్నాడంటావ్? వచ్చిన ఉత్తరం.. పచ్చనోటు అనుకుని పదిలంగా దాచుకుందామా? తాతయ్య మీద పడ్డ కంకర రాయి అనుకుని.. కమ్యూనికేట్ అవుదామా? అందుకే వెళ్లు కార్తీక్.. వెతుకు! వెతికితే పోయేదేం లేదు. దూరమైనదేదో దగ్గరవ్వడం తప్పు!?' – కథ చెప్పడం అయ్యాక నాలుగు ప్రశ్నలు, ఓ సలహా ఇచ్చారు డాడీ.

అవి అర్థం చేసుకుని.. చేసుకోలేని కన్ఫ్యూజన్‌లో.. 'దగ్గరయ్యేది ఎందుకు దూరమయ్యేందుకేగా డాడీ?!' అనేశా.

డాడీ సోఫాలోంచి లేచారు. హాల్లో అటూ ఇటూ తిరిగారు. అది ఆయన కోపమో.. నా మీద చిరాకో అర్థం కాలేదు. కానీ 'కార్తీక్! వై యు ఆర్ ఇన్ నెగెటివ్ మైండ్ సెట్.. బీ పాజిటివ్ కార్తీక్.. బీ పాజిటివ్..' అంటూ వచ్చి మళ్లీ పక్కన కూర్చున్నారు. కోపం లేదు. చిరాకూ కాదు. మెల్లిగానే చెప్తున్నారు.

'ఒక ఊర్లో వానలు పడడం లేదు. యాగం చేస్తేనైనా పడతాయేమోనని ఊరంతా అనుకున్నారు. యాగం మొదలైంది. ఊర్లో వారందరూ వచ్చారు. కానీ ఒక్కడు మాత్రం తనతో పాటు గొడుగు కూడా తెచ్చుకున్నాడు. అదీ నమ్మకమంటే. వర్షం కోసం యాగం చేస్తున్నప్పుడు గొడుగు కూడా తీసుకెళ్లాలి కార్తీక్. చేసే పని మీద ఆ మాత్రం నమ్మకం ఉండాలి. ఆల్కెమిస్ట్ పుస్తకంలో పాలో కోయిలో ఏమంటాడో తెలుసా? 'నువ్వు ఏదైనా సాధించాలని బలంగా కోరుకున్నప్పుడు దానిని సాధించడంలో సహాయపడే విధంగా ఈ విశ్వమంతా కుట్ర పన్నుతుంది' అంటాడు. అలాంటి సంకల్పంతో వెళ్లు. నజియా దొరుకుతుంది' అని డాడీ బుజ్జగించి చెప్పారు. కళ్లలోకి చూస్తూ గడ్డం పట్టుకుని మరీ చెప్పారు.

వర్షం కోసం యాగం చేస్తున్నప్పుడు గొడుగు కూడా తీసుకెళ్లాలి. నమ్మకం లేని పనికి

ఫలితం ఉండదన్నమాట. ఫలితం ఆశించే పని మీద ఆశ కంటే నమ్మకం ఎక్కువ ఉండాలన్నమాట. నమ్మాను. మొదటిసారి నమ్మకాన్ని నమ్మాను. అందుకే నేను వెళ్లాలని, ఆ నమ్మకాన్నీ తోడు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాను.

'నజియాను తీసుకువస్తా డాడీ' అని డాడీ చేతిలో చేయి వేసి ప్రమాణం చేశాను ఇంకేం ఆలోచించకుండా.

'ఫీలింగ్ గుడ్ బేటా. వెళ్లు. వెళ్లేటప్పుడు డైరీలు మర్చిపోకు. దాదా గదిలో ఎక్కడో ఉండొచ్చు. వెతుకు. అంత పర్టిక్యులర్‌గా రాశారంటే వాటిలో ఏదైనా క్లూ దొరకొచ్చు. మర్చిపోకు. అంతా మంచే జరుగుతుంది' అని నా చేయి తన ఎడమ చేతిలో పెట్టుకుని కుడి చేయి నా తల మీద పెట్టి దీవించారు.

ఐసీయూలో ఆపరేషన్ కాదు.. ఆస్పత్రిలో ఆపరేషన్ హైదరాబాద్ మొదలైంది డాడీ దీవెనలతో.

♦

కాఫీ తాగేలోపు మమ్మీని కన్విన్స్ చేశాను. డాడీలా పెద్ద పెద్ద సినిమా కథలు, భారీ డైలాగులేం చెప్పలేదు. షార్ట్‌ఫిల్మ్‌లా షార్ట్ అండ్ స్వీట్‌గానే చెప్పాను.

అసలు ఎందుకు వెళ్తున్నానో అర్థం చేసుకున్నాక మమ్మీ ఒప్పుకుంది. తను నా లగేజ్ సర్దుతున్నప్పుడు నేను దాదా రూమ్‌లోకి వెళ్లాను.

ఎప్పుడో చిన్నప్పుడు ఆడుకున్న గది. ఎప్పుడూ ఇక్కడే.. ఎక్కువగా ఇక్కడే గడిపిన గది. వయసు పెరుగుతున్న కొద్దీ దూరం పెరిగింది ఈ గదితో. ఈ గదిలో ఉండే దాదాకు, నాకు.

ఇప్పుడు చూస్తే మ్యూజియంలా ఉంది. అన్నీ యాంటిక్ పీస్‌లే కనిపిస్తున్నాయి. ఎడమవైపు పెద్ద పియానో ఉంది. వర్‌లైజర్ అని బ్రాండ్ నేమ్ రాసి ఉంది దాని మీద. కుడివైపు పెద్ద టేబుల్ మీద ఉడెన్ గ్రామ్‌ఫోన్, ఎదురుగా పెద్ద వింటేజ్ క్లాక్.. జర్మన్ స్మిడ్ మినియేచర్ క్లాక్ ఉన్నాయి. గది అంతా కలియ తిరిగి చూస్తున్నాను. మనసు లోపల నాఫ్తలిన్ ఉండల మధ్య దాగున్న నాస్టాల్జియా కరిగి మెల్లగా కళ్లలోకి వచ్చింది. ఎన్నో తడి ఆరని జ్ఞాపకాలను తెచ్చింది. ఎటు చూసినా గది బ్లర్‌గా కనిపించడం మొదలైంది. ఇమాజినేషన్స్‌లోని ఓ ఇమేజ్ పిక్సలేట్ అయింది. అది మెల్లగా యానిమేట్ అవ్వడం మొదలైంది. బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక వాయిస్.. 'మచ్చరోంకో మారేతో క్యా ఫాయిదా అఘర్ మార్నా హైతో షేర్ కో మారో.. దోమల్నీ ఈగల్నీ కాదు.. షేర్ అయిన ఆ నిరంకుశ నిజాంను చంపాలనుకుండు యాదయ్య..' – చిన్నప్పుడు దాదా చెప్పిన కథ వినిపిస్తున్నది. అది చెప్పేటప్పుడు నేను 'డిష్యుమ్ డిష్యుమ్' అని బాంబులు విసిరేవాడ్ని. నా చేతులు, కాళ్లు తాకి ఆ గదిలోని వస్తువులు కొన్ని చిందరవందర అయ్యేవి. ఇప్పుడూ

అలాంటి శబ్దాలే వినిపించాయి. ఒక్కసారి బాడీ అంతా షివరింగ్ వచ్చింది. కళ్లు తెరుచుకుని, తుడుచుకుని చూశాను.

గ్రామ్‌ఫోన్ పెవీలియన్ ఊడి పడింది. పియానో మీది ఫ్లవర్ వాజ్ కింద పడి ఉంది. పక్కనున్న చెక్క బీరువా తలుపు తెరుచుకుని ఉంది. అందులోని వస్తువులు కొన్ని నేల మీద చిందరవందరగా పడి ఉన్నాయి.

ఒక్కొక్కటి తీసి బీరువాలో సర్దుతున్నాను.

చిన్న డబ్బాకు తాళం వేసి ఉంది. మమ్మీ మేకప్ బాక్స్ అంత సైజులో ఉంది అది. తాళం వేసి ఏం దాచారిందులో? నేను వెతుకుతున్నదేదో అందులోనే ఉన్నట్లు అనిపించింది. లాగి చూశాను. తాళం రాలేదు. పైకి లేపి నేలకు బలంగా కొట్టాను. నాలుగు ముక్కలైంది ఆ చెక్క డబ్బా. అందులోంచి మూడు డైరీలు బయటపడ్డాయి. ఒక వాచీ ఉంది.. తీసుకుని చూశాను. చాలా పాతది. ఆల్విన్ కంపెనీ వాచీ. దాన్ని చూడగానే చేతికి పెట్టుకోవాలనిపించింది. పెట్టుకున్నాను. తర్వాత డైరీలను తదేకంగా చూశాను. 1947, 48, 49 డైరీలు అవి. ఒకదాని తర్వాత ఒక డైరీ, పేజీలన్నీ తిప్పి చూశాను. 1949 డైరీ లో మాత్రం ఏం రాయలేదు. అందుకే ఆ డైరీ పక్కన పెట్టి 1947, 48 డైరీలు పట్టుకుని వెళ్లాను.

అప్పటికే మమ్మీ నా లగేజ్ అంతా నా బెంజ్ కార్‌లో పెట్టించింది. కానీ నాకు ఫెర్రారీలో వెళ్లాలనిపించింది. ఎందుకంటే అది చాలా ప్రత్యేకమైన కారు. ఏదైనా ప్రత్యేకమైన సందర్భంలో మాత్రమే డాడీ ఆ కార్ తీస్తారు. అదిప్పుడు నా వైపు చూస్తున్నట్లు అనిపించింది. 'నేనూ వస్తాను' అని అడుగుతున్నట్లు వినిపించింది. అందుకే లగేజ్ ఫెర్రారీలోకి మార్పించాను. ఫెర్రారీ 575 కాలిఫోర్నియా ఫోర్ సీటర్ కన్వర్టబుల్. ఈ మోడల్ ఫెర్రారీకి రెండు సీట్లు మాత్రమే ఉంటాయి. కానీ డాడ్ నాలుగు సీట్లు కస్టమైజ్ చేయించారు. నాకు కస్టమైజ్డ్ అండ్ పర్సనలైజ్డ్ ఐటమ్స్ అంటే ఇష్టం. నా కాలికి ఆరు వేళ్లు ఉంటాయి. అందరూ వేసుకునే చెప్పులు, బూట్లు నేను వేసుకోలేను. ఆరు వేళ్లు రావడం అదృష్టం అంటారు తాతయ్య. ఆయనకు నాకు మాత్రమే అలా ఆరు వేళ్లు ఉన్నాయి. చిన్నప్పటి నుంచి నాన్న నాకు కస్టమైజ్డ్ షూస్ అండ్ శాండిల్స్ చేయించేవారు. నా బూట్ల కోసమే కోట్ల రూపాయలు పెట్టి ఉంటారు. ఇక కార్లకయితే లెక్కేలేదు. ఇండియాలో ఈ మోడల్ ఫెర్రారీ ఫోర్ సీటర్ కార్ ఇదొక్కటే. ఇలాంటి ప్రత్యేకమైన కార్‌లో వెళ్తున్నామంటే నాకంటే ముందుగా, ఎక్కువగా వినోద్ హ్యాపీగా ఫీల్ అవుతాడు. ఎందుకంటే వాడు వందల కార్లు నడిపినా ఈ కార్‌ని మాత్రం ఎప్పుడూ నడపలేదు. చాలాసార్లు అడిగినా నేనూ ఎప్పుడూ తీయలేదు. తీసుకెళ్లలేదు. ఇప్పుడు ఈ కారే కరెక్ట్ అని అనిపించాక వాడికి చెప్పాలన్న ఆత్రుతతో ఫోన్ చేశాను. కానీ వాడు కట్ చేశాడు. 'ఇదేంటి కట్ చేశాడు?' అనుకుంటుండగానే వినిపించింది. రెండో నంబర్ ప్రమాద

హెచ్చరిక! కార్ నడుపుతున్నది అనన్య అని అర్థమైంది.

వీ ఆర్ గోయింగ్ టు స్టార్ట్. బట్ వన్ కండీషన్. రాత్రి నుంచి ఏమీ తినలేదు. 'నువ్వు ఎక్కడికైనా వెళ్లు. ఎప్పుడైనా రా.. కానీ కచ్చితంగా సమయానికి భోజనం చేయాలి' అని ఎప్పుడూ చెప్పే మమ్మీ కండీషన్స్ అప్లై ఇక్కడ. అందుకే భోంచేసి బయలుదేరబోతున్నాం.

♦

'కార్తీక్! వెళ్తున్నాం సరే, కానీ ఎలా వెతికేది?' అన్నాడు వినోద్ మరో రోటీ వేసుకుంటూ. మేం మమ్మీ చేసిన పాలక్ పన్నీర్‌తో లంచ్ మొదలెట్టాం. వాడు చాలా ఉత్సాహంగా ఉన్నాడు. కస్టమైజ్డ్ ఫెర్రారీలో వెళ్తున్నామన్న అంతులేని ఆనందం వాడిది.

'వెతుకుదాం ఎలాగోలా.. వెళ్తేనే కదా దొరికేది? సైన్ఇన్ కానిదే మన జీమెయిల్ అకౌంట్ కూడా ఓపెన్ కాదు. అలాగే హైదరాబాద్ వెళ్లనిదే నజియా కూడా దొరకదు' అన్నది అనన్య మూడు వేళ్లతో ముద్దుగా రోటీ ముక్క నోట్లో పెట్టుకుంటూ. తను ఉదయం వేసుకున్న డ్రెస్ మార్చుకుని నీలిరంగు టాప్ బ్లౌజ్ టూనిక్ వేసుకుంది. చేతులు పొడవుగా, చివరన గొడుగుల్లా ఉన్నాయి. తను తింటున్నప్పుడు అవి అటూ ఇటూ ఊగుతున్నాయి.

మా ముగ్గురితో పాటు బుజ్జీ కూడా లంచ్‌లో కూర్చుంది. బుజ్జీ మై బెస్ట్ ఫ్రెండ్. ఫీమేల్ జర్మన్ షఫర్డ్. మా ఇంట్లో తరతరాలుగా ఏ పెట్ డాగ్‌కు అయినా ఇదే పేరు వుంటుంది. ఆడా మగా తేడా ఉండదిక్కడ. ఏదో తాతయ్య సెంటిమెంట్. బుజ్జిగాడికి స్పెషల్‌గా చికెన్ సూప్ ఫర్ పెట్ లవర్స్ సౌల్ కలిపి పెట్టింది మమ్మీ. మా కోసం పాలక్ పన్నీర్‌తో పాటు పుంటికూర చికెన్ ఐటమ్ చేసింది. తాతయ్యకు ఇష్టమైన వంటకం ఇది. పుంటి పులుపునకు, మమ్మీ చేతి స్పైస్ యాడ్ అయితే ఆ టేస్టే వేరు.

'కార్తీక్! నిన్నే!! ఎలా వెతుకుదామంటావ్?' వినోద్ మళ్లీ అడిగాడు.

'వెతుకుదాం. క్లూస్ ఉన్నాయి. నజియా – డైరీస్ – హైదరాబాద్. ఇవే క్లూస్. డైరీలు దొరికాయి. మనం హైదరాబాద్ బయలుదేరుతున్నాం. ఇక నజియా తప్పకుండా దొరుకుతుంది. తాతయ్య రాసుకున్న డైరీలు చదివితే ఇంకేదైనా క్లూ దొరకొచ్చు' అని చెప్పాను రోటీ తిన్నాక రైస్ పెట్టుకుంటూ.

'వావ్! బారు పెట్టినవాడు బీరు పెట్టక మానడు.. అన్నట్లు, ఉత్తరం రాసిన తాతయ్యే క్లూ కూడా ఇచ్చారన్నమాట' అన్నది అనన్య పుంటి కూరలో రోటీ నంజుకుని లొట్టలేసుకుని తింటూ.

'యస్. తాతయ్య నా చిన్నప్పుడు ఎప్పుడూ ఓ కథ చెప్తుండేవారు. యాదిగాని కథ.

అందులో యాదయ్య నిజాం అనేవాడ్ని చంపాలనుకుంటాడు. ఇందాక తాతయ్య గదిలోకి వెళ్లినప్పుడు కూడా ఆ కథ గుర్తొచ్చింది. నిజాం! ఉత్తరంలో నిజాం గురించి ఉంది. తాతయ్య చెప్పిన కథలో నిజాం..' అని నేను చెప్పడం పూర్తి చేసేలోపే 'కార్తీక్ డు యూ నో ఎబౌట్ నిజాం?' అని ఆశ్చర్యంగా అడిగాడు వినోద్. 'నిజాం అంటే మామూలు మనిషి కాదు. హీ ఈజ్ వన్ ఆఫ్ ది రిచెస్ట్ ఫెలో ఇన్ ద వరల్డ్ దట్ టైమ్..' అన్నాడు.

'రియల్లీ?' అన్నాన్నేను.

'యస్.. అలాంటి నిజాం. ది కింగ్‌తో పెట్టుకున్నాడు తాతయ్య. గూగుల్‌లో వెతికాను. 1948లో హైదరాబాద్‌ను రూల్ చేసింది ఆ నిజామే' అని బ్రీఫ్ ఇచ్చింది అనన్య 'ఆంటీ కొంచెం రైస్ ప్లీజ్' అని మమ్మీని అడిగాక.

'హైదరాబాద్‌కి ఇండిపెండెన్స్ వస్తుంది. త్వరలో వచ్చి నిన్నిక్కడికి తీసుకొస్తా అని నజియాకు చెప్పినట్లు ఉత్తరంలో ఉంది కదా. బట్ ఇండియాకి 1947లోనే ఇండిపెండెన్స్ వచ్చింది. ఉత్తరమేమో 1948లో రాసింది. అంటే అప్పుడు హైదరాబాద్‌కు ఇంకా రాలేదన్నమాట. సో.. ఇండిపెండెన్స్‌కి.. తాతయ్యకి ఏదో లింక్ ఉందన్నమాట..' అన్నాడు వినోద్.

'గుళ్లో పోగొట్టుకుని గూగుల్‌లో వెతికినట్లు.. ఉందన్నమాట కాదు. అది ఉన్నమాటే అని అర్థమవుతోంది కార్తీక్..' అన్నది అనన్య తినడం ఆపేసి 'కార్తీక్! నీకింకా విషయం అర్థం కావట్లేదు. మీ తాతయ్య ఒక వీరుడు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు. అక్కడ ఆమెను వదిలేసి.. ఇక్కడికొచ్చి సెటిల్ అయ్యాడు. దాని కారణాలు ఏమైనా కావొచ్చు. కానీ అరవై ఏళ్ల తర్వాత ఉత్తరం తిరిగి రావడం.. తాతయ్య ఇలా అయిపోవడం..' చెప్తూనే ఉంది అనన్య.

'నేనూ అదే చెప్తున్న.. ఏదో శక్తి నిన్ను రమ్మని పిలుస్తోంది కార్తీక్' అన్నాడు వినోద్ అనన్య మాటలను ఓవర్‌టేక్ చేస్తూ. డ్రైవింగ్‌లోనైనా, మాటల్లోనైనా ఓవర్‌టేక్ చేయడం వాడికిష్టం.

'పోస్ట్‌మార్టం చేస్తుంటే డెడ్ బాడీ మూలిగినట్లు.. నువ్వు ఆగు విన్నూ మధ్యలో.. నేను చెప్పేదీ అదే కదా? కార్తీక్ ఒక్క అకౌంట్‌కు రెండు పాస్‌వర్డ్‌లు ఉండవు. ఇక్కడ యూజర్‌నేమ్ రామస్వామి, పాస్‌వర్డ్ నజియా. పదా వెతుకుదాం. ఎందుకు దొరకదో చూద్దాం' అన్నది అనన్య.

అర్థమయ్యి కానట్లే ఉన్నాయి అన్నూ మాటలు. మాకు అర్థం కాకపోయినా పర్లేదు. కానీ కనీసం తనకైనా అర్థమయ్యాయో లేదో. అడిగితే చంపేస్తుంది. అందుకే అడగలేక 'వెళ్దాం.. కానీ మనం హైదరాబాద్ చేరుకునేలోపు నువ్వు ఆ డైరీలు చదవాలి మరి?' అని అడిగాను.

'భలే అడిగావ్‌లే.. నేను కాకపోతే వీడు చదువుతాడా?' అని విన్నూ వీపు మీద ఒక్కటి కొట్టింది ఎడమ చేతితో. అందుకే 'కుట్టే అబ్బాయికి కుడిపక్క, తినే అమ్మాయికి ఎడమ పక్క కూర్చోకూడదు' అంటారు.

కూర్చున్నవాళ్లం లేచాం. మా భోజనం పూర్తయింది.

మమ్మీ డిఫాల్ట్‌గా పది, పన్నెండు జాగ్రత్తలు చెప్పాక, డాడీ ఫోన్‌లో సెండాఫ్ ఇచ్చాక బయలుదేరాం.

'కార్ భలే ఉందిరా!' అన్నాడు వినోద్ డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూనే.

బంకు దగ్గర పెట్రోల్ ట్యాంక్ ఫుల్ చేయిస్తున్నప్పుడు విన్నూ మొబైల్ చూస్తున్నాడు.

'ముంబై టు హైదరాబాద్ గూగుల్ మ్యాప్‌లో సెర్చ్ చేశాను. 12 హవర్స్ 20 మినిట్స్.. 707 కిలోమీటర్స్ వయా ఎన్‌హెచ్ 9' చెప్పాడు వినోద్ కార్ స్టార్ట్ చేస్తూ.

'12 హవర్సా?' అన్నది అనన్య నా బ్యాగ్‌లోంచి డైరీలు తీస్తూ.

'హే.. కాదు.. గంటకు 100 స్పీడ్‌లో వెళ్తే జస్ట్ 7 హవర్స్.. మనం వెళ్లేది గూగుల్‌లో కాదురా.. ఫెర్రారీ.. అదీ 575 కాలిఫోర్నియా' అన్నాడు వినోద్ గేర్ మారుస్తూ.

'7 హవర్స్.. అంటే ఇప్పుడు.. టు ఓ క్లాక్ అయింది. సో.. నైన్ ఆర్ టెన్‌కి రీచ్ అవుతామన్నమాట' అన్నది అనన్య.

'ఓకే బట్ నైట్ స్టే ఎక్కడ?' అడిగాడు వినోద్. వాడెప్పుడూ నిద్రకు ఆగలేడు.

'నైట్ స్టే గురించి ఆలోచిస్తున్నావా? రేయ్! అన్నూ ఇక్కడ. అదీ మా హైదరాబాద్. ఐ కేన్ అరేంజ్ ఎవ్రీథింగ్..' అంది వినోద్‌ను వెనకాలనుంచి కొడుతూ. వాడు అన్నూ దెబ్బలు తప్పించుకుంటూ టాప్ గేర్ వేశాడు. కార్ 90 స్పీడ్‌లో వెళ్తున్నది.

డైరీ మీద 1947 అనే అక్షరాలను అనన్య నిమురుతూ చూస్తున్నది.

మొదటి పేజీ తెరిచింది. అక్కడ గీసి ఉన్న బొమ్మను గమనించాను. అదే బొమ్మని అనన్య కాసేపు తదేకంగా చూసింది. పేజీ తిప్పిది.

'జాగ్రత్తగా వినండి' అని చదవడం మొదలెట్టింది.

♦♦♦

# 3

# తాత డైరీ – 1947

## ఆగస్టు 15

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి" గట్టిగా అన్నడు చంద్రకిషోర్.

గుసగుసలు ఆగిపోయినయ్. మాటలేదు. ముచ్చటలేదు. అంతా సకులంముకులం పెట్టుకుని సప్పుడు సేక కూసుంద్రు.

'ఈ అనంత కాలగమనంలో.. మహానగరాల చరిత్రలో.. ఏదో ఒకరోజు.. ఏదో ఒక క్షణం.. చీకటి కమ్మేస్తుంది. ఇది జగమెరిగిన సత్యం. ఆ చరిత్ర పుటల్ని తిరగేస్తే సమాధుల కింది పునాదులు, పునాదుల కింది సమాధులు చెప్పే వాస్తవం ఒక్కటే.. నిరంకుశ పాలనకు విసిగి వేసారిపోయిన వారు స్వేచ్ఛ, స్వాతంత్ర్యపు వాయువు పీల్చేందుకు ప్రాణాల్ని కూడా లెక్కచేయకుండా తృణప్రాయంగా వొదిలేసిన ఉదాహరణలు ఎన్నో కనిపిస్తాయి. రాజ్యానికే ముప్పు వాటిల్లినప్పుడు, ఆ రాజ్యంలోని ప్రజల మాన ప్రాణాలు మంటగలుస్తున్నప్పుడు ప్రాణాలర్పించడానికి సాహసించిన మహానుభావులే

నిజమైన పౌరులు. వారే అసలైన దేశభక్తులు. వారి త్యాగఫలితమే వీరత్వం, ఆ ధీరత్వమే వారు భౌతికంగా పోయినా వారి పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోయేలా చేస్తుంది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్‌సింగ్ ప్రాణాలకు తెగించి కౌన్సిల్ హాల్‌లో బాంబు విసిరాడు. పట్టుబడ్డాడు. అయినా అదరలేదు. బెదరలేదు. ఉరికంబమెక్కాడు. చావును కూడా దేశంకోసం ప్రేమగా ముద్దాడాడు. గొప్ప దేశభక్తుడిగా మిగిలిపోయాడు. మనం కూడా మన దేశం కోసం.. మన కోసం.. మనవాళ్ల ఈ బానిస సంకెళ్లను తెంపడం కోసం అలాంటి ప్రయత్నమే చేయాలి' చంద్రకిషోర్ చదువుతుంటే మా రక్తం మరుగుతున్నది.

'మన ఈ ప్రయత్నంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా అధైర్యపడకు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నీ లక్ష్యం వీడకు, ఓ వీరుడా, ఓ ధీరుడా.. త్యాగశీలుడా.. ఇదే నీకు స్వాగతం. చూస్తున్నావేం. కదులు.. అడుగు మొదలెట్టు.. రక్తం మరగబెట్టు. రణరంగంలో తొడగొట్టు' చంద్రకిషోర్ తెచ్చిన షహీదోన్ కీ టోలీ పుస్తకం సదివి ఇనిపిస్తుంటే నిజంగా మా నరాలు చిట్లుతున్నయ్. ఏదో చెయ్యాలన్న యావ పుట్టుకొస్తోంది. అలాంటిదేదో మనం చేయబోతున్నామని అతడు చెబుతున్నాడు. ఏం చేయబోతున్నామో మాకింకా తెల్వదు. కానీ చేయగలం అన్న నమ్మకాన్ని మాత్రం నూరి పోస్తుండు. చేయాలన్న సంకల్పాన్ని మాత్రం కలిగిస్తున్నడు. అందుకే ఈ రోజు నుంచి మేం మేం కాదు. మామూలు మనుషులం అంతకన్నా కాదు. అందుకోసం కొన్ని ఒదులుకోబోతున్నాం. ఇంకొన్ని నేర్చుకోబోతున్నాం. మరికొన్ని మార్చుకోబోతున్నాం. అన్నింటికీ సిద్ధంగా ఉండాలి. మేం చరిత్ర సృష్టించబోతున్నాం. ఈ చరిత్ర నిర్మాణంలో మేం మిగలొచ్చు. మిగలకపోవచ్చు. కానీ నడుస్తున్న ఈ చరిత్రకి నడక నేర్పాలి. పరుగు చూపాలి. పగ బట్టాలి. పడగవిప్పాలి. బుసకొట్టాలి. సమరానికి సై అనాలి. ఇక్కడ సంధికి తావులేదు. అవసరమైతే ఆత్మత్యాగానికీ సిద్ధమవ్వాలి. మేం పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలానికి ఎదురీదబోతున్నాం. ఎదుర్కోబోతున్నాం. మేం భగత్ సింగ్‌లా బాంబు వేయబోతున్నాం. కానీ కౌన్సిల్ హాల్ మీద కాదు. ఓ కర్కశకుడి మీద. ఓ కర్కోటకుడి మీద. మా ఈ బానిస బతుకులకు కారణమైన వాడి మీద మా స్వతంత్ర సుమాల్ని హరిస్తున్న ఓ నీచుడి మీద. స్వాతంత్ర్యం వచ్చినా మమ్మల్ని ఇంకా స్వేచ్ఛా వాయువు పీల్చుకోకుండా తన పిడికిట్లో బిగిసి పట్టుకుని ఊపిరాడకుండా చేస్తున్న నిజాం మీద!?

'చంపేయాలి. నవాబును అంతమొందించాలి. మనం చరిత్ర సృష్టించాలి. అవసరమైతే

తిరగరాయాలి. అలాంటి మన కార్యాన్ని రాసుకోవాలి. మనం రాసి పెట్టుకోవాలి. భావితరాలకు మన త్యాగం తెలియాలి. ఈ రోజు నుంచి రాసుకోండి. మీ వ్యక్తిగత జీవితాలు.. మీరు ఎందుకు నిజాంను చంపాలనుకుంటున్నారు? రాయండి. మీ జీవితంలో జరిగిన సంఘటనలు.. మీకు ఎదురైన అనుభవాలు.. ఆవేదనలు.. ఆర్తనాదాలు.. ఆశలు.. ఆశయాలు.. అంతిమ లక్ష్యాలు.. అన్నీ అన్నీ రాసిపెట్టుకోండి. ఇది మనం చేస్తున్న మొదటి ప్రతిజ్ఞ. ఈ రోజు నుంచి మన ఐదుగురం.. ప్రతి రోజూ కలుసుకోవాలి. మాట్లాడుకోవాలి. రాయాలనుకున్నది రాయాలి. గీయాలనుకున్నది గీయాలి. వేయాలనుకున్నది వేయాలి. చంపాలనుకున్నవారిని చంపాలి. చంపాలంతే నిజాంని చంపేవరకు నిద్రపోమని చేయండి.. రెం.. డో.. ప్రతిజ్ఞ' చంద్రకిషోర్ కళ్లు పెద్దగా చేసి పండ్లు కొరుకుతూ పిడికిళ్లు బిగించి చెబుతున్నాడు.

ఆ మాటలు మా మనసుల్లో బందీ అయినయ్. బందూకుల్లా అయితున్నం. బండరాయిలా మా గుండె కాయలు మారిపోతున్నయ్. మేం త్వరలో నిజాంను చంపబోతున్నాం. మేం చేయాలనుకుంటున్నది మామూలు పనికాదు. చంపాలనుకున్నది మామూలు మనిషినీ కాదు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నేను స్వతంత్రంగానే ఉంటానని ఇండియన్ యూనియన్‌కి సవాల్ విసిరిన మహాఘనుడు.. మహా నిరంకుశుడు ఏడో నిజాం.. మీర్ ఆస్మాన్ ఆలీఖాన్‌ను. అవును మీర్ ఆస్మాన్ ఆలీఖాన్‌ను చంపబోతున్నాం. అవును.. మీర్ ఆస్మాన్ ఆలీఖాన్‌నే.

మేం రెండు ప్రతిజ్ఞలూ చేశాం.

రోజులాగే కలుసుకున్న సుల్తాన్ బజార్‌లోని ఉదయ్ క్లాత్ స్టోర్ పై గదిలోంచి కిందికి దిగాం. చంద్రకిషోర్ మాటల్లో ఏదో కనికట్టు ఉంటుంది. పూనకం వచ్చేస్తుంది. పునీతులైపోతాం. కోపమో తాపమో చెప్పేదానికి పురివిప్పుతం.

మేం చేస్తున్నది స్వకార్యమో, స్వామి కార్యమో కాదు. సమాజహితం కోసం. సమకాలీన సమస్య నుంచి విముక్తి కోసం. వీరి పరిచయం నా జీవితాన్ని మార్చేసింది. చంద్రకిషోర్ రాసుకొమ్మన్నడు కాబట్టి రాస్తున్న. గాయిన చెప్పింది నిజమే అనిపిస్తున్నది. ఈ రాసేదేదో నిజంగానే ముందుతరాలకు పనికొచ్చే పని మేం చేస్తున్నట్లు తోస్తున్నది. నేనిప్పుడిలా రాస్తున్నాను. గానీ నాకసలు రాయడమే రాదు. మా ఊరి నుంచి ఈడికొచ్చినంక మొదట పరిచయమైంది చంద్రమే. ఈ రాసుకోవడం, పుస్తకాలు సదవడం నేర్పింది గాయనే.

నేను రోజు కలిసి తిరిగేది ఆయినతోనే. నేనుండేది గాయినింట్లనే. నా నజియా ఉండేది బీ ఆ ఇంట్లనే.

నజియా..

ఈ పేరు ఇనంగనే నా దిల్ ఖుష్ అయితది. ఎంత అందమైన పేరు కదా. అలా పిలవడం తనకు పెద్దగా నచ్చదు. తన అసలు పేరు నాజియా అట. నాకేమో దీర్ఘం తీయనీకి రాకపాయె. మొదటిసారి పలకరించినప్పుడే చెప్పింది. 'నజియా నహీ హై మేరా నామ్.. నాజియా హై' అని. నేనేమో ఎప్పుడూ గిట్లనే 'నజియా.. నజియా' అని పిలుస్తుంటిని.

నాజ్ అంటే గర్వకారణమట. నజ్ అంటే అర్థం తెల్వదుగానీ నజియా దొరకడం నాకు, నా జీవితానికి గర్వకారణమే.

నిజంగ ఎంత ముద్దుగుంటదో ఎర్కేనా!?

అసలు చంద్రకిషోర్ కంటే ముందుగాల రాయాల్సింది నజియా గురించే.

ఎందుకంటే చంద్రం కంటే, అందరికంటే, అన్నింటికంటే నాకు ఎక్కువ తనే కాబట్టి. తనే జిందగీ కాబట్టి. నేను బతుకుతున్నదే ఆమె కోసం. అందుకనే ఆమె గురించి రాయాలి.

నా పేరేమో రామస్వామి. తనేమో నజియా. సాహెబుల పిల్ల. కానీ మా ఇద్దరికి ఎట్ల కుదిరిందో ఏమో. ఒక్కకాడ్కి చేరినం. ఇంగ తనే నా దునియా అయిపాయె. అందుకే రాయాలె. తన గురించే రాయాలె. తనని మొదటిసారి కలిసిన ముచ్చట జెప్పాలె. దాని కంటే ముందల.. ముందు నేను పట్నం ఎందుకొచ్చిన్నో చెప్పాలె. ఎట్లొచ్చిన్నో రాయాలె. మా ఊరి గురించి రాసుకోవాలె.

మా అమ్మయ్యల గురించి, ఆడి మనుషుల గురించి.. నా దోస్తుల గురించి గూడా శానా రాయాలె.

మా పల్లె అంటే.. మాయమ్మ లెక్క.

అందుకే మా అమ్మకాంచే మొదల్ బెట్టి రాస్త.

మాది పజ్జూరు. నల్లగొండ దగ్గర. పానగల్ కట్ట దాటినంక జర దగ్గర్నే మా ఊరు. మేం సాకలోల్లం. మాకు మా ఊర్లనేగాక పక్క గూడేలల్ల గూడ శానామంది ఆసాములుండేది. అటు యర్రగడ్డ గూడెం, తర్వాతి నర్రావుని గూడెం, లచ్చింపురం, ఇటు.. ఎల్మగూడెం.. ఇన్ని గూడెలల్ల రోజుకో గూడెం. పొద్దుగాల పొద్దుగాల పోతుండె మా అమ్మయ్య. ఇల్లిళ్లు తిరిగి ఉతకనీకి బట్టలేసుకొచ్చేది. ఎల్మగూడెం ఏటి కాడ్నో.. పెద్ద సెర్వు గట్టుకాడ్నో.. బట్టలుతికి పొద్దుగూకాల ఇంటికొస్తుండె.

మా ఊర్ల నా పేరు యాదయ్య. రామస్వామిని ఎట్లయిన్నో ఎన్కసీరి రాస్త.

పజ్జూరు బల్లె నన్ను ఐదు దాంక సదివిపిచ్చిండు మా అయ్య.

అటెన్క సదువొద్దన్నడు అయ్య. కానీ మాయమ్మ నన్ను సదువుపియ్యాలని పోరుబెట్టింది.

ఇంగ మా అయ్యకు తప్పలే.

అయిదయినంక సదవాల్నంటే నక్రెకల్‌కు పోవాలె. దినాం.. అంత దూరం నడుసుకుంటబోయేది తోటోళ్లతోని.

పెద్ద సెర్లంగ బాట ఉంటుండె. వానాకాలం మోకాళ్ల లోతు నీళ్లొస్తే.. పుస్తకాలు నెత్తిన బెట్టుకుని బట్టలన్నీ తడవంగ అవతల్కి పోతుండేది.

ఇంగ ఎండకాలమైతే తాండ్రోని బాయిల ఈతకు పడిసచ్చేది. ఒక్కపూట బడులప్పుడు రెండో పూటంత బాయిల్నే ఉండేది. కళ్లన్ని ఎర్రబడంగ ఈతగొట్టేది. నీళ్లళ్ల మునుక్కుంట దొంగాట ఆడేది. దొరికిచ్చుకునుడు, అడుగుమన్ను, గడ్డపార.. నీళ్లల్ల ఆడుతుంటె మస్తుంటుండె.

వొరిచేన్లు కోసినంక పరిగి ఏర్తందుకు ఉర్కులాడేది. చెరువు లూటీ పోయినంక చేపల కోసం ఆరాటపడేది. తాటి సెట్లల్ల కల్లు తాగి సిందులేసేది.

బాటెంట ఇరికి పండ్లు, రేగుబండ్లు, సిప్పాల పండ్లు ఏరుకుంట తినుకుంట బడికిపోయేది.

చింత చిగురు, బొండు మల్లెలు, బంతిపూలు, ఓమ చుట్టలు, భూజెనిగలు, బుడం కాయలు, ఉడకబెట్టిన పెసరకాయలు, రింగన పురుగులు, తాటాకు పంకలు,

ముంజకాయల బండి, సైకలు టైరాట, జిల్లగోన, అష్టచెమ్మ, పిచ్చిబంతి, ఆరుద్ర పురుగులు, మిణుగురులు, సెట్లకిందికి, బోనాలు, ఇట్లాంటియి ఎన్నో యాదికొస్తయి మా ఊరంటె.

పది సదివినంక నన్ను పటేల్ కాడ జీతంల పెట్టాలనుకుండు మా అయ్య. మాయమ్మేమో పట్నంల మా దూరపు సుట్టపాయన కాడికి తోలి పెద్ద సదువు సదివిపియ్యాలనుకునె.

పట్నమంటే.. హైద్రబాదు. పట్నం అనంగనే నాకు ఎక్కడ లేని ప్రేమ పుట్టుకొచ్చేది. ఎప్పుడెప్పుడు పోదామా అని ఆత్రంగగూడా ఉంటుండె.

'మనకు లేకనే అర్కతిబర్కతి బతుకుతుంటే.. ఆడ్ని పట్నం యాడ పంపియ్య' అంటుండె మా అయ్య. గందుకే నన్నింగ జీతంల పెట్టిండు.

గూడెం పటేల్ కాడ, ఏడాది జీతం చేసిన.

అర్క దున్నేది. నాగలి బట్టేది. మోటగొట్టేది. నీళ్లు కట్టేది. కలుపు తీసేది.. పొలం కావలుండేది.. గా పని.. గీ పని అనేంలే. ఏ పనైనా మనకు కొట్టిన పిండిలెక్క ఉంటుండె.

'నీకు రాని పనంటూ లేదురా' అని పటేల్ గూడా నన్ను మెచ్చుకుంటుండె.

ఇంగీడు దారినబడ్డడు, ఈనికి పెండ్లిజెయ్యాలని పిల్లను సూస్తుండె మావోళ్లు. ఎందుకు చెయ్యాలనుకున్నరో దానికో ముచ్చటుంది.

నేను జీతం చేస్తున్నప్పుడే, మా ఊర్లె రోజుకో కోడి మాయమైపోతుండె.

ఒక్కో రోజు.. ఒక్కో ఇంట్ల..

సీకట్ల ఎవరొస్తుండ్రో ఏమోగని కోళ్లగూడు తలుపు పెట్టింది పెట్టినట్లే ఉండేదట. కానీ ఒక కోడి మాత్రం తక్కువయ్యేదట.

నాలుగు దినాలైంది. ఐదు దినాలైంది. ఊరు ఊరంతా పరేషాన్ అయింది. ఇంగ ఇట్లయితె కాదని పెద్ద మనుషులంతా కూసుని మాట్లాడుకుండ్రంట.

ఒక్కో ఇంటి నుంచి ఒక్కక్కలు.. రోజుకోలు.. రాత్రి పూట గస్తీ తిరగాల్నని తీర్మాణం చేస్కుంద్రు. అయినా గూడా దొర్కలేదంట దొంగలు

ఒకరోజు పొద్దుగాల పొద్దుగాల మా ఊరికెంచి మస్కూరు మా పటేల్ కాడికి వొచ్చిండు. నేను అప్పుడే పొలం పనికి పోదామని ఎడ్లు ఇడుస్తున్న.

నన్ను తీస్కపోతందుకే మస్కూరోడు వచ్చిండట. ఎందుకని అడిగిండు పటేల్.

'ఈ యాదిగాడు రాతిర చింత కిందోళ్ల ఇంట్ల కోడి దెంకొచ్చిండు. రాతిర్నే కాదు.. ఈడు, ఇంకెవడో సోపతిగాళ్లు కల్సి మా ఊర్లే రోజుకో కోడి మాయం చేస్తుంద్రు' అని చెప్పిండు మస్కూరు.

'ఎయ్ నేనేడ దొంగతనం జేసిన' అని అంటుండంగనే.. 'నువ్వుంద్రా యాది! రాత్రంత ఈడు నాకాడ్నే ఉన్నడు. ఆడేడ జేసిండు దొంగతనం అదంతా ఒల్లెక్కంగనీ పో' అన్నడు పటేల్ మస్కూరుతోని

అందుకు మస్కూరు 'కాదు పటేలా! ఈడే సేసిండు' అని ఏదో ఎదురుజెప్పబోయిండు.

పటేల్‌కు యమ కోపమొచ్చింది.

'నేను చెప్తున్నకదా. ఆడు నాకాడ్నే ఉన్నడని. నా మాటంటే లెక్కలేదా? పో.. పోయి మీ ఊరి పెద్ద మనిషిని తీస్కరాపో. ఈడే దొంగతనం చేసిండని ఏం సూపిస్తడో చూద్దాం' అని గద్దాయించిండు.

దెబ్బకు మస్కూరోడు మల్ల మాట్లాడకుంట నోరు మూస్కుని, మొహం చిన్నగ చేస్కుని ఎనక బాటబట్టిండు.

ఇంతకీ నేనే దొంగతనం చేసినని మా ఊరోళ్లు ఎట్లనుకుంద్రో ఎర్కేనా?

అయ్యాల రాత్రి బాగా వానబడ్డది.

రోజులెక్కనే అయ్యాల గూడా కోడి మాయమైంది, చింతకిందోళ్ల ఇంట్ల..

గాడ్నే గమ్మతి ముచ్చటయింది.

వీధి పాతకీ కాంచి కోళ్లగూడు దాంక కాళ్ల అచ్చులు పడ్డయంట. వానొచ్చిందిగదా.. గా బురదల అచ్చులువడ్డయన్నట్టు.

ఇద్దరు దొంగలు, అందులో ఒకని కాలుకు ఆరేళ్లు ఉన్నట్లు అచ్చులున్నయ్.

గందుకే నేనే దొంగతనం చేసిన అని అనుకుంద్రు మా ఊరోళ్లు. ఇంకెర్కగాలేదా? నా కాళ్లకు ఆరేళ్లు ఉంటయన్నట్టు. మా ఊర్లే నాకు, ఏనుగోళ్ల ఎంకన్నకు.. మా ఇద్దరికే ఆరేళ్లు ఉంటయ్.

అయితే ఇంతకీ అటెన్క ఏమైందో ఎర్కేనా?

మస్కూరు పోయి ఈడి ముచ్చట చెప్పినంక యాదిగాడు కాకపోతే ఏనుగోళ్ల ఎంకడే కావొచ్చని ఆన్ని పట్టుకొచ్చి రెండు పీకింద్రంట దమ్మ కుర్కి.

అచ్చులల్ల కాళ్లు బెట్టి సూస్తే అచ్చం సరిపోయినయ్. ఆడు దొంగతనం చేస్తే ఆని అచ్చులు బడక నాయి బడ్తాయా మరి?

ఆడు, మామిడోళ్ల శంకర్‌గాడు కలిసి రోజు గిదే పనంట. రోజుకో కోడిని ఏస్కపోవుడు, పెద్ద సెర్ల దావత్ సేస్కునుడు. గదే ముచ్చటంట. గిదంత, అటెన్క మా ఊరికి బోయినప్పుడు మాయమ్మ చెప్పింది. నేను గూడ గిట్లనే వయసు మీద దొంగపనులు, లంగపనులు సేస్తనేమోనని భయవడ్డరు మావోళ్లు. గందుకే నాకు జల్ది జల్ది పిల్లని సూడాలనుకుంద్రు.

గదీ ముచ్చట.

ఇంగ గట్లాంటి దినాలల్లనే ఇంకో ముచ్చటయింది. గదే నన్నీడిదాంక తీసుకొచ్చింది.

ఒకరోజు లచ్చింపురం దొరకాడికి పోయిరమ్మన్నడు పటేలు.

పోతప్పుడు బానే పోయినగానీ వస్తప్పుడు కుక్క కరిపిచ్చుకోనొచ్చిన. కావాల్నని ఎవరన్న కర్పిచ్చుకుంటరాగని, యాంచి వొచ్చిందో ఏందో సపక్కున కాలు పట్టి పీకింది. అది మామూలు కుక్క గాదు. పిచ్చి కుక్క. ఆ ఊళ్ల ఈ ఊళ్ల కొట్టిన దెబ్బలకు ఒళ్లంత పుండ్లయినయ్ దానికి. సొంగ గూడ కారుస్తుండె.

'ఓర్నీ గా కుక్క కర్సిందా? గది కరిస్తే ఇగ నీకు బీ పిచ్చివడ్తదిరో!' అని భయపెట్టిండు

నాతోటి జీతగాడు ఊరిగాడు.

'ఊకోర గాడ్ని గట్ల భయపెడ్తవెందుకు? ఒరే యాది! ఏంగాదుగనీ.. కాస్త పత్తెం జేయాలంతే.. పానగల్ కాడ.. పసరు పోస్తరు. రేపు పొద్దుగాల పోయొద్దువులే' అని మంచిగ జెప్పిండు పటేల్.

మా ఊర్ల పసరుబోస్తోడు యాడెండె? పానగల్ దాంక పోవాల్నంట. గటు నక్రెకల్ అవుతల ఉన్నరంటగనీ, ఇంకా శానా దూరమంట. నక్రెకల్ కల్ల అప్పుడో ఇప్పుడో, ఎడ్ల బండ్లో, ఇంకో బండ్లో దొర్కుతుండె. గానీ గిటు దగ్గర్నే ఉందిగానీ.. గిటు మొహాన గీ పానగల్‌కల్ల ఏ బండి దొర్కకుండె. నక్రెకల్ నడుసుకుంట పోయొచ్చుడు మాకెర్కెగానీ.. ఇప్పుడు పోయొస్తే పొద్దుగూకుతది. ఈడనేమో బాయికాడ పనుండె. పటేలు ఊకుంటడా?

ఇంగ ఏం జేసినం నేను, ఈరిగాడు.. ఎట్లయిన జేసి సైకల్ ఇప్పియ్యమన్నం పటేల్‌ను. గా సైకల్ పెద్ద జీతగానికాడ్నే ఉంటుండె. బాయికాడికి, ఆడికీడికీ పోతందుకు.. ఆడొక్కడే ఏస్కపోవాలె.

ఒక్కగానొక్క కొడుకుని. నేనంటే మా అమ్మయ్యకు పాణమాయె. ఆళ్లుగూడొచ్చి మా పటేల్ సాబ్‌ని బతిలాడి సైకల్ అడిగిచ్చిండ్రు.

నేనప్పుడింక కాంచి దాటి కడ్డి దాంక రాలె. నాకు గంత దూరం తొక్కరాదు. మరెట్ల?

ఈరిగాడు.. నేను సైకల్ మీద పోవాల్నని ముందుగాల్నే ఉపాయం ఏస్కున్నం. ఆడికి కడ్డి కాదు.. సీటు.. క్యారల్ గూడ వొచ్చు. మంచిగ తొక్కుతడు.

గీ మాటే పటేల్‌కు జెప్తే.. 'మంచిగున్నదిరా ముచ్చట. ఇద్దరు కల్సి గటుమొహాన పోతే.. ఇంగ బాయికాడికి పోయేదెవడ్రా?' అనె.

'లేదు పటేలా? ఇంగ అటే బోము. పొద్దుగాల పొద్దుగాల్నే పోయి.. బువ్వటేళ్లకు జప్పున మల్లీడుంటం' అన్జెప్పినం.

'సరే. పోండ్రిగానీ, ఇంగ సైకల్ దొరికిందిగదాని.. ఆ ఊరీవూరు తిరిగి రాకుండ్రి' అన్నడు.

నేను, ఈరిగాడు సంకల్ గుద్దుకుని సప్పుడుసేక సప్పున సైకల్ తీస్కున్నం.

సైకల్ ముందల కడ్డికి తువాల్ సుట్టుకుని కూసున్న. ఈరిగాడు పెడల్ మీద కాల్వెట్టి ఇంగ ఉర్కిచ్చి ఉర్కిచ్చి సీటు మీదికెక్కి కూసుండు.

'అరె మంచిగున్నది. యాది? కుక్క కర్సినందుకు గప్పుడు బాధయిందిగనీ.. గిప్పుడు మంచిగనిపిస్తున్నదిరో!' అన్నడు ఈరిగాడు.

'అవున్రా! గిట్ల మనిద్దరం సైకల్ మీద తిరగాలని ఎన్ని దినాలకెంచి అనుకుంటున్నం. బావుందిగనీ.. పోనియ్.. పోనియ్.. ఉర్రటిగ తొక్కాలె' అన్న.

ఎత్తుగడ్డలు ఎక్కుకుంట.. గుంటలల్ల దుంకుకుంట.. ఉతార్ చడావ్ అని వుర్కుతుండె సైకల్.

'అరె ఈర్గా.. నేనింక కాంచి దాటి కడ్డి దాంక రాలె. నాకు నేర్పిస్తావ్ రా?' అనడిగిన.

'దాందేవుందిరా.. కడ్డీ మీదికొక్కసారెక్కితే సాలు.. ఇక సీటు గూడ వస్తది. వస్తప్పుడు నేర్పిస్తగనీ.. ముందుగాల పసరాయినకాడికి పోదాం. ఆయనిల్లు ఏడుందో దేవులాడాల్నాయె' అన్నడు.

♦

అట్ల నేను, ఈరిగాడు.. ఆరు దినాలు రోజు పానగల్ పోయినం. నాకు కడ్డీ గాదు, సీటు కూడా తొక్కడం వొచ్చింది.

పటేల్ ఒక్కనాడు వారానికి సరిపడా పసరు తెచ్చుకొమ్మన్నడు. గానీ అట్ల ఇయ్యరంట పటేలా? రోజు రావాల్నంట అని మస్క జెప్పినం. ఇంగ గులుక్కుంట గులుక్కుంట రోజూ సైకలిచ్చేది. పెద్ద జీతగాడేమో గుర్కాయించి గుర్కాయించి సూస్తుండె మాకెళ్లి.

ఏడు రోజులల్ల ఐదు దినాలు అయిపోయినయి. గా ఆరో నాడు అయింది అసలు ముచ్చట.

జీతం చేసే గూడెం దాటినంక మా ఊరు, అది దాటినంక అడ్డ బాటెమ్మటి రామారం దాటితె పానగల్ వస్తది. లేదంటే సక్కగ సందెన పల్లి బాటెమ్మటి బోతెనేమో రామారం ఊరవతలంగ ఎళ్తది. సక్కగ బోతె జరంత దూరమైతాందని అడ్డ బాటెమ్మటే పోతుండేది.

ఆరో రోజు.. రామారం పొలిమెర్ల ఆపిండో ఆసామి..

'ఓ పోరలు. ఆగుండ్రి. ఆగుండ్రి.. ఏడికట్లపోతుండ్రు. అటు మొహాన పోకుండ్రి' అని ఎదురొచ్చుకుంటనే అన్నడు.

మేం సైకల్ ఆపి 'ఎందుక'ని అడిగినం.

'కట్టెమ్మటి రజాకార్ల క్యాంపు కాడ గడబిడ అయితాంది. అటు పోతే మిమ్మల్ని బీ పట్టకపోతర'ని చెప్పిండు.

అరె. గీడిదాంక వస్తిమి. గియాలైతే అయిపోయె. రేపు ఎట్లనో అట్ల. ఎట్లబోవాలె మరి– అని సోంచాయించబడ్తిమి.

ఈరిగాడేమో 'అయ్యో సామి! మేం పానగల్‌దాంక పోవాలె. పసరు కోసం. ఈడికి కుక్క కర్సింది. చెప్తె ఇనరా గా రజాకార్లు. గిట్లనే పోతమేంది? నిన్నమొన్న బోయినం గదా' అని అడిగె ఆసామిని.

'ఉరెక్కో.. సెప్తె ఇనారా ఏంది? ఆళ్లు ఇనే మనుషులు కాదు. గిట్లలేదు. గట్లలేదు. ఆడ ఆగమాగం అడివడివి అయితాంది. పెద్ద సూరారపోళ్లను రజాకార్లు పట్టుకొచ్చి యమకొట్టుడు కొడుతుండ్రు. మీరు అటుకళ్ల అస్సలు పోకుండ్రి' అని గుస్స చేసిండు ఆసామి.

'మరే సామి! ఇంతకు ఎందుకు పట్టుకొచ్చిండ్రు గా సూరారపోళ్లను. ఏం చేసిండ్రేంది?' మల్ల అడిగె ఈరిగాడు.

'ఆళ్లా.. ఆళ్లు.. సంఘపోళ్లను ఇండ్లల్ల దాసిపెట్టి ఎవర్కి తెల్వకుంట తిరుగుతున్నరంట. గిది తెలిసిన రజాకార్లు గింత పనికొచ్చిండ్రా అని ఊరు ఊరంత పట్టుకొచ్చిండ్రు. మీరు అటు పోయిండ్రనుకో. మిమ్మల్ని పట్టుకుంటరు మల్ల. ఇంగ నాకయితే ఎర్కలే. నీనయితె పోతున్న. చెప్తె ఇనుండ్రి' అనుకుంట సుట్ట ముట్టిచ్చుకుని గుప్ప గుప్ప ఊదుకుంట, ఊరి మొహాన పోయిండు ఆసామి.

'అరె యాది! ఏంజేద్దాం రా? ఎన్కకుబోదామా, ముందల్కా?' అని అడిగిండు ఈరిగాడు.

'ఓరి ఈరిగా! ఎవరీ రజాకార్లు, ఎవరీ సంఘపోళ్లు. మనం ఏమన్న అన్నమా?

ఆల్లకు ఈల్లకు ఎందుకు పడ్తలేదో మనకెందుకు? అయినా పట్టుకొచ్చి ఏంజేస్తుంద్రో సూస్కుంట పోదాం. దాన్ని బట్టి అటో ఇటో సూద్దాం పా' అన్నడు.

'వోర్నీ తిక్కలెంక. ఆసామి సెప్తె ఎక్కలేదుర నీకు. గటెందుకుర ఇప్పుడు. మనం వొచ్చిన పనేంది. గటు పోయే పనేంది'

'ఏహే.. ఎందుకురా వద్దు. మనం ఆల్లని ఏమన్న అంటున్నమా? ఆళ్ల దగ్గరికి పోతున్నమా? నిన్నమొన్న ఆడికెంచే పోయినంగా ఏమన్న అన్నరా?'

'నిన్నమొన్న వేరు. గియ్యాల వేరు. గడబిడల గలీజైతం వొద్దు యాది!'

'ఉత్తిపున్నేనికి పట్టుకొచ్చి కొట్టుడేందిరా. నేనేమన్న పోయి కలవడదామంటున్ననా ఏంది? ఏంజేస్తుంద్రో సూద్దాం అంతే'

'ఇంగ నువ్వు ఇనేటట్లు లెవ్వుగని. దూరం నుంచె సూడాలె. దగ్గరికి పోవొద్దు మల్ల' అన్నడు ఈరిగాడు.

'గట్లనే పా' అనుకుంట బోయినం.

♦♦♦

# 4

# సూరారం

గంత దూరంల సప్పుళ్లు, అరుపులు ఇనవడ్తున్నయి.

గిసుంటనే సైకల్ ఆపినం. బాటెమ్మటి వొద్దని ఈరిగాడు సైకల్ జరంత లోపలికి పెట్టొచ్చిండు. నేను, ఆడు సిల్ల సెట్లల్లంగ సప్పుడుసేక దూరినం. సిన్నగ ముందల్కి పోతున్నం.

అంగో.. అయ్యో.. ఆళ్ల గుడారాలు. కనవడ్తుండె. నిన్నమొన్న ఈడ ముగ్గురు నలుగురు రజాకార్లే ఉంటుండె. ఇయ్యాల్నేమో శానామందే దిగింగ్రు.

కంప కుచ్చుకోకుండా కిందికి వొంగి సిన్నగ ఇంకొంచెం ముందుకు పోతున్నం.

'యాది! సప్పుదు సేకురో శానామంది ఉంద్రు. ఏమైతదో ఏమో. సప్పుడు కానియ్యకు' గుసగుస అన్నడు ఈరిగాడు.

సప్పుడు సేకని నేను బీ సైగ జేసిన.

ఒకటి రెండు అడుగులు ముందుకేసినం.. గుడారాల దగ్గరికొచ్చినం. శానా దగ్గరికి. అక్కడేమైతాందో మాకు మంచిగ అగుపిస్తున్నది.

అమీన్లున్నరు. రజాకార్లున్నరు. నిన్నమొన్నటి కంటే ఎక్కువే ఉన్నరు. అటు కొందరు, ఇటు కొందరు నిలబడ్డరు. మధ్యల ఆడోళ్ల గుంపు ఉంది.

ఆళ్ల ముందు మొగోళ్లున్నరు.

ఆళ్లను బట్టలిప్పి బరిబాతల నిలబెట్టింండ్రు. తాటిసెట్లకు కట్టేసింండ్రు. పదిమంది ఉన్నరు.

ఆడోళ్లు మొగోళ్ల కంటే జర తక్కువనే కనిపిస్తున్నరు.

అమీన్లు, రజాకార్లు ఆళ్లందరికంటే ఎక్కువమందే ఉన్నరు.

ఒక బూరమీసాల అమీను పెద్ద బండరాయి మీద కూసుండు.

'ఏడ దాసింండ్రు. సెప్తరా సెప్పరా. నా కొడకల్లారా' అని గద్దిచ్చుకుంట అడిగిండు.

'అడుగుతున్నడు గదరా అమీన్ సాబు. సెప్పుండ్రి. ఏడ దాసింండ్రు కమ్మునిస్టోళ్లను' గట్టిగ అర్సిండు ఓ రజాకార్.

'ఈల్లు ఇట్ల జెప్పరు. ఈ ఆడోళ్లను బట్టలిప్పి బతుకమ్మ ఆడిస్తెగానీ సెప్పరు' అని ఒకామె చీరకొంగు బట్టుకుని గుంజిండు ఒక రజాకారోడు.

ఒకాయన గట్టిగ పండ్లు బిగవట్టి 'ఆడోళ్లని ఏమనకుండ్రి. ఏదైనా సేస్తే మమ్మల్ని జేయుండ్రి. ఆడంగి నా కొడకల్లారా' అని సవాల్ జేసిండు.

సెట్టుకు కట్టేసిన తాళ్లు తెంపెటందుకు సూసిండు. కానీ అయ్యి రాలె.

'క్యా బోలా.. నిన్ను అడిగితే సెప్తున్నవారా. ఏడ సెప్తున్నవ్. ఏదరా నీ పెండ్లం? దాని సంగతి సెప్త' అనుకుంట తుపాకీతోని ఎదుర్రొమ్మున గట్టిగ గుద్దిండు ఆ రజాకారు. 'అమ్మో' అని అర్సిండాయన సెట్టుకు ఏలాడుకుంట.

గదిసూసి ఒకామె కళ్లు తిరిగి కిందవడ్డది.

'వారెవ్వ, గిదేనార నీ పెండ్లం. నిన్ను కొడ్తె దానికేమో అయితుందిరో. ఇప్పుడు సెప్త'

అని తుపాకీతోని మల్లోసారి గుద్దిండు. మల్ల అర్సిండు బాధ తట్టుకోలేక. ఆ అరుపునకు కింద పడ్డామెకు జర తెలివొచ్చింది.

'ఏందె ఆడు జెప్పకపోతే నువ్వు జెప్పవా?' అని చీరకొంగు పట్టుకుండు అమీను.

'కాల్మొక్త బాంచన్. మాకేం ఎర్కలే. మమ్మల్ని ఇడుసుండ్రి' అనుకుంట లేవబట్టే ఆమె. సిన్నగ. భయపడుకుంట. భయపడుకుంట.

అయినా ఆ అమీనుగాడు ఊరుకోలే. లేస్తున్నామె చీర సర్రున గుంజిండు. ఆమె గిర్రున తిరిగి మల్ల కిందవడ్డది. రయిక కనిపియ్యకుంట రెండు చేతులు అడ్డం పెట్టుకుంది.

'ఏందిరా ఈ అన్యాళం ఈరిగా! గిదేం జమానారా?' అని పండ్లు కొరికిన. యమకోపమొచ్చింది. ఉర్కుర్కి ఆ అమీనోన్ని ఒక్క గుద్దు గుద్ది సంపేయాలనిపిచ్చింది.

'వొద్దురా యాది! ఈ అన్యాళం సూడలేకపోతున్న. ఈడికెంచి పోదాం పారా' అన్నడు ఈరిగాడు.

'అరె ఈరి. పోయేది లేదు. నా కొడుకుల్ని వొదులొద్దు. ఏదన్నా సెద్దాం రా'

'ఏందిరా సేసేది. అంతమంది ఉన్నరాడ. మనిద్దరం ఏం పీకుతం. ఆల్లకాడ తుపాకులున్నయి. ఒక్కసారి కాలిస్తే గాల్ల కలిసిపోతవ్' అని భయపెట్టనీకి సూసిండు.

'ఎయ్.. ఆడోల్లను అడ్డం బెట్టుకుని ఆడుకుంటుండ్రు.. లేకపోతెనా..? ఆ సూరారపోల్ల గురించి నీకెర్కలేదా ఏంది? కోసి కారంబెట్తరు' అని కసిరిచ్చిన.

'నీకు దండం బెట్త. సప్పుడు సేకురా.. సప్పుడు సేకు.. అటు సూడు ఏమైతాందో' అన్నడు ఈరిగాడు.

అమీనోడు కిందపడ్డామె రయిక బట్టి మల్ల గుంజిండు. రాకుంటె మల్ల బట్టి గుంజిండు. ఊడొచ్చింది. పెద్దగ నవ్విండాడు. రయిక సేతుల బట్టుకుని ఖుషి ఖుషి అయిండు. సెట్టుకు ఏలాడుతున్న ఆమె మొగునికల్ల సూపిచ్చుకుంట.. 'నా కొడ్కా! ఇప్పుడన్న సెప్తవా? సెప్పవా?' అన్నడు ఎగతాళిగా నవ్వుకుంట. ఎక్కిరిచ్చుకుంట.

'ఆడంగి నా కొడకా! ఆడోల్లతోనేందిరా? రారా నా కాడికి. రా! సంపుత నా కొడకా' అన్నడు.

'గట్లనా!? ఏది సంపుర సంపు. సూస్త' అనుకుంట గుంజుతందుకు గాయిన పెండ్లం లంగ బొందె పట్టుకున్నడు.

అర్రల బెట్టి కొడ్తె పిల్లి గూడ పులైతది.

అంతమందిల ఆగం జేస్తుంటె.. ఆ ఆడబిడ్డ ఊకుంటదా. అమ్మోరు లెక్క, కట్ట మైసమ్మ లెక్క గూడా అయితదని ఆనికి ఎర్కలె.

ఆమె అటీటు సూసింది.. ఒక్కపాలిగ లేసింది. ఒంట్ల బలమంతా కాళ్లల్లకు తెచ్చుకుంది.

అమీనుగాన్ని ఒక్క తన్ను తన్నింది. గట్టిగ. ఆడు ఎగిరి గంత దూరం పడ్డడు.

బాగ తన్నింది మాయమ్మ..

అది సూసి.. ఇంకో రజాకారోనికి యమకోపమొచ్చినట్లుంది. ఆమె దగ్గరికి వుర్కబోయిండు. ఇంతల్నె ఆమె లంగ బొందు గట్టిగ కట్టుకుంది. ఎదుర్రొమ్ములకు సేతులు అడ్డం బెట్టుకుంది. ఇంగ ఉర్కుడు షురూ సేసింది.

అబ్బ మంచిగ తన్నెవ్. ఉర్కు తల్లి ఉర్కు. దొర్కకుంట ఉర్కు.. అనుకుంటుండంగనే ఆ రజాకారోడు తుపాకీ ఇసిరేసిండు. అది గాల్ల గిర్ర గిర్ర తిరిగింది. సప్ప సప్ప సప్పుడొచ్చింది. సపక్కున ఆమె కాళ్లకు తగిలింది. బొక్క బోర్ల బడ్డది. పాపం తల్లి. రజాకారోడు రెచ్చిపోయిండు. పండ్లు బిగబట్టిండు. ఆమె దగ్గరికి ఉర్కిండు. ఆమె మీద పడిండు. ఆగమాగం జేస్తుండు.

అయ్యో.. పాడుగాను..

గిది సూస్తందుకేనా కుక్కకర్సింది?

గిది సూస్తందుకేనా సైకల్ మీదొచ్చింది?

గిది సూస్తందుకేనా ఐదు దినాలకెంచి ఇటు మొహాన తిర్గుతుంది?

అన్యాళం పాడుగాను. ఆడబిడ్డ మీద చెయ్యేస్తే ఆగమైతర్రా నాయాల్లారా. నాశనమైతరు.

ఆవు దూడెమ్మగటి కోడె బడ్తెనే ఓర్వం. అట్టాంటిది ఆడబిడ్డ మీదనా మీ పతాపం.

ఒట్టి కొట్టార్రా. మీకు కొట్టాల. గట్ల కొట్టాల కోడెకు కొట్టినట్లు నా కొడకల్లారా!

దున్నపోతుల్లెక్కున్నరు. దుర్మార్గం జేస్తుండ్రు.

అది సూడలేక ఆడ నిల్వడ్డ అమ్మలక్కలు కళ్లు మూస్కుండ్రు.

సెట్లకున్న మొగోళ్లు అటు సూడకుండ మొహం తిప్పుకుండ్రు.

ఆమె మొగుడు మాత్రం అటే సూస్తుండు. కండ్లు పెద్దయి జేసి సూస్తుండు. అటే సూస్తుండు. పండ్లు కొరుక్కుంట. పిడికిళ్లు బిగవట్టుకుంట.

ఒక కాలు సెట్టుకు ఆనించి ఎదుర్రొమ్ము ముందుకు తెచ్చి గుంజుతుండు. కట్టేసిన తాళ్లు తెంపనీకి సూస్తుండు. గట్టిగ గుంజిండు.

ఆ నా కొడుకులకు ఎట్లాగూ కనికరం లేదాయె. ఈ ఊర్ల పేనిన తాళ్లేగా, ఆటికన్నా లేదాయె కనికరం?

తెగితె బాగుండు అనిపిచ్చింది.

'ఈరిగా! సిగ్గనిపిస్తలేదురా? సీమునెత్తురు లేవురా. లోపల ఏమనిపిస్త లేదా?' అని అడిగిన నిమ్మలంగనె.

ఈసారి ఈరిగాడు ఏమనలె. దివాల్ మొహం బెట్టిండు.

బండరాయి మీద కూసున్న పెద్ద అమీనుగాడు లేసిండు. 'కండ్లు మూస్కుండ్రేంది? సూడుండ్రి. మీకు బీ గిట్లనే అయితది. అబీ బోల్తె నయ్ బోల్తె?' అని ఆడోళ్ల దగ్గరికి పోవుకుంట అన్నడు. ఆడు పట పట పండ్లు కొరికిండు. ఆడోళ్లంత గడగడ వొణకబట్టిండ్రు.

'ఇనర్రా ఈళ్లు. ఇనరు. తలొకరు తలొకదాన్ని సూస్కోండ్రి. ఎవరికి నచ్చినదాన్ని ఆళ్లు.. ఆగం జేయుండ్రి. అప్పుడెట్ల సెప్పరో సూద్దాం' అన్నడు ఆ బూరమీసాలోడు.

'అయ్యా ఆగుండ్రి! ఆడోళ్లని ఏం చెయ్యకుండ్రి. నేను సెప్త' అన్నడు ఆఖరి చెట్టుకు కట్టేసి ఉన్నాయిన.

'రేయ్. సాయన్న నోర్మూసుకోరా. ఏందిరా నువ్వు జెప్పేది?' అన్నడు పక్క సెట్టుకు ఏలాడుతున్నాయన.

'చెప్పనియ్యవయ్య చెప్పనియ్యి' అని ఆడోళ్ల కెంచి ఒకామె అన్నది.

'వొద్దె. మన కోసం ఆళ్లని ఆగం సెయొద్దు. ఆ సంఘపోళ్లు సేసేదే మనకోసం. సెప్తే తప్పయితది'

'ఏందయ్య తప్పు. గిట్ల ఆగం జేయబడ్తుంటె ఎందుకయ్యా మనం బతికేది?'

'ఏందిరా! సెప్పొద్దా!! నీ పెండ్లాన్ని సేస్తే సెప్పొద్దంటవో లేదో సూస్త. దాన్ని గుంజకరండ్ర ఇక్కడ' అన్నడు పెద్ద అమీను.

ఇద్దరు రజాకార్లు ఆమె రెండు రెక్కలు బట్టి గొర్ర గొర్ర గుంజుకొచ్చిండ్రు.

జుట్టుబట్టుకుని 'సూడు ఈడ్ని సూడు. ఈడు సచ్చిండింగ నా చేతిలో. నువ్వు సెప్తె బతుకుతడు మరి. ఎయ్యిండ్రా ఈన్ని' అన్నడు.

రజాకార్లు అటోడు, ఇటోడు రెండు తుపాకులు పట్టుకుని కడుపులకెంచి ఒకడు, మొహం మీదొకడు గుద్దుతనే ఉన్నరు. మల్ల గుద్దిండ్రు. మల్ల మల్ల గుద్దిండ్రు.

రక్తాలు కారబట్టినయ్.

నాకు అండ్లకు ఉర్కి తండ్లాడాలని ఉంది. సచ్చినా ఏంలేదు. బతికినా ఏంలేదు. 'ఈరిగా పోదామారా' అంటే ఆడు వొద్దంటడు. నేనింగ ఎట్లయితే గట్లయింది, వుర్కుదామని సూస్తున్న.

గంతల్నే 'ఆపుండ్రయ్యా, ఆపుండ్రి. సెప్త. ఆయన్ని ఏం సెయ్యకుండ్రి' అని బూరమీసాలోని సేతులంగ జుట్టు ఇడిపిచ్చుకుంట అర్సిందామె.

ఆమె సెప్పనే సెప్పింది, అసలు ముచ్చట.

కొట్టుడు ఆపిండ్రు కొడుకులు.

పెద్ద అమీను గాడు పక పక నవ్వుకుంట.. బూరమీసాలు తిప్పుకుంట సైగజేసిండు.

ఒక బలగం ఊర్లకళ్ల ఉర్కనే ఉర్కింది. సంఘపోళ్లను పట్టుకొస్తందుకట్టుంది.

'సెప్పిన గద ఇంగ వొదులుండ్రయ్య మా వోళ్లని' అని అడిగిందామె.

బతిలాడింది. కాళ్ల మీదవడ్డది.

'వదుల్తమె. వదుల్తమ్. మీ మొగుళ్లని, మగాళ్లని. వొదులుండ్రిగానీ.. ఆడోళ్లను పట్టుకుని

బట్టలన్నీ గుంజేయుంస్రి. ఎవర్వీ మిగులొద్దు. అందర్వీ తగలబెట్టేయండి. ఎట్ల ఊర్లకు పోతరో సూద్దాం. దాచి పెడ్తరా ఆళ్లని. మల్ల ఎప్పుడు దాయకుంట గావాలె ఈళ్లకు!'

ఇగ ఆళ్లు ఊకుంటరా? అమీన్లు, రజాకార్లు ఆడోళ్ల మీద పడి బట్టలన్ని గుంజింస్రు. మొగోళ్లని సెట్లకెంచి వొదిలేసింస్రు.

ఆడోళ్ల బట్టలు, మొగోళ్ల బట్టలు అన్నీ ఒక్క కాడేసి నిప్పు బెట్టింస్రు.

'ఇక పోంస్రా. ఎట్ల పోతరో సూస్తం' అనుకుంట గట్టిగ నవ్వింఁడు బూరమీసాలోడు.

భగభగ మంటలేసింది. నా గుండెల గూడా గంతే మంట ఉన్నది.

'అరె ఈరిగా! సస్తే సచ్చినం. పోదాం రా. ఒక్క నా కొడుకుని సంపినా సాలు. పారా' అన్న.

'వొద్దురా యాది! వొద్దు. ఇంగ ఇడిసిపెట్టింస్రుగా. ఆల్లే పోతల్లెరా. బతికింస్రు సాలు' అన్నడు.

ఒకామె తట్టుకోలేక ఉర్కుంట ఉర్కుంట పోయి బాయిలకల్ల దుంకింది. కొందరు మొగోళ్లు ఆళ్ల పెండ్లాలని ఎత్తుకుని దాస్కుంట ఉర్కింస్రు.

ఒకాయన ఒంటి సుట్టు సొప్ప కట్టెలు పెట్టుకుని ఉర్కిండు. బాటెమ్మటి బోతే.. రజాకార్లు గుర్రాల మీదొచ్చి కొట్టబట్టె. అందుకే కొందరు ఆయిందం సేండ్లకు ఉర్కి దాస్కున్నరు. అందులో ఒకరిద్దరు ఆకులు అడ్డం పెట్టుకుని ఆగమాగం ఉర్కింస్రు.

'అరె ఈరిగా! ఇంగ అంగి ఇప్పురా. నీదోటి నాదోటి.. ఇద్దరికిచ్చినా సాలు. నీ తువ్వాలొకరికి, నా తువ్వాలొకరికి.. ఇచ్చొద్దాం'

'ఎట్ల ఇచ్చొద్దాం. గా రజాకార్లు మనల్ని గూడా పట్టుకుంటర్రా ఎందుకొచ్చిన గోల?'

'నా కొడకా! లే. ఉప్పు కారం తింటలెవ్ రా. అప్పటికెంచి సూస్తున్న. పాడిందే పాట పాసిపండ్ల దోస అంటవ్' ఆగబట్టలేక ఒక్క తన్ను తన్నిన ఈరిగాడ్ని.

దెబ్బకు కిందబడ్డడు. మల్లెమ్మటే లేచి నిల్వడ్డడు.

ఇంగ మాట్లాడకుంట అంగి ఇప్పి ఇచ్చిండు.

'ఇంగో సూడు. ఆంచి పోతుంద్రా.. అటు పోతనే మనం కనిపిస్తం. గిట్ల ఆయిందం సేంద్లళ్లకు ఉర్కింద్రు సూడు. ఆళ్లందరు బయిట్కి రాలే. ఆళ్ల కాడ్కి పోకున్నా ఏం లేదు. ఇటు బోయి.. ఆ బాట కాడ బట్టలు ఇసిరేసి వొద్దాం' అన్న.

అటీటు సూడకుంట.. ఉర్కాలని చెప్పిన. 'సరే' అన్నడు ఆడు బానే అంగీ ఇప్పుకుంట. ఇంగ ఉర్కుడు మొదల్బెట్టినం. ఆ బాయిగడ్డెమ్మటి ఒక బస్త గుడ్డ గూడ దొర్కింది. ఉర్కుంట ఉర్కుంట అది బీ అందుకున్నం. అన్నీ ఆ బాట కాడ ఇసిరేసి, ఇంగ ఎవల్కి కన్పియ్యకుంట.. మల్ల ఎనక్కు తిర్గి సైకల్ కాడికి ఉర్కొచ్చినం.

♦

పసరు లేదు. గిసరు లేదు. పెయ్యి మీద బట్టల్లేవ్. ఒంట్లో ఓపిక లేదు. అట్లనే సైకల్ మీదొస్తున్నం. ఆ ఊర్ల ఈ ఊర్ల పరేషాన్ పరేషాన్‌గా సూసింద్రు. మా ఊర్ల అయితే మరింత బర్బాద్ అయినం. ఇంగ ఇట్లనే గూడెం బోతె పటేల్ ఏమంటడో, ఎట్టయితదో?

గందుకే సక్కగ బాయికాడికి బాటబట్టినం.

ఖాలే పీలే ఏం లేదు లోపల. కడుపుల ఆగమాగం ఉన్నది. గుండెల గుబుల్ గుబుల్ అయితున్నది.

గుడిసె జరంత దూరం ఉందంతే. వొరిచేను గట్టెమ్మటి తాటి సెట్టు మీది కెంచి.. 'ఓర్నీ ఏందిరో! ఏం ఆగం చేసింద్రు!! గట్ల రాబట్తిరి!? అని అడిగిండు గౌండ్లోళ్ల శీనుగాడు. పై మొహాన సూసినం. గానీ.. సప్పుడుజెయ్యలేదు. అట్లనే పోయినం.

గుడిసె ముందల సైకల్ ఆపి.. గుడిసె లోపల పాత అంగీలు దోలాడుకుంటున్నం.

ఇంతల్నే గౌడు గబ గబా సెట్టు దిగొచ్చిండు. కల్లు ముంత గుడిసె ముందల ఎండపొడకు పెట్టుకుంట 'ఓరి యాది! ఏందిరో పిలుస్తున్నా సూస్కుంట వొస్తుంద్రుగని.. సప్పుడు జేస్తలేరు. బట్టలేమైనయ్.. గట్లోస్తుంద్రు. ఎవరన్న బర్బాద్ జేసింద్రా ఏంది?' అని అడిగిండు.

'బర్బాద్ లేదు. గిర్బాద్ లేదుగనీ, గింత కల్లుబోస్తావారా ఇయ్యాల' దొర్కబట్టిన అంగి పట్టుకుని బయిటికి వొచ్చుకుంట అన్నడు ఈరిగాడు. 'ముచ్చట ఎన్కసీరి సెప్తగనీ.. పోస్తవా పొయ్యవా?' అన్నడు మల్ల.

'మీకు పొయ్యకపోతే ఇంకెవల్కి పోస్తరో.. పొయ్యకుంట ఇటు మొహాన మల్ల తాడెక్తనా

ఏంది? గిది పటేళ్లకు పంపియాలె. ఇంగో ఆ ఎఱ్ఱ రేగట్ల పోత్తాడు ఉంది. అదెక్కి పోస్తా' అన్నడు.

నేను లోపల అంగి దోలాడుకుంట ఇంటున్న. పాతదోటి సూరుల సుట్టి నూకింది ఎప్పటిదో దొర్కింది. అది తొడుక్కుంట బయిటికి వొస్తుంటె 'ఆనికొక్కనికేనా నీగ్గాడనా యాది! పత్తెం అయిపోయిందా? పసరు మందు యాడిదాంకవొచ్చె?' అడిగిండు గౌడు. నేను సప్పుడుజెయ్యక అంగి తొడుక్కుంటున్న.

'గా పసరు మందుకు పోతెనే గింత కాడికొచ్చింది!' అన్నడు ఈరిగాడు మోటబాయి కాడ కాళ్లు చేతులు కడుక్కుంట.

'ఏమైందేందిరో?' అన్నడు శీనయ్య సుట్ట తీస్కుంట.

'నీయవ్వ.. సుట్ట ఎన్కసీరి అంటిద్దువుగనీ సుతారం సెయ్యకు. ముందు తాడెక్కురా. లోపల ఆగమాగం ఉన్నది. పా.. పా.. పా..' అని తొందరబెట్టిండు ఈరిగాడు వుర్కొచ్చుకుంట.

అంటిద్దామని తీసిన సుట్ట సెవుల సెక్కుకుండు గౌడు. ముస్తాడు ఎగేసుకుండు.

ముద్దెనక ముస్తాడు, కొండికి లొట్టి తగిలిచ్చి బాట బట్టిండు. ఆడెనకంగ మేమిద్దరం పోయినం.

తాటి సెట్టుకాడికి పోయినంక చిర్కబద్ద తీసిండు శీనుగాడు. తాడుకు మధ్యల మోపు చేసి గీస కత్తి గీసుడు మొదల్బెట్టిండు. ఆటీటు మలుపుకుంట కత్తి నూరుతుంటె.. సక్ సక్ మని సప్పుడొస్తాంది. నేను పక్కనున్న వొరిచేను మొరం గట్టు మీద కూసుని ఆ కత్తినే సూస్తున్న. మెత్తగున్నది. ఎండ పొడ తగిలినప్పుడు తళుక్కున మెరుస్తున్నది. గీ కత్తి చేతిలుంటె బాగుండు. గా కొడుకుల్ని సప్ప సప్ప పీకలు కోసి పడేద్దును అనిపిస్తున్నది.

'అబ్బో ఇగ నూరిన కాడికి సాలుగానీ తాడెక్కురా శీనిగా!' అన్నడు ఈరిగాడు తాటి మట్టని దాపు చేస్కుని కింద కూసుంట.

'ఆగుతలేరేమ్రో! గియాల ఊపు మీదికొచ్చిండ్రు. నిన్న మొన్న గియాలకు యాడ ముట్టిండ్రు' అనుకుంట గీస కత్తి ఎన్కబెట్టి, ముస్తాడు ముందలంగ సెట్టుకు గట్టి తాడెక్కిండు శీనయ్య. ముస్తాడు పైకేస్కుంట పోతావుండు. యెసినప్పుడల్లా టప్పు.. టప్పుమని సప్పుడొచ్చె.

'ఆ సప్పుడిన్నవారా.. అట్ల ఎయ్యాల నా కొడుకుల్ని..' అన్న పండ్లు కొరుక్కుంట.

'మల్లేమైందిరో నీకు. నువ్వింక ఆడ్నే ఉన్నవా ఏంది?' అన్నడు ఈరిగాడు తాటిమట్ట లేసి ఉర్కొచ్చి నా పక్కన కూసుంట.

'ఉండక.. నీలెక్క అనుకున్నవారా ఆడంగి నా కొడకా?' అన్న జరంత కోపంగనే.

'అరె నేనేం చేసిన. సేసినకాడికి జేసినం ఇంగొదిలిపెట్రా..'

'ఏందిరా వొదిలేది. గప్పుడు వొదిలిన గానీ.. గిప్పుడు వొదిలేది లేదు. బాయిల బడ్డ కప్పల్లెక్క గిదే మన ప్రపంచకం కాదు' అన్న నేను.

'గింత ముంత కల్లు తాగి మర్సిపో. సప్పుడు సేక ఉండక మల్లేందిరా ముచ్చట..' అన్నడు ఈరిగాడు.

'ముండాకొడ్కా! ఎట్టుంటర సప్పుడు సేక.. ఎట్ల మర్సిపోవాలె.. గా సూరారపోల్లు.. ఆడోళ్లు.. అమీన్లు గయ్యే యాదికొస్తుండె..'

'ఏం సేస్తవ్ మరె.. ఆ అసలు ఏంజేద్దామని?'

'సేస్త సేస్త.. ఈ రాత్రికి సేస్త.. ఎట్లయిన ఏసేస్త నా కొడుకుల్ని..'

'ఏందిరా సేసేది.. ఏసేది.. నువ్వేమన్న జాతి కోసం పుట్టినవా? నీతి లేని నా కొడకా? మూస్కోని తాగి గమ్మునుండు. ఏసేసి యాడుంటవ్ రా ఈ భూమ్మిద.. అమ్మయ్యలేత్ర.. ఏమైపోతది బతుకు..?'

'ఎవడ్రా నీతి లేనోడు. నీయయ్య గదే జెప్తున్నగా.. అండ్ల మా అయ్య ఉంటే.. గిట్లనే ఊకోనా? మా అమ్మ ఉంటే మూస్కోనా? లంజకొడకా? నీ అక్కో చెల్లో ఉంటే నువ్వూకుంటవేమో.. నేనూకోను?' అని మొహం బట్టుకుని సెప్పిన. 'అరే ఈరి.. మనసైతలేదురా ఏదన్న సేద్దాం రా. గది జూసి కూడా మూస్కుని కూసుంటె.. ఎందుకురా ఈ బతుకు ఎందుకు? ఇయ్యాల గా ఊర్లె అయింది. రేపు మన ఊర్ల అయితే? వుండొద్దురా ఆ కొడుకులు. ఆళ్ల పెండ్లాలు ముండబోయాలె. గందుకే రాత్రికి ఆ గుడారాలు.. క్యాంపు ఖతం చెయ్యాలె.. ఈరి ఏందిరా.. సెప్పురా.. సేద్దామా రాత్రికి?' బతిలాడిన.

'సరే.. సప్పుడు సేకు.. ఆడొస్తుండు. సప్పుడుసేకు.. సప్పుడు సేకు..' అన్నడు.

శీనుగాడు దిగిండు. మేం ముచ్చట ఆపినం అని జరంత మొహం మార్సిండు. ఏదో దాస్తున్నమని ఎర్కయినట్టుంది ఆనికి. అనుమానంగ సూసిండు.

కల్లు ముంత దింపి తాటి పీసు అడ్డంబెట్టి కల్లు వొడబోసిండు. చిన్న ముంతల నింపిండు. ఏదో అడుగుదామని సూసిండు. గానీ సప్పుడు సేక, చెరో రేక చేతికిచ్చిండు. సెరింత కల్లు పోసిండు. 'మల్ల పోయనా..?' అన్నడు. మల్ల చెరో రేక గట్టిగనే పట్టినం. చిన్న ముంత ఒడిసింది.

'ఇంకో ముంత పోయనా?' అన్నడు. 'పొయ్యి' అన్నడు ఈరిగాడు.

పెద్ద ముంతలకెంచి చిన్నదాంట్ల పోస్కుంట.. 'మీ ముచ్చటేందో గమ్మతిగుందిరో.. జెప్పనీకి ఏదో ఉందిగానీ సెప్తలేరు. ఎయ్యాలె.. ఖతం జెయ్యాలె అంటున్నరెవర్నిరో..' అడిగిండు శీనుగాడు ఆగబట్టలేక.

ఈరిగాడు, నేను ఒకరి మొహాలు ఒకరు సూస్కున్నం, గానీ సప్పుడు చెయ్యలే కొద్దిసేపు.

'ఇంకో రేక బోసినంక ఈరిగాడు పక్కన బెట్టిండు. నాకు కల్లు పోస్తున్నప్పుడు మొదల్ బెట్టిండు ముచ్చట... 'శీనిగో! మల్ల ఎవల్కి సెప్పకుగానీ గా పెద్ద సూరారం కాడ ఏమైందో ఎర్కేనా?' అని ఆడ జరిగిందంత సాలిరువాలు దున్నినట్టు, పొలం గట్టు కట్టినట్టు.. సెప్పుడు మొదల్బెట్టిండు. శీనయ్య చెవులు నిక్కబొడుసుకుని ఇంటుండు. పైకి నిక్కిన సెవుల సెక్కిన సుట్ట తీసిండు. బొడ్డు కాంచి అంగిలేపి జెకముక సంచి బీ తీసిండు. రెండు చిన్న పలుగు రాళ్ల మజ్జెల దూది బెట్టి టక టక కొట్టిండు. నిప్పు రాలే. మల్లగొట్టిండు. నిప్పంటుకుంది. ఆ దూది సుట్టల నూకి ఇగ గుప్ప గుప్ప పొగ పీల్సి ఊదిండు. నేను ఆ జెకముక సంచిని, ఆడు వొదుల్తున్న పొగనే చూస్తున్న.

'పొగ బెడ్త. గిట్లనే పొగ బెట్టాలె. ఆ గుడారాలల్ల. ఆ క్యాంపుల. ఈ జెకముక సంచి అడిగి తీస్కపోవాలె. ఇయ్యాల రాత్రికి ఎట్టయినా..' అని లోపల్లోపల అనుకుంటున్న.

శీనయ్య ముచ్చటంత ఇన్నడు 'గింత అన్యాళం అయిందా ఆడ. పాడుగాను. గట్ల జేసింద్రులే గా రజాకార్లు.. ఇంగెట్లరో మనం బతికేది..?' అని తలగొట్టుకుండు. సుట్ట నిప్పు రాయికి రుద్ది ఆర్పిండు. మిగిల్న సుట్ట ముక్క మల్ల సెవుల సెక్కిండు.

'గిట్ల బానే బయిటవడి బర్బాద్ అయింద్రుగానీ.. ఎయ్యాల గియ్యాల అంటుంద్రు. ఎవల్నిరో.. ఏసేది?' అనుకుంట పోయిండు. జరంత దూరంల చింతచెట్టు పక్కనున్న పొదల్ల కెంచి ఓ డబ్బా తెచ్చుకుంట. ఎప్పుడు దాసిండో ఏమో అది.

'ఏ.. ఏంలేదు. ఈ యాదిగాడు రాత్రికి గా గుడారాలు తగలబెడ్తా అంటున్నడు. నేనేమో వొద్దురో అని మొత్తుకుంటున్న. నువ్వేమంటవ్ శీనయ్య' అని చెప్పుకుంట, అడుక్కుంట ఆని ఎన్కంగనే తిర్గుతుండు ఈరిగాడు.

శీనయ్య పడావు బడ్డ సెల్కల మొలుస్తున్న తాటి పిల్కల మీద డబ్బలకెంచి ఏదో పోస్తున్నడు. నేను కూసున్న వొరానికి జరంత దూరంలనే ఉన్నరు. ఆళ్లు సేసేది కన్పిస్తున్నది. సెప్పుకునేది ఇన్పిస్తున్నది. ఈరిగాడు శీనయ్యని అడగడం నాకు నచ్చులే. ముచ్చట మర్పియ్యనీకి.. 'ఏంది శీనయ్య.. ఏందది ఏం బోస్తున్నవ్?' అనుకుంట పోయిన.

'ఏది గిదా? కిరసనాయిల్. తాటి పిలకలు పాడుగాను.. ఎంత పీకినా మల్ల మొలుస్తుండె. గీ కిరసనాయిల్ పోసినమనుకో. ఇంగ మాడిమస్సే. సచ్చి ఊకుంటయ్. మల్ల పుట్టవ్' అని జెప్పిండు. 'నా ముచ్చట బానే ఉందిగనీ.. ఏంరో గుడారాలు తగలబెడ్తా అంటున్నవంట.. గంత మొగోనివి అయినవ్‌లే?' అని డబ్బా ఓ చెట్టు దాపున పెట్టుకుంట అడిగిండు.

'గంత గాదు.. గింత గాదు.. ఆడుగాదు.. నువ్వుగాదు.. ఎవ్వలు వొద్దన్నా.. గిద్దన్నా.. ఇయ్యాల ఎయ్యాల. ఈడు వొచ్చినా రాకపోయినా.. ఆడ జరిగేది జరిగేదే.. ఏసేది ఏసేదే..' అని గట్టిన సెప్పిన శీనిగాని కండ్లల్లకు సూస్కుంట.

'తాగిన మాటలారా.. సప్పుడుజేక ఊకొమ్మన్నగా?' అని మీది మీదికి ఉర్కిచ్చిండు ఈరిగాడు.

శీనిగాని కెంచి మొహం తిప్పి ఈరిగాని కల్ల సూసిన. దమ్మకురికి ఒక్కటి బీకిన. నా ఎడమ చేత్తోని ఆని కుడి పక్క రెక్కబట్టి ఈపిలకు ఇరిసిన.

'ఇప్పుడు సెప్పురా.. వొస్తవా రావా? ఏమో మీది మీది కొస్తున్నవేందిరో?' అని కుడిచేత్తోని డొక్కల గుద్దిన.

'అమ్మా' అని అర్సిండు. ఆనికి కూడా అయితది. వొదిలినంక.. ఒద్దు గిద్దని ముచ్చట నువ్వుగానీ, ఆడుగానీ సెప్పింద్రనుకో.. ఆ రజాకార్లను కాదు.. ముందుగాల మిమ్మల్ని సంపుత నా కొడకల్లారా' అని పండ్లు కొరికిన. గుడ్లు ఉరిమి సూసిన.

'అట్లనే అట్లనే.. వస్తగనీ.. వొదులు మాట మార్సను వొదులు' అన్నడు.

వొదిలిపెట్టిన.

'ఏం పట్టుబట్టినవ్ రా. ఏం పగబట్టినవ్ రా? ఇంగ నువ్వు ఇనవని ఎర్కయింది గానీ.. పోదాం లే రాత్రికి.. ఎట్లయితె గట్లాయె.. ఏస్తె ఏసేద్దాం.. ఏదైతె గదైంది..' అన్నడు ఈరిగాడు.

నన్ను సూసి శీనిగానికి కూడా భయమైంది. ఉచ్చబోస్కొనీకి పోయిండు నా కొడుకు. సప్పుడు సేక సూస్తుండు ఆడికెంచి.

'అబ్బా..' అని ఒళ్లు ఇర్సుకుంట.. 'తాగిందంతా దిగిపాయె.. మల్లింత పోద్దువుగానీ రారో.. శీనిగా!' అని ఆన్ని తోల్కొచ్చిండు ఉచ్చ గూడా సక్కగ పొయ్యనియ్యకుండనే.

మల్లో ముంత కల్లు తాగినంక.. 'ఇంగ నేను సెప్త మీరు ఇనుండ్రి. శీనిగా నువ్వు గూడా వొస్తవా?' అని అడిగిన.

'ఏడికి? నేన్ రాన్. ఇంటికాడ నా పెండ్లం పిల్లలు ఆగమైతరు..' అన్నడు భయపడుకుంట.

'నువ్వు రాకుంటె రాకపోతివిగానీ.. ఒక పనిచెయ్యి.. సేస్తవా.. సెయ్యవా?' అని అర్సుకుంట అడిగిన గట్టిన.

'హా.. సెప్పు సేస్త.. సెయ్యకేం జేస్త' అన్నడాడు భయపడుకుంట.

'ఆ రెండు చిన్న ముంతలు.. కిరసనాయిల్ డబ్బా, జెకముక సంచి.. ఇయ్యి సాలు.. ఇంకో ముచ్చట ఊర్ల గీ ముచ్చట ఎవర్కన్న ఎర్కయిందనుకో.. అప్పుడుంటది నీకు.. ఏంది? రాత్రికి మేం తిరిగొస్తే సరే.. లేకుంటె పొద్దుగాల మా ఊరికి బోయి మా అమ్మయ్యలకు సెప్పు. ఏమంటున్న?' అన్న.

గట్లనే అన్నడు. మల్ల సుట్ట తీసి అంటిచ్చుకుంట.

'అరే ఈరి! నేను సెప్త ఉపాయం.. నువ్వు ఇను' అని ఆడికి పోయినంక ఏం జెయ్యాల్నో, ఎట్ల జెయ్యాల్నో మొత్తం సెప్పిన.

రెండు ముంతల నిండా కిరసనాయిల్ పొయ్యాలె. దీనిపైకెంచి గడ్డి నూకాల, జెకముక సంచి పెట్టి నిప్పంటియ్యాల. ఇట్ల అంటిచ్చినమో లేదో.. గట్ల గుడారాల మీదికి ఇసిరెయ్యాల. ముంత సక్కగపోయి గుడారాలను గుంజి కట్టిన రాయికి తగిలి పగలాలె. తగల్లేదో మనం ఆగమైతం. గురి సూసి కొట్టాల. గుల్లేర్‌తో పిట్టలు కొట్టినట్లు, ఒడిసెతోని

వొరిసేన్లో కొంగల్ని తరిమినట్లు, సక్కగ కొట్టాలె. గిదీ నేను చేసిన ఉపాయం.

గిది జెయ్యాలంటే జరంత సీకటివడ్డంక ఈడికెంచి ఎల్లాల. సీకట్ల గురి తప్పొద్దు మల్ల. సిన్నగ పోయి, మరింత సీకటి అయిందాక ఆ సిల్ల సెట్లల్ల దాస్కోవాల. ఆడ అనువుగున్నప్పుడు ఇద్దరం ఒక్కసారే గమ్మున ఇసిరేసి రావాలె.

'అట్లనే సేద్దాం' అన్నడు ఈరిగాడు భయపడుకుంటనే.

♦

పొద్దుగూగినదాంక ఈరిగాడు భయం భయంగనే ఉన్నడు. ఆగమాగమైండు. 'ఆ శీనుగాడు ఊర్లకు బోయిండు. ఎవర్కన్నా సెప్తడేమో' అని భయపడిండు. మల్లోసారి ఆలోచించమని అడుగుతనే ఉన్నడు. ఇంటికాడ ఎట్లనో.. పటేల్ ఏమంటడో.. ఆ గుడారాల కాడ ఏమైతదో.. అని ఆని గుండెల గుబుల్ గుబుల్ అయితనే ఉంది. ఆడు ఏమన్నా.. ఏం అడిగినా సప్పుడు సెయ్యలే నేను.

ఎప్పుడు పొద్దుగూకుతదా అనే సూస్తున్న. పొలం పని చేస్తున్నంగానీ.. నా యాసంత, ధ్యాసంత గాడ్నే ఉంది. గా క్యాంపు కాడ. ఇంగ జరంత సీకటి వడ్డది. నేను అన్నీ సంచిల సర్దుకుని సైకల్‌కు ముందల తగిలిచ్చిన ముందుగాల్నే.. ఇంగ తియ్యిరా ఈరిగా సైకల్ అన్న. ఆని కాళ్లు కదుల్తలెవ్. జరంత వొణుకుతుండు.

గుడ్లురిమి సూసిన.

ఆని గుండె జారినంత పనైంది. సిన్నగ తీసిండు సైకల్. మెల్లగ తొక్కుడు మొదల్బెట్టిండు. నిన్న మొన్న ఉన్న ఉర్కులాట లేదు.

'సిన్నగనే పోనీ, సీకటి పడాలె, పోదాంలే, ఎంత సీకటి పడ్తె అంత మంచిది మనకే' అన్న.

'ఏం సీకటో ఏమో.. మనిండ్లల్ల అయితట్టుంది సీకటి' అన్నడాడు. ఆ మాట ఆని మనసులకెంచి రాలే, మైకంల కెంచి వొచ్చింది.

'ఏం భయపడకురా.. నీకేం కాదు.. ఆడ తేడా వొచ్చినా మొత్తం నా మీద ఏస్కుంటలే. నువ్వు జరంత దూరంలనే ఉందువుగానిలే' అని సముదాయించిన.

జ్వర కుదుటవడ్డడు.

జర సిమ్మ సీకటి అయింది. ఆని మనసులెక్క.

ఉపాయం బాగుంది. కానీ అది ఆనికీ నాకు పెద్ద అపాయం అయితట్టుంది.

అయినా ఏం కాదు, సచ్చినా బతికినా ఇంగలే.

ఇయ్యాల సస్తే రేపటికి రెండు. గంతే ముచ్చట.

♦

సిమ్మ సీకటయింది.

రెండు గుడారాల ముందల అటోటి ఇటోటి కందిన్లు ఎలుగుతున్నయ్. దాని ముందలొకడు, దీని ముందలొకడు కాళ్లు కాలిన పిల్లుల లెక్కన అటీటు తిర్గుతుంద్రు.

ఆళ్లు పంతరో రాత్రంత అట్నే తిరుగుతరో ఎర్కలేగానీ, జర సేపైతే సూద్దామని అనుకున్నం ఇద్దరం. సైకల్ జరంత దూరంలనే పెట్టి వొచ్చినం. పొద్దున దాస్కుని సూసిన సిల్ల సెట్లల్లనే దాస్కుని సూస్తున్న. ఆడ ఏమైతాందో మంచిగ కనిపిస్తాంది. ఏం చెయ్యాలో ఈరిగానికి వొచ్చుకుంటగూడ ఒకటికి రెండుసార్లు జెప్పిన.

'ఈరిగా సప్పుడు సేకు. సైకల్ ఆడుంది. ఈడ తేడా వొస్తే ఉర్కు ఏస్కుని. పో దొర్కకుంటగనీ, నా గురించి సోంచాయించకు, గదీ లెక్క. గంతేగానీ పొద్దటి లెక్క సెయ్యకు' అని జెప్పిన.

'పొద్దటి లెక్కలేదు. గిద్దటి లెక్కలేదు. గింతదాంక వొచ్చినంక ఏడిది ముచ్చట. ఏసుడే ముచ్చట. నువ్వేస్తవా ముందుగాల, నేనెయ్యనా?' అన్నడు. మంచి ఊపు మీదికొచ్చిండాడు.

'ఆగాగు. జర్రసేపాగు. అదే ఊపు మీదుండు. ఆ పిల్లులు పండినా పండకపోయినా… ఏసేది ఏసేదేగనీ, జర్రసేపు సూద్దాం. ఏమంటున్న' అన్న.

'సరే' అన్నడాడు.

నేనేం జేస్తనో గట్లనే జెయ్యి అని చెప్పిన. ఇద్దరం లొట్లు తీసినం కిరసనాయిల్ నింపినం. గడ్డి నూకినం. జెకముక సంచి దగ్గర పెట్టుకున్నం. చాపలకు గాలం ఏసి, కుందేళ్లకు వలేసి పడ్తయా, పడవా? అని ఎదురుసూస్కుంట కూసున్నట్లు, ఆ రజాకార్లు పంతరా పండరా? అని సూస్కుంట కుసున్నం.

ఓడు పండనే పండిండు. గుర్రు పెట్టుకుంట. ఇంకోడు కూర్పట్ల పడ్తుండు. కోడి నిద్రపోతుండు.

'ఇదే అదునురా, ఇంతకంటే ఏముంటది? అంటియ్యిరా యాది' అన్నడు ఈరిగాడు జెకముక సంచి సేతికిచ్చుకుంట. నాకు జరంత అలుపు ఉందిగానీ, ఆడు మంచి ఊపు మీదుండు. సిన్నగ జెకముక సంచిలకెంచి రాళ్లు తీసి దూదిబెట్టి కొట్టిన. నిప్పంటుకుంది. అది లొట్టిల నూకిన గడ్డిల బెట్టి ఆని సేతికిచ్చిన. ఆడు ఉఫ్ ఉఫ్మని రెండు సార్లు ఊదిండు. గడ్డి అంటుకుని మంట లేసింది. ఇంగ జరంత ముందల్కిపోయి సక్కగ గుడారానికి ఇసిరిండు ఈరిగాడు. గుడారం గుంజి కట్టిన బండరాయికి తగిలింది సక్కగ. టపక్కున పగిలింది లొట్టి. లపక్కున అంటుకుంది మంట గుడారం కిందికెంచి.

అది అయ్యేలోపే నేను జెకముక మల్లకొట్టి రెండో లొట్టిల బెట్టిన దూది. ఆ మంట అంటుకున్న ఊపు సూసి రెండో గుడారం మీదికి ఇసిరిన. ఆళ్ల కడుపులు కాలాల ఇయ్యాల. రాసి పెట్టుంది. లొట్టి పగిలింది. మంట లేసింది. రెండు గుడారాలు అంటుకున్నయ్. మొదటిది మాంచి మంట మీదుంది. రెండోదానికి మంట లేస్తున్నది. నిద్రల ఉన్న నా కొడుకులు ఎవడూ బయిటికి రాలె. బయిటున్న పిల్లులకు మెల్కరాలె.

భగ భగ మండుతున్నయ్ గుడారాలు.

'ఇంగ అయిపాయె ముచ్చట ఉర్కుదాం పారా' అన్నడు ఈరిగాడు.

ఇద్దరం సైకల్ కాడికి ఉర్కొచ్చినం. ముత్యాలమ్మ కాడ బోనం బెట్టి ఎనక్కి తిరిగి సూడకుంట వొచ్చినట్టు ఉర్కొచ్చినం.

ఆడు సైకల్ తీసి పోనిస్తుండు.

నేను ఉరుక్కుంట ఉరుక్కుంట ఎక్కుతప్పుడు సూసిన ఎనక్కి.

మంటలు మహా రంజు మీదికొచ్చినయ్.

గుడారాల కెంచి ఏదో సప్పుడొస్తున్నది.

'పకడో.. పకడో' అన్న మాటలినిపిస్తున్నయ్.

ఈరిగాడు ఇంగ ఉగ్రటిగ తొక్కిండు సైకల్.

ఒక్క తొక్కుడుకు రామారం ఊర్లవడ్డం.

ఆ ఊరి పొలిమెర్ల, పొద్దుగాల ఎదురైనాయినే మల్ల కల్సిండు.

'ఏం ఆగం జేసింండ్రో పొద్దుగాలకెంచి ఈడ్నే తిర్గబడ్తిరి? అనుకుంట సైకల్ ఆపిండు.

ఈరిగాడు సెప్పబోతుండంగనే, దూరంల గోల పెద్దగ ఇనిపిచ్చింది. టక్క టక్క గుఱ్రపు డెక్కల సప్పుడు కూడా వొచ్చింది.

'నాకెర్కే, ఆళ్లు వొచ్చేది మీ కొరకే కదా. పోరలు! పొద్దుగాలకెంచి గిది సేద్దామనే తిర్గుతుండ్రా. సెప్తె ఇనరాయె. ఈ బాటెమ్మటి ఉంటే మీ బతుకు ఆగమే. నేను దాసిపెడ్త, మీకేం భయం లేదు, రారి రారి' అని నా చెయ్యి పట్టుకుని గుంజుకపోయిండు. ఈరిగాడు ఎనకంగ సైకల్ పట్టుకుని వొచ్చిండు.

ఇంగ ఆ రామారపాయిన.. 'ఇప్పుడు సెప్పుర్రి, ఏం జేసింండ్రాడా?' అడిగిండు ఇంటికి తీస్కపోయి మంచినీళ్లు ఇచ్చుకుంట.

ఇద్దరం సప్పుడు సెయ్యలే. నీళ్లు తాగి గిలాసు చేతికిచ్చినం.

అది పక్కనబెట్టి, నులక మంచం పర్సుకుంట 'ఈ ఊర్ల రజాకార్లు ఏ ఇంటికి రారో ఆ ఇంట్ల మీరున్నరు. ఎందుకో ఎర్కేనా? ఈ ఊర్ల ఆళ్లకు కావాల్సినయి ఊడిగం సేసేది నేనే. గందుకే ఏం భయంలేదు. మంచిగ పండుకోండ్రి. ఈడికి ఆళ్లు రానే రారు' అని జెప్పిండు.

అప్పుడు జరంత కుదుటవడ్డం ఇద్దరం.

మల్ల ఆయినే 'తిన్నరా ఏమన్న మరె. అరే ఏం లేదాయెగా ఇంట్ల ఆడోళ్లు గూడ లేరాయె సమయానికి ఏమన్న పెడ్తందుకు? ఏంజేద్దాం మరె?' అన్నడు.

'ఏం లేదు. ఏం వొద్దు. పొద్దడికెంచి ఏం తినలేగానీ, ఏం వొద్దు. తినకున్నా ఏం కాదు, కడుపు నిండింది. గా గుడారాలు తగులబెట్టినంక..' అని జెప్పిన.

'అనుకున్న. గిట్లాంటి పనేదో జేస్తరని. నాకెర్కయింది పొద్దున్నే. నీ కండ్లల్ల సూసిన. నీయవ్వ, గంత పని జేసింండ్రులె. ఏయే.. శబ్బాష్ రా పోరలు, మంచిగ జేసింండ్రు' అని మెచ్చుకుండు. 'మరెట్ల ముచ్చట పొద్దుగాల, ఈడ ఉండొద్దు మల్ల మీరు. జేసిన కాడికి జేసింండ్రు అయిపాయె. ఊకోరు ఆళ్లు. వొదలరు మిమ్ముల్ని. ఆళ్లు కాకపోతే ఇంకోలు

వొస్తరు. ఇంకో క్యాంపు పెడ్తరు' అన్నడు.

ఆ రాత్రికి ఉపాయం ఏసినం. తెల్లారిగట్ల సైకల్ ఏస్కని గా రామారపాయిన, ఈరిగాడు ఇంటికి పోవాలె. ఈరిగాన్ని ఇంటికాడ వొదిలిపెట్టి, మా అయ్యని తీస్కొని రావాలె. గదీ ముచ్చట.

తెల్లార్తారికే మా అయ్య రానే వొచ్చిండు. వొచ్చుకుంట వొచ్చుకుంటనే ఒక్కటి పీకిండు. 'గింత పని సేస్తావ్ రో.. ఇంగెట్ల బతికేది' అని తెగ ఇదైపోయిండు. వొస్తున్నప్పుడే రజాకార్లు మా అయ్యకు ఎదురయ్యి అడిగింద్రంట. ఏడికి పోతున్నవని. గా రామారపాయిన ఉండు గాబట్టి వొదిలిపెట్టింద్రట.

నన్ను ఇంగ ఈడ ఉండొద్దని జెప్పిండు. పట్నంల మావ దగ్గర తోలొస్త మల్ల ఊర్లకు రావొద్దన్నడు.

రామారపాయిన పానగల్ దాక మాకు తోడొచ్చిండు. అడ్డ బాటెమ్మటి తీస్కొచ్చిండు. ఆడికెంచి నేను, మా అయ్య సిన్నగ పట్నం బాటబట్టినం.

ఇంగో అట్ల వొచ్చిన నేను పట్నంకు.

♦♦♦

# 5

# నజియా కలిసిన వేళ..

'జర దేక్ కే చలో' అన్నది. చెయ్యి తాకినందుకే.

సీకటి పడతాంది. వానొస్తట్టుంది. జల్దీ సూసిరావాల్నని ఉగ్రటిగ ఉర్కుతున్నం ఆదలబాదల.

పెద్ద పాతకీ దాటిపోతున్నప్పుడు ఎదురుంగ వస్తున్నది.

తొందర్లో సూస్కోలే. చెయ్యి తాకింది. ఒక్కసారిగా ఉరుమురిమి సూసింది. నేను పెద్ద పెద్ద అడుగులు ఏస్కుంటనే ఎనక్కి సూసిన. మెరుపు మెరిసింది.

నల్ల బురఖా యేస్కున్న పిల్ల నన్నే సూస్తుంది.

ఆమె కండ్లే కనిపిచ్చినయ్. ఆ మెరుపుల. ఆ బురఖాల.

చమక్కుమన్నయ్. ఏమన్న కండ్లా అయ్యి. సూపు తిప్పుకోలేకున్న. కానీ తప్పలె. మల్లో రెండు మూడు అడుగులేసిన. ఎనక్కి సూస్తె కనిపియ్యలె మల్ల.

అవును. నేను చెప్తున్నది ఆమె గురించే. గామెని మొదటిసారి కల్సిన ముచ్చటే.

ముందే చెప్పినగా. చంద్రం కంటే ముందు చెప్పాల్సింది.. ఆ పిల్ల గురించే అని.

మాయమ్మ తర్వాత నచ్చిన అమ్మాయి. ముందు అమ్మ గురించి చెప్పిన. ఇప్పుడు నజియా గురించి రాస్తున్న. తర్వాత చంద్రం గురించే.

మా అయ్య నన్ను పట్నంల మా మావ దగ్గర వొదిలిపెట్టి పోయిండుగా, ఈడ్నే ఏదన్న పని సూస్కోని బతకమన్నడు. ఇంటి మొహాన ఇప్పటంతల రావొద్దన్నడు. వొస్తే కాల్లిర్రగొడ్తా అన్నడు.

రెండు మూడు రోజులు మా చిన్న మావకాడ ఉన్న. ఆయన వయసుల నాకంటే జర్రనే పెద్దోడు. మాయమ్మకు ఒక అన్న, ఒక తమ్ముడు. మా పెద్ద మావ బొంబైల ఉంటడు. ఆడ దందా చేస్కుంట బాగ పైసల్ సంపాయించిండంట. మనం గూడా అట్ల కష్టపడాలె అని మా చిన్న మావ చెప్తుండేది. చిన్న మావ చిన్నప్పుడే పట్నం వొచ్చి ఈడ్నే సదువుకుండు. ఇప్పుడు ఏదో బళ్ల పంతులుగ సేస్కుంట వకీల్ సదువు సదువుతున్నడు. మావ నాకు పని ఇప్పిస్తనని చెప్పి ఆళ్ల దోస్తుకాడికి తీస్కపోయిండు. మా మావ దోస్తు పేరు చంద్రకిషోర్. సుల్తాన్ బజార్ల మంగలి దుఖ్నం నడుపుతుండు. మేం పోతార్కె ఎవల్కో సవురం చేస్తుండు. మా మావతోని అలాయ్ బలాయ్ అయినంక జరసేపు కూసొమ్మన్నడు.

జుట్టు కొరిగి గడ్డం గీసిందాంక మేం సూస్కుంట కుసున్నం. అయిపోయినంక 'గడ్డం గీకుడు మజ్జెల ఆపి రాలేంగా?' అనుకుంట బయిటికి తీస్కొచ్చిండు. పక్కనున్న ఫేమస్ కేఫ్‌ల మంచి ఛాయ్ తాగిపిచ్చిండు. బిస్కిట్లు తినిపిచ్చిండు.

నేను మాట ముచ్చట లేకుంట బిస్కిట్లు తినుకుంట, ఛాయ్ తాగుతున్నప్పుడు మావ నా కథంత చెప్పిండాయినకు.

మొత్తం ముచ్చట ఇన్నాయిన.. నాకు పనొక్కటే కాదు, తలదాచుకుంటందుకు జరింత తావు గూడ ఇచ్చిండు.

ఆళ్ల లంకంత కొంపల్నే దొంతలర్ర సాఫ్ చేసి ఇచ్చిండు.

అర్ర కిరాయి, కొలువు జీతం అన్నీ కుదిరినయ్.

ఇంగ మా మావ జరిన్ని పైసల్ నా బుసటి కీసల బెట్టి, నా చెయ్యి చంద్రకిషోర్ చేతుల పెట్టి పోయిండు. ఇంగ అయాల్టి కెంచి నేను, చంద్రకిషోర్ మంచి సోపతి అయినం. ఆయిన నాకంటే పెద్ద అయినా మంచిగ కల్సిపోయిండు నాతోని. నేనాయన్ని 'చంద్రం చంద్రం' అని పిలవబట్టిన.

చంద్రంకు ఇసామియా బజార్ల సొంత ఇల్లుంది. ఇద్దరి ముగ్గురికి కిరాయికి గూడా ఇచ్చిండు ఆ ఇంట్ల. సొంత దుఖ్నం వుంది. ఇద్దరు ముగ్గురు ఆయినకాడ పనిజేస్తుండ్రు. చంద్రంకు పెళ్లయింది. ఆళ్ల అమ్మనాన్న అంతా కలిసే ఉంటరు. ఇప్పుడు ఆళ్లింట్ల నేను గూడ ఓ ఇంటి మనిషి లెక్క అయిన. చంద్రం ఎప్పుడు నాతోనే, నా ఇంట్లనే ఉంటుండే.

నా పనేమో ఉదయ్ క్లాత్ స్టోర్‌ల. పొద్దుగాల పోయి సీకటి పడ్డదాక బట్టలమ్మి రావాలె.

చంద్రం దుఖ్నం, మా దుఖ్నం పక్కపక్కనే.

పొద్దనక, మాపనక నేను చంద్రంతోనే తిర్గుతుండేది. ఇంటికాడ అయినా, పనికాడ అయినా పక్కనే నేను. కలిసి తినేది. కలిసి తిరిగేది. ఒక కంచంల తిని, ఒక మంచంల పండుకునేదన్నట్లు ఉండేది మా ముచ్చట.

పట్నంల నా బతుకు జర్ర సాలున పడ్తున్న రోజులల్లనే నుమాయిష్ వొచ్చింది.

అప్పటిదాక నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌ల ఉండెనట. పోయినేడాదో అంతకుముందు ఏడాదో గోషామహల్ పెద్ద మైదాన్లకు మర్సిండ్రంట. అక్కడ పెద్ద పెద్ద దుఖ్నాలుంటయని, దేశ దేశాలకెంచి శానామంది వొస్తరని, సూస్తె సూడాలేగాని సెప్తె తక్కువని ఊరిస్తుండె చంద్రం. రెండు మూడు దినాలకెంచి దినాం పోదాం అనుకుంటున్నం కానీ కుదరకపాయె.

ఇంగ అయ్యాల మంగళారం. చంద్రం దుఖ్నం తియ్యడు.

నేను పనికి పోయిన. పొద్దుగూకాల కేఫ్ కాడికి వొచ్చిండు. ఇద్దరం ఛాయ్ తాగినమ్. నా పని అయినంక, నుమాయిష్ బాటవట్టినం.

ఆడ మస్తు జనాలు, ఇసక పోస్తే రాలనట్లు ఉండ్రు. బొచ్చెడు దుఖ్నాలు బీ ఉన్నయ్.

ఎన్నెల రాతిరి మా ఊర్ల గునుగుపూలు కనిపించినట్లు, మిణుగురు పురుగులు తిరిగినట్లు చానా బుడ్డ బుడ్డ దీపాలు మిణుకు మిణుకున మెరుస్తున్నయ్.

గయ్యి సూస్తందుకు కండ్లు సాలక నేను పరేషాన్ పరేషాన్‌గా అటీటు సూస్కుంట పోతున్న.

గప్పుడే తాకింది గా పిల్ల చెయ్యి.

గంతే ఇంగ నా జిందగీ పూరా బర్బాద్ అయ్యె. గంత మంచిగున్న నుమాయిష్ కంటే.. గా పిల్లే నాకు ఊకె యాదికి రాబట్టె.

ఇంగ ఆ రాత్రి ముచ్చట చెప్పాలె.

ఎంతకూ నిద్రబట్టకుండె. అయ్యే కండ్లు యాదికొస్తుండె. మెరుపు మెరుస్తున్నది. కండ్లు కనిపిస్తున్నయి. గదే ముచ్చట రాత్రంత. యాడ నిద్ర బట్టె. అరెరే ఏమాయె? ఏం మాయ! ఎంత మందిని సూసిన. ఎన్ని కండ్లు ఎర్కే. గానీ గీ కండ్లే నాకెందుకు యాదికొస్తున్నయ్. ఎందుకిట్ల నిద్రబట్టకుండ చేస్తున్నయ్. గంతఘనం ఏముంది ఆ కండ్లల్ల? ఆగమాగం అయితాంది తప్ప, ఏం ఎర్కయితలే.

'ఆ కళ్ళు కళల ఆకళ్ళు

ఆకళ్ల కలలు ఆ కళ్ళు

కలల ఆకళ్లు ఆ కళ్ళు

పువ్వుల్లో ముళ్ళు ఆ కళ్ళు

దేవుళ్ల గుళ్ళు ఆ కళ్లు' అని ఆ కండ్ల గురించి ఎవరైనా కవిత్వం రాస్తే రేపట్నాడు ఆళ్లు మహాకవి అయితరేమో.

అటు పొర్లినా, ఇటు పొర్లినా ఎంతకు నిద్ర పట్టదాయె. ఎవరామె? ఏందా కండ్లు? మా ఊరి కాపురాల గుట్ట గుండ్ల లెక్క ఉన్నయ్. పెద్ద పెద్దగ. ముద్దు ముద్దుగ. మల్ల ఎప్పుడన్నా సూస్తనా? మల్ల కన్పిస్తయా ఆ కండ్లు? ఏం సమజైతలె.

అటీటు తిర్గిన లేసి. ఆగమాగమైంది. అడవడవి అయింది పానం.

బయిటికొచ్చిన. ఏం జేయాలె నిద్రవస్తలే. తెల్లారుతున్నది. కాళ్లు కాలిన పిల్లి లెక్క తిర్గుతున్న. ఇంగ ఎప్పుడు పన్నెనో ఏమో ఎర్కలే. తెల్లారి నిద్ర లేస్తారికే మాత్రం చంద్రం లేడు. సెప్పకుంటనే పనికిపోయిండు. లేపినట్టుందిగనీ నేనే లేవనట్టుంది.

ఒళ్లు ఇర్సుకుంట బయిటికొచ్చిన. ఇయ్యాల కొలువుకు పోతట్టు కొడ్తలే ఒళ్లు. నొప్పులు నొప్పులు ఉన్నయ్. ఎవడో గుప్ప గుప్ప పెయ్యి మీద గుద్దినట్లు ఉన్నది.

సూరీడు నడి నెత్తి మీదికొస్తుండు. పైటీలు బువ్వ యాదికొస్తున్నది. కడుపుల ఆగమాగం వున్నది. తాగుదామంటే, కుండల బీ నీళ్లు లెవ్వు. ఆ దూప పక్కనబెడ్తే, గంతకంటే ఎక్కువ నాకు గా కండ్ల దూపే అయితుండె. సూడాలన్న దూప. కండ్లళ్ల కండ్లు బెట్టాలన్న యావ. సతాయించబట్టె.

పానం ఆగుతలేదు. పసిరికలు వొచ్చినోనికి లోకమంత పచ్చగ కనిపిచ్చినట్టు నాకు ఆ కండ్లే కనిపిస్తుండె. ఇంగ ఉండబట్టలేక పోయిన.

మల్ల ఉర్కిన ఆ నుమాయిష్‌లకు.

అటు తిరిగిన. ఇటు తిరిగిన. అండ్ల సూసిన. ఇండ్ల సూసిన. యాడ కనిపియ్యలె. ఆ కండ్లు. దిమాక్ ఖరాబైంది. దిల్ పూరా ఆగమైంది.

ఓర్నీ.. ఎక్కడి కండ్లు.. ఏంది ముచ్చట?

నిద్ర లేదు. తిండి లేదు. కొలువు లేదు. కిషోర్ లేడు.

యాంచి వొచ్చెనో ఓపిక?!

తిరిగిన. నుమాయిష్ పూరా తిర్గిన. యాడ కన్పియ్యలె ఆ కండ్లు. నా కండ్లు. ముద్దు ముద్దు కండ్లు. ముచ్చటైన కండ్లు.

పొద్దుగూకుతాంది. పోదామా వొద్దా? పోతెట్ల? పోయినంక వొస్తదేమో! వొచ్చినంక సూడకుంటె ఎట్ల. ఈడ్నే ఉండనా? ఇంటికి పోనా? ఏం సమజ్ కాలె. ఏం జెయ్యాలో ఎర్కగాలె. ఎదల ఏడుపు తన్నుకొస్తున్నది. ఏం జెయ్యాలె? మనసైతె మంచిగలే. మల్ల మల్ల యాదికొస్తుండె. మరేం జెయ్యాలె. ఎట్ల మర్వాలె. ఎట్లొస్తది మర్పనీకి?

ఒక్క రోజాయె. రెండు దినాలు అయిపాయె. చంద్రం లేదు. గింద్రం లేదు. ఇల్లు లేదు. గిల్లు లేదు. కొలువు లేదు. గిలువు లేదు. తిండి లేదు. తిప్పల లేదు. మన్ను మశానం సేస్కొని ఇటు మొహాన్నే తిర్గుతున్న. యాడ తింటున్ననో ఏమో ఎర్కయితలె.

మూడోనాడు మాపటిజాము పోకపోక ఇంటి మొహాన పోయిన.

ఇగ సూద్దునుగదా చంద్రం నా ఇంట్లనే పండుకుని ఉన్నడు. చాబీ ఆయినకాడోటి నాకాడోటి ఉంటది. 'నా అర్ర, నీ అర్ర' అని ఏం లేదు మాకు. ఎప్పుడంటె అప్పుడొస్తుండె. ఎక్కువగ నా అర్రల్నే ఉంటుండె.

సూస్తారికే చెయ్యికి దెబ్బ తగిలి ఉంది. ఎవరో కొరికినట్లు ఉంది. సాపకు అంటిన రక్తం నల్లగైంది. జరంత పసుపు పూసి ఉంది చెయ్యికి, దెబ్బ తగిలిన కాడ.

అటీటూ ఊపి పండుకున్నోన్ని లేపిన. లేసిండు. సూసిండు. ఒక్కటేసిండు ఈపిలకెంచి. 'యాడికిపోతున్నవ్, ఏం జేస్తున్నవ'ని కసిరిచ్చిండు. కారాలు మిరియాలు నూరిండు. సెప్పకుంట సెయ్యకుంట ఇష్టమొచ్చిన ఏశాలు ఏస్తున్ననని యమ కోపానికొచ్చిండు. ఆడ మీవోడు పనికి వొస్తలేడని అడుగుతుండ్రని అడ్డందొడ్డం వొచ్చిండు కొట్టనీకి.

నేను కిందవడి మీదవడి జరంత సముదాయించినంక నిమ్మలవడ్డడు. సర్రసర్ర సాఫ్‌సీదా ముచ్చట సెప్తే ఇంగ సల్లవడ్డడు. 'మరి నాకు చెప్పి పోవాలె కదా' అని మొహం మార్సిండు.

'మల్లీసారి అట్ల సెప్పకుంట సెయ్య'నని మాటిచ్చిన. బతిలాడిన. ఊకుండు.

చెయ్యేవరు కొర్కిండ్రంటె సప్పుడు సెయ్యలె. దవాఖానకు పోదామంటే ఏమొద్దన్నడు. నేను పట్టుబట్టి గుంజిన. నిమ్మలంగ లేసిండు. గులుక్కుంట, మూలుక్కుంట.

ఇంట్లకు పోయి కాళ్లుజేతులు కుడుక్కొచ్చుకున్నంక ఇంగ ఇద్దరం ఉస్మానియా దవాఖానకు బాటబట్టినం.

ఇంగో గా దవాఖాన్లకు పోతుంటనే మల్ల తగిలింది ఒక  చెయ్యి. అదే చెయ్యి. నుమాయిష్‌ల తగిలిందే. యాదికుంది. ఎర్కయింది.

ఎనిక్కి తిరిగి సూస్తె అయ్యే కండ్లు. ఈసారి ఏమనలే మంచిగ నవ్వింది. ఆ నవ్వు కనిపియ్యలెగనీ ఆ కండ్లల కనిపిచ్చింది. సూసి సూడనట్లు పోయింది. నేనింగ ముందల ముందల పోతున్న చంద్రం చెయ్యి బట్టి గుంజిన.

'అబ్బా' అనుకుంట ఆగిండు. కొట్టినంత పన్జేసిండు. ఎందుకంటే నేను గుంజింది దెబ్బతగిలిన చెయ్యినే. పట్టుకుంది కొరికినకాడ్నే.

ఎనక్కి సూస్కుంట పట్టుకున్నగద ఎర్కగాలే మరి ఏం జెయ్యాలె?!

'ఏంది ముచ్చట?' అన్నడు.

'నేను ఇప్పుడే వొస్త, నువ్వు పో' అన్న.

'గదేంది? మల్ల ఏం జెయ్యనీకి పోతున్నవ్? గా పిల్లగానీ కనిపించిందా ఏంది?' అని అడిగిండు.

'ఔ మల్ల. ఆ పిల్లే. ఆ కండ్లే' అన్న.

'నీకు పిచ్చిబట్టిందిరా యాది. ఏ పిల్లని సూసినా ఆ పిల్లలెక్కనే కొడ్తున్నట్లుంది నీకు'

'లేదు చంద్రం ఆ పిల్లే. ఆ కండ్లే. అయ్యాల తగిలిన చెయ్యే. నాకు మంచిగ యాదికుంది'

'సరే. పో! పొయ్యి సావు. నేనీడ జరసేపు నిలవడ్తగని సూసిరాపో. నీ ముచ్చట ఎందుకు కాదనాలె. అదో మైల నాకు మల్ల' అన్నడు.

నేను ఉర్రటిగ ఉర్కిన. అటీటు సూసిన. యాడ ఆ బురఖా పిల్ల కనిపియ్యలె. బుర్క పిట్టలెక్క ఉర్కినట్టుంది. పెద్ద పాతకీ దాక పోయివొచ్చిన. సడక్ మీదికి పొయ్యి కూడా సూసిన. అటు తిర్గిన. ఇటు వుర్కిన. యాడ బీ కనిపియ్యలె. గింతల్నే మాయమయ్యెనా? పాడుగాను. ఏందీ ముచ్చట. గిట్లయిపాయె. గింతల్నే పాయె. ఏం జెయ్యాలె. ఎట్ల జెయ్యాలె. మల్లెట్లరో కలిసేది? అని లోపల్లోపల గులుక్కుంట, ముక్కుకుంట మూలుక్కుంటు చంద్రం దగ్గరికి పోయిన సేసేదేం లేక. సూసేదేం మిగలక.

'హె.. హే.. దొర్కిందా పోరీ. కన్పిచ్చినాదిరో. భలే పిల్ల దొర్కిందిరో నీకు. భలే పిచ్చివట్టెరో యాదిగానికి' అని ఎక్కిరిచ్చిండు.

'ఊకో చంద్రం! నీతోని ముచ్చట పెడ్తారికే ఎల్లిపాయె. అటెన్క వొచ్చినంక సెప్తనుగా ముచ్చట. ముందుగాల్నే గుచ్చి గుచ్చి అడగాల్నా ఏంది నువ్వు?'

'అబ్బో బావుందిరో ముచ్చట. అటీటుతిప్పి నా మీదికి నూకినవ్ లే? అబ్బా! దొర్కుతదిలే. దొర్కేదుంటే మల్ల దొర్కుతది రాసిపెట్టుంటె గనీ పా పా' అని లోపల్కి తోల్కపోయిండు.

చెయ్యికి మందు పెట్టిచ్చుకుని వొచ్చినం గానీ, ఆ రాత్రి చంద్రంకు, నాకు నిద్ర బట్టలే. నొప్పికి ముక్కుకుంట మూలుక్కుంట పన్నెడంట. నాకేమో ఆ కండ్లు నిద్ర బట్టకుండ సెయ్యబట్టె.

రెండు, మూడు దినాలాయె. తెల్లారిగాక మల్ల తెల్లారి ముచ్చటది. ఐతారం అయ్యాల.

చంద్రం చెయ్యికి తగిలిన దెబ్బ మానుతుండెగానీ, నాకు తగిలిన దెబ్బ మానకపోతుండె. గుండెల గుచ్చుకున్న ఆ చూపులు.. చుర చుర చేస్తుండె. దిల్ పూరా కీమా కీమా అయితుండె. సూడాలె సూడాలె అని కలవర పెడ్తుండె. రోజు పొద్దున్నో పొద్దుగూకాల్నో ఆ ముచ్చటో ఈ ముచ్చటో చంద్రానికి చెప్పి ఆ దవాఖాన కల్ల పొయ్యొస్తనే ఉన్న. కన్పియ్యకపోతదా? అని. యాడ.. వారం కావొస్తుండె. యవ్వారం ఎటూ తేలదాయె. నేను పనికి మాలిన తిర్గుడు తిర్గుతున్నగనీ గా పిల్ల ఊకె ఆ దవాఖాన్లనే ఉంటదా ఏంది? ఎందుకుంటది? గన్ని రోజుల పనేముంటది? అని అనుకున్నగానీ అయ్యాల్నే మాయ జరిగె.

ఐతారం అంగడి అయ్యాల. సౌదలు కొనుక్కొస్తందుకు అంగడికిబోయిన. ఒక్కన్నే.

వొస్తప్పుడు మా గల్లి చివర్న ఒక సాహెబుల పిల్లని ఒకడు సతాయిస్తుండు. ఎనకంగ అదంటుండు ఇదంటుండు. ఆ భాష మొత్తం నాకు అర్థం కాలేగనీ, ఆ పిల్లని సతాయిస్తుండని మాత్రం ఎర్కయింది.

మా ఇంటి సందులకే మళ్లిండ్రు. నేను ఎనకంగనే ఉంటిని. ఆడు ఆ పిల్ల చెయ్యి బట్టి గుంజిండు. పిల్ల చేతుల సంచి కిందవడ్డది. సౌదలన్ని ఆగమైనయి.

నేను ఉర్కి ఆన్ని గట్టిగ పట్టుకున్న. రెండు చేతులు ఈపిలకు ఇర్సి పట్టుకున్న. సరుకులు ఏర్కోకుండ, సప్పుడు సేక ఆ పక్కనోలింట్లకు ఉర్కింది ఆ పిల్ల. ఎన్కకి గూడా సూడలేదు ఎవరో ఆ పిల్ల అని సూద్దామంటె.

కింద పడ్డ సౌదల్ సర్దుదామని నేను సూస్తుంటె, ఈంచి ఎట్ల సర్దుకోవాలని ఆడు సూసిండు. చేతులు ఇడిపిచ్చుకుని, నా చెయ్యి గట్టిగ కొరికి ఉర్కిండు జపక్కున.

అబ్బా.. ఈడు కొరికి పాయె. పిల్ల లేకపాయె. సౌదలన్నీ సడక్‌నవడె. చెయ్యి నొప్పిగనే ఉన్నా సరుకులన్ని సంచిలకు ఎత్తిన. కానీ ఎవల్కి ఇయ్యాలె అని అటీటు సూస్తుంటె ఆ పిల్లపోయిన ఇంట్లకెంచి ఒక పెద్దామె వొచ్చింది. 'ఆ పిల్ల మా ఇంట్లనే ఉంది. సంచి ఇయ్యమంది' అని అడిగింది. నేను సప్పుడు సేక ఇచ్చిన. అటెన్క మూడో ఇల్లే మాది. పోతపోతనే చంద్రంకు జెప్పిన. ఈడ అయిన ముచ్చటంత.

'ఆడా? ఆడు పొట్టిగుండు కదా' అన్నడు. 'సాహెబుల పిల్ల ఎనకంగ పడుతుండా?' అని అడిగిండు. రెండింటికీ అవునన్న.

'ఆడు దొంగ నా కొడుకు. ఆడు మల్ల నాకు దొరకాలగనీ ఉంటది ఆనికి. కోసి కారం

బెడ్త ఈ సారి' అన్నడు కోపంగా.

'ఏంది ముచ్చట, ఏందో ఉన్నట్టుంది యవ్వారం?' అని అడిగిన.

'ఆ ఏం లేదు. మనింట్ల కూడా సాహెబులు కిరాయికి ఉంటరు కదా. ఆళ్ల పిల్లని బీ గట్లనే సతాయిస్తుంటడు. మొన్న నేనొస్తుంటె గట్లనే సేసిండు. దగ్గరికిపోయి దమ్మకురికి ఒక్కటిచ్చిన. ఆడు అటీటు సూసి చెయ్యి పట్టుకుని కొరికి ఉర్కిండు' అని చెప్పుకుంట మానిపోతున్న దెబ్బ సూస్కుండు.

'ఓర్నీ గదా అసలు ముచ్చట! అయ్యాల వోలు కొరికింద్రు అని అడిగితే సెప్పవైతివి గదా. గప్పుడే సెప్తె నేను గియ్యాల జర పైలం ఉందునుగదా?' అని నా దెబ్బ సూస్కున్న.

గట్టిగనే కొర్కిండు కొడుకు. ఎవడాడు, ఏందాని కథ? గీ ముచ్చట కంటే నాకు నేనుండే ఇంట్లనే ఎన్నడు సూడని సాహెబుల ముచ్చట మంచిగనిపించింది. ఆడు ఎంట బడుతుండంటే ఆ పిల్ల ముద్దుగున్నట్టే లెక్క. కొంపదీసి ఆ పిల్లే, ఈ పిల్ల కాదుగా. ఏమో! అట్ల అనిపిచ్చె నాకు. నిజంగా ఇన్ని దినాలకెంచి ఉండుకుంట, ఆ సాహెబుల ఇంట్ల ఉండే అందర్నీ సూడనే సూడకపోతిని. సూస్తందుకు ఏడుండె. బయిటికొస్తే కదా ఆళ్లు. ఎప్పుడు సూడు తలుపులు పెట్టుకునే వుంటరు. ఇయ్యాల సూడాలె. ఎట్టయినా సూడాలె. ఎందుకంటే నన్ను ఏదైనా కరిస్తే అది నా జిందగీనే మారుస్తది. చెప్పిన గదా. అయ్యాల గా ఊర్ల కుక్క కర్సింది. ఆ దెబ్బకు వొచ్చి ఈ పట్నంల బడ్డ. ఇయ్యాల ఈడు కర్సిండు. మల్ల ఏమైతదో చూడాలె. ఈ దెబ్బకు, నేను దోలాడుతున్న పిల్లకు ఏదో వుందని లోపల్లోపల అనిపిస్తున్నది. అందుకే సూడాలె. మా ఇంట్ల ఉన్న ఈ సాహెబుల పిల్ల ఎట్లుంటదో. కానీ ఎట్ల సూడాలా?

గదే సొంచాయించుకుంట ఉన్న. పొద్దుగూకుతారికే ఒక ఉపాయం జేసిన. జరంత సీకటయినంక ఇంట్ల కుండల ఉన్న మంచినీళ్లన్నీ మోరిల పారబోసిన.

పెద్ద చెంబు పట్టుకుని సాహెబుల ఇంటికి పోయిన. తలుపు పెట్టి ఉంది. ఏం జేయాలె తప్పదు. ఎట్టయితె గట్టయింది సూద్దామని, తలుపు బేదం టకటక కొట్టిన. ఎవ్వరూ తియ్యలె. మల్లకొట్టిన.

'కౌన్ హై?' అని అన్నరు ఎవరో లోపలికెంచి. గొంతు తియ్యగున్నది.

'ఏం జెప్పాల, నేనెవర్నో ఎట్ల జెప్పాలె' అని సోంచాయిస్తుండంగనే.. తలుపు తెర్సుకున్నది.

పొడవాటి పచ్చ లంగా, నిండు చేతుల ఎఱ్ర జాకెట్టు ఏస్కుని ఉంది ఆ పిల్ల. ముద్దుగుంది. పాలల్ల ఏసిన పసుపు, కుంకుమ లెక్క ఉన్నది. ఆషాడమాసంల కనిపిచ్చే ఆరుద్ర పురుగు లెక్క అందంగున్నది.

ఆ కండ్లు, నా కండ్లేనా? అట్లనే ఉన్నయి. ఆటినే చూస్తున్న. సూపు తిప్పుకోబుద్ధి కాలే.

'క్యా హెూనా?' అని అడిగినయ్ ఆ కళ్లు.

మాట రాలే. మల్ల అడిగినయ్.

'తోడా పానీ' అన్నా. నా మాట తడవడ్డది. నా కండ్లు, ఆ కండ్లనే సూస్తున్నయ్.

'ఠైరో' అని లోపలికి పోయినయ్ ఆ కళ్లు.

ఆ కండ్లు లేతగున్నయ్. మా బుజ్జి మేక కండ్లలెక్క ముద్దుగున్నయ్.

ఆమె తెల్లగున్నది. మా ఆవు పాల బురుగు లెక్క, శీనుగాడి కల్లు నురుగులెక్క తెల్లగున్నది.

ఆమె కండ్లు సెర్వులెక్కున్నయ్. కనుబొమ్మలు సెర్వు మీద సింగిడీలెక్క ఉన్నయ్. ఆకాశంల ఒకేసారి రెండు సింగిడీలు సూడం. కానీ ఇయ్యాల ఈమె మొహాన నేను సూసిన.

'లేలో' అని మంచినీళ్లు తెచ్చిచ్చింది. ఆదలబాదల తాగుకుంట ఆగమాగం సూసిన. తాగుతప్పుడు జరిన్ని నీళ్లు మీద పోయినయ్. అంగి తుడుసుకుంట 'ఔర్ తోడా' అన్న.

'నువ్వు?' అని ఏలు నాకల్ల సూపిచ్చి, నోరు మూస్కుంది. కండ్లు జరింత పెద్దగ జేస్కుంది.

'నేన్ బీ ఇల్లనే కిరాయికి ఉంట. దొంతలఱ్రల' అన్న.

'నువ్వు.. పొద్దున.. ఆడ.. నువ్వే కదా?' అన్నది.

'పొద్దున.. ఆడ.. ఏడ?' అడిగిన.

'హాత్ కైసా హై?' అంది.

'అంటే.. పొద్దున నువ్వు.. సడక్ మీద సౌదల్.. నువ్వేనా?' అన్న. చెయ్యి దెబ్బ సూపిచ్చుకుంట.

నేనే అని నవ్వింది. ఆడు కొరికినప్పుడు, సౌదల్ ఏరినప్పుడు కిటికీలకెంచి సూసినని చెప్పింది. నమ్మలేకపోయిన, నేను దోలాడుతున్న పిల్ల దొర్కుతదని తెల్సుగనీ, గిట్ల దొర్కుతదని అనుకోలే. ఆశ్చర్యంగా ఉంది. ఆగమాగం ఉంది మనసు! నా నమ్మకం నిజమైంది. కర్సినోని కాళ్లు మొక్కి, కండ్లు పొడవాలె. ఆ పొట్టోనియి. లేకపోతే ఆడు నా పిల్ల ఎనకంగ పడ్తడా?

'ఎవడాడు?' అని అడిగిన.

'కౌన్?' అన్నది.

'అదే పొద్దున.. ఆడు నీ ఎనకంగ..' అన్న.

'చోడ్‌దేవ్ ఉస్కో' అంది. 'దవాఖానకు పోలేదా?' అడిగింది.

'పోలేగనీ.. దవాఖాన, నుమాయిష్.. జర దేక్ కే చలో...' యాదికుందా అని అడిగిన.

పక పకా నవ్వింది.

ఆ నవ్వు బొండుమల్లెలు ఇచ్చుకున్నట్టు, పల్లెరుగాయలు గుచ్చుకున్నట్టు ఉన్నది.

'ఇంగ నువ్వేం ఫికర్ కాకు, నీకు నేనున్నా' అన్న.

'హు..' అంది మొహమంత పెద్దగ జేస్కుంట. అటెన్కనే సిగ్గు పడుకుంట.

'ఏడికి పోయినా నాకు సెప్పు. నేను తోడొస్తా. నీకేం భయం లేదు' అన్న.

'హు.. హు..' అంది నెత్తి గంగిరెద్దులెక్క ఊపుకుంట.

'సరేనా మరి! పిలుస్తవ్‌గా?' అన్న.

'ఉ' అంది.

చెంబు నిండ నీళ్లు తీస్కుని పోయిన. ఈ ఆడిపోరలతోని పెట్టుకుంటే ఇంతే.. కల్సినా, కల్వకపోయినా నిద్రవట్టదు. నిన్నమొన్ననేమో ఎవరో, ఎట్ల కలవాల్నో అని నిద్రబట్టకపోయె. ఇయాల్నేమో ఈ ఇంట్లనే ఉండుడేంది, తోడు ఉంటా అంటే,

తలూపుడేంది. ఉట్టిగనే ఊపిందా? నిజంగానే వొస్తదా? రేపు ఏడికన్నా పోతే పిలుస్తదా? పిల్వదా? గియన్ని సోంచాయిస్తుంటె ఎట్ల నిద్రవస్తది?

అటు పొర్లిన ఇటు పొర్లిన. ఎటు పొర్లినా రాలే నిద్ర. లోపల పన్నెదానికంటే బయిటే ఎక్కువ తిర్గిన. అటు ముఖాన్నే సూసిన. ఆ గలమకల్ల. మూసి ఉన్న తలుపుల కల్లా.

♦

కోడి కూయకముందే మెల్కొచ్చింది. ఎప్పుడు పన్నెనో ఏందోగని నిద్ర సరిపోలే. ఆ సాహెబుల గలమకెల్లే సూస్కుంట కూసున్న. ఎన్నడు లేనిది పొద్దుగాల పొద్దుగాల పండ్లు తోమిన. మల్ల తోమిన. ఉన్న బొగ్గు మొత్తం అయిపోయినదాంక తోమిన. ఎంత తోమినా పండ్లు తెల్లవడుతున్నయో లేదో గని, ఆ తలుపులు మాత్రం తెరుస్తలేరు.

పొద్దు పొడిచినంక ఒక పెద్దామె తలుపు తీసింది. ఆళ్ల అమ్మ అట్టుంది. బాసాన్లు బయిటేసి తోముతుంది. నేను గూడ కడిగిన బాసాన్లని బయిటేసి తోమిన. ఉన్న నాలుగింటినే మల్ల మల్ల తోమిన. కడిగినయే కడిగిన. కడిగినయని ఎవరు సూసింద్రు సెప్పురి. ఆళ్లకెర్కా? మీకెర్కా? నాకు తప్ప!!

ఆమె జరంత అనుమానంగనే సూసింది. మల్ల మల్ల సూస్తె మొహం పట్టుకుని అడుగుతట్టే అన్పిచ్చింది. నా పని నేను సేస్కుంటే ఏం అడగక పొవ్వు. కానీ నేను ఒకటికి పదిసార్లు అటు కల్లనే సూస్తుంటిని.

'ఏం యాది పొద్దుగాల లేసినవ్? వామ్మో! ఎన్నడు లేనిది ఏందిరో సెట్లకు నీళ్లు పోస్తున్నవ్ ఇయ్యాల' అన్నడు చంద్రం అప్పుడే బొగ్గు పెట్టి పండ్లు తోముతూ బయిటికొచ్చుకుంట.

అది ఇని ఆ పిల్ల నవ్వింది. ఆళ్ల అమ్మ బాసాన్లు కడగడం అయిపోయినంక ఈ పిల్ల వొచ్చి కురాడు పెట్టింది బయట కట్టెల పొయ్యికాడ.

'ఏం లేదు చంద్రం. మన సెట్లేగా మాడిపోతున్నయని నీళ్లు పోస్తున్న. నిద్ర పట్టకపాయె. ఆడు మామూల్గ కొర్కిండా? నా కొడుకు! నువ్వు ఎట్ల ఏగినవో గానీ.. ఏం కొర్కిండు ఆడు. యమ నొప్పి ఉన్నది' అన్న.

'మరందుకే నిన్న రమ్మంటే రాకపోతివి దవాఖానకు. ఇయ్యాల్నన్న పోదాం పా. జరంత తక్కువయ్యేదిగా' అన్నడు చంద్రం. 'ఏం నాజియా మీ ముసల్దానికి ఎట్లుంది?' అన్నడు.

'అట్లనే ఉంది భాయ్‌జాన్! ఇంగో వంట చేసి తోష తీస్కపోవాలె' అన్నది ఆ పిల్ల. నా పిల్ల నా కల్ల, చంద్రం కల్ల సూస్కుంట.

'ఆహా.. అంటే వంట అయినంక దవాఖానకు పోతదన్నమాట. నేను బీ చంద్రంకు వంక చెప్పి పోవొచ్చన్నమాట. నాకల్ల సూసిందంటే ముచ్చట మంచిగుంది.

'ఆ.. నేను గూడ పొయ్యి రావాలె చంద్రం ఇయ్యాల. లేకపోతే నొప్పి ఎక్కువైతట్టుంది. నువ్వు గూడ వొస్తవా? నేనొక్కడ్నే పొయ్యిరానా' అని అడిగిన. 'నేను రాను నువ్వు పొయ్యిరా అని అంటే బాగుండు' అని లోపల అనుకుంటు.

'యాడ. ఇయ్యాల గీ సాహెబ్‌గూడా దాంక పోయిరావాల్నని సెప్పినగా నిన్ననే. నువ్వు పొయ్యిరా. నేను అటు పాయొస్త' అన్నడు. పైకి మొహం మార్సినట్టు పెట్టినగనీ లోపల ముర్సిన.

♦

'నజియా ఏమన్న మాట్లాడు' అని అడిగిన.

'నజియా నహీహై మేరా నామ్. నాజియా సుల్తానా హై' అన్నది.

'నాజియా బాలేదు. ఏదో దీర్ఘం తీసినట్లు, దూరం పోయినట్లు ఉంది. నజియా.. సూడు ఎంత ముద్దుగుందో. నజియా.. నజియా' అన్న.

నవ్వింది. మొహం మీద బురఖా ఇప్పి నెత్తి సుట్టూ సుట్టుకుంట. ఆమె బురఖా చేతుల అంచున చమ్కీలు, పూల లెక్క అల్లి ఉన్నయ్. తళతళ మెరుస్తున్నయ్. అంత అందంగ వున్న ఆ పూలకంటే ఎక్కువగా నేను ఆమె కండ్లనే సూస్తున్న. రెండు సింగిడీలని, పాలు తాగిన చెంపల్ని, కుంకుమ తిన్న పెదవుల్ని.. ఈటినే సూస్తున్న ఒకదాని తర్వాత ఒకదాన్ని.

'ఏంది' అన్నట్లు సింగిడీలు ఎగరేసింది. ముసి ముసిగా నవ్వుకుంట.

'ఏం లేద'న్నట్లు నేను తల అటూ ఇటూ అడ్డంగ ఊపిన, ఆమె కండ్లల్లకే సూస్కుంట.

మేం ఉస్మానియా దవాఖాన్ల పెద్ద చింతచెట్టు కింద కూసున్నం.

చంద్రం ఊరికి పోయినంక, నేను ఈ పిల్ల ఎమ్మటి దవాఖానకు పోదామని సూస్తున్న. ఏడికన్నా పోతే పిలవమన్నగా, పిలుస్తదా లేదా అని గూడ సూస్తున్న.

'అమ్మీ.. మై జా రహా హు..' అని నా అఱ్ర ముందలంగ పోవుకుంట గట్టిగ అన్నది. 'సెప్పేది ఉంటే ఇంట్లనే సెప్పి పోవొచ్చుగ, ఈడికొచ్చి సెప్పిందంటే నన్ను పిల్వుడు కాకపోతే ఇంకేంది?' అనుకున్న. నేను గూడ సిన్నగ తాళం బెట్టి బాటబట్టిన. బయిటికి ఎళ్తారికే సందు కొనకు పోయింది. ఎనక్కి తిరిగి సూసింది. నడుసుకుంట నడుసుకుంట దవాఖానకు వొచ్చినం, నేను ఎనకంగ, ఆమె ముందులంగ.

పెద్ద పాతకీ దగ్గర ఆగింది. నేను దగ్గరికి పోయినదాంక ఆగింది. నాకల్ల సూస్కుంట సింగిడీలు ఎగిరేసింది, ఏందీ అన్నట్లు. తల అడ్డం ఊపిన, ఏం లేదన్నట్లు. అటెన్కంగనే 'మాట్లాడాలె' అన్న.

'సూపిచ్చుకోవా?' అన్నది.

తల ఊపిన.

'సూపిచ్చుకోనొచ్చి ఆడ కూసో. నేను ముందొస్తే నేన్ బీ ఆడ్నే కూసుంట' అని పెద్ద చింత చెట్టుకల్ల సూపిచ్చింది.

నేను జల్ది జల్ది సూపిచ్చుకొని వొస్తారికే చెట్టుకింద కూసుంది.

వొచ్చి కూసున్ననో లేదో 'నువ్వు నాకీ షాదీ చేసుకుంటవా?' అన్నది.

నమ్మబుద్ధి గాలే. గిల్లుకుని గిచ్చుకుని సూస్కున్న. నిజమే ఇది. ఆశ్చర్యంగా ఉంది. ఎతుకుతున్న తీగ ఎడమకాలికి తగిలినట్లు, నేను అడుగుదామన్న మాట నన్నే అడిగింది. ఆనందం పట్టలేకపోయిన. ఆగమాగమైన. నోట మాట రాలే. ఎక్కిళ్లు గూడ ఆగిపోయినయ్.

'ఏంది మాట్లాడవు. నేను ఇష్టం లేదా?' అన్నది మల్ల.

'చేస్కుంట. కానీ..?' మొత్తం చెప్పకముందే..

'చూసినవా.. ఎక్కిళ్లు ఆగిపోయినయ్' అన్నది నవ్వుకుంట.

'అంటే... నువ్వు నిజంగా అడగలేదా?' అన్న మొహం అంతా మార్సుకుని.

'ఉహు' అంది తల అడ్డంగా అటూ ఇటూ తిప్పుకుంట. అలా ఊపినప్పుడు ఆమె చెవులకు ఏలాడుతున్న జుంకాలు ఊగినయ్.

ఏం మాట్లాడకుంట కూసున్న. ఆమె గూడా సప్పుడుసేక కూసుంది.

కొద్దిసేపయినంక 'మాట్లాడాలన్నవ్?' అని అడిగింది.

'నువ్వే మాట్లాడు' అన్న మొహం తిప్పుకుంట.

'ఏం మాట్లాడాలె?' అన్నది. నేను సప్పుడుజెయ్యలేదు.

'సూపిచ్చుకున్నవా?' అన్నది. నేను తల ఊపిన.

'మందులిచ్చిండా?' అన్నది. మల్ల తల ఊపిన.

'నాగావట్టే అయింది కదా?' అన్నది. నేనేం మాట్లాడలేదు. 'నాగావట్టే' ఏంది? నేను కాబట్టే కావొచ్చు అనుకున్న లోపల.

'ఏందీ మాట్లాడవా అన్నింటికి తల ఊపుతున్నవ్?' అని అడిగింది. నేను సప్పుడుజెయ్యలేదు. కాసేపు తను కూడా మాట్లాడలేదు.

కొద్దిసేపయినంక తనే 'మా ఇంట్ల నాకీ షాదీ చెయ్యాలని సూస్తుండ్రు' అన్నది.

నేను కూసున్న రాయి మీంచి కింద పడబోయి, పట్టుకున్న. మల్ల మంచిగ కూసున్న.

'పెండ్లా?' అన్న పెద్దగ నోరు తెర్సిన.

'హా..' అన్నది. 'దాదీ దవాఖాన్ల ఉందిగా. ఆమె పోతార్కనే నా పెండ్లి చెయ్యాలని సూస్తుండ్రు' అన్నది మొహం జరంత మాడ్సి.

'మరి చేస్కో, నీకిష్టం లేదా?' అని అడిగిన. లోపల కాలిపోతున్న మంట, కడుపులకెంచి మాటలల్లకు వొచ్చింది.

'నై' అన్నది.

'ఇప్పుడిష్టం లేదా? అసలు పెండ్లే ఇష్టం లేదా? లేదంటే పిలగాడు నచ్చలేదా?' అని అడిగిన గుచ్చిగుచ్చి. దించుకున్న తలలోకి వొంగి వొంగి సూస్కుంట.

'ఎవరో తెల్వకున్నా, నాకోసం వచ్చి చెయ్యి కర్పిచ్చుకుంటడుగా. అట్టాంటి పిల్లగాడు నాకు నచ్చుతడు' అన్నది సిగ్గు పడుకుంట.

'కర్పిచ్చుకుంటడుగా.. కర్పిచ్చుకోవడం ఏంది. కొరికించుకోవడమా?' అని అడిగిన అర్థంకాక.

'ఉమ్..' అన్నది.

నేను నవ్విన. ఎగిరి గంతేసిన. మల్ల కూసున్న. 'నచ్చానా?' అన్న. గదుమ పట్టుకుని అడుగుదామంటే తలకాయ పక్కకు తిప్పుకుంది. నవ్వింది. ముసి ముసిగా. ముద్దు ముద్దుగా.

మంచిగుంది. మస్తుగుంది. మత్తుగుంది. 'చెప్పకుంటమాయె. ఎర్కయిందిగానీ ఏమన్న చెప్పు' అన్న.

'ఏం చెప్పాలె?' అన్నది చేతులున్న సంచి పక్కన పెట్టుకుంట.

'ఏదో ఒకటి?' అన్న ఆమె కండ్లల్లకు సూస్కుంట.

'ఉమ్.. ఏంచెప్పాలె.. ఆ.. ఈ చెట్టుకాడనే ఎందుకు కూసొమ్మన్ననో చెప్పనా?' అన్నది.

'చెప్పు' అన్న.

'నలభై ఏళ్ల క్రితం ఈడ పెద్ద వానొచ్చింది. జనాలంత ఆగమాగమైంగ్రు. చెట్టుకొకరు పుట్టకొకరు. కొట్టుకపోయింగ్రు. అట్లనే ఈ చింత చెట్టు మీదికి వంద మంది దాంక కొట్టుకొచ్చింగ్రంట. ఇది సగానికి ఎక్కువనే మునిగిపోయిందంట. ఆ పై కొమ్మలకు ఎక్కి శానామంది బతికింగ్రంట. అందులో మా దాదీ గూడా ఉంది. గిదంతా ఆమే చెప్పింది. ఇంత మందిని కాపాడిన చెట్టు చాలా పవిత్రమైనది. అట్టాంటి కాడ్నే నిన్ను మొదటిసారి కలుద్దామని ఈడ కూసొమ్మన్న' అని చెప్పింది.

ఒక్కసారి లేచి నిలబడి.. చెట్టు మొత్తం తిరిగి సూసిన. కింది కెంచి, మొదలు కాంచి సుట్టు తిరుక్కుంట.

ఇంగో అట్ల కలిసిన నా నజియాని. ఆళ్ల దాదీ దవాఖాన్ల ఉన్నన్ని రోజులు ఆ చెట్టుకిందనే కూసొని మాట్లాడుకున్నమ్. మా ఊరి ముచ్చట, మాయమ్మ గురించి, గుడారాలు తగలబెట్టిన ముచ్చట.. గియన్నీ. అయాల్టికెంచి నజియా యాడికి పోయినా నాకు చెప్పే పోయేది. ఇద్దరం కలిసే పోయేది ఆమె ముందల, నేను ఎనకంగ.

చార్మినార్ కాడ సీటి కొట్టినం. గోల్కొండల గోల పెట్టినం.

పాతబస్తీల పాయ తెచ్చిచ్చిన. లాడ్ బజార్ల గాజులు కొనిచ్చిన.

♦♦♦

# 6

# పాంచ్ పటాకా

ఇంగ చంద్రం గురించి చెప్పాలె. నిజాం మీద బాంబు దాడి చేయాలనుకుంటున్న మా ఐదుగురి గురించి రాయాలె. ముందు మాకు నిజాంని చంపాలని లేకుండె. మా ఊర్ల తగలబెట్టినట్లు ఈడ గూడా రజాకార్ల గుడారాలు తగలబెట్టాలనే అనుకున్నం. కానీ నిజాంని చంపాలనుకున్న దాంక మా ముచ్చట ఎట్ల పోయిందో మంచిగ చెప్పాలె.

నేను ఉదయ్ క్లాత్‌స్టోర్‌ల పన్జేస్తున్న అని ముందుగాల్నే చెప్పినగదా. ఆ బంగ్లా పైననే ఒక అర్ర ఉండేది. అది చంద్రం పేరు మీదనే ఉండేది. ఆయినే కిరాయి కడుతుండేటోడు. అండ్లకు అప్పుడప్పుడు శానామంది వొచ్చిపోతుండేది. అర్ధరాత్రిదాంక రహస్య సమావేశాలు అయితుండేది. ఆళ్లు ఎవలో ముందుగాల నాకు ఎర్కగాలేగనీ, చంద్రం గూడా పోతుండేది. ఆయిన అండ్లకు పోయే ముచ్చట ఉన్న నాడు.. నాకు చెప్పేది. నేను చిన్నగ.. మంచిగ ఇంటికొచ్చి నజియాతోని మాట్లాడుకుంటనో, సూస్కుంటనో వుండేది.

అయితే ఆ అర్రల అర్ధరాత్రి దాంక పెద్ద పెద్ద సమావేశాలు అయితుండేదని, బడా బడా రాజకీయాల ముచ్చట్లు చేసేదని చంద్రం నాకు చెప్పేటోడు. మా ఇంట్ల

పండుకున్నప్పుడు అర్ధరాత్రి దాటినంక గూడా, ఒక్కోసారి తెల్లారినదాంక ఆడ పెట్టిన ముచ్చట్లే చెప్పేది.

చంద్రం, ఇంకొకాయిన కల్సి ఓసారి దారుసలెం కట్టెలమండి మైదానంల జరిగిన సభకు మారు వేషంల పోయింద్రంట. తుర్కోళ్ల లెక్క షేర్వానీ ఏస్కుని, రూమీ టోపీ పెట్టుకుని, కండ్లకు సుర్మా రుద్దుకుని అచ్చం ముస్లింల లెక్కనే తయారయ్యి పోయింద్రంట. చంద్రంతోని పోయిన ఆ ఇంకొకాయిన పేరు లక్ష్మీ నారాయణ పవార్. ఈన గురించి శానా చెప్పాలె. ఈన ముచ్చట్లు, ఉపాయాలు పెద్ద పెద్దగ, మంచి మంచిగ ఉంటయి.

పాకిస్తాన్ డిమాండ్‌ను హిందువులు ఒప్పుకోకపోతే.. ఆళ్ల తలకాయల్ని కోడి తలకాయలెక్క ఇర్సెయ్యాలని ఆలీ జిన్నా అనే ఆయన అన్నడట ఆ సభల. ముస్లింలను రెచ్చగొట్టి, హిందువులను ఖతం చేసే ఆ ఉపన్యాసం ఇని సిగ్గూ లజ్జ లేకుంట, చీమూ నెత్తురు లేని బతుకు బతికేకంటే ఆళ్లని ఏదన్నా చేసి చావాలని అనేటోడు చంద్రం. ఆ సమావేశంల ఈళ్లను ఎర్కబట్టి 'కాఫీరోంకే ఖతమ్ కరో' అని రజాకార్లు, పోలీసోళ్లు ఎంటబడ్డరంట. అటో ఇటో తప్పించుకుని వొచ్చినంగనీ, దొర్కితే అయిపోయేటోళ్లం అని చెప్తుండేది చంద్రం.

ఆ ముచ్చట చెప్పినప్పుడే నేను మా ఊర్ల చేసింది చెప్పిన. పెద్ద సూరారపోళ్లను సెట్లకు కట్టేసి కొట్టింది, ఆడోళ్లను ఆగం చేసింది, అది సూడలేక అయ్యాల రాతిరి నేను, ఈరిగాడు గుడారాలు తగుల బెట్టిన ముచ్చట, ఆళ్లకు దొర్కకుంటనే పట్నం వొచ్చి ఈడ ఉన్న దాంక అన్నీ ఒక్కొక్కటి పూస గుచ్చినట్లు మంచిగ సెప్పిన. ఈరిగాడు యాడున్నడో, ఎట్టున్నడోగానీ ఆ ముచ్చట, నా ముచ్చట చంద్రంకు మంచిగ నచ్చింది.

'నువ్వు ఇట్ల సేసినవని ఇయ్యాల దాంక నాకెర్కలే. అయితే నువ్వు గూడ ఇంగ మాతోని రావాలె. నిన్ను బీ అల్లకు తీస్కపోత. మేం ఆడ మాట్లాడుకునేది గూడా గిట్టాంటి ముచ్చట్లే. చెయ్యాలనుకునేది గూడా గిట్టాంటి పనులే. నువ్వు ఈపాటికే చేసినవ్ కావట్టి, నువ్వు బీ మా తోటి ఉంటే మంచిగుంటద'ని చంద్రం నన్ను గూడా అయాల్టి కెంచి ఆ సమావేశాలకు తీస్కపోవుడు షురూ చేసిండు.

ఆ సమావేశాలకు ఎవరెవరో వస్తుండేది. శానా ముచ్చట్లు చెప్తుండేది. ఆళ్లందరికీ లక్ష్మీ నారాయణ పవార్ పెద్దదిక్కు లెక్క ఉండేది. ఇయ్యాల ఎవరెవరు రావాలె, ఏమేం మాట్లాడుకోవాలె లాంటి జెండాలు, ఎజెండాలు ఆయనే సూస్కుంటుండేది. ఆయనంటే అందరికీ గౌరవం ఉండేది. చంద్రంతోని మారువేషంల జిన్నా సమావేశానికి పోయింది ఆయినే అని నాకు అటెన్కంగ ఎర్కయింది. ఆయన చెప్పిన ముచ్చట ఏందంటే..

హిందుస్థాన్ ఏర్పైనంక హైద్రబాద్‌ను మరో పాకిస్తాన్ లెక్క మార్చాలని, అందుకోసం హైద్రబాద్ రాష్ట్రంల తక్కువున్న ముస్లిం జనాభాను ఎక్కువ చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ముస్లింలను తీసుకురావాలని నిజాం ఆలోచన చేస్తుండని ఎర్కయింది. మన్మాడ్, బలార్షా నుంచి ముస్లింలను ఎక్కించుకుని రోజూ ఓ రైలు వొస్తుండేది. అట్ల వొచ్చినోళ్లు మౌలాలీలో, ఎర్రగడ్డలో క్యాంపులు ఏస్కుని కాందీశీకుల్లెక ఉంటున్నరంట.

వొచ్చింగ్రు బానే ఉంది. గానీ వొచ్చి ఆళ్లు ఏం జేస్తరు, ఏం చెయ్యాలనుకుంటుంగ్రు? ఈ ముచ్చట్లు తెలుసుకుంటందుకు మారు వేషాలల్ల, గొర్ల కాపర్ల లెక్క అటు మొహాన పోయి ఆళ్లని మందలించి తెల్సుకోవాలని ఒకరోజు పవార్ ఉపాయం చేసిండు. అందుకు ఎవరెవరు ఎల్లాల్నో, ఎట్ల పోవాల్నో, ఏం అడగాల్నో పూరా ఆయనే చెప్పిండు.

క్యాంపుల కాడికి పోయి వొచ్చినోళ్లు మల్ల సమావేశంల ఇట్ల చెప్పింగ్రు. ఈడ హిందువులను తరిమి కొట్టింగ్రని, భూములన్నీ ఖాళీగా ఉన్నయి.. వొచ్చి ఆక్రమించుకొమ్మని ఆడ మత పెద్దలు చెప్పింగ్రని, ఈడ నాలుగైదు రోజులున్నంక ఆ పని చేస్తమని, లేకుంటే హిందువులను ముస్లింలలెక్క బలవంతంగా మత మార్పిడి చేస్తమని.. అయినా కాకుంటే ఖతమ్ చేస్తమని, ఇదీ మా పని అని ఆళ్లు చెప్పింగ్రంట.

ఈ ముచ్చట ఎర్కయినంక పవార్ మల్లో పెద్ద ఉపాయం చేసిండు. ఆళ్లు ఇట్లాంటి దుర్మార్గమైన పని చేస్తందుకు వొచ్చింగ్రు కాబట్టి.. మనం ఆళ్లను ఎదుర్కోవాలె.. అయిన కాడికి మట్టు బెట్టాలె. ఇందులో తప్పేం లేదు అన్నడు. ఇందుకు రెండు మార్గాలు బీ చెప్పిండు. ఒకటి.. రైలు వొచ్చేటప్పుడే పట్టాలు పేల్చేసి, రైలు కూల్చేయాలె. రెండోది మారు వేషాలల్ల రాతిరి పూట గుడారాల కాడికి పోయి తగలబెట్టాలె. దీనికి కూడా పవార్ మంచి మంచి ఉపాయాలు చేసిండు. రైలు పట్టాలు పేలుస్తందుకు ఆజుబాజు చూసి అనువైన వాళ్లని ఒక గుంపుగ చేసిండు. గుడారాలు పేల్చేటందుకు మరో గుంపు చేసిండు. మా ఊరికాడ నేను గుడారాలు పేల్చిన ముచ్చట చంద్రం పవార్‌కు చెప్పి నన్ను దగ్గరి నుంచి పరిచయం చేసిండు. అయినా నేను కొత్త కాబట్టి నాకు ఈడి ముచ్చట్లు పెద్దగా తెల్వదని నన్ను ఆ గుంపులల్లకు తీస్కోలే పవార్. కానీ నేను ఆళ్ల కంటే బాగా గుడారాలు తగలబెడ్తనని ఆళ్లకు ఎర్కలే. నేను బీ ఆ గుంపుల ఒక్కదాంట్లైనా వుండాల్నని అనుకున్నగనీ కుదర్లే.

చంద్రం గుడారాలు తగలబెట్టే గుంపుల ఉన్నడు. నేను ఆ పని అప్పటికే చేసిన కాబట్టి ఇట్ల చెయ్యాలె, అట్ల చెయ్యాలె అని చెప్పిన అయ్యాల రాతిరి. ఆ సీకట్లనే ఆళ్లు చెయ్యాల్సిన పని.

ఆ పని అయ్యినంక వొస్తనని పొద్దుగూకుతప్పుడు పోయిండు చంద్రం. ఏమైందో ఏమో తెల్లారిగట్ల వొచ్చి పండుకుండు. పొద్దుగాల లేసినంక గుడారాల ఉపాయం గోల్‌మాల్ అయిందని చెప్పిండు. గుడారాలు తగలబెట్టలేకపోయినం అన్నడు.

మల్ల రెండు మూడు దినాలకు రైలు పట్టాలు పేల్చే ఉపాయం ఉంది.. అది మంచిగనే చేసిండ్రంటగనీ.. ఆఖరి నిమిషాన గ్యాంగ్‌మన్ వొచ్చి రైలు ఆపి ఆగం చేసిండంట. పట్టాలు ఊడినయని పసిగట్టిండంట. ఈ ముచ్చట నాకు మల్ల సారి సమావేశంల ఎర్కయింది.

'ఒకసారి అంటే సరే. రెండోపాలి ఏమైంది. ఒక ఉపాయం అయితె పాయె. రెండో ఉపాయం కూడా ఎందుకు చెడిపోయింది?' అని అయ్యాల రాతిరి ఇయ్యరమయ్యర అర్సిండు పవార్. యమ కోపం మీద, ఉపాయాలు దెబ్బకొట్టినయన్న చిరాకు మీద మాట్లాడిండు.

ఎవ్వలి ముచ్చట ఆళ్లు చెప్తుండ్రు. ఇట్ల చేసినం గానీ అట్లయింది.. ఇచ్చిన బాంబులు పేలలేదని గూడారం గుంపు, గ్యాంగ్‌మన్ రాకుంటే రైలు కూలేదని పట్టాల గుంపు.. అయిన ముచ్చట, కానీ ముచ్చట.. కావాల్సిన ముచ్చట, మల్ల చేయాల్సిన ఉపాయం అన్నీ మాట్లాడుతుండ్రు.

'రజాకార్లను ఎయ్యాలంటే మాటలు కాదు, రైలు కూల్చాలన్నా, గుడారాలు పేల్చాలన్నా గుండె ధైర్యం కావాలె. సరే, అయిన కాడికి అయింది. అదును సూస్కుని మల్లీ ఎయ్యాలె ఉపాయం. ఈసారి సావాలె నా కొడుకులు..' పండ్లు బిగవట్టి చెప్తుండు పవార్.

ఇదంతా మంచిగనే ఉంది. కానీ నేను అప్పటికెంచి, నిన్న మొన్నటికెంచి ఇన్న ముచ్చట వేరు. దీనికంతటికీ కారణం ఆ నిజాం, ఆడ్నే ఏస్త ఎట్ల ఉంటది అని నేను ఆలోచన జేస్తున్న. ఊకున్నోనికి ఉపాయాలు ఎక్కువొస్తయి గదా. అందుకే ఆళ్లని ఇళ్లని ఏసుడు ముచ్చట పవార్ చెప్తుంటె ఉండబట్టలేక 'ఆళ్లని ఈళ్లని ఏసుడుకంటే ఈ నిజాంనే ఏసేద్దాం' అన్న ఆ సమావేశంల. అనుకోకుండా నోట్లకెంచి అంతమందిల అట్ల వొచ్చింది ఆ మాట, నాకు తెల్వకుంటనే.

అందరు గమ్మున అయిపోయిండ్రు. నా మొహం సూసిండ్రు.

అటీటూ సూసిన పవార్ ఆఖర్కి నాకళ్ల సూస్కుంట 'ఎవర్నువ్వు. ఏం మాట్లాడుతున్నవ్? నిజాంను ఎయ్యాలంటే ఉట్టి మాటలనుకున్నవా?' అన్నడు.

'వొట్టి మాటలో, పచ్చి మాటలో నాకెర్కలే. కానీ ఎయ్యలేమంటవా?' అని అడిగిన.

'ఎవరు ఈన్ని తీస్కొచ్చింది? బచ్చెగానీ మాటలు మాట్లాడుతుండు. ఈ ముచ్చట్లు నీకు పూరా ఎర్కలే. ఈడ్ని తీస్కొచ్చినోళ్లు దయచేసి నా కండ్ల ముందుకెంచి తీస్కపోండ్రి' అని కండ్లు మూస్కుండు పవార్.

'ఏం ఎర్కలే. నువ్వే చెప్తున్నవ్‌గా. గుడారాలు తగలబెట్టాలని, ఒక్కటన్న తగలబెట్టింండ్రా? రైలు పట్టాలు పేల్చాలనీ అనుకుండ్రు. కానీ ఇప్పటికి ఒక్కసారైనా పేల్చింండ్రా. లే. కానీ నేను మా ఊర్ల ఈ పని ఎప్పుడో సేసిన. మంటల్ల కాలి సచ్చింండ్రు నా కొడుకులు' అని నిలవడి చెప్తున్న. నా అంగి పట్టుకుని 'కూసో' అని గుంజుతుండు చంద్రం.

'నీ టమాటా ఊరి ముచ్చట వేరు. ఈడ వేరు. నిజాంను సంపడమంటే ఏమనుకుంటున్నవ్? ఊకుంటరా రజాకార్లు. రెచ్చిపోతరు. హిందువులను ఖతమ్ చేస్తరు. పూరా ఆగమాగమైతది? ఎర్కేనా నీకు. వొద్దు నువ్వీడ పో. బయిటికిపో. జర తీస్కపోండ్రి' అని కండ్లు మూస్కుని, మొహం తిప్పుకొనే అన్నడు పవార్.

'ఎర్కే. కానీ ఈ మాట నీకు ఎర్కేనా? నాయకున్ని సంపితే సైనికుడు ఎప్పుడూ ముందడుగు ఎయ్యడు. చదవలేదా చరిత్ర? ఏ యుద్ధంలనైనా గింతే. తిరగేద్దామా మల్ల పుస్తకాలు, పురాణాలు...'.

'పుస్తకాలు, పురాణాల గురించి నాకే చెప్తవా? ఎవరు నువ్వు అసలు. నిన్ను ఈడికి ఎవరు రానిచ్చింండ్రు.. తీస్కపోండ్రి ఈన్ని బయిటికి మొదలు.. ' అని పట పట పండ్లు కొరికిండు పవార్.

అప్పటిదాంకా నా అంగి పట్టుకున్న చంద్రం పైకి లేచి నా పీక పట్టుకుండు. సప్పుడు సేకని సైగ చేసిండు. కుడి రెక్క పట్టుకుని గట్టిగ గుంజిండు. గొర గొర గుంజకపోయిండు బయిటికి.

'ఇను చంద్రం ఆయిన చెప్తున్నది తప్పు. నేను అన్నదాంట్ల ఏమన్న తప్పు ఉందా?' అని అన్న.

'అయ్యాన్నీ అటెన్క మాట్లాడదాం. ముందు నువ్వు లోపల్కి రాకుంట ఈడ కూసో' అని కిందికి గుంజుకొచ్చి కూసోబెట్టిండు మంగలి దుఖ్నంల.

మల్ల పైకి పోయిండు. అయ్యాలకెంచి నన్ను పైకి రానియ్యలె. లోపల్కి పోనియ్యలె. కానీ ఆడ ఏమైతాందో రోజు చంద్రంని అడిగి తెలుసుకుంటనే ఉంటిని. నేను అడగక

పోయినా చంద్రం సెప్తనే ఉన్నడు.

ఆ రోజుల్లనే పవార్, రాజారాం షోలాపూర్ పోయింద్రంట. పెద్ద బాంబులు, గుడారాలు పేలుస్తందుకు మంచి బాంబులు తెస్తందుకు పోయింద్రని చెప్పిండు. అదే సమయంల చంద్రం గూడా అమృత్‌సర్ పోయిండు. ఆడ పెద్ద నాయకులు ఉంద్రని ఆళ్లని కలిసి రావాల్నని చెప్పిండు. ఆడికెంచి వొస్తప్పుడే చంద్రం రకరకాల పుస్తకాలు తెచ్చిండు. వొచ్చిన రాతిరే మల్ల ఉదయ్ క్లాత్‌స్టోర్‌పై అర్రల సమావేశానికి పోయిండు చంద్రం.

అయ్యాల రాత్రి సమావేశం అయిపోయినంక వొస్తప్పుడు తనతోని ఒకాయిన్ని తీస్కొచ్చిండు. ఆయన పేరు రణధీర్ ఆర్య. ఆయన వొచ్చుకుంట వొచ్చుకుంటనే 'నీ పేరేనా యాదయ్య?' అని అడిగిండు.

నేను 'అవునన్న'.

'నీ ముచ్చట ఎర్కయింది. ఏమో అనుకున్న. నీ సత్తా ఏందో నీ కండ్లల్ల కన్పిస్తున్నది. ఈడికెంచి ఇగ నువ్వు బీ మాతోటి ఉంటవు' అన్నడు.

నాకు పూరా అర్థం కాలేగనీ.. చంద్రంగానీ, పవార్ గానీ నా గురించి చెప్పింద్రని సమజైంది.

'నచ్చినవ్' అన్నడు. 'ఆళ్లని ఈళ్లని కాదు.. నిజాంనే ఎయ్యాలన్నవంట గదా.. బావుంది. కానీ ఎట్లేద్దాం?' అన్నడు. నేను సప్పుడు సేక చంద్రం మొహం సూసిన. ఆయన నా మొహం, రణధీర్ మొహం చూసిండు.

'ఏద్దాం. ఆ నిజాంనే ఏద్దాం. ఈ ఉపాయంల నువ్వు బీ ఉంటవు. రేపటికెంచి రా. నాతోని' అన్నడు.

మర్నాడు రాతిరి సమావేశానికి నన్ను బీ తీస్కపోయిండు. నన్ను సూడగానే పవార్ మొహం తిప్పుకుండు. నేను తల దించుకున్న. ఆ మాట, ఈ మాట చెప్పి పవార్‌ను ఒప్పిచ్చిండు.

'దేశానికి సొతంత్రం వొస్తుంది. కానీ మనం ఇంకా నిజాం నిరంకుశత్వ బానిస సంకెళ్లలోనే ఇరుక్కుపోతున్నాం. ఇండియన్ యూనియన్‌తోటి నేను కల్వను అంటున్నడు నిజాం. సూద్దాం. ఒప్పుకుంటడో ఒప్పుకోడో.. ఒప్పుకోకపోతే ఇంగో ఈ యాదయ్య చెప్పినట్లు ఏసేద్దాం.. ఆ నిజాంనే' అన్నడు రణధీర్.

నాకేం అర్థం కాలే. నేను చెప్పింది నచ్చకనే పవార్ నన్ను సమావేశాలకు రావొద్దన్నడు. ఇప్పుడీయన కొత్తగొచ్చిండు. ఈన చెప్తే పవార్ ఇంటుండు. పైగా నేను అన్న మాటలు ఊకె చెప్తుండు. ఈ ఉపాయంల నేను బీ ఉంటనంటున్నడు. అసలు ఏం ముచ్చటైందో చంద్రంను అడగాలని ఉన్నది.

అయ్యాల రాతిరి చంద్రం ఒక్కడే కాదు, రణధీర్ కూడా ఉన్నడు. ఇద్దరు కలిసి ఇట్ల చెప్పింద్రు ఆ ముచ్చట, నేను చంద్రంని అడిగినంక.

పవార్, రాజారాం బాంబులు తెస్తందుకు బొంబై పోయింద్రుగదా. ఆ పోతప్పుడే మధ్యల షోలాపూర్‌కాడ ఆగింద్రంట. ఆడ హైద్రబాద్ నుంచి పోయిన కాందీశీకులు ఉంటరు. ఈడ నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా మాట్లాడినోళ్లను, ఏదన్నా జేసినోళ్లను రజాకార్లు పట్టుకునేటోళ్లు. అట్లాంటోళ్లంత ఆడికి పోయి దాస్కుంటుంటరు. ఇంగో ఆళ్లని కలుద్దామని ఆగింద్రంట. ఆడనే లక్ష్మణ్ బాపూజీ అనే పెద్దాయిన కలిసి ఈళ్లని గుర్తు పట్టిండంట. 'ఏ పని మీద ఏడికి పోతుంద్రు?' అని ఆరా తీసిండంట. ఆ ముచ్చట ఈ ముచ్చట చెప్పినంక 'రజాకార్ల గూడారాల మీద ఏస్తందుకు బాంబులు కావాల్నని పోతున్నం' అని చెప్పింద్రంట.

అందుకు బాపూజీ ఒక్క నిమిషం ఆలోచించి 'మచ్చరోంకే మారేతో క్యా ఫాయిదా. అఘర్ మార్నా హైతో షేర్‌కో మారో' అన్నడట. ఇట్లాంటి మాటే నేను అన్నగదా. అందుకే పవార్ సప్పుడు చెయ్యలేదట. అటెన్క బాపూజీ.. రణధీర్ ఆర్యను తోడిచ్చి హైద్రబాద్ పంపిండంట. నిజాం మీద బాంబు దాడి ఎట్ల చేయాల్నో, ఎంతమంది ఉండాల్నో ఆజుబాజులు సూస్కుని మల్ల రమ్మన్నడంట. ఈ పథకానికి పవార్ నాయకత్వం చేస్తడని, ఆయిన చెప్పినట్లు అందరూ ఇనాల్నని ఆడనే తీర్మాణం చేసిండంట బాపూజీ.

ఇంగో అట్ల రణధీర్ హైద్రబాద్ వొచ్చిండు. అమృత్‌సర్ కెంచి వొచ్చిన చంద్రం, అయ్యాల రాతిరి సమావేశంల రణధీర్‌ను కల్సుకుండు. నిజాం మీద బాంబు ఏసుడు ముచ్చట మాట్లాడుకున్నంక, నా ముచ్చట చెప్పిండంట. రణధీర్ ఉంటందుకు కొన్ని రోజులు ఓ ఇల్లు కావాలె. అందుకే నా దగ్గర ఉంచుదామని చంద్రం రణధీర్‌ను అయ్యాల రాత్రి తోల్కొచ్చిండు.

మల్ల తెల్లారే దేశానికి సొతంత్రం వొచ్చింది. మనకేమో రాకపాయె. ఆ కోపంలనే అందరం సమావేశం పెట్టుకున్నం. అయ్యాల్నే చంద్రం అమృత్‌సర్ కెంచి తెచ్చిన పుస్తకం సదువుకుంట మేం ఏం చేయబోతున్నామో చెప్పిండు. ఆడ ఏం చెప్పిండో ముందుగాల్నే రాసినగద. అట్ల మమ్మల్ని బందూకులెక చేసిండు.

పవార్ నిజాం మీద బాంబు దాడి ఉపాయానికి 'ఆపరేషన్ సీతాఫల్' అనే పేరు పెట్టిండు. ఈ ఆపరేషన్‌ల ఉండే ఐదుగురిల రణధీర్ మాట కాదనలేక నన్ను బీ చేర్చుకుండు పవార్. ఇందులో పవార్, రణధీర్, చంద్రకిషోర్, నేను, రాజారాం ఉన్నం. ఆపరేషన్ సీతాఫల్‌లో ఉండేవాళ్లు అసలు పేర్లతోని ఉండొద్దని మా అందరి పేర్లు మార్సిండు పవార్. ముందు ఆయన పేరు బాబు అని పెట్టుకుండు. రణధీర్ ఆర్య ఆయిన అసలు పేరు కాదు. అప్పటికే ఈశ్వరయ్య అనే పేరుని రణధీర్ ఆర్య అని మార్సుకుండట. చంద్రకిషోర్ పేరు దేవ అని, రాజారాం పేరు గంగారం అని మార్సిండు. ఇంగ నా పేరేమో రామస్వామి. అయ్యాల్టి కెంచి అందరం ఆ పేర్లతోనే పిల్సుకోవాల్నని చెప్పిండు. అసలుపేర్లు యాడ చెప్పొద్దని మల్ల మల్ల చెప్పిండు.

అయ్యాల్టికెంచి మేం అయిదుగురం రోజూ కల్సుకుంటున్నం. ఏం చేస్తున్నమో రాసుకుంటున్నం. ఆపరేషన్ సీతాఫల్‌లో అయిదుగురం ఎవరు ఏ పని చెయ్యాల్నో ఆ ఉపాయం మంచిగచేసి చెప్తా అన్నడు బాబు.

మేం బీ ఉత్తగనే ఉండకుండా రోజూ రాతిరి పూట నేను, రణధీర్, దేవ రకరకాల ఉపాయాలు చేస్తనే వున్నం. నిజాం కార్ల పోతుంటడు గదా, ఆ కారు వొచ్చే సడక్ మూల మలుపు మీద ముగ్గురు నిలబడాలె. ఒకరు మూల మీద ఉంటరు.. ఇంకొకరు అటుకళ్ల, మల్లొకరు ఇటుకల్ల వుండాలె. ముందు మూల మీద ఉన్నాయిన బాంబు ఎయ్యాలె. అది తప్పిందనుకో కారు ముందుకొస్తే ముందలాయన ఎయ్యాలె, ఎనక్కి తిప్పితే ఎనకాల వున్నాయిన ఎయ్యాలె. ఇదీ మొత్తానికి మేం ముగ్గురం కల్సి చేసిన ఒక ఉపాయం.

ఇదే ఉపాయం మల్ల సమావేశంల అందరం మాట్లాడుకున్నం. బాబు కూడా మంచిగున్నది అన్నడు. కానీ ఈ ముచ్చట ఉట్టిగనే అనుకుని చేస్తే అయ్యేది కాదు, ముందుగాల శిక్షణ తీసుకోవాలె. కారు నిమ్మలంగ వొస్తదో, ఉగ్రటిగ వొస్తదో తెల్వదు. కాబట్టి ఎట్టొచ్చినా దానికి తగ్గట్టు ఎయ్యడం ఎట్లనో జరింత నేర్సుకోవాలె. ఇందుకని మల్ల మనం షోలాపూర్ పోవాలె. బాపూజీని కలిసి ఈ ఉపాయం చెప్పాలె. ఆడ ఒక కారు అద్దెకు తీసుకుని నేర్సుకోవాలే. ఇందుకోసం నేను, రణధీర్ షోలాపూర్ పోయి వొస్తం. మీరు ముగ్గురు ఈడ నిజాం ఏ యాలకు ఏడికి పోతుండనే ముచ్చట, ఏ సడక్ అయితే బాంబు దాడి చేస్తందుకు బాగుంటదో ఆరా తీయాలని చెప్పిండు బాబు.

పది, పదిహేను రోజులైంది. బాంబులు తెస్తందుకు తలా ఇన్ని పైసలు జమా చేసినం. జరిన్ని పైసల్ తక్కువ పడ్తే దేవ తన పెండ్లం బంగారు గొలుసు కుదవబెట్టి ఇచ్చిండు. ఆ పైసల్ పట్టుకుని బాబు, రణధీర్ షోలాపూర్ పోయింద్రు.

నేను, దేవ, గంగారం ఇంగ రోజూ నిజాం వుండే కింగ్ కోఠీల జరసేపు తిర్గుతుండేది. ఎవర్కి వీలు కుదిరినప్పుడల్ల ఆళ్లు అటుకల్ల పోయి వొస్తుండేది. నిజాం ఏడికి పోతుండు, ఎట్ల పోతుండు.. కారు ఎట్ల నడుపుతుండ్రు.. అది వొస్తప్పుడు సడక్ మీద సవ్వారి ఎట్లుంటది.. జనాలు ఏడేడ ఉంటుండ్రు... బాంబు ఏస్తందుకు ఏడయితే బావుంటది.. గియాన్నీ సూస్తుండేది. మల్ల ఎప్పటికప్పుడు రాతిరి వేం మాట్లాడుకుని రాసి పెట్టుకుంటుండేది.

నెల రోజుల తర్వాత ఒక రోజు రణధీర్ షోలాపూర్ కెంచి ఉన్నట్టుండి ఊడి పడ్డడు. ఎల్లుండి పొద్దుగాల రైలుకు బాబు బాంబులు తీస్కుని షోలాపూర్ కెంచి వొస్తుండని చెప్పిండు. అయ్యి ఆల్తుపాల్తు తెస్తే ఆగమైతమ్. పోలీసులు పట్టుకుంటే పెద్ద పరేషాన్. అందుకే ఆల్ల కంటికి కనవడకుంట, ఆటిని పైలంగ తెస్తందుకు ఓ ఉపాయం చెయ్యాలన్నడు. ఆయ్యాల రాతిరికి నా అర్రలనే కూసొని ఏసినం మల్లో ఉపాయం.

అసలికైతే రైలు దిగి సుల్తాన్ బజార్ రావాల్నంటే నాంపల్లి స్టేషన్ కాడ దిగాలె. మరి ఆడైతే పోలీసోళ్లు శానామంది ఉంటరు, పట్టుకుంటరు అనే అనుమానంతోని మధ్యల మాయం చేయాలనుకున్నం. పోలీసులు ఎక్కువగా ఉండని స్టేషన్ అయితే బావుంటదని, ఒకలు ముందుగాల పోయి రైలు వొచ్చే యాలకు ఆడ నిల్వడాలని, రైలు ఆగంగనే బాంబులున్న డబ్బా తీస్కుని సైకల్ మీద రావాలని ఉపాయం చేసినం. అందుకు హుస్సేన్ సాగర్ కాడి రైల్వే స్టేషన్ అయితే బావుంటదని అనుకున్నం. ఆ ఉపాయం నేనే చెప్పిన కాబట్టి ఆ పనీ నేనే చేస్తె బావుంటదని చెప్పిండు రణధీర్. ఆటిని తెచ్చి ఎవల్కి తెల్వకుండ సిద్ధిఅంబర్ బజార్ల గంగారం కిరాయికి ఉండే అర్రల దాచి పెట్టాలన్నది అసలు ముచ్చట.

అంతేకాదు అయ్యాల రాతిరి ఆడ షోలాపూర్‌ల బాబు, రణధీర్ ఏం చేసింద్రో, ఎట్ల చేసింద్రో కూడా మాకు చెప్పిండు రణధీర్.

నిజాం కారు ఉంటది గదా అట్లాంటి కారే ఒకటి కిరాయికి తీస్కుంద్రంట షోలాపూర్‌ల. ఇంగ ఒక రబ్బరు చెండును కోసి అండ్ల రాళ్లు పోసి మల్ల కుట్టింద్రంట. ఆ చెండుని ఇంగ రోజు కారు మీదికి ఇసిరేసేదంట. సక్కగ ఎనక సీట్లకు ఇసరాల్నంట. కారు ఎంత వుర్రటిగ వొస్తదో తెల్వదు కాబట్టి, ఒకసారి నిమ్మలంగ వొస్తప్పుడు ఎట్ల ఎయ్యాల్నో.. ఇంకోసారి జరంత ఉర్రటిగ వొస్తప్పుడు ఎట్ల ఎయ్యాల్నో మల్ల మల్ల చెండు ఏసుకుంట నేర్సుకుంద్రంట. అబ్బ గాడికి నేను బీ బోయి నేర్సుకుంటె బావుండనిపించె గానీ ఏం చేస్తాం, బాబు ఒప్పుకోడాయె.

సరే ఇంగ, గా ముచ్చట పక్కనబెడ్తే తెల్లారి గాక మల్ల తెల్లారి రైలు వొచ్చే

యాలయింది. నేను పొద్దుగాల పొద్దుగాల్నే లేచి కోఠీల ఒక సైకల్ అద్దెకు తీస్కున్న. ఇంగ ఆ సైకల్ ఏస్కుని పోయి హుస్సేన్ సాగర్ రైల్వే స్టేషన్ల నిల్వడ్డ. రైలు ఎప్పుడొస్తదా అని సూస్కుంట కూసున్న. బాబు రైలు దిగనే దిగిండు. అటీటు సూస్కుంట నా దగ్గరకు వొచ్చిండు. రెండు పెద్ద డబ్బాలు చేతికిచ్చిండు.

'ఏమున్నయ్ ఇల్ల. సీతాఫలాలేనా?' అని అడిగిన.

'లే.. బిస్కిట్లు' అన్నడు బాబు.

'మరి సీతాఫలాలు?' అని అడిగిన.

'అయ్యి గూడా ఉన్నయి గనీ నోర్మూసుకుని పైలంగపో' అన్నడు. నేను గట్లనే చేసిన.

నేను స్టేషన్ల కెంచి బయిటికి వొస్తున్నప్పుడు ఒక పోలీసోడు ఆపనే ఆపిండు.

'ఏమున్నయ్ ఇల్ల' అన్నడు.

'బిస్కిట్లు' అన్న.

'తీసి సూపియ్' అంటే నేను పై మూత తీసి సూపిచ్చిన. నిండా సీతాఫలాలున్నయ్.

'బిస్కెట్లన్నవ్..?' అనుకుంట ఒక సీతాఫలం తీస్కుండు పోలీసోడు.

నేను ఏం చెప్పాల్నో అర్థం కాక నవ్విన. ఆ డబ్బాని ఈ డబ్బాని బయిటంగ పక్కనకెంచి కర్రతోని కొట్టి సూసిండు పోలీసోడు.

'ఇంగపో' అన్నడు పండు ఇప్పుకుంట.

అ..మ్మా..! బిస్కిట్ల డబ్బా అని చెప్పిండు బాబు, సిప్పాలకాయలల్లనే సీతాఫలాలు గూడా పెట్టిండ్రన్నమాట. అట్టెట్టనా అని సోంచాయించుకుంటనే వొచ్చిన. మనసు ఊకుంటదా గంగారం అర్రల పెట్టినంక డబ్బా మూత మల్ల తీసి సూసిన. ఒక్కొక్క సీతాఫలం తీసి సూసిన. బాంబులు అడుగున పెట్టి పైనంగ పండ్లు పేర్సిండ్రు. మూడు పిన్ బాంబులున్నయి. జరంత బరువే వున్నయ్. చేతుల పట్టుకుని సూసిన. ఇసిరేసినట్లు చేసి సూసిన. తిప్పి తిప్పి చూసిన. 'నిజాంను సంపుతందుకు వొచ్చిండ్రులే.. ముద్దుగున్నరు ముగ్గురు బుజ్జి ముండలు..' అని మురిసిన.

ఇంగ నేనేమో ఎప్పుడెప్పుడు బాంబు ఏసే రోజు వొస్తదోనని సూస్తున్న. కానీ నెల,

నెల పదిహేను రోజులు సప్పుడు సేక ఉండాలని, ఖుఫియాలు తిర్గుతుండ్రని ఆళ్లకు అనుమానం వొస్తే బాంబు ఉపాయం మొత్తం బర్బాద్ అయితదని రణధీర్‌ను పిలిచి బాబు చెప్పిండంట. మల్ల సమావేశానికి పిలిచిన దాంక ఎవ్వలు బాంబు గురించిగానీ, నిజాం మీద దాడి గురించి గానీ ఎక్కడా మాట్లాడకూడదని, మాలో మేం కూడా మాట్లాడొద్దని కూడా చెప్పిండంట.

ఇంగ అందరం ఏం తెల్వనట్లు, మాకాడ బాంబులే లేనట్లు సప్పుడు సేక ఎవ్వరి కొలువులు ఆళ్లు చేస్కుంటున్నం.

సరిగ్గా నెల పది రోజులు అయినంక అయిదుగురం కల్సుకున్నం మల్ల మా దుఖ్నం పై అర్రలనే. ఆపరేషన్ సీతాఫల్ ఎట్ల చెయ్యాల్నో బాబు ఉపాయం చెప్పే రోజు అది. ఎప్పుడెప్పుడా అని ఎదురు సూస్తున్న రోజు.. రానే వొచ్చింది.

'ఈ ముచ్చట జాగ్రత్తగా వినండి. ఇందులో యాడ తేడా అయినా అందరం ఆగమైతం. అందుకే ప్రాణాలు పోయినా పర్లేదు అనుకోండి' అని మొదలు పెట్టి ఆపరేషన్ సీతాఫల్ మొత్తం చెప్పిండు బాబు.

నిజాం నివాసం ఉండే కింగ్ కోఠీ సడక్ మీద నిలవడాలి. చౌరస్తాల బాబు నిలబడ్తడు. నిజాం కారు ముందుకు పోయే బాటల జరంత దూరంల రణధీర్ నిలబడ్తడు. ఆ తర్వాత ఇంకొంచెం దూరంల గంగారం నిలబడ్తడు. రాజమహల్ నుంచి నిజాం బయిటికి రాంగనే ముందుగాల బాబు బాంబు ఇసురుతడు. ఆడ తప్పితే తర్వాత నిల్వడ్డ రణధీర్ బాంబు ఎయ్యాల. ఆడ బీ తప్పితే ఇంగ గంగారం ఇసరాలె. ఇదీ బాబు చెప్పిన ఉపాయం. కానీ ముందుగాల మేం అనుకున్నది, షోలాపూర్ పెద్దలకు పంపిన ఉపాయం ఇది కాదు. ఆ ముగ్గుర్లో నేను ఉండాలని అనుకున్న, కలగన్న. మూల మీద నిలబడేటోన్నయితే ఇంకా బాగుండు అనుకున్న. కానీ మూల మీద కాదు, ఆ ముగ్గురిలోనే నా పేరు లేకుండా చేసిండు బాబు.

'ఇదేం బాగలేదు' అన్న నేను.

'ఏం బాగలేదు. ఎందుకు బాగలేదు?' అన్నడు బాబు.

'ఇది కాదుగా మనం ముందుగాల అనుకున్న ఉపాయం' అన్న.

'అదీ ఇదీ ఒకటే.. అటు నిల్వడేటోడు ఇటు నిలవడ్తడు గంతే తేడా' అన్నడు బాబు.

'ఆడనే ఉంది అంతా. అటొకరు ఇటొకరు ఉండాలె. అందరూ ఇటే ఉంటే దెబ్బయితమ్'

అని చెప్పిన.

'రామస్వామి చెప్పేదాంట్లో నిజం ఉంది. ముందు అనుకున్నది ఇది కాదు. ఎందుకు మార్సినవ్ ఉపాయం?' అని రణధీర్ బీ అడిగిండు.

'మార్సుట్ల ఏముంది. ముగ్గురు ఒకకాడ ఉండుడు కంటే ముందలొొకలు మల్ల ముందలికి ఇంకొకలు ఉంటే బావుంటది. ఈడ తప్పితే మల్లెయ్యొచ్చు' అన్నడు బాబు.

'ముగ్గురు ఒక్కకాడుంటే.. ఒకరి తర్వాత ఒకరు, కారు ముందుకు పోయినా ఎనకకు పోయినా బాంబు ఏయొచ్చు..' అని రణధీర్ చెప్తుండంగనే...

'కారు ముందుకే పోతది కానీ. ఎనక్కి ఎట్ల పోతది. ఎనక్కి తిర్గనీకి ఏముండదు ఆడ. ముందుకే ఉఁరటిగ వొస్తది కాబట్టి. నువ్వు ఉఁరటిగనే ఎయ్యి' అన్నడు బాబు.

'అది కాదు అసలు ముచ్చట. ఆడ మీరు రబ్బరు చెండుల రాళ్లు పోస్కుని నేర్సుకుండ్రు. కానీ ఈడ బాంబు సూస్తే జరంత బరువెక్కువుంది. ఇసరడంల తేడా వొస్తే బాంబు సరిగ్గా ఆడ్నే పడుతదని లేదు. అందుకే సెప్తున్న. ముగ్గురు ఒక్కకాడ్నే ఉండాలె' అని.

'నేర్సుకుంది నేనా నువ్వా? రణధీర్! ఈడు ముందుకెంచి ఇట్లనే మాట్లాడతడు. అందుకే వొద్దన్న' అన్నడు బాబు.

'ఈడు చెప్పేదాంట్ల నిజం ఉంది..' అని రణధీర్ ఏదో చెప్పబోయిండు.

'నేను చెప్పినట్లు ఇనాలె. నేను కెప్టెన్‌ను పెద్దలు నిర్ణయించిండ్రు' అని గట్టిగ అర్సిండు బాబు.

ఎంత చెప్పినా ఇనలే. ఆయిన చెప్పిన మాటనే నెగ్గించ్చుకుండు. ఆ ఉపాయమే ఖాయం చేస్కుండు.

ఇంగ బాంబు దాడికి ముహూర్తం పెడతనని, ఆ రోజుకోసం ఎదురు చూడాల్నని చెప్పిండు.

♦♦♦

# 7

# నిఖారం

'ఏంది! మొత్తం కనిపియ్యకుంట అయిపోయినవ్. బొత్తిగ నల్లపూస లెక్క అయినవ్. ఇంటికల్ల బీ వొస్తనే వొస్తలెవ్వు. యాడ తింటున్నవ్. యాడ ఉంటున్నవ్?' అని అడిగింది నా నజియా.

అయ్యాల ఆల్లింట్ల ఎవ్వలు లేరని ఎర్కయితే ఇంటి పట్టునే ఉన్న. ఐతారం అయ్యాల. చంద్రం దుఖ్నానికి పోయినంక, నేను నజియా ఇంట్ల దూరిన.

సాయ్‌బాన్‌ల కూసున్నం ఇద్దరం.

'నజియా నీకు శానా చెప్పాలె. మేం ఏం చేస్తున్నమో ఎర్కేనా?' అన్న.

'నువ్వు ఊకనే ఉండవుగా. మల్లేం జేస్తున్నవ్? నిన్న మొన్న చేసిన దానికే ఇంతకాడికి అయ్యింది' అన్నది రంగు కాయితాలు ముందల ఏస్కుంట.

'ఏమైంది?' అన్న.

'ఎర్కలేదా నీకు?' అన్నది శాకశాలలకు ఉరుక్కుంట. పొయ్యి మీద ఉడుకుతున్న బిర్యానీ జరంత మాడు వాసన వొస్తున్నది.

'అయ్యో.. నీకీ మాట్లాడుకుంట కూసుంటె బిర్యానీ మాడిపాయె' అనుకుంట వొచ్చింది.

నజియా వొండిన బిర్యానీ తినాలంటే పెట్టి పుట్టాలె. నేను ఆమెను ప్రేమించినందుకు కాకపోయినా, ఆమె చేతి బిర్యానీ తింటందుకైనా పెండ్లి సేస్కోవాలె. ఇంగ ఎప్పుడంటే అప్పుడు ముర్గీ బిర్యానీ తినొచ్చు. ఎంత అదృష్టం ఉంటే గిట్లయితదో ఎర్కేనా? తంతె బూరెల గంపల పడ్డట్టు.. కరిస్తే నేనొచ్చి బిర్యానీ బేసిన్ల పడ్డ. నజియా వొండిన బిర్యానీ ఒక్కసారి తిన్నంక ఊకున్ననా.. ఆల్లింట్ల ఎవ్వలు లేనప్పుడల్లా నేను ముర్గీ కూర పట్టుకొస్తే, తను నాకోసం మంచిగ బిర్యానీ వొండి పెడ్తుండేది. ఇది మాకు కొత్తకాదు. ఇట్ల మేం శానా సార్లు చేసినం. పొద్దుగాల ఇంట్ల దూరి లోపలంగ బేడెం పెట్టుకుంటె పొద్దుగూకాల బైటికొచ్చేది. లోపల ఏమేం చేసేది నేను పూరా చెప్ప. మీరు బీ అడగొద్దు.

శానా రోజుల కెంచి రణధీర్ ఎప్పుడూ ఎమ్మటి ఉంటుండు కావట్టి ఈమజ్జ కుదుర్తలేగనీ.. నిన్న మొన్నటిదాంక ఇదే ముచ్చట మా ఇద్దరికీ. ఇయ్యాల రణధీర్.. చంద్రం ఎమ్మటి పోయిండు, గందుకే నేనిటొచ్చిన. ఇయ్యాల గూడా నేను ఆళ్లతోని పోయేదుండె కానీ, నజియాను కల్వక, ఆమె చేతి బిర్యానీ తినక శానా రోజులయిందని 'ఇయ్యాల ఒంట్లో బాలేదు, మీరు పొయ్యిరాండ్ర'ని ఒల్లక్కం చెప్పి ఆళ్లని అటు తోలి, నేను ఇటు వొచ్చిన.

'ఆకలైతుందా? బిర్యానీ అయింది తింటవా?' అన్నది నజియా.

'బిర్యానీ తర్వాత తింటగనీ ఇటు రా. ఇంగో ఈడ కూసో' అన్న.

'నేను రాను. నీ చేతులు ఊకోవు. నేను ఈడ్నే ఉంట నువ్వు ఆడ ఉండి చెప్పు' అన్నది. ఎర్ర కాయితంతోని చేసిన బాతు బొమ్మ సూపిచ్చుకుంట.

నజియా కాయితం బొమ్మలు మంచిగ చేస్తది. రంగు రంగుల కాయితం పిట్టలు ఆళ్ల ఇంటి నిండుంటయి. ఆ బొమ్మలంటే నాకు బీ శానా ఇష్టం.

'నజియా.. బొమ్మలు తర్వాత చేద్దువుగనీ దా! ఈడ కూసుందువు. నీకు శానా చెప్పాలె' అని బతిలాడిన.

'ఆహా.. నిన్న మొన్న యాడికి పోయిందో ఈ ప్రేమ. ఓ.. ఇయ్యాల ఉర్కొచ్చినవ్.

చెప్పుదువ్ లే ముచ్చట. రేపో ఎల్లుండో దాదీ ఇంటికొస్తది. అది వొచ్చినంక నాకు షాదీ సేస్తరు. అప్పుడు ఆ రణధీర్‌కు, చంద్రంకు చెప్పుకుంట కూసుందువులే శానా ముచ్చట' అన్నది.

'ఏ.. అది కాదు నజియా.. మేం ఏం చేస్తున్నమో ఎర్కేనా?' అని ముచ్చట చెప్పబోతుండంగనే..

'నాకేమొద్దు నీ ముచ్చట' అనుకుంట శాకశాలలకు పోయింది మల్ల.

నేను సిన్నగ లేసి ఎనకంగ పోయిన. ఆమె పొయ్యి మీంచి బిర్యానీ గిన్నె దింపుతున్నప్పుడు, ఎనకంగ గట్టిగ పట్టుకున్న.

ఆ గిన్నె అట్లనే లపక్కున వొదిలేసింది. ఎనకకి తిర్గి ఈపింగ ఒక్కటిచ్చింది. 'ఏంది నువ్వు చేస్తుంది? కొద్త నిన్ను. ముట్టుకోకు అని చెప్పినగా, పో' అన్నది మూతి ముడుసుకుంట.

'ఓయ్.. నేను కాకపోతే నిన్ను ఇంగెవలు ముట్టుకుంటరె' అని మల్ల పట్టుకోనీకి పోయిన.

'ఆహా.. పట్టుకుందువ్.. పట్టుకుందువ్.. నాకు పెండ్లి అయినంక మాది ఆయనికి అడిగి పట్టుకుందువ్‌లే' అంది.

'ఏంది! నజియా అట్ట మాట్లాడతావ్. ఊకె పెండ్లి పెండ్లి అని' జరంత కోపానికి వొచ్చిన.

'అబ్బో కోపం.. ఆ కోపమే ఇంతదాంక తెచ్చిందని చెప్తుంటె మాత్రం సమజ్ కాదు' అనుకుంట ఎనకంగ వొచ్చింది.

'ఏం కోపం.. ఏం చేసిన చెప్పు నేను' అన్న.

'యాజ్జేసుకో.. నేను ఇప్పుడే వొస్తా' అనుకుంట బయిటికి పోయింది. నన్ను ఇంట్లనే ఉంచి, బయిటంగ బేడం పెట్టుకుంది.

♦

యాజ్జేసుకుంటున్న.

అబ్దుల్లా గురించి. నా చెయ్యి, చంద్రం చెయ్యి కొర్కిండుగా ఆడే అబ్దుల్లా. అయ్యాల అయిందిగా ముచ్చట అటెన్క కొన్ని రోజులు ఏమైందోగనీ ఇటు ముఖాన రాలే.

అబ్దుల్లా గూడా మా గల్లిలనే వుంటుండె. నేను నిజాం పని, ఈ దేశాన్ని ఉద్ధరించే పనిల వున్నగద. అప్పుడే ఆడు మల్ల రెచ్చిపోయిండంట.

ఒకదినాం నజియా దవాఖానకు పోవుకుంట నన్ను రమ్మన్నది.

'ఇయ్యాల నాకు కుదరదు నజియా! నువ్వు పొయ్యిరా' అన్న.

'ఈ మజ్జ నన్ను పట్టించుకుంటలెవ్, ఏదేమైనా ప్రేమ తగ్గింది నాకీ మీద నీకీ' అనుకుంట అలిగి పోయింది.

ఎవ్వలు ప్రేమలవడ్డా గిదే ముచ్చట ఉంటదా? మొదట్ల బానే ఉంటది. అటెన్క.. నన్ను పట్టించుకుంటలెవ్. నా మీద ప్రేమ తగ్గింది.. గిట్టాంటి ముచ్చట్లే ఉంటయా? ఏమోగనీ... ఒక మాట చెప్త ఇనురి. ఇంగో ప్రేమించినమ్ గదా అని పొద్దున కెంచి రాత్రి అయిందాక.. రాతిరి కెంచి తెల్లారినదాంక ఇంగ ఆమెనే సూస్కుంట కూసుంట. ఎట్టుంటది?.. శానా బావుంటది. కానీ మరి తిండికి ఎట్ల ఎల్లాలె. ముద్దు దొర్కుతదేమోగనీ ముర్గీ ఏడంగ వొస్తది. గందుకే సూసినంత సేపు సూడాలెగనీ.. పొట్ట కూటికీ పోవాలెగదా. గందుకే పొయ్యిన, ఇంగేంజేస్తం మల్ల.

అయ్యాల పొద్దుగూకాల నేనొస్తారికే మొహం మాడ్సింది. గలమట్ల కూసున్నామె నన్ను చూసి మూతి తిప్పుకుని ఇంట్లకు పోయింది.

ఆడోళ్లు అట్ల చేసింద్రంటే ఏదో ముచ్చట ఉన్నట్లే.

ఇంగెట్ల? ఎప్పుడు అడగాలె ముచ్చట అని సూస్తున్న నేను. మల్ల తెల్లారి చెప్పింది అసలు ముచ్చటంతా.

నజియా దవాఖానకెంచి వొస్తుంటె ఆ అబ్దుల్లా ఎమ్మటి వడ్డడంట, ఏమేమో మాట్లాడిండంట. అన్నీ ఆగం మాటలె.

'రామసామి ఉన్నడని రంజుమీద ఉన్నట్లుంది. ఆని సంగతి, నీ సంగతి చెప్తా' అని బెదిరించిండని చెప్పింది.

ఇంగ ఇట్ల ఉందా ఆని ముచ్చట అని యమ కోపమొచ్చింది. అయ్యాల రాతిరికి

నేను, చంద్రం మాట్లాడుకున్నం.

తెల్లారి సక్కగ అబ్దుల్లా ఇంటికి పోయినం. పొద్దుగాల పొద్దుగాల్నే తింటుండు. తిన్నదాంక బైట అరుగు మీద కూసున్నం. తిన్నది అయిపోయిందో లేదో సూసి ఇంట్లకెంచి గుంజుకొచ్చినం. సక్కగ రామమందిరం సందు చివర్న పాతబడ్డ ఇంట్లకు తీస్కపోయినమ్. యమ కొట్టుడు కొట్టినం. మూతి మీదికెంచి, ముక్కు మీదికెంచి. రక్తాలు కారబట్టినయి. మల్ల నజియాకల్ల సూస్తె కాళ్లు ఇరగ్గొడతా అని, కండ్లు పీకేస్తా అని బెదిరిచ్చిన.

ఆడు పోవుకుంట పోవుకుంట 'సెప్త మీ సంగతి. మా లడకీ ఎమ్మటి పడుకుంట, నన్నే కొడ్తరులే. చెప్త మీ సంగతి. రామస్వామి అని పేరు మార్సుకుని నువ్వు ఏం చేస్తున్నవో ఎర్కే యాదయ్య, చంద్రమ దేవా! నీకు గూడా అయితది. అయిపోయింద్రు మీరు. ఖతమ్ చేయిస్త మిమ్మల్ని' అనుకుంట పోయిండు అబ్దుల్లా, ముక్కుల రక్తం తుడుసుకుంట.

ఆని బెదిరింపు మేమేం పట్టించుకోలే. కానీ ఆనికి మేం మార్సుకున్న పేర్లు ఎట్ల ఎర్కయినయో తెల్వలేదు. అయితె అయింది. తెలిస్తె తెలిసిందిగానీ.. మేం చేసే పనిల ఇంకా పైలంగ ఉండాలని మాత్రం ఎర్కయింది. అబ్దుల్లా అన్న ఖుఫియా అని, ఆన్ని మల్ల గెల్కితె మొదటికే మోసం వొస్తదని, ఇంగ ఆడ్ని ఇడిసిపెట్టాలని, పట్టి పట్టి గెల్కొద్దని చెప్పిండు చంద్రం.

దీనికంతటికీ పరిష్కారం ఒక్కటేనని, నేను జల్దీ నజియాని పెండ్లి చేసుకోవాలెనని నేను చెప్పిన.

చంద్రం అందుకు ఏర్పాట్లు చేస్తా అన్నడు. ఆర్యసమాజ్‌ల పెండ్లి చేస్తా అని మాటిచ్చిండు. నజియాను ఒకసారి అడుగు, గామె ఏమంటదో ఏమో అని గూడా అన్నడు.

'నేను మీదాంట్లకు రానా.. నువ్వు మా దాంట్లకు వొస్తవా?' అని నేను మల్లసారి నజియాను అడిగిన. తనకు ముందుగాల సమజ్ కాలే. అటెన్క మంచిగ ఎర్కయింది.

'ఓ పని చేద్దాం. నేను మీ దాంట్లకు వొస్తా. నువ్వు మాదాంట్లకు రా' అంది నవ్వుకుంట. 'మీ దాంట్లకు వొస్తే నాకేం పేరు పెడతావ్?' అని అడిగింది మల్ల.

'భాగమతి' అని చెప్పిన నేను. 'మరి నేను మీ దాంట్లకు వొస్తే ఏమని పిలుస్తవ్' అని అడిగిన.

'కులీ కుతుబ్ షా' అన్నది నవ్వుకుంట.

'అవును.. మన ప్రేమకు గుర్తుగా మనం మరో భాగ్యనగరం కడదాం' అన్న నేను.

ఇద్దరం నవ్వుకున్నం.

'నవ్వింది చాలుగానీ నజియా, మనం పెండ్లి చేస్కుందాం. అప్పుడు ఏ లొల్లీ వుండదు' అన్న.

'పెండ్లి. మన పెండ్లి, అదే పెద్ద లొల్లి అయితట్టుంది. మా ఇంట్ల ఏమంటరో ఏమో!?' అని కంగారుపడ్డది.

'ఏ.. నాకేం తక్కువ. నేను నిన్ను మంచిగ సూస్కుంట. నాకంటే బాగ సూస్కుంటోడు నీకు యాడ దొర్కుతడు? ఈ మాట చెప్పు మీ ఇంట్ల' అన్న.

'అట్లేం లేదు. నేనే మంచిగ ముచ్చట చెప్పి ఇంట్ల ఒప్పిస్త తియ్' అంది.

అట్ల అదును సూసి తాను అడుగుదాం అనుకుంటుండంగనే.. ఒకదినం అబ్దుల్లా మల్లొచ్చిండంట, ఇద్దరు రజాకార్లను తీస్కొని. నేను, చంద్రం ఇంట్ల లేనిది సూసి.

'మీరు పాపం చేస్తుండ్రు. హిందువులు మనకు శత్రువులు. అట్లాంటిది మీ పిల్ల ఆ రామసామి గానితోని తిర్గుతుంది. భయం చెప్పుండ్రి. మల్ల మాకు తిర్గినట్టు తెల్వాలె. ఆ రామసామి ఉండడు, నీ బిడ్డ ఉండదు. ఇద్దర్ని ఖతం జేస్తం' అని భయపెట్టిండ్రంట.

'అట్ల ఏం లేదు. మా పిల్లకు మేం భయం చెప్పుకుంటం' అని నజియా వాళ్ల అబ్బాజాన్ ఆ రజాకార్లకు నచ్చజెప్పి తోలిండంట.

అయ్యాల రాతిరి ఈ ముచ్చటంత నజియా నాకు చెప్పింది. నేను ఎమ్మటే చంద్రంను పిలిచి 'ఇంగ లాభం లేదు, ఆడు నన్ను ఏస్తడా బచ్చా. నేనే ఏసేస్త ఆ అబ్దుల్లాని' అన్న.

'అయినకాడ, కానికాడ ఆవేశపడకు. మాలిక్ మేహర్బాన్ హైతో గధా బీ పహిల్వాన్ బన్‌జాతా. ఆన్ని ఎయ్యడం కాదు ముచ్చట. నువ్వు పెండ్లి చేసుకో. అప్పుడు ఎవ్వడేం పీకలేడు. నిన్ను, నజియాను' అన్నడు చంద్రం.

నేను జరసేపు సోంచాయించి 'అట్లనే కానిద్దాం. నువ్వు ఆర్యసమాజ్‌ల మాట్లాడతా అన్నవ్‌గా జల్ది కానియ్యి పని' అని చెప్పిన.

'నువ్వేం ఫికర్ కాకు, మీ పెండ్లి నా చేతుల మీదికెంచి చేస్తా, ఆర్యసమాజ్‌ల రేపే మాట్లాడతా' అని మాటిచ్చిండు చంద్రం.

ఇంగ మేం గా పనిమీదే ఉన్నం.

♦

'యాజ్జేసుకున్నవా?' అనుకుంట వొచ్చింది నజియా.

'ఊ.. యాజ్జేసుకున్న. కానీ ఏడికిపోయినవ్ నువ్వు?' అని అడిగిన.

'నేనా? అరబ్బోళ్ల ఇంటికి. ఇయ్యాల అబ్బాజాన్ ఇంటికి రానన్నడు. అందుకే తోష ఇచ్చి పంపిన. అబ్బాజాన్ దుఖ్ఖం పక్కనే అరబ్బోళ్ల దుఖ్ఖం ఉంటది' అని చెప్పింది. నజియా అబ్బాజాన్‌కు కోఠిల గడియారం దుఖ్ఖం ఉన్నది.

'ఇప్పుడు చెప్పు ఏమంటుండ్రు ఇంట్ల..' అని అడిగిన.

'నువ్వే చెప్పు ముందుగాల. శానా చెప్పాలె అన్నవ్‌గా?' అని దీర్ఘం తీసింది.

'అదీ.. నేను చెప్తగనీ.. నువ్వు చెప్పు ముందు..' అన్న.

'లేదు నువ్వే చెప్పు'

'అదీ.. మేం నిజాంను చంపబోతున్నం' అని చెప్పిన నేను గపక్కున.

'ఏందీ?' అన్నది కండ్లు పెద్దగ చేసి.

'మేము.. నిజాంను... చంపబోతున్నం..' నిమ్మలంగ ఇడదీసి చెప్పిన.

'నిజాంనా? మీరా? ఏమన్న కిర్రాకా మీకు? నిజాంను సంపుడంటే ఏందనుకుంటుండ్రు. ఉన్నతీరిగ ఉండవా నువ్వు. ఆడ మీ ఊర్ల గుడారాలు తగులబెట్టి ఈడికొచ్చినవ్. ఈడ నిజాంను సంపి ఇంకేడికి పోతవ్? దమాక్‌లేని పనులు చెయ్యకు' అని కోపానికొచ్చింది.

'దమాక్‌లేని పనేం కాదు. ఒకటికి పదిసార్లు సోంచాయించినంకనే అనుకున్నం. మేం నిజంగానే నిజాంను చంపబోతున్నం. బాంబు దాడి చేస్తున్నం' అని చెప్పిన మల్ల.

'నేను ఇంకేమో మన పెండ్లి గురించి ఏదన్న ముచ్చట చెప్తవేమో అనుకున్న.. నువ్వేమో గింతపనికి వొచ్చినవ్. వొద్దు. గియ్యన్ని వొద్దు మనకు. నువ్వు, నేను.. సాలు.. గిది

సాలు మనకు' అన్నది.

'నీ గురించి.. నా గురించి మాత్రమే చూస్కుంటే.. ఈ బతుక్కు అర్థమే ఉండదు నజియా.. పుట్టిన పుట్టుకకు ఒక ఫయిదా ఉండాలె నజియా'

నజియా సప్పుడు జెయ్యలేదు. నేను చెప్పేది తనకు నచ్చలేదు. నేను చేస్తున్న పని అంతకన్నా నచ్చలేదని ఎర్కయింది నాకు.

'ఇంట్ల కూసోని కాదు నజియా.. ఒక్కసారి బయిటికి పోయి సూడు.. హిందువుల మెడల్ని కోడి మెడలు ఇరిసినట్లు ఇరిసెయ్యాలని మాట్లాడుతుంఙ్రు. బలవంతంగా మత మార్పిడి చేస్తుంఙ్రు. ఒప్పుకోక పోతే.. ఖతమ్ చేస్తుంఙ్రు. ఆడోళ్లను ఆగం చేస్తుంఙ్రు. బరిబాతల బతుకమ్మ ఆడిస్తుంఙ్రు.. గియ్యన్ని ఇనుకుంట బతికే బతుకు.. అసలు బతుకే కాదు.. మావోళ్లు ఆళ్లని సంపాలె.. ఈళ్లని సంపాలె అని సూస్తుంఙ్రు.. నేను ఆళ్లని ఈళ్లని కాదు.. దీనికంతటికీ కారణమైన ఆ నిజాంనే ఏసేద్దాం అని చెప్పిన. ముందల అందరూ నీలెక్కనే మాట్లాడింఙ్రు.. నిజాంను సంపాలంటే మాటలు కాదు అన్నరు. కానీ ఇప్పుడు.. అందరూ ఒక్కమాట మీదికొచ్చింఙ్రు.. నిజాంను ఏసేస్తున్నం. మన దేశానికి సొతంత్రం వొచ్చింది నజియా. కానీ ఈ నిరంకుశ నిజాం మనకు ఇంకా సొతంత్రం ఇస్తలేడు. మరో ముస్లిం దేశం చేద్దామని సూస్తుండు. అదీ అన్యాళంగా, అక్రమంగా.. బలవంతంగా.. ఈ ముచ్చట ఎవల్కి అర్థం కాకపోయినా నీకు అర్థం కావాలె. మన ప్రేమ కోసం నేను ముస్లింగ మారుతా. తప్పులేదు. నాకోసం నువ్వు హిందువుగ మారుతవ్. కాదనవ్. కానీ దేశం కోసం, రాజ్యాధికార స్వార్థం కోసం అమాయకుల్ని పావుల్ని చేయడం తప్పు. పాపం. ఆడ మా ఊర్ల ఈ కండ్లతోని సూసిన. నా అమ్మల్లాంటోళ్లు.. అక్కల్లాంటోళ్లు.. ఆళ్ల మొగుళ్లని సెట్లకు కట్టేసి... ఆళ్ల ముందల ఆగం జేసింఙ్రు.. ఈ కండ్లతోని సూసిన.. తట్టుకోలేకపోయిన. తగలబెట్టిన. కాలి సచ్చింఙ్రు ఆ మంటల కొందరు, నా కొడుకులు.. మా ఒక్క ఊర్లనే ఇట్లయిందంటే.. ఈ తెలంగాణ మొత్తమ్మీద.. ఏఏ ఊర్ల ఎన్ని అయ్యి ఉండొచ్చు.. దీనికంతటికి ఊరూరికి పోయి.. ఒక్కొక్కన్ని ఏసుడు కాదు.. ఆళ్లందరి బలుపునకు.. కారణమైంది ఈ ఒక్కడు.. ఈ నిజాం.. ఈని అండ సూస్కోనే ఆ రజ్వీ ఆగం జేస్తుండు. జేయిస్తుండు.. అందుకే.. ఏసేస్తం.. ఆ నిజాంనే ఏసేస్తం.. నువ్వు.. అవునన్నా కాదన్నా...' అని పట పట పండ్లు కొరికిన.

నన్ను చూసి నజియా భయపడింది. గజ గజ వొణికింది.

'ఆ అబ్దుల్లా ఏ ధైర్యంతోని మాట్లాడిండు. మీ ఇంటికొచ్చి నన్ను, నిన్ను సంపుతానని.

ఆ రజాకార్ల అండ సూస్కొనే కదా. లేకపోతే ఆనికి అంత ధైర్యం ఏడికెంచి వొచ్చింది? ఆన్ని ఎయ్యడం నాకు పెద్ద పని కాదు.. నాకు నువ్వు, నీకు నేను.. ఇంగ మనకెవ్వరూ అక్కర్లేదు అనుకుంటె.. ఆన్ని ఏసేస్త.. కానీ.. నీలాంటోళ్లు.. నాలాంటోళ్లు.. ఈ దేశంల ఎంతో మంది ఉంద్రు.. ఈళ్ల అండ సూస్కొని చేసే బెదిరింపుల్ని భరిస్తుంద్రు. బాధ పడుతుంద్రు.. ఆ బానిస సంకెళ్లు తెంపాల్నంటే.. తప్పదు.. చావో బతుకో.. తాడో పేడో.. తేల్చుకోవాల్సిందే.. నేను సస్తే నాకు కావాల్సినోడు దేశం కోసం వీరమరణం పొందిండని గర్వంగా చెప్పుకో.. నాజియా.. నాజ్ అంటే గర్వకారణం.. నువ్వు నాకు దొర్కడం.. నేను నీకు దొర్కడం.. నాకూ భయమైతాంది.. ఏమైతదో ఏమో అని. నాకెమన్నా అయితే నువ్వు ఏమైపోతవో అని.. అందుకే నిన్ను నాజియా అని పిల్వలేకపోతున్న. మొదటికెంచి.. దీర్ఘం తీసినట్లు.. దూరం చేసినట్లు ఉందంటె అదే అర్థం..' అని చెప్తున్నపుడు నాకు ఏడుపు ఆగలే.. వొలవొలా ఏడుపు తన్నుకొచ్చింది.

నన్ను పట్టుకొని నజియా కూడా ఏడ్చింది.

'ఒక్కటి చెప్పనా నజియా! నిజాంను చంపాలనుకుంటే.. సాహసం అవుతది. కానీ సంపితే మనకు సొతంత్రం వొస్తది.. దయచేసి మమ్ముల్ని ఆపకు' అని చేతులు పట్టుకున్న.

'ఇంతమందికి మంచి జరిగే పన్జేస్తున్నరు. నేనెందుకు కాదంట. ఈ ఏక్ ఆద్మీ గురించి నువ్వు ఆగిపోకు. మనందరి సుఖూన్ కోసం ఇంతమందికి ఆజాద్ ఇవ్వాలనుకుంటున్న నీ ఆశయం కోసం ఏదైనా భరిస్తా. కొంత కాలం దూరమైనా సహిస్త..' అని ఏడ్సుకుంటనే చెప్పింది. 'చెప్తున్నా ఇను, మనకు పెండ్లి అయినా కాకున్నా.. ఈ రోజుకెంచి నువ్వు నా మొగునివి. ఈ దేశం కోసం పోరాడుతున్న గొప్పోడు నా మొగుడు.. నావొక్కదాని బాధ కోసం నువ్వు ఆగిపోకు' అన్నది కండ్లు తుడుసుకుంట.

నేను బీ కండ్లు తుడుసుకున్న. నవ్విన. ఏడుపు పోయిందని చెప్పే నవ్వే కానీ అందులో జీవం లేదు. నజియాని గట్టిగా కౌగిలించుకున్న. తను కూడా నన్ను కౌగిలించుకుంది. నుదుటి మీద ముద్దు పెట్టుకున్న.

'నువ్వు ఏదైనా చెయ్యి. కానీ జాగ్రత్తగా.. నీకోసం ఒక ప్రాణం ఎదురుసూస్తుంటదని మర్శిపోకు..' అన్నది.

'దేశాన్ని ఏలేటోన్ని సంపుతున్నం. అట్టాంటోడికి ఒక అమ్మాయిని పెండ్లి చేసుకోవడం పెద్ద పని కాదు. నేను, చంద్రం ఇప్పటికే మాట్లాడుకున్నం. రేపో ఎల్లుండో.. మీ అబ్బాజాన్‌తో మాట్లాడుతం. ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయిన. మన పెండ్లి జరిగేది,

జరిగేదే.

తర్వాత నజియా వాళ్ల దాదీని దవాఖాన కెంచి ఇంటికి తీసుకొచ్చిండ్రు. ఇంగ ఆల్లింట్ల పెండ్లి ఏర్పాట్లు చేస్తుండ్రు.

ఇంగ లాభం లేదని చంద్రం, నేను పొయ్యి నజియా వాళ్ల అబ్బాజాన్‌తో మాట్లాడినం. నేను సప్పుడు సేక కూసున్నగానీ.. చంద్రమే పెద్దరికం చేసిండు. ముందుల అబ్బాజాన్ అస్సలు ఒప్పుకోలే. కానీ. 'నజియాకు రామస్వామి అంటే ఇష్టం, ఆమె ఇష్టాన్ని కాదని ఎవరో నచ్చనోనికి ఇచ్చి పెండ్లి చేస్తే నీ బిడ్డ సుఖూన్‌గ ఎట్లుంటది?' అని నచ్చజెప్పిండు.

ఆయిన మా ముందల్నే నజియాను పిలిచి అడిగిండు. ఆమె నన్నే చేస్కుంట, ఇంకెవల్నీ చేస్కోనని చెప్పింది. ఒక్కతే బిడ్డ, ఆ బిడ్డ ఇష్టాన్ని ఎందుకు కాదనాలని అబ్బాజాన్ ఒప్పుకుండు. అయితే ఒక్కమాట, నేను మతం మార్చుకోవాల్నని అట్లయితనే పెండ్లికి ఒప్పుకుంట అన్నడు.

నజియా కంటే నాకు ఎక్కువ ఏదీ కాదు, అందుకే నేను బీ ఒప్పుకున్న. నేను అట్ల ఒప్పుకోవడం చంద్రంకు నచ్చలేదు. అందుకే ఓ పక్షం రోజుల సమయం అడిగిండు. ఆయిన ఒప్పుకుండు.

ఇంతల్నే నజియావాళ్ల దాదీ చనిపోయింది.

నెల రోజుల దాంక పెండ్లి ముచ్చట లేదు.

ఇంతల్నే ఆపరేషన్ సీతాఫల్ చేసే రోజు వొచ్చింది.

♦♦♦

# 8

# ఆపరేషన్ సీతాఫల్

డిసెంబర్ 4, 1947, బేస్తారం

విసిగి వేసారిన జీవితాలు..

దాస్య శృంఖలాలు.. బానిస సంకెళ్లను తెంపుకొని ఓ విముక్తి కోసం చూస్తున్నయి. హత్యలు, అత్యాచారాలకు, రక్తపాతానికి ఇక చరమగీతం పాడి ఎందరికో స్వేచ్ఛ సొతంత్రాలు ప్రసాదించే రోజు..

ఎప్పటినుంచో ఎదురు సూస్తున్న ఆ పవిత్రదినం.. రానే వొచ్చింది.

మేం ఐదుగురం సిద్ధంగా ఉన్నం.

మా ఇంట్ల అయ్యాల రాతిరి అందరం కల్సుకున్నం. రేపు పొద్దుగాల చేయబోతున్న మహాకార్యం గురించి ఒకటికి రెండుసార్లు మాట్లాడుకున్నం. ఎవర్కీ నిద్రబట్టలే. అందరి కండ్లూ ఎరుపెక్కి ఉన్నయ్. ఆ ఎరుపు ఆ ఒక్క రాతిరి నిద్ర లేకపోవడం వల్ల వొచ్చింది మాత్రమే కాదు, ఇన్నాళ్లుగా లోపల్లోల ఉన్న కసి తీర్చుకునేందుకు పొడుచుకొచ్చిన

పొద్దు అది.

ఆ రాత్రి గంగారం తన అర్రల దాచి పెట్టి ఉన్న సీతాఫల్ డబ్బాలు తీస్కొని మా ఇంటికొచ్చిండు.

ఒక డబ్బాల కెంచి మూడు బాంబులు తీసిండు బాబు. ఒకటి తన దగ్గర ఉంచుకుండు. ఇంకోటి రణధీర్‌కు, మూడోది గంగారంకు ఇచ్చిండు.

ఇంకో డబ్బాలకెంచి మూడు పిస్తోళ్లు తీసిండు బాబు. బాంబులు పేలడంలో తేడా వొస్తే ఎంటనే పిస్తోలు తీసి పేల్చాలి. ఇది బాబు మార్చిన మరో ఉపాయం. అప్పటికీ కాకపోతే, పోలీసులకు దొర్కితే, ఆళ్ల చేతిలో చిత్రహింసలు అనుభవించే కంటే విషం తాగి సావాలె. అందుకోసం మూడు విషం సీసాలు బీ సిద్ధం చేసిండు బాబు. ఆ ముగ్గురూ తలా ఒక బాంబు, ఒక పిస్తోలు, చిన్న విషం సీసా తీసుకుండ్రు.

ముందుగాల నుంచి అనుకున్న ఉపాయంల ఇట్టాంటి మార్పులు శానా చేసిండు బాబు, ఆని బాబు సల్లగుండ. అంతా ఆయిన ఉపాయం ప్రకారమే కానిస్తుండు. ఆయనే సడక్ మూల మీద ముందుగాల బాంబు ఏస్తందుకు ఉంటడు. సరిగ్గ చెప్పాల్నంటే నిజాం రాజప్రసాదం దగ్గర్ల ఉండే ఆల్ సెయింట్స్ స్కూల్ దగ్గర మూల మీద బాబు వుంటడు. అటెన్క కింగ్ కోఠీ చౌరస్తాల రణధీర్ నిలవడతడు. తాజ్‌మహల్ హోటల్ ఎదురుంగ ఉన్న గ్రామర్ స్కూల్ ముందల గంగారం నిలవడాలి.

నేను కిరాయి సైకల్ తీస్కుని బాబుని ఎక్కించుకుని ఆల్ సెయింట్స్ స్కూల్ కాడికి తీస్కపోవాలె. బాబు మూల మీద నిలవడ్డప్పుడు నేను పక్కనే ఉండి సూస్కోవాలె. అన్నింటికంటే మరో ముఖ్యమైనది ఏందంటే బాబు బాంబు ఎయ్యడం కంటే ముందు కారు ఆగుతందుకు, కారు డ్రైవర్‌ను కంగారు పెడతందుకు చిన్న తోక పటాకు నేను పేల్చాలె. ఏదో పేలిందని కారు ఆగినా, జర్రంత వేగం తగ్గినా ఎంటనే బాబు బాంబు ఏస్తందుకు మంచిగుంటదనేది మరో ఉపాయం. నేను బీ ఈ ఆపరేషన్‌ల ఏదో చెయ్యాల్నని రణధీర్ పోరాడంగ పోరాడంగ నాకు ఈ తోక పటాకు పేల్చే అవకాశం ఇచ్చిండు బాబు. మహానుభావుడు.

అంతకుముందే అనుకున్నట్లు ముగ్గురు మంచిగ షేర్వానీలు, రూమీ టోపీలు కొనుక్కొచ్చుకుండ్రు. ఆడ నిలవడి అటూ ఇటూ తిర్గుతున్నప్పుడు ఎవల్కీ అనుమానం రాకుండ ఉండేందుకు ఈ ఏర్పాటు.

ఇప్పుడు ఈడికెంచి అందరూ కల్సి పోయి ఎవ్వరు ఏడుండాల్నో.. ఎట్ల చేయాల్నో ఒకసారి ముందుగాల్నే ఆజుబాజులన్నీ సూస్కుని రావాలె. వొచ్చినంక.. మల్ల

తయారయ్యి.. రాజప్రసాదం నుంచి నిజాం బయిటికి వొచ్చే యాలకంటే గంట ముందల మల్ల పోవాలె. దీనికంటే ముందు చేయాల్సిన పనులు ఇంక శానా ఉన్నయ్.

అసలు ఇదంతా ఎందుకు చేస్తున్నమో, చేసినమో ఈ దేశానికి తెల్వాలెగదా.. అందుకే బాబు షోలాపూర్ కెంచి వొస్తప్పుడే పెద్దొళ్లతోని మాట్లాడి ఒక ప్రతిజ్ఞ పత్రం రాసుకొచ్చిండు. దాని రెండు నఖలు కూడా తీస్కొచ్చిండు.

అందులో ఏం రాసి ఉందో మా అందర్కీ చదివి ఇనిపిచ్చిండు బాబు.. నిజాం భారత దేశానికి పెద్ద శత్రువని, ఇయ్యాల్టి నుంచే కాదు టిప్పుసుల్తాన్‌ను ఓడించి, చంపేందుకు అయ్యాల్టి నుంచే అంగ్రేజ్ వోళ్లతోని దోస్తానా చేస్తుందని.. 1857ల జరిగిన మొదటి సిపాయి తిరుగుబాటును అణచివేస్తందుకు కూడా ఆ అంగ్రేజ్ వోళ్లతోని మిలాఖాత్ అయ్యిండని మొదల్ బెట్టి.. ఇప్పుడు ఇండియాకు సొతంత్రం వొచ్చినా, తాను సొతంత్రంగా వుంటానని ప్రగల్భాలు పలుకుతూ.. హిందుస్తాన్ నుంచి విడిపోయిన పాకిస్తాన్ మాదిరి హైద్రబాద్‌ను బీ తయారు చేసి ఈడ మరో సొతంత్ర పాకిస్తాన్ చెయ్యాలనుకుంటుండని.. అందుకోసం చేసిన, చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు.. అన్నీ రాసింద్రు అందులో.

అందుకే నిజాంను చంపుతున్నామని.. ఆ ప్రతిజ్ఞ సారాంశం. అది సదివి ఇనిపించినంక బాబు, రణధీర్, గంగారం ముగ్గురు నెత్తుటితోని దాని మీద సంతకాలు చేసింద్రు.

ఈ పత్రాన్ని, ముగ్గురు కలిసి ఇప్పుడు దిగే ఫొటోని బీ కల్పి పత్రికలకు, రేడియోలకు విడుదల చెయ్యాలని చెప్పిండు బాబు. ఈ పని దేవ చెయ్యాలని.. ఈ బాంబు ముచ్చట కాంగనే దేవ బెజవాడ పోయి అక్కడికెంచి ఈ పని చెయ్యాలని చెప్పిండు.

సంతకాలు పెట్టినంక ఆ పత్రాలు దేవ చేతిల బెట్టింద్రు.

ఇంగ శ్రీకృష్ణ సైకల్ ట్యాక్సీ సత్యనారాయణ కాడ మూడు సైకల్లు కిరాయికి తీస్కున్నం. నా సైకల్ నంబర్ ఎస్‌కే 10. ఐదుగురం ఆ సైకల్లు ఏస్కొని పోయి ఆల్ సెయింట్స్ స్కూల్ నుంచి తాజ్ మహల్ హొటల్ దాంక కలియ తిరిగినం. ఎవరు ఏడ ఉండాల్నో బాబు సైగలతోనే చెప్పిండు. అది అయినంక సుల్తాన్ బజార్ల ఉండే ఆర్యసమాజ్ మందిర్లకు పోయి కాసేపు కూసున్నం. ఆడ సాయబాన్ల సుద్ద ముక్క తోని గీసుకుంట మల్ల చెప్పిండు ఉపాయం బాబు. తేడా రావొద్దని, ఎవరి పనిల ఆల్లు పైలంగా ఉండాలని ఒకటికి రెండుసార్లు చెప్పిండు.

ఆ ఆర్యసమాజ్‌ల కెంచి ఎల్లినంక సక్కగ మా ఇంటికి పోయినం. ఆ ముగ్గురు మంచిగ షేర్వానీలు ఏస్కొని అచ్చం సాహెబుల లెక్క తయారైంద్రు. షేర్వానీ జేబులల్ల ఒక పక్క పిన్ బాంబు, ఇంకో పక్క పిస్తోలు పెట్టుకుంద్రు. విషం సీసాలు గూడా ఆ

జేబుల్నే ఇరికిచ్చుకుండ్రు. అందరి జేబులు ఉబ్బుబ్బుగ కనిపిస్తున్నయ్. ఎవరన్న సూస్తే 'ఏమున్నయ్ అండ్ల' అని అనుమానిస్తట్టే ఉన్నయి. ఇంగ నేను నా అంగి జేబుల నాలుగు తోక పటాకులు, ఒక అగ్గి పెట్టె పెట్టుకున్న.

ఇంగ ఈడికెంచి పోతందుకు తయ్యారైనం.

పొయ్యేముందల కలుస్తా అని నేను నజియాకు మాటిచ్చిన. ఇయ్యాల మేం నిజాం మీద బాంబు దాడి చేస్తున్నమని ఆమెకు మొన్ననే చెప్పిన. అప్పటికెంచి ఏమైతదో, ఎట్లయితదో అని మాకంటె ఎక్కువ ఆమే పరేషాన్ అయితాంది.

పొయ్యే ముందల చెప్పు అని ఒకటికి పదిసార్లు చెప్పింది. రాతిరి కెంచి, పొద్దుగాల్నుంచి మా గలమకల్లే సూస్తున్నది. ఆడికీడికి తిర్గుతాంది. ఆగమాగమైతాంది.

ఇందాక పోతప్పుడు గలమల నిల్వడి సూసింది. 'నేను మల్లొస్త' అని సైగ చేసిన.

ఇప్పుడు ఇంగ బాంబు ఏస్తందుకు పోతున్నం. ఎట్లయితదో ఏమైతదోగని ఒకసారి నజియాను చూసి, మాట ముచ్చట చెప్పి పోవాలె.

అందరూ బయిటికి ఎల్లిండ్రు. 'నేను ఇప్పుడే లోపల్కి పోయొస్త' అని బాబుని అడిగిన.

'పొద్దుపోతాంది. మల్ల లోపల్కి ఎందుకు?' అన్నడు బాబు.

ఒంటికి అన్నట్టు నేను చిటికెన ఏలు సూపిచ్చిన బాబుకు.

'ఎర్కయిందిగనీ ఎల్లెం రా' అన్నడు దేవ.

నేను లోపల్కి పోతార్కె నజియా బయిటనే ఉన్నది. నేను కనిపియ్యంగనే దగ్గరికి ఉర్కొచ్చింది.

'పోతుండ్రా, భయమైతాంది' అన్నది వొణుక్కుంట.

'నువ్వు భయపడకు. నువ్వు భయపడ్తె నాకు బీ భయమైతది' అన్న.

ఏడుస్తుంది. కండ్లెంబటి వొల వొల నీళ్లు కారుతున్నయి.

ఆళ్ల గలమట్లకెంచి ఆళ్ల అమ్మీ సూస్తుంది. అయినా నేను కండ్లెంబటి నీళ్లు తుడిచిన.

'నజియా! ఏం కాదు. జర ఏడ్వకు. నీ కండ్లల్ల నీళ్లు సూస్తే నా పానం పోతాంది. పోవాల్సిన పానం నాది కాదు. ఆ నిజాంది' అన్న.

'సరే ఏం ఏడ్వను కానీ.. ' అని ఏదో చెప్పబోతోంది.

'ఇంకేం చెప్పకు. నేనొస్తా. క్షేమంగా వొస్తా. నమ్ము' అన్న ఆమె చేతిల చెయ్యేసి ధైర్యం చెప్తూ.

'సరే.. ఒక్క నిమిషం ఉండు' అన్నది కండ్లు తుడుసుకుంటూ లోపల్కి పోయింది.

ఏదో తీస్కొని వొచ్చి 'నీ చెయ్యి ఇటివ్వు' అన్నది. నేను కుడి చెయ్యి ఇస్తే.. 'ఈ చెయ్యి కాదు.. ఆ చెయ్యి' అన్నది.

చేతి గడియారం.. మంచిగుంది..

నా చెయ్యికి పెడుతూ 'ఇది నీ వొంటి మీద ఉండాలె. దీన్ని సూసినప్పుడల్ల నేను యాదికి రావాలె'.

'నిన్నెట్ల మర్చిపోతా నజియా' అన్న. 'వెళ్లనా మరి?' అని అడిగిన గడియారం సూస్కుంట.

'సరే.. జాగ్రత్త..' అన్నది కండ్లల్లకు సూస్కుంట.

'లోపల్కి పో' అని సైగ చేసిన. ఎనక్కి తిరిగి సూడకుంట బయిటికి వొచ్చిన. ఆమెను చూస్తే నేను ముందడుగు ఎయ్యలేను.

♦

ఐదుగురం కల్సి ఇంగ కోఠిలోని దయాల్ ఫొటో స్టూడియోలకు పోయినం. ఈళ్లు ముగ్గురు ఫొటువా దిగినంక.. దేవ ఆడనే కుసొని ఫొటువా కడిగిచ్చుకుని అటుకెంచి అటే బెజవాడ పోవాలె. అదీ ముచ్చట.

మిగిలిన నలుగురం.. నేను, బాబు ఒక సైకల్ మీద, రణధీర్, గంగారం ఇంకో సైకల్ మీద కింగ్ కోఠీకి బయలుదేరినం.

ఎవ్వరు ఉండే సోటు కాడికి ఆళ్లు నిమ్మలంగ సేరుకుంద్రు. నేను బాబును ఆల్ సెయింట్స్ స్కూల్ మూల మీద దింపినంక.. సైకల్ గోడకు ఆనించి అటు పక్క నిల్వడ్డ. గోడకు ఆనిస్తప్పుడు ఒక పోలీసోడు నన్ను సూసిండు. ఆ మూల మీద ఒక ట్రాఫిక్ పోలీసు, ఒక కానిస్టేబుల్ నిలవడి ఉన్నరు. కింగ్ కోఠీ చౌరస్తాల మరో ఇద్దరు వున్నరు. నిజాం బయిటికి వొచ్చే యాల అయితాంది కాబట్టి అప్రమత్తంగా ఉన్నరు. హడావిడి చేస్తుంద్రు రోజులెక్కన్నే.

నేను సైకల్ అటు పక్క పెట్టి సడక్‌కు ఇటు పక్క వొచ్చి నిలవడ్డ. బాబు అటు పక్కే ఉన్నడు. అంటే కారు వొస్తప్పుడు నేను ముందల ఉంట తర్వాత బాబు ఉంటడన్నట్టు. నేను ఇటు కల్ల వొచ్చినప్పుడు పోలీసోడు అటు పక్క సైకల్ కాడికి పోయిండు. దాని మీద రాసి ఉన్న ట్యాక్సీ పేరు నంబరు సూసినట్టున్నది.

ప్రతి దినాం నిజాం నాలుగు, నాలుగున్నర గంటలకు కింగ్ కోఠీల కెంచి ఎల్లి దారుల్‌షిఫాలో ఉన్న తన తల్లిని కలిసేటందుకు పోతుంటడు. కింగ్ కోఠీలోని రాజప్రసాదం నుంచి బయలుదేరి ఆల్ సెయింట్స్ స్కూల్ మూల మీదికెంచి కింగ్ కోఠీ చౌరస్తా దాటి తాజ్‌మహల్ హెూటల్ ముందలంగ ఆబిడ్స్‌కు చేరుకుని అటుకెంచి మొహింజాహీ మార్కెట్ మీదుగా దారుల్‌షిఫా పోతడు. ఇది రోజూ జరిగేదే.

నిజాం రాజప్రసాదం నుంచి బయిటికి వొస్తప్పుడు సైరన్ మోగుతది. పోలీసులు విజిల్స్ కొడతరు. అప్పుడు సడక్ మీద ఎవ్వరూ ఉండకూడదు. నడుస్తున్న జనాలు పక్కకు తప్పుకోవాలె. సైకళ్లు, మోటార్ సైకళ్లు, ఎడ్ల బండ్లు, టాంగాలు.. ఇట్టాంటియి గట్ల వుంటే.. పక్కకన్నా జరగాలే.. లేకుంటే సందులకన్నా పోవాలె.

నజియా ఇచ్చిన చేతి గడియారంల టైం సూస్కున్న.

4 గంటల 15 నిమిషాలు అవుతోంది.

నిజాం సవారి బయలుదేరే సంరభం మొదల్ కావొస్తోంది. ఆ సవ్వారి.. ఇయ్యాల మా యావ్వారంతోని ఎట్లుంటదో సూడాలె..!?

బాబు మొహం సూస్తే ఉపర్ షేర్వానీ అందర్ పరేషానీ అన్నట్లు ఉన్నది. ఆడ రణధీర్, గంగారం ముచ్చట ఎట్లున్నదో?

పైకి బానే ఉన్నగనీ.. లోపల నా ముచ్చట గూడా గట్లనే ఉన్నది. ఈ బాబుగాడు బాంబు ఏస్తడో, బర్బాత్ చేస్తడో, తేడా వొస్తే జీవితాలు మాడి మసైపోతయి. నా నజియా ఏమైపోతదో? ఎట్లయితదో?? గుండెలో గుబుల్ అయితాంది. ఆగమాగం ఉన్నది. అయినా కండ్లు పెద్దగ జేసే సూస్తున్న. పండ్లు కొరకబట్టి, పిడికిళ్లు బిగబట్టే ఉన్న. పోనియ్.. పోతే పోనియ్. నాదో పానం. బాబుదో పానం. కానీ ఆ నిజాం పోతే.. ఎంతో మంది పానాలు మిగుల్తయ్. మానాలు నిలబడ్తయ్. సాలు.. ఇంతమంది హాయిగ ఊపిరి పీల్చుకుని బతికితె సాలు.

ఒక్కసారిగా విజిలు..

సమయం చూస్తే 4.30 గంటలు..

మారు మోగుతున్నయ్ విజిల్లు. సడక్ మీద సందడి సందడి అంతా మెల్లగా మాయమైతోంది. ఎక్కడోళ్లు అక్కడ పక్కకు జరుగుతుండ్రు. సడక్ అంతా ఖాళీ అయ్యింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. నిర్మలమైపోయింది.

నిజాం సవ్వారీ బయలుదేరింది. దూరంగా కారు సప్పుడు ఇనిపిస్తున్నది. బాబు నాకెల్లి సూసిండు. ఆయిన గల్లీ మలుపు వద్ద కానిస్టేబుల్ వెనకాల నిలబడి ఉన్నడు.

నేను అంగి జేబుల కెంచి తోక పటాకు తీసిన. అగ్గి పెట్టె తీసుకుంట అటు మొహాన సూసిన. అదిగో నిజాం.. ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న నిరంకుశుడు కార్ల ఎనక సీట్ల కూసోని ఉన్నడు.

చెయ్యొద్దు ఆలస్యం. ఎయ్యాలె పటాకు.

నేను పటాకు అంటిస్తనే ఉన్న. బాబు బాంబు తీసి కానిస్టేబుల్ మీదికెంచి కారుకల్ల ఇసరనే ఇసిరిండు.

తొందరవడ్డదేంది? అప్పుడే ఏసిండేంది?– అనుకుంటనే పటాకు ఆర్పిన.

బాంబు సపక్కున ఉరికి కార్‌కు తగిలింది. కిటికీలకెంచి ఎనక సీట్ల పడకుంట కింటికి అంచుకు తగిలి కింద పడ్డది. సరిగ్గా ఎనక పయ్యకింద పడ్డది. పయ్య దాని మీదికి ఎక్కనే ఎక్కింది. ధామ్ అని పేలింది. పెద్ద శబ్దం వొచ్చింది. రెండు మూడు బాంబు ముక్కలు వొచ్చి సైకల్‌కు తాకినయ్. దాన్ని ఆనించిన గోడకు పగుళ్లు వొచ్చినయ్. సూస్తుండంగనే దట్టమైన పొగ కమ్ముకుంది. అంతా భయానకం.. బీభత్సం. జనాలంతా అటూ ఇటూ ఉర్కుల బెడ్తుండ్రు. కారు దగ్గర్ల ఉన్నోళ్లు దూరంగా ఉరుకుతుండ్రు. దూరం ఉన్నోళ్లు ఈడ ఏదో అయ్యిందని దగ్గరికి ఉర్కొస్తుండ్రు.

ఏం జరుగుతుందో ఎర్కయితలేదు.

అంతా క్షణాలల్ల జరిగిపోయింది.

ఆ పొగలకెంచి తేరుకుని కారు డ్రైవర్ సర్రున కారును ఎనక్కి తిప్పుతుండు. బాబు జేబుల కెంచి పిస్తోలు తీయబోయిండు కాలుస్తందుకు. ఇంతల్నే ముందలున్న కానిస్టేబుల్ ఎనక్కి తిరిగిండు. ఆని చేతికి బాంబు ముక్క తాకి గాయమైంది. రక్తం కారుతాంది. అయినా సర్రున ఎనక్కి తిరిగి బాబును పట్టుకుండు. పిస్తోలు గుంజుకుండు. నేను కారుకల్ల, బాబు కల్ల సూస్కుంట సడక్ దాటి సైకల్‌కల్ల పోతున్న.

'పకడో ఉస్కో.. పకడో.. పకడో' అని బాబును పట్టుకున్న పోలీసోడు నాకల్ల

సూపిచ్చుకుంట అర్సిండు. దూరంగ ఉన్న ఇంకో పోలీసోడు నాకల్ల ఉర్కి రావడం మొదల్‌బెట్టిండు. కారు ఎనక్కి తిరిగి పక్కనే ఉన్న ఒక ఇంట్లకు పోయింది. నేను వు[రటిగ ఉర్కొచ్చి సైకల్ తీసిన. నా కాడికి ఉర్కొస్తున్న పోలీసోడు సూసి ఆని చేతుల బల్లెం నాకల్ల ఇసిరేసిండు. అది స[రున వొచ్చి నా సైకల్ ఎనక పయ్యల ఇరుక్కుంది. లపక్కున కింద పడ్డది సైకల్. నేను ఎగిరి ఆడబడ్డ. మల్ల లేసి సైకల్ కాడికి వుర్కొస్తప్పుడు బాబుకల్ల, పోలీసోని కల్ల సూసిన. బాబును వొంగబెట్టి పోలీసోడు గప్ప గప్ప గుద్దుతుండు. ఇంకో ఇద్దరు ముగ్గురు బీ బాబును పట్టుకుం[డు. ఈ పోలీసోడేమో నన్ను పట్టుకుంటందుకు ఉర్కొస్తనే ఉండు. నేను దబ్బ దబ్బ సైకల్ పయ్యల ఇర్కిన బల్లెం తీసి ఆనికల్ల ఇసిరిన. బల్లెం ఆనికి అడ్డంగా తగిలింది. ఆడు కిందవడ్డడు. ఆడు లేస్తారికే నేను సైకల్ మలుపుకోని కింగ్ కోఠీ చౌరస్తాలకల్ల పోయిన. రణధీర్ చౌరస్తాల పరేషాన్ పరేషాన్‌గ అటీటు సూస్తుండు. నేను సైకల్ మీద పోవుకుంటనే 'సీతాఫల్ మురిగిపోయింది నడువ్ నడువ్' అన్న. నేను అయిన్ని దాటి పోతుండంగనే ఎనకంగ ఊర్కొచ్చిండు. నేను సైకల్ తొక్కుకుంటనే ఎడమ చెయ్యి హ్యాండిల్ మీంచి తీసిన. రణధీర్ ఉర్కొచ్చి ఉర్కొచ్చి ఎగిరి కడ్డీ మీద కుసుండు.

'ప్చ్.. మురిగిందా?' అన్నడు పైడల్ మీద నా కాలు జరంత జరిపి, ఆయన కాలు ఇరికిచ్చి గట్టిగ తొక్కుకుంట.

'మురిగింది. బాబుగాడు పెంట పెంట చేసిండు' అన్న. సైకల్ ఉ[రటిగ ఉర్కుతాంది.

'మరి బాబేడి? దొర్కిండా?' అడిగిండు.

'దొర్కిండు.. గిరఫ్తార్ చేసిం[డు.. ఇయ్యరమయ్యర కొడుతుం[డు. అయిపోయినమ్ మనం' అన్న.

ఇంతల్నే తాజ్‌మహల్ హొటల్ కాడికి వొచ్చినం. [గామర్ స్కూల్‌కాడ గంగారం గందరగోళంగా నిలబడి ఉన్నడు. మేం పోవుకుంట పోవుకుంటనే సైగ చేసినం. గంగారం చిన్నగ [గామర్ స్కూల్ సందులకు ఉర్కిండు.

'నిజాం కాలేజ్ గేటు కాడికి పోనియి' అన్నడు రణధీర్.

'ఆడికెందుకు?' అన్న.

'మా సైకల్ ఆడనే ఉంది. గంగారం గన్‌ఫౌం[డీ గల్లిలంగ పడి నిజాం కాలేజ్‌లకు దూకి గేటుకాడికి వొస్తడు' అన్నడు.

మేం సైకల్ ఉ[రటిగ తొక్కుతనే ఉన్నం. నిజాం కాలేజ్ గేటు కాడికి పోయి నిలబడ్డం.

'ఆడు సెడదెంగిండు. సంకనాకిపిచ్చిండు. ఆడు దొర్కిండు. ఇప్పుడు మన పేర్లుబీ సెప్తడు. ఆడు చెప్పినా చెప్పకపోయినా. ఆ పోలీసోడు గోడకు ఆనిచ్చినప్పుడు ఈ సైకల్ సూసిండు. సైకల్ ట్యాక్సీ కాడికి పోయి అడిగితే మన పేర్లు సెప్తరు. ఇంగ అయిపోయినమ్ మనం. ఆగమైపోయినమ్. ఇంగెట్ల. ఇంగేం చేద్దాం.. ఈడ ఎక్కువసేపు ఉండొద్దు' అని చెప్తున్న నేను.

గంగారం ఇంకా వొస్తలేదేందని మైదానంలకు సూస్తున్నమ్. దూరంకెంచి గంగారం కన్పిస్తుండు. ఉర్రటిగ ఉర్కొస్తుండు.

దరిద్రం పాడుగాను.

గంగారం ఎనకంగ పోలీసోళ్లు ఎంట పడుతున్నరు. మనోడు ఆగమాగం ఉర్కొస్తుండు. పడుకుంట లేసుకుంట పరుగు తీస్తుండు.

'అరెరె.. పాడుగాను. గంగారం గూడా గిరఫ్తార్ అయితట్లుంది? ఏంజేద్దాం' అన్నడు రణధీర్.

'ఔగా. ఈ దినం మనల్ని పగబట్టినట్లుంది. ఎట్ల మల్ల. ఏం జేద్దాం' అన్న నేను. వణుకుడు పుడతాంది. అరచేతుల్ల సెమట పడుతాంది.

'సైకల్ మీద ఉర్కి అందుకొద్దామా?' అన్నడు రణధీర్.

'అందుతడంటవా? మనం గూడా ఆగమైతమా?' అన్న నేను.

'అయితె అయ్యింది. ఆన్ని సూస్కుంట ఊకుందామా? అట్నే వొదిలేద్దామా?' రణధీర్ వొణుక్కుంటనే, చేతులు అంగికి తుడుసుకుంట అన్నడు.

'అయితె అయింది. నువ్వీడ ఉండు. నేను బోత. ఆ సైకల్ తీస్కుని ఉండు నువ్వు. నేను పొయ్యొస్త' అన్న నేను.

'నేనే పోత ఉండు' అన్నడు రణధీర్.

'నువ్వొద్దు. నీ జేబుల బాంబు, పిస్తోలు ఉన్నయ్. నువ్వొద్దు. నేనే పోత' అన్న.

చిన్నగ సైకల్ తీసి ఉర్రటిగ తొక్కుతున్న. అంత దూరం ఉండు గంగారం. ఆయిన ఎనకంగ పోలీసోళ్లు ముగ్గురు ఉర్కొస్తుండ్రు. నేను అటు కల్లే పోతున్న. దొర్కితే దొర్కిన. ఏం జేద్దాం. ఇయ్యాలతోని అయిపోయింది బతుకు. బర్బాద్ చేస్తివి గదరా బాబు. పాపం బాబును ఏం చేస్తుండ్రో.. ఎంత కొడుతుండ్రో ఏమో.. అని లోపల్లోపల

అనుకుంటనే తొక్కుతున్న సైకల్. ఆళ్లు దగ్గరికి వొస్తుండ్రు. నేను ఇంకా దగ్గరికి పోతున్న. శానా దగ్గరికి వొచ్చిన. పోలీసులు ఎనకంగ ఇంకా దగ్గర్కివొచ్చిండ్రు.

నేను పోవుకుంట పోవుకుంటనే సైకల్ అర్ధ చంద్రాకారంల తిప్పుకుంట.. 'జై భజరంగ బలీ.. ఎక్కు గంగారం..' అన్న.

గంగారం ఎక్కబోయి కింద వడ్డడు. నేన సైకల్ తొక్కుతనే ఉన్న. పోలీసోళ్లు వొస్తనే ఉన్నరు. 'పకడో పకడో' అని అరుస్తనే ఉన్నరు పోలీసోళ్లు.

గంగారం లేసుకుంట లేసుకుంటనే ఉర్కొస్తుండు. వొంగి వొంగి పరుగు తీస్తనే వున్నడు. నేను సైకల్ జరంత ఉర్రటి తగ్గిచ్చిన. గంగారం ఎనకంగ సైకల్ క్యారల్ పట్టుకుండు.

ఉర్కొచ్చుక్కుంట ఉర్కొచ్చుకుంటనే ఎగిరి క్యారల్ మీద కూసుండు.

హమ్మయ్య అని నేను ఊపిరి పీల్చుకుంటున్న.. అంతల్నే కిందవడ్డడు.

ఏమైందని ఎనక్కి తిరిగి సూస్తారికే.. పోలీసోడు అంగి పట్టి గుంజుతుండు. సైకల్ ఎక్కి కూసున్నప్పుడు ఆని చేతికి కాలర్ దొర్కినట్టుంది.

ఇంగ నేనేం చెయ్యాలె.. నేను ఆగితే నన్ను బీ పట్టుకుంటరు. ఎనక్కి సూస్కుంటనే తొక్కుతున్న సైకల్. ఇద్దరు పోలీసులు కల్సి గంగారంను గట్టిగ పట్టుకుండ్రు.

ఆ మూడో పోలీసోడు నాకల్లనే ఉర్కొస్తుండ్రు. నేను దొర్కకుండ తొక్కుతుంటిని. సూసిండు.. సూసిండు.. ఉర్కొచ్చిండు.. ఉర్కొచ్చిండు.. ఇంగ నేను దొర్కుతట్టు లేదని.. చేతుల లాఠీ తీస్కొని ఇసిరేసిండు. అది గాల్ల జప్ప జప్ప తిరుక్కుంట వొచ్చి నా ఈపిల ఫట్‌మని తాకింది. సుర్రు మన్నది. సైకల్ పయ్యల పడితే ఆగమైతుంటిని, ఈపికి తాకింది కావట్టి బతికిపోయిన. ఇంగ లేసి లేసి తొక్కిన సైకల్. దెబ్బకు గేటుకాడికి వొచ్చిన. ఎనక్కి సూస్తే పోలీసోడు ఆడనే ఆగి ఉండు. ముందుల్కి సూస్తే రణధీర్ లేడు. ఏమైపోయిండో ఏమో! సూస్తందుకు లేదు. ఎతుకుదామంటే ఈళ్లు ఎంటబడ్తట్టుంది. వొస్తడులే.. ఆయినే వొస్తడు. ఎటుపోయిండో.. అని ఆలోచన చేస్కుంటనే బషీర్‌బాగ్ కల్ల సైకల్ మల్పిన. నాంపల్లి స్టేషన్ రోడ్ కెంచి మొహింజాహి మార్కెట్‌కు వొచ్చి గౌలిగూడలవడ్డ.

♦♦♦

# 9

# చలో బొంబై

**గౌలీగూడకు** వొచ్చినంక పానం జరంత నిమ్మలవడ్డది.

రణధీర్ ఎటుపోయిండో ఏమో. బాబుని, గంగారంని ఏం చేస్తుండ్రో ఏమో. నజియా నాకోసం ఎదురు సూస్తుండొచ్చు అని సోంచాయించుకుంట దబ్బ దబ్బ సైకల్ తొక్కిన.

జర్ర సేపట్లనే ఇంట్లవడ్డ. నేను పోతార్కెనే నజియా గలమట్ల కూసోని ఎదురు చూస్తాంది. నన్ను సూడంగనే లేసి ఉర్రటిగ ఉర్కొచ్చింది దగ్గరికి.

'ఏమైంది?' అన్నది.

నేను సైకల్ స్టాండ్ ఏస్కుంట 'మొత్తం ఆగమాగమైంది' అన్న.

'నీకేం కాలేగా?' అడిగింది.

'ఏం కాలే.. కానీ..' అని బాబు, గంగారం గురించి చెప్పబోతుండంగనే..

'బాబీ బాబీ' అనుకుంట ఉర్కొచ్చిండు పక్కింటి అరబ్బోళ్ల పిల్లగాడు. 'బాబీ! ఆడదాంక

పోయివొచ్చిన. ఆడ పరేషాన్ పరేషాన్ అయితాంది. అంతా గడ్‌బడ్ గడ్‌బడ్ వుంది. నిజాం మీద ఎవరో బాంబు ఏసింద్రంట!' అని చెప్పిండు.

నేను ఎంతసేపటికీ రాకపొయ్యేసరికి, అక్కడ ఏమైతాందో పోయి చూసిరమ్మని మోహింజాహీ మార్కెట్‌దాంక ఆ అరబ్బోళ్ల పిల్లగాడ్ని తోలిందంట నజియా.

ఆడొచ్చి నా కండ్లల్లకు సూస్కుంట 'ఆ బాంబు నువ్వే ఏసినవా ఏందన్నా?!' అని అడిగిండు. ఆడు నన్ను అన్నా అని, నజియాను బాబీ అని పిలుస్తుంటడు.

'ఈనేం ఎయ్యలేదుగానీ సప్పుడ్జేకు' ఆ పిలగాన్ని నోరు మూస్కొమ్మన్నది. ఆడు నజియా మాట మంచిగ ఇంటడు.

'నాకెర్కే.. ఖాత్నా చేసే వాళ్ల కండ్లళ్ల ఎరుపు ఉంటదట. అది నీ కండ్లళ్ల కనిపిస్తాంది. నువ్వే చేసినవ్. నాకెర్కే' అన్నడాడు మల్ల.

'ఈనేగనీ ఎవ్వర్కి చెప్పకు' అన్నది నజియా.

నేను అర్ర తాళం తెరిచి గలమట్ల కూసున్న. యమ ఆయాసం అయితాంది. గప్ప గప్ప ఊపిరి పీలుస్తున్న.

'నువ్వు లోపల్కి పోయి జరిన్ని మంచినీళ్లు తేపో' అని ఆ పిలగాన్ని తోలింది నజియా.

ఆడు పోంగనే 'ఏమైందసలు.. మిగిల్లోళ్లు ఏరి?' అని అడిగింది నా పక్కన కూసుంట.

'మొత్తం బర్బాద్ అయింది నజియా! బాబు, గంగారం.. ' అని చెప్తుండంగానే ఆ పిలగాడు మంచినీళ్లు తీస్కొని వొచ్చిండు. నేను చెంబు తీస్కొని గట్టగట్ట తాగిన. పొరబోయింది. 'నిమ్మలంగ తాగు' అనుకుంట నజియా నా నెత్తి మీద కొట్టింది. నేను ఇంకిన్ని తెమ్మని ఆ పిలగానికి చెంబు ఇచ్చుకుంట సైగ జేసిన.

'బాబు, గంగారం గిరఫ్తార్ అయింద్రు. బాబు గాడు మొత్తం చెడదొబ్బిండు.. పోలీసులు పట్టుకుని ఆళ్లని యమకొట్టుడు కొడుతుంద్రు..'

'అయ్యో! అట్లయిందా? మరి రణధీర్ ఏమైండు..?' అని అడిగింది.

'చెప్తా ఉండు' అని చెయ్యి చూపిన, ఆ పిలగాడు తెచ్చిన మల్లిన్ని మంచినీళ్లు తాగుకుంట.

చెంబు పక్కన పెట్టి 'నేను ఈడ ఎక్కువ సేపు ఉండొద్దు. పోలీసుళ్లు నా కోసం గూడ వొస్తరు. కింగ్ కోఠి సడక్‌ల గోడకు సైకల్ ఆనిచ్చినగద అప్పుడు పోలీసోడు సూసిండు. బాబు ఎందుకు తొందరపడ్డడో ఏమో.. నేను తోక పటాకు పేల్చక ముందుకే బాంబు ఇసిరేసిండు. అది పయ్యకింద పడి గొర్ర గొర్ర రాస్కపోయి పేలింది. డ్రైవర్ ఎమ్మటే కారు ఎనక్కి తిప్పిండు. బాబు పిస్తోలు తీసి కాలుద్దామని సూస్తుండంగనే పోలీసోడు పట్టుకుండు. నన్ను బీ పట్టుకొమ్మని వుతరాయించిండు. నేనింగ సైకల్ ఏస్కుని ఉర్కొచ్చిన. రణధీర్, గంగారంకి బీ సైగ జేసిన. రణధీర్ నేను, నిజాం కాలేజ్ గేటు కాడ ఉన్నప్పుడు గంగారం మైదానంల ఉర్కొస్తుండు. ఎనకంగనేమో పోలీసులు ఎంట పడుతుండ్రు. నేను గంగారంను అందుకొద్దామని పోయిన. కానీ కాలే. దొర్కిండు. గంగారం బీ దొర్కిపోయిండు. నేను మల్ల రణధీర్ కాడికి వొస్తారికే ఆయన లేడు. ఎటు పోయిండో ఏమో! ఇంగ ఈడ ఉండొద్దు నజియా నేను.. ఈడ వుండొద్ద'ని దబ్బ దబ్బ చెప్పిన.

'అయ్యో.. ఇంగ ఎట్ల చేద్దాం. వొద్దు వొద్దంటె ఇన్నవా? ఇప్పుడెట్ల' అని వొల వొల ఏడ్వబట్టింది నజియా.

'నజియా ఏడ్వకు.. ఏం కాదు.. నేను పోత.. ఎటన్న దొర్కకుండ పోత. నాకేం కాదు.. బొంబై పోత.. మా పెద్ద మావ కాడికి.. ఏం కాదు.. నువ్వేడ్వకు' అని జెప్పిన నజియా కండ్లు తుడుసుకుంట.

'బొంబైకా..? వొద్దు. నువ్వు యాడికి పోవొద్దు. మా ఇంట్ల దాస్కో. నీకేం కాదు..'

'ఇంట్ల దాస్కునుడు కాదు నజియా, నేను నిన్ను కలుస్తందుకే వొచ్చిన. లేకపోతే అటుకెంచి అటే పోదును.. బాబు, గంగారంను అడుగుతరు.. ఇంకెవరెవరు ఉన్నరని. ఆళ్లు చెప్పినా చెప్పక పోయినా ఈ సైకల్‌తోని పరేషాన్ వొచ్చింది. దీని మీద నంబర్ రాసుంటది. అది ఆ పోలీసోడు సూసిండు. ఈ సైకల్ ఎవ్వరు తీస్కపోయిండ్రని ఆ ట్యాక్సీ సైకల్‌కాడ అడుగుతరు. కోఠీల సత్యనారాయణ కాడ ట్యాక్సీ తీసుకున్న. ఇంగ ఆడు నా గురించి పూరా చెప్తడు. ఆనికి మన ఇల్లు ఎర్కే. ఈడికి పట్టుకొస్తడు. అందుకే ఈడ ఎక్కువ సేపు ఉండొద్దు. నేను బీ గిరఫ్తార్ అయితే.. మన జిందగీ పూరా బర్బాద్ అయితది.. నజియా' అని చెప్పిన.

'ఎట్ల మరి. ఎట్ల పోతవ్ నువ్వు.. బొంబై దాంక..? మజ్జెల యాడనన్న పట్టుకుంటె.. ఏమో నాకైతే కాళ్లు చేతులు వొణుకుతున్నయ్' అన్నది భయపడుకుంట.

'ఏం కాదు.. ఈ సైకల్ తీస్కపోయి లష్కర్ స్టేషన్ల పెడ్త. ఇది ఆడ ఈడ వుండొద్దు. ఆడికెంచి రైల్‌గాడీ ఎక్కిపోత'

'పోదువ్‌గానీ.. ఇట్ల వొద్దు. ఇట్ల పోతే గుర్తు పడ్తరేమో.. జర్రాగు చెప్తా' అని ఏదో సోంచాయించింది నజియా.

ఇంగ లేసి 'నువ్వు మారు వేషంల పోదువు, చెప్తాగు' అనుకుంట చంద్రం ఇంట్లకు పోయింది. ఒక మంగలి కత్తి తీస్కొచ్చింది.

'ఇంగో ఆ అంగి ఇప్పి ఇటు కూసో జల్దీ' అన్నది.

నా నెత్తి మీద నీళ్లు పోసి గుండు కొరిగింది. అరబ్బోళ్ల పిలగాన్ని పంపి ఆల్లింట్ల ఒక డెరస్ తెమ్మంది. 'ఇంగో ఈ డెరస్ బదలాయించుకునిపో.. ఇప్పుడు ఎవ్వలు గుర్తు పట్టరు' అని చెప్పింది. నేను ఆ డెరస్ ఏస్కుంటున్నప్పుడు కొరిగిన నా జుట్టంత ఏరింది, పొయ్యిల పోసి నిప్పు పెట్టింది. ఎవరన్న వొస్తే ఈ జుట్టు ఎవరిదని అడుగుతరేమోనని అట్ల సేసిందంట.

'పైసలున్నయా?' అని అడిగింది. 'జర ఉండ'మని చెప్పి, ఇంట్లకు పోయి బంగారు గొలుసు, ఒక ఉంగరం తెచ్చిచ్చింది. 'ఇయ్యి వుంచుకో.. పనికొస్తయ్' అన్నది. మల్ల ఇంట్లకు పోయి, ఓ డబ్బా సంచిలపెట్టుకునొచ్చి 'ఇంగో తషా పట్టుకపో.. ఆకలైతది.. యాడనన్న తిను. ఊకనే కూసోకు' అనుకుంట మల్ల ఇంట్లకు పోయింది.. ఇంట్లకు బయిటికి చడబిడ తిర్గుతుంది. కాళ్లు ఆడలే. ఆగమాగమైంది.

'ఇంగ పో.. అంతా ఆ అల్లా సూస్కుంటడు.. నిమ్మలంగ పో. సూస్కుంటపో.. జాగ్రత్త.. పోయినంక.. నాకో కారటు ముక్క రాయి' అన్నది.

ఇదంతా పరేషాన్ పరేషాన్‌గా సూస్తుండు ఆ అరబోళ్ల పిల్లగాడు. ఆన్ని అటుకల్ల పొమ్మన్నది. ఆడు పోయినంక 'ఫైలం ఫైలం' అని ఒకటికి పదిసార్లు చెప్పుకుంట నా నుదిటి మీద ముద్దు పెట్టింది. వణుకుతుంది. వొళ్లంత సల్లబడ్డది.

నేను నజియాని సూస్కుంట సూస్కుంట పోయి సైకల్ తీసిన..

'నువ్వు బీ ఫైలంగ ఉండు.. పరేషాన్‌కాకు.. నేను పోంగనే కారటు రాస్త' అని చెప్పిన. కండ్లల్ల కెంచి నీళ్లు దుంకినయ్. ఆగలె. ఆగమాగముంది.

సైకల్ స్టాండ్ తీస్తోన్ని, మల్ల స్టాండ్ ఏసిన. పోబుద్ధి కాల్లే. కానీ పోవాలె. ఎట్ల ఇంగ?

మల్ల ఉర్కి నజియాను గట్టిగ కావులించుకున్న. ఏడుపు ఆగలేదు. ఇద్దరం ఏడ్చినం. ఎక్కెక్కి ఏడ్చినం.

'నాకేం కాదు.. నువ్వు జాగ్రత్త.. ఆళ్లు రాగాలె.. పో' అనుకుంట ఏడ్చుకుంట ఇంట్లకు పోయింది. మల్లొచ్చి సూసింది. మల్ల పోయింది. పొమ్మని సైగ చేసింది, ఏడుసుకుంట.

నేను కండ్లు తుడుసుకుంట సైకల్ తీసిన. ఎనక్కి సూస్కుంట సూస్కుంట సైకల్ తొక్కుతున్న. నజియా బైటికొచ్చి సూస్తుంది. సందు చివరదాంక పోయిన. మూల తిర్గుతప్పుడు జరంత ముందల్కొచ్చి సూస్తోంది నజియా. ఒక క్షణం ఆగి సూసిన.

నేనింగ చాదర్‌ఘాట్, కాచిగూడకెంచి ఎల్లి ముషీరాబాద్‌లవద్ద. అటుకెంచి మల్ల తిరిగి లష్కర్ స్టేషన్‌కు చేరిన. సైకల్ ఆడ స్టేషన్ల పెట్టి లోపల్కిపోయిన. ఎక్కడ సూసినా.. ఎవ్వలి నోటి ఎంబడి ఇన్నా.. గా బాంబు ముచ్చట్లే.

ప్లాట్‌ఫామ్ మీద రైల్‌గాడీ ఔరంగాబాద్ పోతందుకు ఉంది. రయ్యి రయ్యి పోయి ఇంగ అండ్ల ఎక్కి కూసున్న.

నా పక్కన కూసున్నోళ్లు బీ బాంబు దాడి గురించే మాట్లాడుకుంటుండ్రు. బాంబు మాట ఇనిపిచ్చినప్పుడల్లా నా గుండె ఢాం అని పేలుతాంది.

ప్లాట్‌ఫామ్ మీదనేమో పోలీసోళ్లు తిరుగుతుండ్రు. ఈ రైల్‌గాడీనేమో ఇంకా పోతట్టు లేదు. లోపల లొల్లి లొల్లి ఉంది. గుండెల గుబుల్ గుబుల్ అయితాంది. పొద్దటికెంచి ఏం తినలే. కడుపుల కాలుతాంది. నజియా తోష పెట్టిందిగానీ, తినబుద్ధి కాల్లే. తింటట్టు లేదు ముచ్చట.

చేతి గడియారంల టయమ్ సూస్కున్న. ఏడు కొడతాంది. గడియారం సూస్కున్నప్పుడల్లా నాకు నజియా యాదికొస్తది. ఏం చేస్తుందో ఏమో. నా కోసం పోలీసోళ్లు వొచ్చి పోయే ఉంటరు. ఏం అడిగిండ్రో.. ఏం చెప్పిందో? రైలు బండి ఎప్పుడు కదుల్తదా అని సూడంగ.. సూడంగ.. పావుగంటకు కూ.. చుక్ చుక్.. అనుకుంట కదిలింది.

జరంత ఊపిరి పీల్చుకున్న.

మన్మాడ్ దాంక అదే బండిల పోయి అక్కడ్నుండి బొంబైకి వేరేది ఎక్కాలె. టక్కట్

మాత్రం ఔరంగాబాద్ దాంకనే ఇచ్చింద్రు. ఆడికెంచి మన్మాడ్‌కు మల్ల తీస్కోవాల్నంట. ఎందుకంటే మన్మాడ్ అంటే హైద్రబాద్ పొలిమేర. ఆ సరిహద్దు దాటి ఆడికెల్లి హిందువులు పారిపోతరేమోనన్న అనుమానంతోనని పక్కనున్న ఒక తుర్కాయినని అడిగితే తెల్సింది.

మల్ల గిదేంది ముచ్చట అనుకున్న. అయినా నేను హిందువును కాదుగా, మారువేషంల ఉన్నగా.. నాకేం కాదులే.. అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్న.

నా పక్కన కూసున్న తుర్కాయిన 'క్యా నాం హై ఆప్ కా?' అని అడిగిండు. 'హమ్మయ్య ఈడు నన్ను హిందువునని గుర్తు పట్టలే, అంటే.. నాకు ఇంకేం భయం లేదు. ఇంగ నన్నెవరు గుర్తుపట్టరు' అని లోపల్లోపల ఖుషీ అయిన.

'మేరా నామ్ అబ్దుల్లా' అని చెప్పిన. ఆడు ఎందుకు పనికి రాడనుకున్న, ఆని పేరు ఇట్ల పనికొస్తదని అనుకోలే. ఎందుకు యాదికొచ్చిందో ఏమో ఆ తుర్కాయిన అడగంగనే గబుక్కున ఆ అబ్దుల్లా పేరొచ్చింది నోట్లకెంచి.

ఇంగ మంచిగ ఆ తుర్కాయినతోని ముచ్చట షురూ చేసిన. లోపలి భయం జరంత పోతందుకు.

ఆయనతోని మాట్లాడుతుంటే ఎర్కయింది. ఆయన ఖుఫియా అని, షోలాపూర్ దాంక పోతుండని మాటలల్ల తెల్సింది.

'షోలాపూర్‌కు ఎందుకు?' అని అడిగిన ఖుషియా అనేసరికి ఉండబట్టలేక.

'నిజాం మీద బాంబు దాడి చేసింద్రుగదా.. అందులో ఇద్దరు దొరికింద్రు. మిగిలినోళ్లను పట్టుకుంటందుకు సూస్తున్నం. షోలాపూర్ కెంచి ఒకడు వొచ్చి, ఈ పనిల ఉన్నడంట, ఆని జాడ తెలుసుకుంటందుకు పోతున్న' అని చెప్పిండు.

'అమ్మ నీయమ్మ. ఈని తోని మాట్లాడితే భయంపోతదనుకుంటే.. అసలుకే ఎసరు పడతట్టుంది. ఈడు పోక పోక మా గురించే పోతుండుగా, కూసోక కూసోక నా పక్కన్నే కూసోవాల్నా... ఇంగెట్లరో?' అని లోపల్లోపల అనుకున్న.

'ఔనా.. ఆ షోలాపూరోడి పేరు ఏంది మరె?' అని అడిగిన.

'రణధీర్.. దొంగ పేర్లు పెట్టుకుని తిరుగుతరు కొడుకులు..' చెప్పిండా ఖుఫియా.

నోట్ల మన్నుపడ్డట్టు అయింది. దొంగనా కొడుకు. ఈడు మావోని కోసమే పోతుండా?

ఎంత పని అయ్యేరా? ఈడు నన్ను బీ గుర్తుపట్టడా ఏంది? అసలు నా గురించి ఎర్కేనా? నా గురించి గూడా గిట్టాంటోళ్లు తిరుగుతుండొచ్చుగా? అనిపిచ్చి.. 'ఆ ముగ్గురేనా ఆ నిజాం మీద బాంబేసింది.. ఇంక బీ ఉన్నరా?' అని అడిగిన.

'ముగ్గురే కాదు. ఐదారుగురుదాంక ఉన్నరు. ఆళ్ల కోసం బీ దోలాడుతుండ్రు' అని చెప్పిండు. ఏందీడు గుచ్చి గుచ్చి అడుగుతాండు అన్నట్లు.. నాకల్ల జరంత అనుమానంగ సూసిండు. 'నువ్వు యాడిదాంక పోవాలె?' అని గూడ అడిగిండు.

'అదీ.. నేను బొంబై దాంక పోవాలె. మాయమ్మ ఆడ దవాఖాన్ల ఉంది. మందులకు పైసల్ లేకపోతే తీస్కపోతందుకు వొచ్చిన' అని ఒల్లక్కం చెప్పిన. ఆడు ఎందుకు అని అడగక ముందల్నే.

ఇంగ మాట్లాడలే మల్ల. సప్పుడు సేక కూసున్న. ఆడు ఆ రాతిరి అప్పుడప్పుడు, అదోటి ఇదోటి అడుగుతనే ఉన్నడు. నేను ఏదో చెప్పీ చెప్పనట్లు చెప్పుతనే ఉన్న. ఇంగ సూడంగ సూడంగ నిదరబట్టింది. ఆడు నాకంటె ముందల్నే పన్నెడు. గుర్రు పెట్టుకుంట నిదరపోయిండు. మల్ల తెల్లారి మజ్జానానికి షోలాపూర్ వొచ్చింది. ఆ స్టేషన్ రాంగనే ఆ ఖుఫియా తుర్కాయిన 'ఖుదాఫీజ్' అని చెప్పి దిగిపోయిండు.

'హమ్మయ్య' అని నేను ఊపిరి పీల్చుకున్న. 'మావోళ్లనే పట్టుకోనీకు పోతుండులే పెద్ద పీకుడుగాడు' అని మనసుల అనుకున్న. ఇంతకు రణధీర్ ఏమైండో, దేవ ఎటు పోయిండో అని కాసేపు సోంచాయించిన.

'నజియా ఏం జేస్తుందో?' యాజ్జేసుకున్న. 'మా ఇంటికి బీ ఖుఫియాలు వొచ్చి పోయి ఉంటరా?' అని ఆలోచన చేసిన. రణధీర్ కోసం ఎతుకుతుండ్రంటే.. ఇంగ నాకోసం బీ అన్ని తావులల్ల ఎతుకుతనే ఉంటరని సమజైంది.

ఏదయితె, అదైంది. అయినా ఆ ఔరంగాబాద్ పోయినదాంకనే కదా. ఆడ మన్మాడ్ రైలు ఎక్కిన్నంటే ఇంగ బొంబైల పడ్తా అనుకున్న. కానీ ఆ ఔరంగాబాద్ పోయినంకనే ఆగం ముచ్చటైంది. ఆడికి పోయేసరికి అంతా ఉల్టాఫల్టా కొట్టింది ముచ్చట.

ఏమైందంటే, చెప్పినగా టికెట్ ఔరంగాబాద్ దాంకనే ఇచ్చిండ్రని. ఆడిదాంక రైలుల హైద్రాబాద్‌కెంచి వొచ్చినోళ్లందర్ని మల్ల తిరిగి హైద్రాబాద్ తీస్కరావాల్నని కబర్ వొచ్చిందంట. బాంబుదాడి చేసినోళ్లు ఈ గుంపుల్నే పారిపోతుండ్రని ఇట్ల చేసిండ్రంట.

ఇంగెట్ల?

నేను జర సోంచాయించి టక్కట్ కలెక్టర్ కాడికి పోయిన. 'నేను అట్టాంటోన్ని కాదని, నన్ను తిరిగి హైద్రబాద్ తీస్కపోవొద్దని అడిగిన. 'నేను మన్మాడ్ పోవాలె. జర్ర టిక్కట్ ఇప్పియుండ్రి' అని బతిలాడిన.

'చెప్తె సమజైతలేదా? నీకేమన్న బొట్టు పెట్టి చెప్పాల్నా. హైద్రాబాద్‌కెంచి వొచ్చినోళ్లందరు మల్ల హైద్రాబాద్ పోవాల్సిందే' అని గద్దాయించిండు.

'జర్ర పెద్ద మనసు జేస్కోండి.. సారూ! నేను జల్ది బొంబై పోవాలె. ఆడ మాయమ్మ దవాఖాన్ల ఉంది. మందులు కొంటందుకు ఆళ్ల కాడ పైసల్ లేవ్. అందుకే నేను తీస్కపోతున్న. కావాల్నంటే సూడుండ్రి' అని నా కీసలకెంచి పైసల కట్ట తీసి సూపిచ్చిన.

ఆ కట్ట సూసినంక టిక్కట్టాయిన జర కోపం తగ్గిచ్చిండు. సల్లబడ్డడు. 'అట్టనా.. అమ్మకు బాలేదంటున్నవ్ కావట్టి వొదిలిపెడుతున్న. ఇంగో టికెట్. తీస్కో. పో.. పోయి అటుకల్ల నిల్వడుపో.. మన్మాడ్ రైల్ గాడీ ఆ ప్లాట్‌ఫామ్ మీదికి వొస్తద'ని టిక్కెట్ ఇచ్చుకుంట సూపిచ్చిండు.

నేను జప్పున టిక్కెట్ తీస్కుని ఉర్కి ఆ ప్లాట్‌ఫామ్ మీద నిల్వడ్డ.

మిగిల్నోల్నందరినీ మల్ల రైలు ఎక్కించి హైద్రబాద్‌కు తిరిగి పంపిండ్రు.

'హమ్మయ్య. బతికిపోయిన' అని లోపల్లోపల ఖుషీ అవుకుంట మన్మాడ్ రైలెక్కి కూసున్న.

మన్మాడ్‌ల దిగి మల్ల బొంబై రైలెక్కిన. ఇంగ తెల్లారితారికే.. బొంబైలవడ్డ.

♦

బొంబైల దిగంగనే సక్కగ అడుక్కుంట అడుక్కుంట మా పెద్ద మావ ఇంటికి పోయిన.

మా మావ పాలదందా చేస్తందుకు అప్పుడెప్పుడో బొంబైకి వొచ్చిండు. ఇప్పుడు పెద్ద బంగళానే కట్టిండు. 'బానే సంపాయించిండు' అనుకుంట ఇంట్లకు పోయిన.

నన్ను సూడంగనే గుర్తు పట్టలే, ఎప్పుడో చిన్నప్పుడు సూసిండుగదా. ఇంత దూరం ఆయన్ని ఎతుక్కుంట వొచ్చినందుకు యమ ఖుషీ అయ్యిండు. 'మా అక్క ఎట్లుందిరా? మా బావ మంచిగున్నాడా?' అని ఒక్కతీరిగ అడిగిండు.

అంత మంచిగనే ఉన్నరని చెప్పిన. 'నిన్న మొన్న చిన్న మావ కాడనే ఉన్న హైద్రాబాద్‌ల.

ఆడ ఆ కొలువు, ఈ కొలువు చేస్తే బాలేదని.. ఏదన్న దందా జేస్కుని బతకాలని నాకుండె. అందుకే చిన్న మావని అడిగితే.. పెద్ద మావ కాడికి పో.. మంచి మంచి దందాలు చేస్కోవొచ్చు అని చెప్పిండు, అప్పటికెంచి ఇంగ ఎప్పుడు మీ కాడికి వొద్దామా? అని సూస్తుంటిని మావా!' అని చెప్పిన పెద్ద మావకు. 'ఇంగో ఇన్నాళ్లకు ఇట్ల వొచ్చిన మావ. ఇంగ నీ కాడ్నే ఉంట. నాకు ఏదన్న దందా సూపియ్ మామ' అని గూడా అడిగిన.

'అబ్బ ఎన్నాళ్లకెన్నాళ్లకు.. నా అల్లుడు నాకోసం.. గింతదూరం దేవులాడుకుంట వొచ్చిండు' అని యమ సంతోషపడ్డడు మా మావ.

అల్లుడొచ్చిండని అయ్యాల రాతిరికి కోడి కూర తెచ్చిండు. రెండు మూడు దినాలాయె కడుపు నిండ తినక. అయ్యాల మంచిగ తిన్న. తింటప్పుడు మా మావ.. 'గదేంది అల్లుడు. మన కాడ మస్తు దందాలున్నయ్. ఆని కాడ, ఈని కాడ దందాలు జేసుడేంది. మనదే సూస్కుందువులే' అని అన్నడు.

దీనమ్మ జీవితం యాడికేడికో పోతాంది అని ఖుషీ కావాల్నే.. ఏమైపోతాందో ఏమో అని పరేషాన్ కావాల్నో సమజ్‌గాలే.

సక్కగయినా.. సంకనాకి పోయినా.. కాలం మనకు సుట్టం కాదు, అది చట్టంలెక్క దాని పని అది చేస్కుంట పోతా..వుంటదని ఎర్కయింది. ఇంగ మన పని మనం చేస్కుంట పోతా..వుండాలని బీ సమజైంది.

♦

మా మావకు ఒక్కతే బిడ్డ. పేరు గౌరి.

మెట్రిక్ దాంక సదివిందంట. వకీల్ సదువు సదివిపిస్తా అని చెప్పిండు మావ.

నేను పొయ్యినప్పటికెంచి నాకల్ల అదో తీరిగనే సూస్తుండె. నేను 'ఏం పిల్లా' అనుకుంట పరాశికం ఆడుతనే ఉన్న. ఎంతైనా బావను గదా. కానీ నాకు ఆ పిల్లని సూసినప్పుడల్లా నా నజియానే యాది కొస్తుండె. గౌరీ గూడ అట్లనే ఉంటుండె, తెల్లగ, ముద్దుగ.

నజియా ఎట్లుందో ఏమో? ఏం జేస్తుందో? ఎంత యాజ్జెసుకుంటుందో? ఎంత పరేషాన్ అయితాందో? పోంగనే కారటు ముక్క రాస్తా అని చెప్పిన. కానీ ఇప్పటిదాంక రాయానే రాయకపోతిని. రేపు ఎట్లయినా రాయాల్నని అనుకున్న.

తెల్లారి మర్సిపోకుండ కారటు తీస్కొని వొచ్చిన. లష్కర్‌ల రైలు ఎక్కిన కాంచి మొదల్‌బెట్టి.. పక్కన కూసున్న తుర్క ఖుఫియా గురించి, ఔరంగాబాద్‌ల అయిన ముచ్చట గురించి, ఈడికొచ్చినందుకు సంతోషపడ్డ మావ గురించి, అత్త గురించి, గౌరీ గురించి.. నేను చేస్తున్న పని గురించి.. ఇట్ల అన్ని ముచ్చట్లు రాసిన. ఈ కారటు అందంగనే మల్ల ఎమ్మటే తిరిగి నాకు బీ రాయమని, చంద్రంను అడిగినట్లు చెప్పమని గూడ ఆ కారట్ల రాసిన.

ఇంగ నజియా కాంచి కారటు ముక్క ఎప్పుడొస్తదా? అని ఎదురు సూస్కుంట కూసునేది. పది దినాలైంది. పక్షం రోజులు పోయింది. నెల దాటింది.

నజియాకాంచి కారటు మట్టుకు రాలే. ఏమైంది.. ఎందుకు రావట్లే? నజియాకు అందిందా? అందలేదా? అందినంక ఎందుకు రాయదు. రాస్తది.. మరెందుకు రాస్తలేదు?

బెజవాడ పోయిన చంద్రం వొచ్చిండో రాలేదో? ఏమై పోయిండో?

నేను ఇప్పటంతల హైద్రాబాద్ పోతట్లు లేదు. ఆడ ఎట్లుందో ఏందో ముచ్చట. పోతే మల్ల నన్ను బీ గిరఫ్తార్ చేస్తే.. ఎట్ల? బాబును, గంగారంను వొదిలి పెట్టింద్రో లేదో.. ఎట్ల ముచ్చట.. ఏంది కథ?

ఎప్పుడు గియ్యే యాజ్జేసుకుంట, తల్సుకుంట తల్సుకుంట ఉండేది. కానీ నా ముచ్చట మాత్రం ఎప్పుడూ మావకు చెప్పలే. హైద్రాబాద్‌ల గింత పని చేసి వొచ్చినంటే.. ఆయన ఏమనుకుంటడో ఏమో అని అనుకోబడ్తిని.

సరే ఎట్ల అయ్యేది ఉంటే.. అట్ల అయితది.. నేను మల్ల హైద్రాబాద్‌కు పొయ్యే రోజు ఒకటి వొస్తదని.. కానీ ఎప్పుడు? అని.. ఇంగ దాని కోసమే ఎదురు సూస్కుంట ఉంటిని.

♦♦♦

# 10

# తాత డైరీ – 1948

'గౌరిని నీ చేతుల పెడుతున్న. ఇంగ నువ్వే సూసుకో' అన్నడు మావ.

అదే ఆయన ఆఖరి మాట అయితదని అనుకోలే.

జీవితం పాడుగాను, కొన్నిసార్లు కాలం మన మీద పగవడ్తది. మనం అడుగు పెట్టినకాడల్లా ఆగమాగం అయితది. నా జిందగీ పూరా ఇట్లనే అవ్వకుంట వొస్తుండె. ఏదో సుతారం సూస్కుంట, నిమ్మలంగా చేస్కుంట వొస్తున్న.

లేకపోతే ఏంది? నిన్నటి మొన్నటి దాంక, అంతెందుకు ఇయ్యాల పొద్దటిదాంక మంచిగ ఉన్నోళ్లు, ఇప్పుడే పోవుడేంది? ఇంతల్నే టక్కరవ్వుడేంది?? ఆలుమొగలు ఇద్దరు ఆగమై పోయెరా దేవుడా?

'నా అల్లుడు వొచ్చినంక, నాకు శానా పని తగ్గింది. అన్నీ ఆడే సూస్కుంటుండు' అని మా మావ రాతిరి మాయత్తకు చెప్తుంటె ఇన్న. 'ఎప్పటికెంచో అడుగుతున్నవ్‌గా.. అట్ల రేపు మనిద్దరం కొత్త కార్ల షిరిడీకి పోదాం పా.. తీస్కపోతా' అన్నడు అత్తతోని.

అట్ల పోయినోళ్లని.. ఇంగో మల్ల ఇట్ల దవాఖాన్ల.. మంచం మీద సూస్తిని. అత్త పోయిందని ఎర్కయినంక మావ.. నన్ను పిలిచి.. గౌరిని నా చేతుల పెట్టిండు. కానీ అంతల్నే కన్ను మూస్తడని అనుకోలే.

ఇప్పుడు నేనింగ.. అజ్ఞాతంలోంచి అగాథంలో పడుతున్న. నిజాంకు దొర్కకుండా నాల్గు దినాలు ఈడ దాస్కుందామని వొచ్చిన. మావకు ఏదో ఒల్లక్కం చెప్పి బానే ఉన్న. కానీ ఆడ నజియా ఏమైపోయిందో? ఎట్లుందో? ఆ ముచ్చట నన్ను తొల్కరిచ్చుకుంట.. గిల్కరిచ్చుకుంట ఉండగనే.. ఇప్పుడు.. ఇంత పనాయె? ఇంగ నేనేం చెయ్యాలె??

ఎట్ల పోవాలె.. ఈ గౌరిని వొదిలి.. మావ చెప్పిన మాటని.. చేతుల పెట్టిన చెయ్యిని ఈ ఇంటిని, మావ యాపారాలని వొదిలి ఎట్ల పోవాలె?

ఇప్పటిదాంక నేను ఈడికి ఎందుకు వొచ్చిన్నో.. ఏం చేసి వొచ్చిన్నో ఎవర్కీ చెప్పనయితిని. ఇప్పుడు గౌరికి చెప్తే ఏమనుకుంటది? అసలే అమ్మయ్యలు పోయిన బాధల వుంది. ఎట్ల చెప్పాలె. ఎప్పుడు చెప్పాలె?

చెప్పాలే.. చెప్పక తప్పదు. లేకపోతే నా నజియా ఆగమైపోతది. చెప్పకపోతే నేను ఆగమైపోతా.

రోజులు గడుస్తున్నయ్. ఎప్పుడుసూడు గౌరీ ఏం మాట్లాడకుండా, ఆ అర్ర తలుపులు పెట్టుకునే కూసుంటుండేది. వకీల్ సదువు సదువుతా అన్నది.. ఆ పనీ చెయ్యట్లె. సముదాయిద్దామని, సర్దిచెప్దామని శానాసార్లు చూసిన. కానీ ఎట్ల పోవాలె లోపల్కి. పనోళ్లతోని చెప్పిస్తే ఏం బావుంటది? మంచి చెడులన్నీ ఆల్లే సూస్కుంటుండ్రు. కానీ మంచి మాట మాత్రం నేనే చెప్పాలె. మామూలు మనిషిని గూడా నేనే చెయ్యాలె.

గౌరిని పెండ్లి చేస్కుంటెనన్నా మామూలు మనిషి అయితదని ఆళ్లూ ఈళ్లూ అంటుండె. కానీ నా కోసం ఆడో పానం ఎదురు చూస్తుండె. ఎట్లా?.. ఎట్లా చెప్పాలె ఆళ్లకు. ఏం చెప్పాలె.

దినాలు గడుస్తున్నయ్.. నేను నిమ్మలంగ... దందాల పడిన. ఒక్కసారి అల్ల ఇర్కినమంటే.. మల్ల బయిటికి వొస్తట్టు ఉండదు. కుట్రలు, కుతంత్రాలు.. సంపాదించింది నిలబెట్టుకోవాలె.. కూడబెట్టింది కాపాడుకోవాలె.. ఉన్నది ఉన్నట్లు జేసుడు కాదు, ఉన్నదానికంటే ఎక్కువ చెయ్యకపోతే నిన్ను ఇంకోడు తొక్కేయాలని సూస్తుంటడు.. మా మావ ఇంత సంపాదించిండంటే.. ఇట్లాంటియి ఎన్ని ఎదుర్కుండో. నేనిప్పుడు ఎనకడుగు

ఏస్తే ఉన్నయన్ని ఉడుసుక పోతయి. అందుకే ఎయ్యొద్దు.. నాకిచ్చిన ఆస్తులు.. అంతస్తులే కాదు.. నా చేతిలో పెట్టిన పిల్లని కూడా నేను సూస్కోవాలె.

ఇట్ల మొదల్‌బెట్టిన పనిల శానా మర్సిపోవాల్సి వొస్తది.. శానా పోగొట్టుకోవాల్సి బీ వొస్తది. అన్నీ భరించినోడు అందలం ఎక్కుతడు. భరించలేనోడు అగాథంల పడ్తడు..

ఇదంత చేస్తున్నప్పుడు నాకు ఎర్కయినది ఏందంటే.. అందలం ఎక్కినోని కంటే.. అగాథంల పడ్డోడే నయం అని. ఎందుకంటే.. అగాథంల పడ్డోనికి ఎక్కడానికి అందలం ఉంటది.. కానీ ఎక్కినోనికి.. ఇంగేం ఉండదు.. పడడానికి అగాథం తప్ప. నేను ఎక్కడానికి ఏం లేకుండా.. పడడానికి అగాథం సూస్కుంట నిలబడే శిఖరం దాంక పోయిన.

ఆడికెంచి పైకి సూస్తె ఆకాశాన నజియా కనిపించింది. ఆడికి ఎట్ల పోవాల్నో ఎర్కగాలే. కిందికి సూస్తె గౌరి ఉన్నది. దుంకితె ఏమైతదో తెల్వట్లేదు.. ఆకాశానికి ఎక్కలేను. అగాథంలకు దుంకలేను. ఒకాల దుంకాల్సివొస్తే దుంకుతప్పుడు సూస్కోవాలె ఒకటికి రెండుసార్లు.. ఎందుకంటే కొన్నిసార్లు ఈత వొచ్చినోడు గూడా నీళ్ళళ్ల దుంకి బతికి బయటపడడు. ఇంకోసారి ఇసుకల దుంకినోడు కూడా ఇరకబడ్తడు.

నజియా? గౌరీ?

ఆకాశమా? అగాథమా?

ఆకాశానికి నిచ్చెన ఎట్లెయ్యాలె..?

తెల్వలే. ఎట్ల తెలుసుకోవాల్నో సమజ్ గాలే.. కానీ దేవులాడుతనే ఉన్న, దేవులాడుతనే ఉన్న. సమాధానం కోసం.. సమస్య పరిష్కారం కోసం.

కాలం శానా గొప్పది. గాయం సేస్కుంటనే మందు బీ రాస్తుంటది.

గౌరి అప్పుడప్పుడే మామూలు మనిషి అవుతున్నది. మనుషులల్ల కలుస్తున్నది.

ఇంగ నిమ్మలంగ చెప్పిన.. అదును సూస్కుని అన్నీ చెప్పిన. మా ఊర్ల గుడారాలు తగులబెట్టిన కాంచి మొదల్‌బెట్టి, హైద్రబాద్ వొచ్చింది.. నిజాం మీద బాంబు ఏసింది.. నజియాతో ప్రేమల పడ్డది.. పెండ్లి చేస్కుంటా అని మాట ఇచ్చింది.. అన్నీ చెప్పిన.

ఏమంటదో ఏమో అనుకున్న.. అంతా ఇన్నంక 'మరి నజియాను ఈడికి తీస్కరావొచ్చుగా' అంది గౌరీ. శానా రోజుల తర్వాత మంచిగ మాట్లాడడమో, నజియాను

తీసుకురమ్మని అనటమో ఏదోగని మంచిగ అనిపిచ్చింది.

'తీస్కరావొచ్చు.. కానీ ఆడ ముచ్చట ఆగం ఉన్నది. ఇప్పుడు ఎట్ల ఉన్నదో ఎర్కయితలేదు. నేను పోయిన్ననుకో.. నన్ను గిరఫ్తార్ చేస్తే.. ఆడ నజియా ఏమైపోతది.. ఈడ నువ్వు ఏమైపోతవు? అందుకే సోంచాయిస్తున్న' అని చెప్పిన.

'ఉత్తరం రాసి రమ్మనొచ్చుగా' అన్నది.

నేను ఉత్తరం రాసిన ముచ్చట చెప్పిన. తిర్గి మల్ల కారటు రాలేదనీ చెప్పిన. ఎట్లయినా మల్లా రాస్త ఉత్తరం అని చెప్పిన.

ఆ తెల్లారే పేపర్ల సదివిన. ఇండియన్ యూనియన్ సైన్యాలు హైద్రబాద్ మీద దాడి చేయబోతున్నయని, ఇంగ నిజాం లొంగి పోవాల్సిందేనని రాసింద్రు అందుల.

యమ సంతోషమేసింది. ఇంగ నేను హైద్రబాద్ పోయి రావొచ్చు అనుకున్న. ఈ ముచ్చటే గౌరీకి చెబితే ఖుషీ అయింది. 'కానీ ఆమె పైకి ఖుషీగా ఉందిగనీ లోపల లేదు. ఆమెకు నిన్నే పెండ్లి చేస్కోవాలని ఉంద'ని పనామె చెప్పింది.

ఎట్లయితె గట్లాయె అని నజియాకు మల్ల ఉత్తరం రాసిన.

తిరిగి కారటు గురించి ఎదురు సూసిన. కానీ రాలె.

♦

'దేవా లేడా?' అని అడిగిన.

'దేవా ఎవరు?' అంది ఆ ఇంటామె. మార్వాడామెలెక్క కనిపించింది.

'దేవా అంటే చంద్రం.. ఈ ఇంటాయన' అన్న.

'చంద్రమా? లేడు.. ఆయన ఎప్పుడో ఇల్లు అమ్ముకొని పోయిండు. ఇప్పుడు వేరే వాళ్లు కొన్నరు. మేం కిరాయికి ఉంటున్నం' అని చెప్పింది.

'పక్కన నజియా వాళ్లు!' మల్ల అడిగిన ఆమెనే.

'నజియానా? ఎవరామె మాకు తెల్వదు' అన్నది.

'నజియా.. తుర్కోళ్లు.. ఇంగో ఇల్లనే, ఈ ఇంట్లనే కిరాయికి ఉండేటోళ్లు' అని చెప్పిన.

'ఏమో తెల్వదు. మేం వొచ్చినకాంచి అయితే ఎవ్వలూ లేరు మరి' అని చెప్పింది.

'చంద్రం ఇల్లు అమ్మి ఏడికి పోయిండో ఎర్కేనా? జర.. నేను దూరంకెంచి వొచ్చిన బొంబైకెంచి..' అని అడిగిన.

'తెల్వద్ సాబ్. దేశం పోతున్నట్లు తెల్సుగనీ.. ఏ దేశం పోయింగ్రో తెల్వదు' అని చెప్పింది.

శానా రోజుల తర్వాత హైద్రబాద్‌కు వొచ్చిన. మా గల్లీ ఒక్కటే కాదు. హైద్రబాద్ గింతల్నే శానా మారింది. మా గల్లీలకు ఎవలెవలో వొచ్చింగ్రు. ఎవరెవరరో కనిపిస్తుంగ్రు. చంద్రం ఇల్లు అమ్ముకుని పోయిండంట. మరి ఎవర్ని అడగాలె నజియా గురించి. మా నజియా వాళ్లు ఏడికిబోయి ఉంటరు?

హైద్రబాద్ మీద పోలీస్ యాక్షన్ జరిగింది. నిజాం నవాబు లొంగిపోయిండు. హైద్రబాద్‌కు ఆజాద్ వొచ్చింది.. అని ఎర్కయినంక, ఇంగ నన్ను ఎవ్వరూ గిరఫ్తార్ చెయ్యరన్న ధైర్యంతోని వొచ్చిన, నా నజియాను తీస్కపోతందుకు. కానీ ఈడికి వొస్తారికే నా నజియా లేదు, చంద్రం లేడు. ఎవర్ని ఆడగాలె. రణధీర్ ఎటుబోయి ఉంటడు. గంగారం, బాబు? ఏమో సూడాలె. ఎవల్నన్న అడగాలె.. అని సోంచాయించుకుంట సుల్తాన్ బజార్‌లకు పోయిన. ఉదయ్ క్లాత్‌స్టోర్ కాడికి.

నన్ను సూడంగనే మా సేటు పరేషాన్ అయ్యిండు 'ఏం యాది ఎట్లున్నవ్. ఎటుబోయినవ్ అసలు, కనిపియ్యకుంటనే పొయ్యినవ్?' అన్నడు.

నేను పూరా చెప్పినంక చంద్రం గురించి అడిగిన 'చంద్రం యాదుండు.. లేదు.. దుఖ్ఖం వొదిలేసి.. ఇల్లు అమ్మేసి పోయిండు.. మీరు చేసిందానికి గింత పనాయె. ఇల్లు నేనే కొన్న. ఆ పైసల్ తీస్కుని ఇంటిల్లిపాది మూట ముల్లె సర్దుకుని పోయింగ్రు.. ఆడికి బీ వొచ్చి గిరఫ్తార్ చేస్తరేమోననీ ఎవల్కి చెప్పలే.. ఏడికి పోతుంగ్రో. ఇల్లు కొన్న నాకు బీ చెప్పలే' అని చెప్పిండు.

'మరీ చంద్రం ఇంట్ల కిరాయికి ఉన్న నజియా వాళ్లు?' అని అడిగిన.

'అల్లా. ఆళ్లు యాడుంగ్రు.. ఆ పోలీస్ యాక్షనప్పుడు మిల్ట్రీవోళ్లు సంపెగా ఇంటిల్లిపాదిని, ఊరవతల్కి తీస్కపోయి. నజియా అంటే ఆ తుర్కాయిన బిడ్డనేకదా.. ఆ పిల్లగూడా లేదు. ఆ పిల్లని బీ కాల్చి సంపింగ్రని ఒకరంటరు.. లేదు ఆ అబ్దుల్లాగాడు ఎత్తుక పోయిండని ఇంకొకరంటరు.. ఏమో మరి ఏమైందో పూరా అయితే ఎర్కలే యాది!'

అని చెప్పిండు సేటు.

నజియాను చంపేశారా? నా నజియాను చంపేశారా? గిది ఇంటందుకేనా నేను వొచ్చింది? గీ ముచ్చట తెల్సుకోనీకేనా ఇన్ని రోజులు ఎదురుసూసింది. లేదు.. నా నజియా సచ్చిపోలేదు.. బతికే ఉంది.. బతికే ఉంటది.. అట్ల ఏం కాదు.. నమ్మకముంది.. అడుగుత.. ఆ అబ్దుల్లాగాడ్నే అడుగుత.. అని మనసుల అనుకుంటు పోయిన అబ్దుల్లా ఇంటికి. సేటు 'ఏమన్న తిన్నవా? ఛాయ్ అయిన తాగిపో!' అని అడిగినా ఇనకుండ పోయిన.

అబ్దుల్లా ఇంట్లనే ఉన్నడు. 'తింటుండు' అని చెప్పింది ఒకామె. ఆమె ఎవరో కొత్త మనిషి. ఆడు తిన్నదాంక బయట అరుగు మీద కూసున్న.

మూతి తుడుసుకుంట బయటకొచ్చిండు అబ్దుల్లా. నన్ను సూసి గుర్తు పట్టిండు. 'ఏం యాది! కైసే హు.. ఓహెూ.. ఇప్పుడు యాది కాదెమో.. రామస్వామి కదా..' అన్నడాడు ఎగతాళిగా నవ్వుకుంట.

'నజియా ఎక్కడా?' అరుగుమీంచి లేసి ఆని అంగి పట్టుకుని అడిగిన.

'అంగీ వొదుల్ ముందల' అని నన్ను తోసి 'నాకేం తెలుసు..' అన్నడు. 'ఆజాద్ వొచ్చిందని వొచ్చినావ్. యాడ దాస్కున్నవ్ ఇన్ని రోజులు.. నువ్వు బీ దొర్కితే.. ఇంకా జైళ్లనే ఉందువు.. ఆ బాబు, గంగారంలెక్క' అన్నడు మల్ల.

'అబ్దుల్లా! గా పాతయన్నీ మనసుల పెట్టుకోకు.. ఏం చేసినవ్ నా నజియాని, చెప్పు' అని మల్ల అడిగిన.

'నేనేం చేసిన నీ నజియాని. గా మిల్ట్రీవోళ్లని అడుగుపో.. ఆళ్లు చెప్తరు?' అనుకుంట నవ్విండు.

యమ కోపమొచ్చింది. కడుపులకెంచి ఒక్కటి గుద్దిన. 'చెప్తవా? చెప్పవా?' అని ఎగిరెగిరి తన్నిన. మొహం మీంచి, ఈపిలకెంచి గుద్దిన. ఆన్ని ఎంత కొట్టినా 'నేను నిజమే చెప్తున్న. నిజంగ నాకు తెల్వదు. నీకు ఎవ్వలు చెప్పింన్రో ఏందోగానీ నిజంగ నేను చూసిన, ఆ మిల్ట్రీవోళ్లే ఊరవతల్కి పట్టకపోయింన్రు.. ఆ తర్వాత ఏం జేసింన్రో నాకెర్కలే' అనే అంటుండు. 'నిజం! ఆయినకు ఏం ఎర్కలే.. చోడ్ దేవ్ జరా' అని ఆ ఆడామె అన్నది. ఇందాక వొచ్చినామె. అబ్దుల్లా పెండ్లామంట.

ఆమె చెప్పినంక వొదిలిపెట్టిన అబ్దుల్లాని.

ఇంగెవల్నీ కలవాలె. ఎందుకు కలవాలె. బాబు, గంగారం ఇంకా జైల్లోనే ఉన్నరని అర్థమైంది అబ్దుల్లా మాటలల్ల. ఆళ్లను బీ కల్వలే. నా నజియానే లేదు. ఇంగెవరు కావాలె నాకు. ఎవ్వలొద్దు. ఈ హైద్రబాద్ వొద్దు. ఈ మనుషులొద్దు.

లేదు. నా నజియా లేదు.

నా నజియా సచ్చిపోయిందట.

ఇది నేను నమ్మలేని నిజం.

కలం కదుల్తలేదు. కన్నీళ్లు ఆగుతలెవ్వు.. చేతులు వొణుకుతున్నయ్.. ఇంగ నేనేం రాయలేకపోతున్న..

రాయను.. నా నజియా లేని లోకం గురించి ఇంగ నేనేం రాయను..

♦

*(ప్రస్తుతం)*

క్రస్స్ స్ స్ స్ స్ స్... చక్..

వినోద్ కారు సడన్ బ్రేక్ కొట్టాడు.

దాదాపు ఓ వంద మీటర్లు టైర్లు రోడ్డు మీద రాసుకుంటూ పోయాయి.

క్లచ్చు, బ్రేకు వొదిలేసి, గేర్లలో ఆపేశాడు వినోద్.

కార్ పూర్తిగా ఆగింది రోడ్డు మీద.

అనన్య చేతిలో డైరీ తీసుకుని చూశాను. అక్షరాల మీద సిరా పారబోసినట్లు కన్పిస్తున్నాయి. కాగితం తడిసి మాసి ఉన్నది. కల చెదిరిపోయింది. కళావిహీనంగా అయింది. ఆ తర్వాత తిప్పి చూస్తే.. అన్నీ ఖాళీ పేజీలే..

వినోద్ కార్ ఇంజిన్ ఆఫ్ చేశాడు. డోర్స్ అన్‌లాక్ అయ్యాయి.

కాసేపు మౌనం. ఒక నిశ్శబ్దం.

నేను డోర్ తీసుకొని కార్‌లోంచి బయటికొచ్చాను.

తర్వాత వినోద్, అనన్య కూడా దిగారు.

నేను సిగరెట్ అంటించి 'హైదరాబాద్, 50 కె.ఎం.' అని రాసి ఉన్న మైలురాయి మీద కూర్చున్న. సిగరెట్ తాగుతూ.. సూర్యాస్తమయాన్ని చూస్తున్నాను.

'నజియా చనిపోయిందా?' అన్నది అనన్య వినోద్‌తో.

వాడేం మాట్లాడలేదు. నావైపు చూశాడు. తర్వాత వాళ్లిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఇద్దరు నావైపు చూశారు.

'కార్తీక్!?' అని పిలిచాడు వినోద్. అది పిలుపో, పరామర్శో అర్థం కాలేదు.

నేను మూడు, నాలుగు దమ్ములు పీల్చిన తర్వాత అనన్య నా దగ్గరికొచ్చి చేతిలో సిగరెట్ తీసుకుంది. దమ్ము పీలుస్తూ కార్ దగ్గరికెళ్లింది. బ్యాక్ బొనెట్ మీదికి ఎక్కి కాళ్లు కిందికేసి కూర్చుంది.

'ఇంకో సిగరెట్ ఇవ్వరా!' అంటూ వినోద్ నా దగ్గరికి వచ్చాడు.

నేను 'కార్‌లోనే ఉన్నాయ'ని సైగ చేశాను.

వాడు సిగరెట్ ప్యాకెట్ తీసుకుని, ఒకటి అంటించుకుంటూ వచ్చి నా పక్కన నిల్చున్నాడు.

రెండు దమ్ములు పీల్చిన తర్వాత 'కార్తీక్!' అని పిలిచాడు.

'హు..' అన్నాను.

'నజియా?' అన్నాడు.

'హా..!' అన్నాను.

'ఇప్పుడెలా?' అది అనన్య కార్ దిగి దగ్గరికి వస్తూ.

నేను వినోద్ చేతిలో సిగరెట్ తీస్కుంటూ 'ఎలా ఏంటి?' అన్నాను.

'అదీ.. నజియా?..' ఇంకేదో అంటున్నది అనన్య.

'ఆ.. నజియా?' అన్నాన్నేను తన మాట పూర్తికాకుండానే.

'అదే నజియా చనిపోయింది కదా..' అని ఇంకేదో అడగబోయాడు వినోద్.

'నజియా... చనిపోలేదు' అని గట్టిగా అన్నాన్నేను.

ఇద్దరూ ఫ్రీజ్ అయిపోయారు. ఒకరి మొహం ఒకరు చూస్కున్నారు మళ్లీ.

'నజియా బతికి ఉందా! అదెలా?' అన్నాడు వినోద్ ఆశ్చర్యంగా.

నేను కృత్రిమమైన చిరు మందహాసంతో 'నమ్మకం' అన్నాను.

'నమ్మకం!?' అన్నారు ఇద్దరు సేమ్ పించ్‌లో. సేమ్ పిచ్‌లో. ఒకరిది ఆశ్చర్యం. ఇంకొకరిది ప్రశ్నార్థకం.

'యస్. నమ్మకం. తను బతికే ఉందని నా నమ్మకం' అన్నాను.

'తొక్కేం కాదు. నువ్వేదో పెద్ద.. నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్‌లా మాట్లాడకు' అని వెటకారంగా అన్నది అనన్య.

'నేను బ్రాండ్ అంబాసిడర్నో.. బ్యాండ్ బాజా గాడినో.. నువ్వు ఏదైనా అనుకో.. కానీ తను బతికే ఉందని నాకు అనిపిస్తోంది. తను చనిపోతే మనం ఇక్కడి వరకు వచ్చే వాళ్లం కాదేమో. అరవయ్యేళ్ల తర్వాత ఒక ఉత్తరం రావడం, నేను ఆమె కోసం వెతకడం, మీరు నాకు తోడు రావడం.. డైరీలు దొరకడం.. ఇదంతా ఒక కుట్ర.. నజియా బతికే ఉందని చెప్పే పన్నాగమే.. ' అని చెప్పాను నేను చాలా కూల్‌గా. వెటకారానికి గురైన వారి తర్వాతి మాటలు.. భారీగానే, బలంగానే ఉంటాయి మరి.

'కుట్ర.. పన్నాగం..!? ఏం మాట్లాడుతున్నావ్ రా నువ్వు..' అన్నాడు వినోద్.

'నేను మాట్లాడుతున్నది కరెక్టే. నువ్వు ఏదైనా సాధించాలని బలంగా ప్రయత్నిస్తున్నావంటే దాన్ని సాధించడంలో ఈ విశ్వమంతా కుట్ర పన్ని నీకు సహాయం చేస్తుంది..'

'కుట్ర పన్ని సహాయం చేస్తుందా? క్వయిట్ కాంట్రాస్ట్. అదెలా?' అడిగింది అనన్య.

'నో మోర్ క్వశ్చన్స్! నజియా బతికే ఉంది. ఐ బిలీవ్. యూ షుడ్ బిలీవ్' కొన్ని విషయాల్ని ఇంగ్లీష్‌లో చెప్తేనే కన్విన్స్ అవుతారు మనుషులు.

♦

'హైదరాబాద్, 50 కి.మీ. ఇంకో హాఫెన్ హవర్‌లో వెళ్లిపోతామా?' అనన్యని అడిగాడు వినోద్, నా మాటలకు కన్విన్స్ అయినట్లు **నటిస్తూ** కార్ స్టార్ట్ చేశాక.

'మే బీ! ట్రాఫిక్ లేకపోతే. ఉంటే గంట కూడా పట్టొచ్చు' అన్నది అనన్య తన బ్యాగ్‌లోంచి మొబైల్ ఫోన్ తీస్తూ.

వాళ్ల డాడీకి కాల్ చేసి ఫ్రెండ్స్‌తో హైదరాబాద్ వస్తున్నట్లు చెప్పింది. బండ్లగూడలోని వాళ్ల గెస్ట్ హౌస్‌లో రాత్రి ఉండడానికి ఏర్పాట్లు చేయించింది.

'మరి డ్రింక్స్ ఏం లేవా?' అడిగాడు వినోద్ అనన్యని.

'వాటర్ మిగిలాయని ఇంకో క్వార్టర్ కొనుక్కునే రకం నువ్వు. డ్రింక్ లేకుండా నువ్వు ఎక్కడుంటావ్.. ఉన్నాయ్ పదా.. ఆ ఏర్పాట్లు కూడా..' అన్నది అనన్య.

ఆ తర్వాత ఎవ్వరం మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వారు ఉన్నారు.

♦

గచ్చిబౌలి దగ్గర అవుటర్ రింగ్‌రోడ్ ఎక్కి బండ్లగూడకు వెళ్లాం. తొమ్మిదిన్నరకు గెస్ట్ హౌస్‌కు చేరుకున్నాం.

అనన్య ఫ్రెషప్ అవుతున్నప్పుడు నేను డాడ్‌కి కాల్ చేశా.

'దాదాకు ఎలా ఉంద'ని అడిగాను.

'నాట్ బ్యాడ్. రిపోర్ట్స్ రేపు మార్నింగ్ వొస్తయ'ని చెప్పి ఫోన్ పెట్టేశారు.

నేను ఫోన్ మాట్లాడుతున్నపుడు వినోద్ బాల్కనీలో తిరుగుతూ వాడూ ఫోన్ మాట్లాడుతున్నాడు. ఎవరో అమ్మాయికే అయి ఉంటుంది. అనన్య వచ్చేలోపు కాల్ కంప్లీట్ చేయాలన్న తొందర వినిపిస్తోంది వాడి మాటల్లో.

నేను ఫ్రెషప్ అయ్యి వచ్చేసరికి వినోద్ టీవీ ఆన్ చేసి పెట్టాడు.

♦♦♦

# 11

# అన్వేషణ

## నవంబర్ 28, 2009

టీ న్యూస్

'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అంటూ తెలంగాణ మలిదశ ఉద్యమ ప్రస్థానంలో మరపురాని ఘట్టానికి తెర తీశారు టీఆర్ఎస్ ఉద్యమనేత కే చంద్రశేఖర్ రావు. ఆయన పిలుపు కోట్లాది ప్రజల హృదయాలను తాకుతున్నది. ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడి రాష్ట్రంలో అల్లకల్లోలం ఏర్పడుతున్నది. దోపిడీ పాలకులకు కంటికి నిద్ర కరువైతున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు చేపట్టిన ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యయుత లాబీయింగుల దశనుంచి ఉద్యమాల దిశకు పరిణామం చెందడానికి ఈ దీక్ష ప్రధాన కారణం కాబోతున్నది' యాంకర్ ఉద్వేగంగా వార్తలు చదువుతున్నది.

'ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి బయలుదేరిన కేసీఆర్ కరీంనగర్‌కు చేరుకోగానే అభిమానులు భారీ సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. సాయంత్రం అయ్యేసరికి పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు

కేసీఆర్ ఇంటిని చుట్టుముట్టాయి. ఈ రాత్రికే కేసీఆర్‌ను అరెస్టు చేస్తారని వార్తలు రావడంతో కరీంనగర్‌లోని టీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ నాయకులు, తెలంగాణవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో సీఆర్‌పీఎఫ్, రిజర్వ్ ఫోర్స్ బలగాలు భారీగా మొహరించాయి' అని వాయిస్ ఓవర్ నడుస్తున్నప్పుడు రకరకాల విజువల్స్ ప్లే అవుతున్నాయి.

'ఇప్పుడు కరీంనగర్‌లో కేసీఆర్ నివాసం వద్ద పరిస్థితి ఎలా ఉందో.. మా కరస్పాండెంట్ లైవ్‌లో అందిస్తాడు' అని యాంకర్ వాయిస్ ఆపిన ఏడు సెకన్ల తర్వాత లైవ్ కనెక్ట్ అయింది.

'కాసేపు ఆ టీవీ ఆఫ్ చేస్తావా?' అంటూ బాత్‌రూమ్ నుంచి వచ్చాడు వినోద్.

నేను టీవీ మ్యూట్‌లో పెట్టా.

'పెగ్ ఫిక్స్ చేశావా, లేదా?' అనన్య మీద అరిచినంత పనిచేశాడు వినోద్.

'ఆవేశపడకు. అన్ని దానాలకన్నా నిదానం గొప్పది. వాచ్‌మన్ తేవడానికి వెళ్లాడు. వస్తుండొచ్చుగనీ కూర్చో' అన్నది అనన్య టీపాయ్ మీద కడిగిన గ్లాసులు రెడీగా పెడుతూ.

ఫస్ట్ సిప్ తాగిన తర్వాత 'ఆ.. యస్.. ఇప్పుడు చెప్పరా కార్తీక్. ఏం చేద్దాం?' అని అడిగాడు వినోద్.

నేను రెండో సిప్ తాగి గ్లాస్ కింద పెడుతూ 'ఐ హ్యావ్ ఏ ప్లాన్!' అన్నాను.

'చెప్పు' అన్నది అనన్య తన మొదటి సిప్ తర్వాత గ్లాస్‌లో ఇంకొన్ని వాటర్ కలుపుతూ.

'నువ్వు తాత డైరీ చదువుతున్నప్పుడు.. నేను నోటీస్ చేసిన కొన్ని ప్లేసెస్ ఉన్నాయి. కలవాల్సిన వ్యక్తులూ ఉన్నారు. వారిని పట్టుకోవడమే మన పని. అందులో నంబర్ వన్.. సుల్తాన్ బజార్‌లోని ఉదయ్ క్లాత్ స్టోర్..'

'యస్.. దీని పక్కనేకదా చంద్రం అలియాస్ దేవ హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్ ఉన్నది' అన్నది అనన్య.

'ఎగ్జాట్లీ! తాతయ్య నెక్ట్స్ టైమ్ వెళ్లినప్పుడు సేట్‌ని కలిశాడు కదా. వాళ్ల వివరాలు ఏవైనా దొరకొచ్చు' అని మూడో సిప్ తాగాను. 'ఇక రెండోది.. నల్లగొండ దగ్గర పజ్జూరు.. మా ఊరు.. తాత పుట్టి పెరిగిన ఊరు.. నాకూ చూడాలని ఉంది.. కానీ.. మనం రేపు అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు.. నజియాకు మా ఊరికి ఏం సంబంధం లేదు..

తాత ఆ ఉరికెంచి హైదరాబాద్ వచ్చాక, ఆ తర్వాత ముంబై వచ్చాక, మళ్లీ ఆ ఊరు వెళ్లలేదు. సో... ఎట్ ప్రెజెంట్ మనం అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు.. అండ్ థర్డ్ వన్..' అని నేను పూర్తిగా చెప్పకుండానే..

'ఇసామియా బజార్.. తాతయ్య ఉన్న ఇల్లు. చంద్రం ఇల్లు అదే కదా' అన్నది అనన్య.

'అదే. కానీ అక్కడికి వెళ్తే ఏం క్లూ దొరక్కపోవచ్చు.. ఎందుకంటే.. దాన్ని అమ్ముకుని చంద్రకిషోర్ వెళ్లిపోయాడు కదా. ఆ తర్వాత ఏమయ్యాడో తాతయ్యకు, మనకు, ఆ ఇల్లు కొన్న ఆ సేట్‌కు కూడా తెలియదు.. సో..'

'బట్.. ముంబై నుంచి తాతయ్య ఉత్తరం రాసింది ఈ అడ్రస్‌కే కదా.. ఎందుకు రీచ్ అవ్వలేదో.. ఏమైనా..' అన్నది అనన్య.

'చూద్దాం. వెళ్దాం. కానీ అక్కడ అదే గల్లీలో ఉండే.. అబ్దుల్లా మన ఫోర్త్ ఛాయిస్.. తాతయ్య ఆల్రెడీ ఇతన్ని కలిశాడు. కానీ ఆయనేదో విషయం దాచినట్లు నాకు అనిపిస్తుంది. అందుకే ఆయన దగ్గరికీ వెళ్దాం. అండ్ ఫిఫ్త్ ఆప్షన్.. లక్ష్మీ నారాయణ పవార్ అండ్ గంగారం. ముందుగా అరెస్టు అయిన ఈ ఇద్దరు, తాతయ్య మళ్లీ వచ్చినప్పుడు జైల్లో ఉన్నారు. వీరికి నజియా గురించి తెలియకపోయినా.. రణధీర్ గురించో, ఇంకేదైనా సమాచారమో దొరకొచ్చు...' అని నేను చెప్తున్నప్పుడు అనన్య కనెక్ట్ అయినంతగా వినోద్ కాలేదు. డైరీ చదివేటప్పుడు వాడు డ్రైవింగ్ మీద ఎక్కువ కాన్సన్‌ట్రేట్ చేసి ఉంటాడు. అందుకే మా ఈ సంభాషణను పెద్దగా పట్టిచ్చుకోకుండా..

'ఈ బ్రాండ్ తెప్పించావేంటే? చెత్తగా ఉంది' అంటూనే మొదటి పెగ్ చివరి సిప్ తాగేశాడు.

'ఆకలేసినప్పుడు గారెను చూడాలి కానీ.. దానికి ఉన్న చిల్లును కాదు.. నువ్వు మూస్కొని తాగు' అన్నది అన్నూ. తను రెండో పెగ్గు ఫిక్స్ చేసుకునే పనిలో బిజీగా ఉన్నాడు. వాడు కథకంటే, డ్రింక్‌కే బాగా కనెక్ట్ అయ్యాడు.

'ఇక లాస్ట్ బట్ నాట్ లీస్ట్.. కోఠీలోని ఎస్‌కే సైకిల్ ట్యాక్సీ. బాంబ్ ప్లాన్‌లో తాతయ్య గోడకు సైకిల్ పెట్టినప్పుడు ఒక పోలీస్ చూశాడు. పవార్, గంగారాం తర్వాత మిగిలిన వారెవరో తెలుసుకునేందుకు.. ఆ సైకిలే క్లూ. సో కచ్చితంగా.. ఆ సైకిల్ ట్యాక్సీ అతన్ని పోలీసులు ఎంక్వైరీ చేసే ఉండొచ్చు. పైగా అతనికి తాతయ్య ఉండే ఇల్లు కూడా తెలుసు.. సో.. అతన్ని కలిస్తే ఆ రోజు ఏమైందో మనకు తెలిసే ఛాన్స్ ఉంది..' నేను నా ప్లాన్

చెప్పడం పూర్తి చేశాను.

'సో.. రేపు మనం ముందుగా వెళ్లాల్సింది.. సుల్తాన్ బజార్‌లోని ఉదయ్ క్లాత్ స్టోర్.. ఐమ్ ఐ కరెక్ట్?' అంది అనన్య నాకు, తనకు రెండో పెగ్, వినోద్‌కు మూడోది పోస్తూ.

'నో.. కింగ్ కోఠీ.. రాజమహాల్.. ఆపరేషన్ సీతాఫల్ జరిగిన ప్లేస్ చూడాలి మనం ముందు..' అన్నాన్నేను.

'సమ్‌థింగ్ క్రేజీ' అన్నది అన్నూ.

'నేను మిడిల్ డ్రాప్.. గుడ్‌నైట్ మరి' అన్నాడు వినోద్ మూడో పెగ్ లాగించి. వాడి నిద్రకు వేళయింది.

♦

మేం బండ్లగూడ నుంచి ఉదయం ఎనిమిది గంటలకే కింగ్ కోఠీ ప్యాలెస్‌కు బయలుదేరాం..

అనన్య కార్ డ్రైవ్ చేస్తున్నది. అమ్మాయిలు సొంత ఊరు వొచ్చినప్పుడు ట్రెడీషనల్ డ్రెస్సులే ఎక్కువ వేస్తారు ఎందుకనో? తను యెల్లో కలర్ చుడీదార్ వేసుకుంది. తను గేర్లు మారుస్తున్నప్పుడు ఆమె చున్నీ చివర్న ఉన్న గజ్జెలు గల్ గల్ మని చప్పుడు చేస్తున్నాయి.

అమ్మాయి కార్ డ్రైవ్ చేస్తున్నప్పుడు, అబ్బాయి పక్కన కూర్చుంటే రోడ్డు మీద టూ వీలర్‌లో వెళ్లే వారు ముంబైలోనే వింతగా చూస్తారనుకునేవాడ్ని. కానీ హైదరాబాద్‌లో కూడా అలాగే చూస్తున్నారు.

అన్నూ కార్ స్పీడ్ పెంచింది. చెప్తే ఒప్పుకోడుకానీ వినోద్ కంటే కాస్త వేగంగానే డ్రైవ్ చేస్తున్నది.

ఆమె వేగానికి బ్రేక్ పడింది.

సాగర్ రింగ్‌రోడ్‌లో రోడ్డు మీద బారికేడ్లు పెట్టారు. లెఫ్ట్ టర్న్ తీసుకొమ్మని సైన్ బోర్డులు కూడా ఉన్నాయి.

'రైల్వే ట్రాక్ మీద స్పీడ్ బ్రేకర్లు పెట్టినట్టు.. రోడ్డు మీద బారికెడ్లు అడ్డంగా పెట్టారేంటి?' అని గొనుగుతూ కార్ పక్క గల్లీలోకి తిప్పింది అన్నూ. తిప్పి, తిప్పి మళ్లీ ఎల్‌బీనగర్

రోడ్డు ఎక్కిచ్చింది. నేను గూగుల్‌లో రూట్ మ్యాప్ చూస్తున్నాను.

ఎల్‌బీ నగర్ సర్కిల్..

భారీగా ట్రాఫిక్ జామ్..

'బారికేడ్లు పెట్టినప్పుడు అటు వెళ్లొచ్చుకదా. ఇటెందుకొచ్చావ్, ఇప్పుడు చూడు?' అని చిరాకు పడ్డాడు వినోద్. వాడి చిరాకుకు కారణం డ్రైవింగ్ తనకు ఇవ్వలేదని కాబోలు.

'ఇప్పటికైనా చెప్పేది విను, లెఫ్ట్ తీసుకో' అన్నాడు వినోద్.

'నువ్వు లైట్ తీస్కో' అన్నది అనన్య.

కార్ ముందుకు కదిలేలా లేదు. ఏమైందో చూద్దామని నేను కార్ దిగి కాస్త ముందుకు నడిచాను.

ఓ మై గాడ్! మంటలు..

మంటల్లో ఎవరో కాలిపోతున్నారు. అటూ ఇటూ పరుగుతీస్తుంటే.. పోలీసులు, కొందరు జనాలు మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతా గందరగోళంగా ఉంది. ఆందోళనగా ఉందక్కడ.

'బాస్ ఏమైందక్కడ?' అడిగాను ఒకతన్ని.

'జై తెలంగాణ!' అన్నాడు.

'కేసీఆర్‌ను అరెస్టు చేసింద్రుగా.. దీక్ష భగ్నం చేసింద్రని.. ఆ పిలగాడు ఆత్మాహుతి చేసుకుండు' చెప్పిండు పక్కనాయన.

'కేసీఆర్.. జై తెలంగాణ.. రాత్రి వార్తల్లో.. మే బీ అదే కావొచ్చు..' అని గుర్తు చేసుకుంటూ కార్ దగ్గరికి వెళ్లాను.

'ముందుకు వెళ్లే ఛాన్స్ లేదు. మనం లెఫ్ట్ తీసుకోవడం బెటర్' అని చెప్పాను అనన్యకి. తనేం మాట్లాడకుండా సర్వీస్ రోడ్డులోకి కార్ టర్న్ చేస్తున్నప్పుడు నేను సైడ్ చెప్పాను. పక్క గల్లీలోంచి.. ఆ తర్వాత ఇంకో గల్లీలోకి తిప్పి వేరే దారిలో దిల్‌సుఖ్‌నగర్‌కు తీసుకొచ్చింది.

'జై కేసీఆర్.. శ్రీకాంతా చారి అమర్‌రహే..' అని నినాదాలు చేస్తున్నారు ఆ చౌరస్తాలో.

'ఎవరీ కేసీఆర్.. ఆయన కోసం ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు?' అడిగాను అన్నాని.

'కేసీఆర్.. ఈజ్ ది గ్రేట్ లీడర్. ఎనిమిదేళ్లుగా ఆయన సపరేట్ తెలంగాణ స్టేట్ కోసం పోరాటం చేస్తున్నాడు.. ఆ ఆత్మహుతి ఆయన కోసం కాదు.. తెలంగాణ కోసం.. అని మొదలెట్టి.. కింగ్ కోఠీ చౌరస్తా వచ్చిందాకా చెప్తూనే ఉన్నది. కోఠికి దగ్గరలో 'ఇటు వెళ్తే ఇసామియా బజార్.. అటు వెళ్తే సుల్తాన్ బజార్' అని చూపించింది.

చౌరస్తాలో కార్ ఆపింది. అదిగో అదే కింగ్ కోఠీ ప్యాలెస్ అని చూపించింది. 'ఇక్కడ రణధీర్ ఉండొచ్చు. అదిగో ఆ మూల మీద తాతయ్య నిలబడి ఉండొచ్చు. ఇదిగో ఇటు గంగారం.. ' తను చెప్తూనే ఉంది. నేను తాతయ్య నిలబడ్డ మూల చూపించగానే.. అక్కడికి పరుగున వెళ్లాను.

ఆ 'కొత్త గోడ'కు తాతయ్య ఆనించిన సైకిల్.. మూలమీద నిలబడ్డ బాబు, ఆయన ముందు పోలీసోడు.. అదిగో మహాఘనత వహించిన నిజాం రాజు ఆలీ ఖాన్ కారు వస్తున్నది. నేను తాతయ్య వైపు చూస్తున్నాను. బాబు బాంబు ఇసిరేసిండు. పెద్ద శబ్దంతో పేలింది. అంతా పొగ.. డ్రైవర్ కార్ వెనక్కి తిప్పాడు.. పోలీసు బాబును పట్టుకున్నాడు.. ఇంకో పోలీసు తాతయ్య వైపు వస్తున్నాడు. నేను 'తాతయ్య రన్ రన్.. ' అని అరిచాను. నా ముందు ఎవరో కార్ ఆపి హారన్ కొడుతున్నారు. ఆ శబ్దం నన్ను ఈ లోకంలోకి తీసుకొచ్చింది. అనన్య కార్ తిప్పుకొని వచ్చింది. 'కమ్ ఇన్..' అన్నట్లు సైగ చేసింది కార్ నా ముందు ఆపుతూ.

నేను కార్ ఎక్కి కూర్చున్నాక, చౌరస్తా వైపు పోనిస్తున్నది. చౌరస్తా మూల మీద రణధీర్ నిలబడి ఉన్నాడు. కాస్త ముందుకు వెళ్లాక తాజ్‌మహల్ హోటల్ దగ్గర గంగారాం నిలబడి ఉన్నాడు.

'ఇసామియా బజార్‌కు వెళ్దామా?' అని అడిగారెవరో.

'కాదు. నిజాం కాలేజ్ గ్రౌండ్' అన్నాన్నేను తెలియకుండానే.

'కార్తీక్ ఏమైంది నీకు? ఆర్ యూ ఓకే..' అన్నది అనన్య. కార్ సడన్ బ్రేక్ వేశాక నన్ను పట్టుకుని ఊపుతూ.

నేను ఉలిక్కి పడి లేచాను. 'ఎక్కడున్నాం మనం?' అన్నాను ఏమీ తెలియనట్లు..

'ఆ.. 1947లో..' అన్నది తను వెటకారంగా.

'ఫెర్రారీ కార్‌లోనా?' పెద్దగా నవ్వాడు వినోద్.

'బ్యాటరీ తీసి మొబైల్ ఛార్జింగ్ పెట్టినట్లు! ఏమైంది నీకు' అడిగింది అనన్య.

'నథింగ్' అన్నాన్నేను. 'పోనియ్.. ఇసామియా బజార్‌కు, కాదు.. సుల్తాన్ బజార్‌కు' అన్నాను.

'అయితే.. కరెక్ట్‌గానే ఉన్నావన్నమాట?' అన్నది అన్నూ.

ఆబిడ్స్.. కోఠి.. ఉమెన్స్ కాలేజ్.. దగ్గర లెఫ్ట్ తీసుకున్నాక సుల్తాన్ బజార్ వొచ్చింది.

బట్టల షాపులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవన్నీ జనాలతో కిటకిటలాడుతున్నాయి. కార్ పార్క్ చేసేందుకు ఎక్కడా ప్లేస్ దొరకలేదు. అనన్య కార్ అటు తిప్పి.. ఇటు తిప్పి మొత్తానికి ఓ చోట ఇరికించింది. ముగ్గురం కార్ దిగి ఉదయ్ క్లాత్ స్టోర్ గురించి వెతకడం మొదలెట్టాం. ఎక్కడా కనిపించలేదు. ఎవర్ని అడిగినా చెప్పడం లేదు. ఈ మహానగరంలో ఏడాదికే మారిపోయే రూపు రేఖల మధ్య.. అరవయ్యేళ్ల క్రితం నాటి ఆ షాప్ వెతకడం మాకు పెద్ద కష్టమే అయింది. ఒక షాప్‌లో ఓ పెద్దాయన 'ఉదయ్ క్లాత్ స్టోర్ తెలుసు'.. అనడంతో కాస్త కుదుటపడ్డాం.

'ఉదయ్ క్లాత్‌స్టోర్ అప్పట్ల ఉండె. ఇప్పుడేడ ఉంది.. ఎప్పుడో కూలగొట్టి షాపింగ్ కాంప్లెక్స్ కట్టింద్రు' అని చెప్పాడాయన.

'దాని సేట్ గురించి ఏమైనా తెలుసా? ఎక్కడుంటారో కొంచెం చెప్పగలరా?' అని అడిగితే ఆ పెద్దాయన 'సేట్ చమన్‌లాల్.. ఇప్పుడాయన ఉన్నడో, పోయిండో తెల్వద్ కనీ.. అంబర్‌పేటల ఉంటది ఆళ్ల ఇల్లు. లాల్‌బంగ్లా అంటే ఎవర్నడిగినా చెప్తరు. ఎర్ర బిల్డింగు.. పెద్దగుంటది' అని చెప్పిండు.

ఇరవై నిమిషాల తర్వాత.. మేం అంబర్‌పేట్‌లోని లాల్‌బంగ్లా ముందు ఉన్నాం. ఈ అడ్రస్ కనుక్కోవడానికి పెద్దగా కష్టమేమీ కాలేదు.

గోల్డ్ కలర్ పెద్ద కారు చూసినా సెక్యూరిటీ వాడు గేట్ తెరవలేదు.

వినోద్ కార్ విండో మిర్రర్ డౌన్ చేసి 'సేట్ చమన్‌లాల్‌ని కలవాలి, ఆయన వున్నారా?' అని అడిగాడు.

'ఎవరు మీరు? తెల్సి వొచ్చింద్రా తెల్వక వొచ్చింద్రా? చమన్‌లాల్ సాబ్ లేడు. ఆయన చనిపోయి చాలా రోజులైంది..' అని చెప్పాడు సెక్యూరిటీ వాడు.

'లేదు.. నిజంగానే మాకు తెలియదు. మేం ముంబై నుంచి వొచ్చాం. సేట్ చమన్‌లాల్‌ను కలవాలని, ఇసామియా బజార్‌లో మా ఇల్లు కొన్నరు. దాని గురించి మాట్లాడాలి, ఇప్పుడెలా?' అంటూ కార్ దిగాను.

'ఎలా అంటే ఏం చెయ్యను మరి? చమన్‌లాల్ సాబ్ లేదు. పెద్ద సాబ్ ఉన్నడు' అన్నడు సెక్యూరిటీ.

'పెద్ద సాబ్ అంటే?'

'ఉదయ్‌లాల్! చమన్‌లాల్ సాబ్ పెద్దకొడుకు'

'ఆయనతోని మాట్లాడొచ్చా?'

'ఏమో మరి, సాబ్‌ను అడిగొస్తా ఉండుండ్రి' అని లోపలికి వెళ్లాడు సెక్యూరిటీ వాడు. ఎదురు చూడగా చూడగా ఓ 900 సెకన్ల తర్వాత వచ్చాడు.

'రమ్మంటుండు, రాండ్రి' అని గేట్ తీశాడు.

ఉదయ్‌లాల్ హాల్‌లో ఆరామ్ కుర్చీలో కూర్చున్నడు. పక్కన చిన్న టేబుల్ మీద పేపర్ల కట్ట ఉంది. ఆయన చేతిలో ఇంగ్లీష్ పేపర్ ఉన్నది.

మమ్మల్ని చూసి కూర్చొమ్మని సైగ చేశాడు. నేను ఉదయ్‌లాల్ పక్కన సోఫాలో కూర్చున్న, నా పక్కన అనన్య, ఎదురు సోఫాలో వినోద్ కూర్చున్నారు.

ఆ హాల్ అంతా విలువైన వస్తువులతో అందంగా ఉంది. మా తాత గదిలో ఉన్నట్లు పాతకాలం నాటి వస్తువులు కూడా ఉన్నాయి.

కళ్లజోడు సర్దుకుంటూ పరిశీలనగా చూశాడు ఉదయ్‌లాల్. 'ఎవరు మీరు, ఏం కావాలి?' అని అడిగాడు.

'సాబ్! రామస్వామి మా తాత. ఇసామియా బజార్‌లో మీరు కొన్నారుగా చంద్రం ఇల్లు, అందులో ఉండేవాడు. ఆ ఇంట్లోనే నజియా కూడా ఉండేది. ఆమె కోసం వెతుకుతున్నాం. మీ దగ్గర ఏమైనా సమాచారం దొరుకుతుందేమో అని వొచ్చాం' సోఫాలోంచి కాస్తముందుకు, ఆయన దగ్గరకు వొంగి చెప్పాను.

'చంద్రం.. ఎర్కేగనీ.. ఈ రామస్వామి ఎవరు?' అన్నడు ఉదయ్‌లాల్.

'రామస్వామి అంటే యాదయ్య.. మీ ఉదయ్ క్లాత్ స్టోర్‌లో పనిచేసిండు..'

ఆయన కాసేపు ఆలోచించి 'యాదయ్యా! అవును మాదంట్ల పనిచేసి ఉండె. చంద్రం ఇంట్లనే ఉండేది కదా. ఆ యాదయ్య మనవనివా నువ్వు? ఎట్లున్నడు యాదయ్య.. మంచిగున్నడా?'

'మంచిగనే ఉన్నడ'న్నట్లు తల ఊపాను. కొన్నిసార్లు మనుషులు బాగోలేకపోయినా, బావుండ్రనే చెప్పాల్సి వస్తుంది.

'మంచోడు ఉంటుండెగనీ.. బాంబు ఏసి ఆగం చేస్కునే. సరే ఏం కావాలె చెప్పుండ్రి'

'చంద్రం ఎక్కడుంటున్నాడో ఏమైనా తెలుసా మీకు?' అని అడిగిన పని మనిషి తెచ్చిచ్చిన మంచినీళ్లు తాగుతూ. ఆమె చీరకట్టు కొత్తగా అనిపించింది.

'చంద్రం ఇల్లు అమ్ముకున్నంక ఎటుపోయిండో తెల్వదు..' అని చెప్పిండు ఉదయ్‌లాల్.

'ఆ ఇంట్లనే నజియా అని కిరాయికి ఉండేది, ఆమె గురించి కావాలె మాకు' అని అడిగింది అనన్య నీళ్ల గ్లాస్ టీపాయ్ మీద పెడుతూ.

'నజియానా? నజియా ఎవరో తెల్వదు.. శానా మంది కిరాయికి వొచ్చిండ్రు. పోయిండ్రు.. అందులో నజియా ఎవరో నాకెర్కలే..'

'నజియా గురించి కాకపోయినా.. మీ ఉదయ్ క్లాత్ స్టోర్‌పైన చంద్రం అద్దెకు తీసుకున్న రూమ్‌లో మీటింగ్‌లు అవుతుండేది కదా.. ఆ మీటింగ్‌లకు వచ్చే వాళ్లలో ఎవరైనా తెలుసా?'

'మీటింగులకు.. అంటే.. అందులో లక్ష్మీ నారాయణ పవార్.. గంగారం ఎర్కే.. అప్పట్ల బాంబేసి దొర్కిపోయెగదా.. మీ తాతతో కల్సి..'

'అవును.. వారిని కలిస్తే ఏమైనా తెలుస్తుందేమో అనుకుంటున్నాం. వారిప్పుడు ఎవరు ఎక్కడుండ్రో ఏమైనా తెలుసా?'

'యాడుండ్రంటే.. దొర్కినంక.. శానా రోజులు జైల్లనే ఉన్నరు. పోలీస్ యాక్షన్ అయినంక.. ఏడాదో రెండేళ్లకో జైలుకెంచి బయటికొచ్చిండ్రు.. పేపర్లల్ల గూడా ఆళ్ల ఫొటో వచ్చి ఉండె అప్పుడు. గంగారం ఏటు పోయిండో తెల్వదుగానీ.. పవార్ అయితే గీడ ఉంటుండె.. బ్యాంకుల ఉద్యోగం చేసి రిటైర్ అయిపోయిండు'

'పవార్! పవార్ అడ్రస్ కావాలి.. చెప్పగలరా?'

'అడ్రస్ తెల్వదుకానీ.. నల్లకుంటల ఉంటుండె. ఫీవర్ హాస్పిటల్ ఎదురుంగ గల్లిల. ఇల్లయితే సరిగ్గ తెల్వదు..' అని చెప్పిండు.

'పవార్ జైల్లో ఉన్నప్పుడు జరిగిన విషయాలు.. ఆయనకెలా తెలుస్తాయి?' అని అడిగింది అనన్య. ఉదయ్‌లాల్ ఇంట్లోంచి బయటికి వొస్తున్నప్పుడు.

'తెలియక పోవచ్చు. కానీ చూద్దాం. ఎవరి దగ్గర ఏ ఆధారం దొర్కుతుందో.. అయన బయటికి వొచ్చాక మిగిలిన వాళ్లు ఏమైపోయారో తెలుసుకునే ప్రయత్నం చేసి ఉండొచ్చు కదా..' అన్నాను నేను కార్ ఎక్కుతూ.

ఉదయ్‌లాల్ మాతో మాట్లాడుతున్నప్పుడు ఆయన కళ్లలో ఏదో ఆనందం కనిపించింది. ఎందుకో అని ఆలోచిస్తుండగానే 'ఇదే ఫీవర్ హాస్పిటల్' అన్నది అనన్య. అంబర్‌పేటకు, ఫీవర్ హాస్పిటల్‌కు పెద్ద దూరం ఏం లేదు.

'ఆపు.. ఆపు.. ఒక సిగరెట్ తాగుదాం!' అన్నాడు వినోద్. ఈ రోజు వాడు మార్నింగ్ నుంచి సిగరెట్ అడగలేదంటే గొప్ప విషయమే.

ఫీవర్ హాస్పిటల్ ఎదురు గల్లీలో కార్ ఆపి నేను, వినోద్ సిగరెట్ అంటించాం. అనన్య కార్ విండోస్ ఆటో బటన్ నొక్కి దించింది. చుడీదార్‌లో ఉన్నప్పుడు అమ్మాయిలు సిగరెట్ తాగరేమో!

నేను సిగరెట్ పొగ బయటికి వొదులుతున్నప్పుడు.. 'కార్తీక్! అటు చూడు' అన్నది.

దూరంగా ఒక బ్యానర్ మీద.. తెలుగు అక్షరాలు పెద్దగా రాసి ఉన్నాయి.

'ఏంటది?' అడిగాను అర్థంకాక.

'హైదరాబాద్ పోరాట యోధుడు.. తెలంగాణ భగత్‌సింగ్.. లక్ష్మీ నారాయణ పవార్‌కు శ్రద్ధాంజలి' అని చదివి వినిపించింది.

♦♦♦

# 12

# పోలీస్ యాక్షన్

'శ్రద్ధాంజలి అంటే?' అడిగాను నేను.

'శ్రద్ధాంజలి అంటే.. పవార్ ఈజ్ నో మోర్' చెప్పింది అనన్య.

'అవునా? పవార్ చనిపోయాడా?' అన్నాడు వినోద్. అది ఆశ్చర్యమో, ఆవేదనో అర్థం కాలేదు.

'యస్. చనిపోయాడు. ఇప్పుడేం చేద్దాం' అన్నది అనన్య.

నేనేం మాట్లాడలేదు.

'బొకే తీసుకుందాం.. కండోలెన్స్ బొకే' అన్నాడు వినోద్.

'యస్ యూ ఆర్ రైట్' అన్నాను వినోద్‌ను మెచ్చుకుంటూ.

'పేపర్ లీక్ అయిందంటే.. ప్లంబర్‌ని పిలిచే ఫేస్ అనుకున్న. కానీ పర్లేదు. అప్పుడప్పుడు నీ బ్రెయిన్ కూడా పనిచేస్తది' అన్నది అనన్య. వినోద్ దాన్ని కాంప్లిమెంట్‌గానే తీసుకున్నాడు.

మేం తెల్ల గులాబీ పూల బొకే తీసుకుని వెళ్లాం. దాన్ని అంజలి ఘటించడం అంటారని చెప్పింది అన్నూ. అలా ఘటిస్తున్నప్పుడు డాడ్ ఫోన్ చేశారు. నేను లిఫ్ట్ చెయ్యలేదు.

తర్వాత పక్కకెళ్లి కాల్ చేశాను.

'డాడ్! ఎలా ఉంది తాతయ్యకు?'

'వెరీ సీరియస్, కష్టం అంటున్నారు డాక్టర్లు. మీరెక్కడున్నారు?' ఆయన గొంతులో జీవం లేదు.

నేను పవార్ గురించి, ఆయన తాతయ్యతో కలిసి బాంబు దాడిలో పాల్గొన్న విషయం గురించి చెప్పాను. కానీ డాడీ నజియా గురించే అడిగారు. అదే పనిలో ఉన్నామని చెప్తే 'హర్రీఅప్' అన్నారు. నేను ఫోన్ మాట్లాడుతున్నప్పుడు అన్నూ, విన్నూ ఎవరితోనో మాట్లాడుతున్నారు.

'సత్యనారాయణ అడ్రస్ దొర్కింది' అనుకుంటూ వచ్చారిద్దరు.

'సత్యనారాయణ??' ఎవరు అన్నట్లు ఫేస్ పెట్టాను.

'సత్యనారాయణరా.. శ్రీకష్ట సైకిల్ ట్యాక్సీ..' అన్నాడు వినోద్.

'ఓహ్.. యస్.. యస్.. శ్రీకృష్ణ సైకిల్ ట్యాక్సీ..'

'చలో కోఠీ' అంటూ కార్ వైపు కదిలింది అన్నూ.

♦

'ఆయన మాట్లాడే పరిస్థితిలో లేరు. ఏం కావాలో చెప్పండి' అన్నాడు ఆ కుర్రాడు. ఇంచు మించు మా వయసు వాడే.

మేం శ్రీకృష్ణ ఆటోమొబైల్స్‌లో ఉన్నాం. కోఠీలో పెద్ద షోరూమ్. దాని జనరల్ మేనేజర్ రాకేష్‌తో మాట్లాడుతున్నాం.

పవార్ తమ్ముడు శ్రీకృష్ణ ఆటోమొబైల్స్ అడ్రస్ చెప్పాడట. జైలు నుంచి వచ్చాక గంగారాం తన సొంత ఊరు పాల్మకులకు పోయిండని, ఆ తర్వాత ఎప్పుడూ రాలేదని చెప్పాడట. అబ్దుల్లా ఎవరో, రణధీర్ ఏమయ్యాడో తెలియదన్నాడట. పవార్ జైలు నుంచి విడుదలైనప్పుడు సైకిల్ షాప్ సత్యనారాయణ కూడా వచ్చాడని, ఆ తర్వాత

కూడా అప్పుడప్పుడూ వస్తుండేవాడని, ఇద్దరూ మంచి స్నేహితులని, ఈ మధ్యే ఆరోగ్యం బాగోలేక రావట్లేదని చెప్పాడట పవార్ తమ్ముడు. ఇదంతా నల్లకుంట నుంచి కోఠీ వస్తున్నప్పుడు చెప్పింది అనన్య.

'యాక్చువల్లీ! మేం ముంబై నుంచి వచ్చాం. మా తాతకు సీరియస్‌గా ఉంది. ఆయన కోసం నజియాను వెతికే పనిలో ఉన్నాం. తన ఆచూకీ కోసం మాకు ఏ ఆనవాళ్లూ దొరకడం లేదు. మీ తాతయ్యను కలిస్తే ఏమైనా క్లూస్ దొరుకుతాయేమోనని..' అని చెప్పాను.

'ఓకే.. ఐ క్యాన్ అండర్‌స్టాండ్.. కానీ ఆయన మాట్లాడలేడు. పెరాలసిస్. ఇంకేదైనా సహాయం కావాలంటే అడగండి.. చేస్తాను' అన్నాడు రాకేష్ అనన్యను చూస్తూ.

'నిజాం మీద బాంబు దాడికి వెళ్లినప్పుడు తాతయ్య, పవార్ మీ దగ్గర సైకిల్ ట్యాక్సీ తీసుకుని వెళ్లారు. ఆ తర్వాత ఏం జరిగిందో కావాలి, చెప్పేవారు ఎవరైనా ఉంటే..'

'ఏమో ఆ ఇన్సిడెంట్ గురించి నాకు ఐడియాలేదు. బట్.. 1947 టైమ్ అంటున్నారు కాబట్టి మీ కోసం నేనో హెల్ప్ చేయగలను. ఆ పర్టిక్యులర్ పీరియడ్ గురించి మా ఫాదర్ చాలాసార్లు చెబుతుంటారు. ఆయన్ని అడిగి చూద్దాం. మనకు ఇంకేదైనా క్లూ దొరకొచ్చు' అన్నాడు. రాకేష్ ఏంటో నేను అడిగిన దానికి సమాధానం అనన్యకు చెబుతున్నాడు. కొన్నిసార్లు అందమైన అమ్మాయిలు పక్కన ఉండడం వల్ల పనులు సులభంగా జరుగుతాయని అర్థమైంది.

రాకేష్ మమ్మల్ని ఎందుకో చాలా ఆత్మీయుల్లా తీసుకెళ్లి వాళ్ల నాన్నకి పరిచయం చేశాడు. ఆయన నిజాంపై బాంబు దాడి గురించి అడిగినప్పుడు చాలా ఉద్వేగానికి గురయ్యాడు.

'ఆగస్టు 15, 1947 నుంచి సెప్టెంబర్ 17, 1948 వరకు హైదరాబాద్‌లో జరిగిన అనేక సంఘటనలు నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఈ పదమూడు నెలల కాలంలో నాకు ఎదురైన అనుభవాలు ఎప్పుడూ నా కళ్ల ముందు కన్పిస్తుంటాయి. అవన్నీ మీకు వివరంగా చెప్తా' అని ఇలా ప్రారంభించాడు.

1947 ఆగస్టు 15

దేశమంతా స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటోంది. కానీ.. తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది. అప్పటికే

హైదరాబాద్ ఒక బలమైన స్వతంత్ర రాజ్యంగా నిలదొక్కుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాంకు బ్రిటీషు వారు మూడు అవకాశాలు ఇచ్చారు. ఒకటి.. పాకిస్తాన్‌తో చేరడం.. రెండు.. స్వతంత్రంగా ఉండడం. మూడు ఇండియన్ యూనియన్‌లో చేరడం. నిజాం రెండో ఆప్షన్ ఎంచుకున్నాడు. భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన చర్చలన్నీ విఫలమయ్యాయి. భారతదేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్, రజాకార్ల కార్యకలాపాలు శాంతికి సామరస్యానికి భంగం కలిగించాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే.. నిజాం నవాబు మీద బాంబు దాడికి ప్రయత్నించి విఫలమయ్యారు మీ తాతవాళ్లు.

అయ్యాల ఏమైందో చెప్తా ఇనుండ్రి. బడికెందుకు పోలేదో ఏమోగనీ.. అయ్యాల నేను సైకిల్ షాప్‌లనే ఉన్న. పొద్దుగాల పొద్దుగాల్నే ఐదుగురు వొచ్చి మూడు సైకిళ్లు తీసుకున్నరు. అందులో నాకు పవార్ మాత్రమే తెలుసు. ఆయన మా నాన్నకు మంచి దోస్తు. ఒక సైకిల్ మధ్యాహ్నానికి తీసుకొచ్చి ఇచ్చారు.

అయ్యాల సాయంత్రం పోలీసులొచ్చారు. నాకేం తెల్వదని నేను మా నాన్నను పిలిచాను. ఆయన వొచ్చాక పోలీసులు నోట్ పుస్తకం తీసుకున్నారు. తొమ్మిది, పది, పదకొండు నంబర్ల సైకిళ్లు ఎవరెవరు తీస్కున్నారో చూశారు. తొమ్మిదో నంబర్ సైకిల్ దేవ పేరు మీద ఉంది. ఆ సైకిల్ తిరిగి వొచ్చింది కాబట్టి దేవని అడగలేదు. పది రామస్వామి, పదకొండు పవార్ పేరు మీద ఉన్నయి. పది, పదకొండు రాలే. పదకొండో నంబర్ సైకిల్ మల్ల తెల్లారి ఎవరో తీసుకొచ్చి ఇచ్చిండ్రు. ఆయన పేరు అడిగితే రణధీర్ అని, ఈ సైకిల్ పవార్ ఇచ్చిరమ్మన్నడని చెప్పిండు.

అయితే పోలీసులు 'పవార్ దొర్కిండు, కానీ ఈ పదో నంబర్ రామస్వామి అడ్రస్ చెప్పమ'ని అడిగిండ్రు. ముందుగాల 'పవార్ ఒక్కడే తెలుసు, పవార్ ఎమ్మటి వొచ్చిండు కాబట్టి రామస్వామికి సైకిల్ ఇచ్చినగనీ.. ఆ రామస్వామి ఏడుంటడో తెల్వదు' అని చెప్పిండు మానాన్న. అందుకు పోలీసులేమో 'అడ్రస్ తెల్వంది ఎట్ల ఇస్తవ్? నీకు తెల్సుగానీ చెప్పు. లేకపోతే నిన్ను గూడా పోలీస్ స్టేషన్‌కు తీస్కపోతం' అని బెదిరించిండ్రు. దీంతో అడ్రస్ చూపించడానికి పోలీసులతో వెళ్లాడు నాన్న. అక్కడ ఆరా తీస్తే 'పొద్దున పోయిండు ఇంత వరకు రాలే' అని తెల్సిందంట. ఆ ఇంటి యజమాని పేరు చంద్రం అని చెప్పడంతో దేవ బతికి పోయిండు. ఇంగ పోలీసులు మీ తాత అర్ర తాళం పగలకొట్టి అన్నీ సగబెట్టిండ్రంట. ఏందేందో పుస్తకాలు తీస్కపోయిండ్రంట.

ఇంగ వొస్తప్పుడు ఆ గల్లిలనే ఉండే అబ్దుల్లా 'రామస్వామిని దేవులాడుతుండ్రా. నేను

సూసిన. ఇంగో ఇప్పుడే ఇట్ల సైకిల్ ఏస్కుని పోయిండు' అని పోలీసులకు చెప్పిండంట. మా నాన్న చెప్పొద్దని సైగ చేస్తున్నాగూడ ఇనకుండ చెప్పిండంట. ఆ అబ్దుల్లా గూడా సైకిల్ కోసం మా దుఖ్నానికి అప్పుడప్పుడు వొస్తుండె. ఇంగో అట్లయింది.

మీ తాత తీస్కపోయిన పదో నంబర్ సైకిల్ చాలా రోజుల దాంక దొర్కలే. ఆ తర్వాత ఎప్పుడో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉందని పోలీసులు చెప్తే మా నాన్న పోయి తెచ్చిండు. గిందంత అయితారికే ఏడాది అయింది.

ఇంగ 1948 ఆగస్టు 15 నాడు ఏమైందంటే?

దేశానికి స్వాతంత్ర్యంవొచ్చి ఏడాది అయింది. కానీ మనం ఇంకా నిజాం పాలనలోనే ఉన్నాం. కాబట్టి వేడుకలు నిషేధం. జాతీయ నినాదాలే కాదు, జాతీయ నేతల పేర్లు పలకడమూ నిషేధమే. అప్పుడు నేను ఏడో తరగతికి వొచ్చిన. మా బడిల ఉదయం ఎనిమిదిన్నరకు దైవప్రార్థనానంతరం, నిజాం రాజు స్తోత్రం.. ఆ తరువాత నిజాం ప్రభుత్వ పతాకావిష్కరణ, అటుపైన వందన సమర్పణ జరగడం ఆనవాయితీ. అయితే ఆర్యసమాజ్ వారు ఎలాగైనా ప్రథమ స్వాతంత్ర్యోత్సవాలను జరపాలని అనుకుంద్రు. జాతీయ పతాకాలను ఆయా ప్రభుత్వ కార్యాలయాలపై ఆవిష్కరింపజేయాలని, నిజాం పతాకానికి వందన సమర్పణ తిరస్కరించాలని, జాతీయ నినాదాలు, జాతీయ జయనాదాలు చేయాలని నిర్ణయించారు.

ఆ రోజు కూడా యథావిధిగా మా బడిలో..

తారిఫే ఉస్ ఖుదా కో, జిస్నే జహాఁ బనాయా..

జీస్నే జహాఁ బనాయా, కాన అస్మా బనాయా.. అంటూ ప్రార్థన మొదలైంది. తర్వాత నిజాం రాజు స్తోత్రం, అటు తర్వాత పతాకావిష్కరణ..

మా హెడ్‌మాస్టర్ 'సలాంకరో' అనంగనే ముస్లిం విద్యార్థులంతా సెల్యూట్ చేశారు. హిందువులమంతా సెల్యూట్ చేయలేదు.

మమ్మల్ని గమనించిన హెడ్ మాస్టర్.. 'మై దూస్‌రీ బార్ బోల్ రహాహుఁ జెండా కో సలాం కరో' అంటూ ఊగిపోయాడు.. అయినా మేం మౌనంగానే ఉన్నాం.

'తుమ్ సబ్ లోగ్ యహా సే చలే జావో! మేరే మదరసే కో ఆనే కా జరూరత్ నహీ..' అంటూ మమ్మల్ని బయటకు గెంటేసి పాఠశాల గేటు వేశాడు. ముందే అనుకున్నట్లు..

మమ్మల్ని చుట్టుముట్టిన పోలీసులు లాఠీ ఝులిపించారు. మేమంతా 'స్వంతత్ర భారత్ కీ జై, వందేమాతరం, పోలీస్ జులుం ముర్దాబాద్..' అంటూ పెద్దగా నినాదాలు చేశాం. కొందరు విద్యార్థులు రాళ్లతో పోలీసులపై దాడి చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అందరూ చెల్లాచెదురయ్యారు. కొందరు పరారై షాపులల్లో, ఇళ్లల్లో దాక్కున్నరు. విద్యార్థులకు ఆశ్రయమిచ్చిన వారిపై పోలీసులు కేసులు బనాయించారు. చిత్ర హింసలు పెట్టారు. నన్నయితే పదిహేను రోజులు స్కూలు నుంచి బహిష్కరించారు.

ఆ తర్వాత ఆగస్టు 21 అర్ధరాత్రి ఇమ్రోజ్ పత్రిక నడుపుతున్న షోయబుల్లాఖాన్‌ను నిజాం ప్రభుత్వం హత్య చేయించింది. నిజాం చేపట్టిన ఈ చర్యలు, రజాకార్ల హింసపై హైదరాబాద్ పోలీస్ చర్యకు కేంద్ర ప్రభుత్వం నడుం కట్టింది.

యూనియన్ సైన్యాలు.. హైదరాబాద్‌పై దాడి చేయబోతున్నాయన్న వార్త నిజాం రాజ్యమంతటా వ్యాపించింది. దీంతో నిజాం సర్కార్ ప్రతిరోజూ రాత్రిపూట నగరంలో బ్లాక్ అవుట్ అమలు చేయించేది. బ్లాక్ అవుట్ అంటే ముందు ఆకాశంలో ఎర్రలైటు వెలిగేది. ఆ తర్వాత పెద్దగా సైరన్ మోగేది. ఆ సిగ్నల్ వచ్చిన తర్వాత.. ఇళ్లలో ఎవరూ లైట్ వేయకూడదు. కనీసం దీపం కూడా పెట్టొద్దు. యూనియన్ సైన్యాలు రాత్రి పూట దాడులు చేస్తాయన్న భయంతో నిజాం సర్కార్ అలా చేయించేది.

బ్లాక్ అవుట్ సైరన్ మోగంగనే జనాలందరూ ఇళ్లపైకి ఎక్కి విమానాలు వొస్తాయని, తమని రక్షిస్తాయని చూస్తుండేది.

ఇంగో ఇట్ల ఉన్నప్పుడే 1948 సెప్టెంబర్ 17 రానేవొచ్చింది. అయ్యాల గూడా రోజు మాదిరిగానే మా బడిలో ప్రార్థన జరుగుతోంది.. సరిగ్గా అదే సమయంలో ఒక హెలికాప్టర్ శబ్దం వినిపించింది. అప్పటికే ఆ పరిసరాల్లో రెండు రౌండ్లు చక్కర్లు కొట్టి తిరిగి వెళ్లిపోతోంది.

ఆ హెలికాప్టర్‌ను చూసి మా పాఠశాలలోని ముస్లిం విద్యార్థులు 'ఆజ్ హవాయి జహాజ్ గిర్ జాతే' అంటూ సంబురాలు పంచుకున్నారు. మా వైపు హేళనగా చూశారు. అలాంటి వేధింపులు మాకు అలవాటై ఈసారి కూడా పెద్దగా పట్టించుకోలేదు.

క్లాస్‌లోకి వెళ్లి కూర్చున్నాం. 9.45 గంటలకు పెద్ద శబ్దం వినిపించింది. ముస్లిమ్ పిల్లలంతా 'హవాయ్.. జహాజ్ గిర్ గయా' అంటూ క్లాస్ నుంచి బయటికి పరుగులు తీశారు. నేను కూడా ఏమైందో చూద్దామని బయటికి వొచ్చాను. రోడ్డు వెంబడి జనం పరుగులు తీస్తున్నారు. ఇంతలో హెడ్‌మాస్టర్ పిల్లలందరినీ లోపలికి పిలిచి గేట్

వేయించాడు.

హైదరాబాద్ పోలీస్ చర్య మొదలైంది. దీనికి ఆపరేషన్ పోలో అని పేరు పెట్టారు.

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి 22 మార్గాల ద్వారా సైన్యం హైదరాబాద్ రాజ్యంలోకి ప్రవేశించింది. ఉస్మానాబాద్ అవుతల బ్రిడ్జిని పేల్చి వేయాలని నిజాం సర్కార్, రజాకార్లు అనుకున్నారు. కానీ అంతకుముందే భారత బలగాలు బ్రిడ్జీ దాటి వచ్చేశాయి.

పైన విమానాలు, కింద యుద్ధ ట్యాంకులు, ట్రక్కులు, వాహనాలు, మిలటరీ బలగాలు.. అనేకం వచ్చినయ్. సుక్కు, గుర్కా, గ్వాలియర్, మలబార్ పోలీసులు హైదరాబాద్‌ను చుట్టుముట్టారు. సైనిక కవాతులు, బూట్ల చప్పుళ్లతో బజార్లన్నీ బలగాలతో నిండిపోయాయి. యుద్ధం మొదలైంది.

గాల్లో విమానాలు పల్టీలు కొట్టాయి. యుద్ధ విన్యాసాలు చేశాయి. ఢాం, ఢూం డిష్యూమ్.. ఫిరంగి మోతలు, తుపాకీ చప్పుళ్లు.. అరుపులు, ఆర్తనాదాలు.. చావుకేకలు.. రక్తపు మడుగులు.. అయిపోయింది. అంతా అయిపోయింది. నాలుగు గంటలు సాగిన ఆ సమరంలో రజాకార్ల శవాలు గుట్టలుగా పడిపోయాయి. మిలటరీ వాళ్లు రజాకార్ల ఇండ్లలోకి చొరబడి మరీ పట్టుకున్నారు. అయితే కొందరు రజాకార్ల ప్రాణాలు కాపాడుకోవడానికి తమ వేషధారణ మార్చుకున్నారు. గుండ్లు గీయించుకుని, నామాలు పెట్టుకుని, జంజెములు వేసుకుని, పంచెలు బుడ్డ గోచీలు పెట్టుకుని అయ్యవార్ల రూపంలో దర్శనమిచ్చారు. కాని స్థానికులు వారిని గుర్తు పట్టి పేరు పేరునా పట్టించారు.

గద్దొచ్చె కోడిపిల్ల.. సిల్లాం కల్లాం అన్నట్లు అయిపోయింది హైదరాబాద్ పరిస్థితి.. ముస్లింలను కాల్చి చంపడంలో సిక్కు సైనికులు ఆనందం పొందిండ్రు.. ఆడవాళ్లను చెరచడంలో గూర్ఖా సైనికులు ఆనందం పొందారు.. ఆపరేషన్ పోలోలో కొందరు అమాయక ముస్లింలు కూడా బలయ్యారు. అప్పటికి అణిగిమణిగి ఉన్న కొందరు హిందువులు మిలటరీ అండ చూసుకుని రెచ్చి పోయిండ్రు.

ఎలాగైతేనేం.. సెప్టెంబర్ 17న రాత్రి ఇండియన్ యూనియన్ సైన్యం దాడికి భయపడి రజాకార్ల నాయకుడు రజ్వీ పారిపోయిండు. నిజాం రాజు లొంగిపోయాడు.

చిన్న పిలగాన్ని కదా.. ఇదంతా అప్పుడు నాకు తెలియదు. ఏం జరుగుతుందో.. అప్పుడు అర్థం కాలేదు. కానీ ఏం జరిగిందో ఆ తర్వాత తెలుసుకున్న.

1948 సెప్టెంబర్ 17 అంటే నిజాం గద్దె దిగిన రోజు.. రజాకార్ల దురాగతాలు

అంతమొందిన రోజు.. తెలంగాణ పరిపూర్ణ స్వాతంత్ర్యం సాధించిన రోజు.. తెలంగాణ పుర వీధుల్లో త్రివర్ణ పతాక తోరణాలు కట్టిన రోజు..

రాకేష్ వాళ్ల నాన్న ఇదంతా మాకు చెబుతున్నప్పుడు కళ్లముందు జరిగినట్లే అనిపించింది. ఆయనతోపాటు మేం కూడా ఎమోషనల్ అయ్యాం.

'అంకుల్! మీరు స్కూల్ టీచర్‌గా పనిచేశారా?' అని అడిగింది అనన్య.

'అవును. కొంత కాలం పనిచేశా! నీకెలా తెల్సు?' అన్నారు అంకుల్. అదేంటో అనన్య వరుస కలిపేసింది.

'ఏం లేదు అంకుల్. మీరు చెబుతుంటే.. హిస్టరీ క్లాస్ విన్నట్టుగా ఉంది' అన్నది.

అందుకాయన నవ్వుతూ.. 'అవును. మన చరిత్ర అలాంటిది.. చాలా గొప్పది. ప్రపంచ చరిత్రలో ఏదేశాన్నయినా.. తీసుకోండి.. స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఏడాది పాటు.. ప్రజలు ఇంకా బానిస బతుకు బతికిన చరిత్ర మనకు ప్రపంచ చరిత్రలో ఎక్కడా కనిపించదు..'

'యస్.. అంకుల్.. గ్రేట్ హిస్టరీ.. అంకుల్! ఇప్పుడొక డౌట్?' అడిగాను నేను.

లేకపోతే అనన్య, అంకుల్ ప్రపంచ చరిత్రలోకి ఎక్కడికో వెళ్లిపోయేలా ఉన్నారు.

'అడుగు కార్తీక్ రామస్వామి!' అన్నాడు అంకుల్. నా పేరు అలా పిలవడం మంచిగా అనిపించింది. స్కూల్ టీచర్లు ఇలా పూర్తి పేరుతో పిలుస్తారేమో.

'అంకుల్! మీ నాన్నగారు.. పోలీసులతో చంద్రం ఇంటికి వెళ్లినప్పుడు.. అక్కడ నజియా ఏమైనా కనిపించిందా?'

'నజియా! ఏమో తెలియదు. కానీ పోలీసులు చంద్రం ఇంట్లనే అడిగారు. ఇదే రామస్వామి గది అని చూపించడంతో అయిపోయింది..'

'ఇంకోటి అంకుల్.. తాతయ్య అబ్దుల్లాను కలిశారు. మీరు చెప్పినదాంట్లో.. అబ్దుల్లా తాతయ్య గురించి పోలీసులకు చెప్పారు.. పైగా ఆయన నజియాను సతాయిస్తుండేవాడు.. నాకు అబ్దుల్లా మీద డౌట్‌గా ఉంది.. ఆయన్ని కలవాలి.. మీకు అడ్రస్ ఏమైనా తెలుసా?'

'తెలుసు' అని ఆయన అనడంతో మనసు కుదుటపడింది. నాకెందుకో నమ్మకం

కలుగుతోంది. నజియా ఏమైపోయిందో అబ్దుల్లాకు తెలుసు అని. ఆయనకెలా తెలుసు అని పట్టిక్యులర్‌గా అడిగితే చెప్పలేను, కానీ మనస్సాక్షి చెబుతున్నది నజియా గురించి అబ్దుల్లాకు తెలుసని.

'అంకుల్! థ్యాంక్యూ అంకుల్.. థ్యాంక్స్ ఏ లాట్. నెక్స్ట్ టైమ్ హైదరాబాద్ వొచ్చినప్పుడు మళ్లీ తప్పకుండా కలుస్తా అంకుల్' అని అబ్దుల్లా అడ్రస్ చెప్పాక రాకేష్ వాళ్ల నాన్నకు ఒకటికి పదిసార్లు థ్యాంక్స్ చెప్పింది.

'లంచ్ టైమ్ కదా భోంచేసి వెళ్లండి' అన్నాడు రాకేష్.

'పర్లేదు.. నెక్స్ట్ టైమ్!' అంది అనన్య.

'నైస్ టు మీట్ యూ అనన్యా, వీ విల్ మీట్ ఎగైన్' అంటూ కార్ దగ్గరికి వొచ్చి మరీ సెండాఫ్ ఇచ్చాడు రాకేష్.

♦

ఇసామియా బజార్‌లో చంద్రం, తాతయ్య ఉన్న ఇంటికి దగ్గర్లోనే అబ్దుల్లా ఇల్లు. పాతబడి ఉంది. గోడలు అక్కడక్కడా పెచ్చులూడుతున్నాయి. ఇంటి ముందు అరుగులు.. చూస్తే తాతయ్య అక్కడ కూర్చున్నట్లు జ్ఞాపకం వచ్చింది.

తలుపు కొడితే ఒక అమ్మాయి వచ్చి తీసింది.

'అబ్దుల్లా గారూ..?' అన్నాన్నేను.

'హై.. ఆప్ కౌన్?' అని అడిగింది.

'మై ముంబైసే ఆ రహాహు.. సాబ్‌కే మిల్‌నే కేలియే..' అన్నాను.

'దాదా ఖానా ఖా రహాహై.. అందర్ ఆయియే..' అంటూ లోపలికి వెళ్లింది.

మేం బయటే అరుగు మీద కూర్చున్నాం. కాసేపటి తర్వాత ఒక పెద్దావిడ వచ్చింది.

'ముంబైకెంచి వొచ్చింది మీరేనా? ఏంకావాలె??' అని అడిగింది.

మేం చెప్పబోతుండగానే.. 'అందర్ ఆయియే' అంది.

లోపలికి వెళ్లాక 'అదిగో ఆయినే. లేవలేడు.. కూసోలేడు.. ఆయినతో మీకేం పని?'

అన్నది.

'నేను రామస్వామి మనవడ్ని. నజియా కోసం వెతుకుతున్నాం' అన్నానేను.

'మాకు తెలుసు ఆమె గురించి మీకు తెలుసని?' గట్టిగా అంది అనన్య. తను ఎందుకు అలా అన్నదో నాకు అర్థం కాలేదు. తన వైపు చూస్తూ కళ్లు అర్పింది. ఆమె వైపు చూడు అన్నట్లు సైగ చేసింది.

ఆ పెద్దావిడ మొహంలో నెత్తురు లేదు. కాసేపు ఏం మాట్లాడలేదు. కన్నీరు పెట్టుకుంది.. 'చెప్త బిడ్డా చెప్తా. తెలుసు. ఆ నాజియా గురించి తెలుసు. ఇప్పుడు బీ చెప్పకపోతే ఆ అల్లా నన్ను క్షమించడు' అంది. కూర్చోమంది. అబ్దుల్లా దగ్గరికి పోయింది. చెవుల ఏదో చెప్పివొచ్చింది.

'నేను రామస్వామి మనవడ్ని' అన్నాను.

'తెలుసు బిడ్డా! ఎర్కయితుంది. అయ్యాల ఆయిన కండ్లల చూసిన దేవులాటే.. ఇయ్యాల నీ కండ్లల్ల కనిపిస్తున్నది. చెప్పాలె బిడ్డా.. శానా చెప్పాలె. మా ముసలోడు చేసిన దానికి పాపం మీరెంత బాధపడుతున్నరో నాకు ఎర్కయితున్నది. అప్పుడు మీ తాత వొచ్చినప్పుడే చెబుదామనుకున్న బిడ్డా. కానీ మీ తాత ఈయన్ని యమ కొట్టుడు కొడుతుండె.. ఇంగ ఈ ముచ్చట చెప్తే ఊకుంటడా. సంపేస్తడేమో అని భయపడ్డ. నిజాం రాజునే సంపాలనుకున్నాయనకు ఈనను సంపడం ఒక లెక్కా అని భయమేసింది. అందుకనే నేను బీ మాకు తెల్వదనే చెప్పిన. పాపం.. నా మాట ఇనే ఆయన సప్పుడు చేక పోయిండు. ఇన్ని ఎండ్లకు దేవులాడుకుంట మల్ల మీరొచ్చిండ్రు.. ఇప్పుడు బీ చెప్పకపోతే.. ఇంగ ఈ జిందగీకి అర్థమే లేదు' అని చాలా బాధపడింది.

ఒక మనిషి తాను చేసిన తప్పేంటో తెలుసుకోవడానికి జీవితకాలం పడుతుందా? అనిపించింది. ఆ పెద్దావిడ మాటల్లో పశ్చాత్తాపం కనిపించింది. కానీ ఆమె చెప్పిన ముచ్చటలో మాకు నజియా కనిపించింది. నజియా ఒక **రణ దివిటీ** అని అర్థమైంది.

♦♦♦

# 13

# రణ దివిటీ

మిలటరీ వారు ఇళ్లలోకి వచ్చి మరీ రజాకార్లను, వారి సానుభూతిపరులను పట్టుకుని చంపేస్తున్నారని విన్న అబ్దుల్లా ఒక పథకం వేశాడు.

నజియా మీద కోపంతో, కోరికతో చేసిన పని అది.

'మా అన్న ఖుఫియా కదా, నన్ను మిలటరీ పోలీసులు ఏం చేయరు. కానీ నిన్ను పట్టుకుంటరు. ఎందుకంటే మనం రజాకార్ల పేరుతో నజియా వాళ్ల ఇంటికి వెళ్లి బెదిరించాం కదా. అందుకే ఎటైనా వెళ్లి దాస్కోపో.. లేదంటే ఆ మిలటరీ వాళ్ల చేతిలో నువ్వు ఖతమ్ అయిపోతావ్' అని తన మిత్రుడిని బెదిరించాడు అబ్దుల్లా.

వాడు హడలి పోయాడు. ఎక్కడ దాస్కోవాలో తెలియక సతమతమయ్యాడు.

అప్పుడు అబ్దుల్లానే వాడికో సలహా ఇచ్చాడు 'ఎవరికీ తెలియకుండా పోయి నువ్వు నజియా వాళ్ల ఇంట్లో దాస్కొమ్మని చెప్పాడు'

అబ్దుల్లా మిత్రుడు ఆలోచించకుండా అలాగే చేశాడు.

అబ్దుల్లా అప్పుడు తన పథకం అమలు చేశాడు.

మిలటరీ వారి దగ్గరికి వెళ్లి 'మా అన్న ఖుఫియా' అని పరిచయం చేసుకున్నాడు. 'నజియా వాళ్ల అబ్బాజాన్ రజాకార్లకు సహాయం చేస్తున్నాడని, ఇప్పుడు కూడా ఒకడిని దాచిపెట్టార'ని మిలటరీ పోలీసులకు చెప్పాడు.

వెంటనే కొందరు మిలటరీ పోలీసులు నజియా వాళ్ల ఇంటిమీద దాడికి బయలుదేరారు.

మిలటరీ వారు తమ గల్లీలోకే వస్తున్నారని తెలుసుకున్న జనాలు తలుపులు బిగించుకున్నారు. మిలటరీ పోలీసులు నేరుగా నజియా ఇంటికి వెళ్లి తలుపులు పగలగొట్టడం మొదలెట్టారు. 'దబ్ దబ్' అని సప్పుడు వస్తున్నది. అది విని ఓ మూలన దాక్కున్న అబ్దుల్లా మిత్రుడు గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేశాడు. వాడిని పట్టుకుని పోలీసులు కాల్చి చంపేశారు.

ఇది చూసిన నజియా అబ్బాజాన్‌కు ఏం చేయాలో అర్థం కాలేదు. తాను ఏమైపోయినా పర్లేదు.. తన బిడ్డను ఎలాగైనా కాపాడుకోవాలనుకున్నాడు. మా ప్రాణాలు పోయినా పర్వాలేదు.. కానీ వయసులో ఉన్న బిడ్డ వారి చేతికి చిక్కితే ఆగం చేస్తారని ఆలోచించాడు.

నజియా అప్పుడే ఒక ఆలోచన చేసింది. కట్టెల పొయ్యిలో బూడిద ఒళ్లంతా పూసుకుంది. బట్టలకూ రుద్దుకుంది. జుట్టంతా చెడగొట్టుకుంది.

ఇంతలో మిలటరీ వారు వీధి గుమ్మం తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. నజియా పిచ్చిదానిలా నటించింది. అందవిహీనంగా తయారైన ఆమెను చూసి మిలటరీ వారు ఏమీ అనలేదు. కానీ రజాకార్‌ను దాచి పెట్టారన్న నెపంతో నజియా అబ్బాజాన్‌ను, అమ్మీని పట్టుకుని వెళ్లారు మిలటరీ పోలీసులు. తన కళ్ల ముందే తన వాళ్లను తీసుకెళుతుంటే నజియా చూస్తూ ఏమీ చేయలేకపోయింది.

'ఊరవతలికి తీసుకెళ్లి మీ అమ్మానాన్నలను కాల్చి చంపేశార'ని వార్త మోసుకెళ్లాడు అబ్దుల్లా. అది విన్న నజియా బోరున ఏడ్వడం తప్ప ఏమీ చేయలేకపోయింది.

'నువ్వు ఇక్కడ ఉంటే నిన్ను కూడా చంపేస్తారని, మా అన్న ఖుఫియా కాబట్టి నన్ను ఏమీ చేయరని, మా ఇంట్లో తల దాచుకుంటే నీకేం కాద'ని నమ్మబలికాడు అబ్దుల్లా.

అతనితో వెళ్లడానికి నజియా ఒప్పుకోలేదు. కానీ, పక్కన కిరాయికి ఉండేవారు బలవంతం చేశారు. అబ్దుల్లా చెప్తున్నదే బావుందని సముదాయించారు. నజియాకు

ఇష్టం లేకపోయినా అబ్దుల్లా బలవంతంగా నజియాను తన ఇంటికి తీసుకెళ్లాడు.

నజియాను చేరదీయడం అబ్దుల్లా చేసిన మంచి పనే అని ఆయన భార్య అనుకుంది. అంతలోనే ఆమెకు అసలు విషయం అర్థమైంది. నజియా మీద అబ్దుల్లా కన్ను ఉందని ఆమెకు తెలిసిపోయింది. నజియాను అబ్దుల్లా ఆగం చేయకుండా ఓ కన్నేసి ఉంచింది. 'ఆమెను ఏమన్నా చేస్తే నేను ఊకోను, నిన్ను చంపడానికి కూడా వెనకాడను' అని అబ్దుల్లాను చాలా గట్టిగా బెదిరించింది. భార్య పోరు పడలేక.. అబ్దుల్లా నజియాను భువనగిరి దొరకు నజరానాగా ఇచ్చాడు. అందుకు భారీ పారితోషికం కూడా తీసుకున్నాడు.

–ఈ కథంతా మాకు అబ్దుల్లా భార్య చెప్పింది.

నజియా భువనగిరి దొర దగ్గరే ఉండిపోయిందా? ఇప్పుడెక్కడుంది? ఈ ప్రశ్నలకు సమాధానమే మేం తదుపరి వెతకాల్సింది. కానీ నజియా ఎక్కువ కాలం భువనగిరి దొర దగ్గర లేదని, ఆమెను ఒక డాక్టర్ అక్కడి నుంచి తప్పించాడని కూడా అబ్దుల్లా భార్యనే మాకు చెప్పింది.

'హిమాయత్‌నగర్‌లో ఉండే మా సుట్టపాయిన డాక్టర్, నాకు మామ వరుస అయితడు. ఆ ఊరికి ఈ ఊరికి తిరిగి వైద్యం చేస్తుండేవాడు. ఇక్కడి నుంచి వెళ్లాక నజియా ఏదో బీమారిల పడ్డదట. ఆమెకు వైద్యం చేస్తందుకు పోయిన మా మామ ఆమెను కనిపెట్టిండంట. మా తుర్కోళ్ల అమ్మాయి ఈడ ఎందుకు ఉందని అనుకుండంట. వైద్యం పేరుతోని చిన్నగ రోజూ పోవుకుంట, నజియాను ఇంగ ఆ దొరకాంచి తప్పించిండంట' అని ఆమె మాతో చెప్పింది. ఇదంతా ఆళ్ల మామ ఒకసారి కలిసి తనకు చెప్పిండంట.

'ఆ తర్వాత ఏమై పోయిందో తెల్వదు బేటా! మావని అడుగుదామన్నా ఆయన లేడు. ఆయన పోయిన ఏడాదే చచ్చిపోయిండు. ఇంగెట్ల బేటా దొర్కబట్టుడు? నా ముసలోడు చేసిన పాపానికి ఏమైపోయిందో ఏమో ఆ నజియా' అని చానా బాధ పడ్డది కూడా.

నమ్మకం సన్నగిల్లుతోంది. చనిపోయిందనుకున్న నజియా బతికే ఉందని తెలిసింది. కానీ ఇప్పుడు అన్ని దారులు మూసుకుపోయాయి. చివరి వరకూ వచ్చాం. ఇక దొరుకుతుంది.. నజియా ఎక్కడ ఉందో తెలిసిపోతుంది అనుకున్నాం. ఆ డాక్టర్ సాబ్ బతికి ఉంటే.. నజియా ఏమైపోయిందో చెప్పేవాడు. కానీ ఇప్పుడు.. ఏం చేయాలి? ఎలా కనుక్కోవాలి? చెప్పేవారెవరున్నారు?

వాచీలో టైమ్ చూశా. ఆల్విన్ వాచీ ఆగిపోయి ఉంది. సరిగ్గా మేమిప్పుడు ఇలాంటి

పరిస్థితిలోనే ఉన్నాం. ఎటు పోవాలో తెలియడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.. ఒక నిశ్చల స్థితి..

ఒక నిస్తేజం.. ఒక నిర్వేదం.. ఒక నిశ్శబ్దం..

మొబైల్‌లో టైమ్ చూశాను.. 3.23 పీఎం..

అనన్య కార్ డ్రైవ్ చేస్తున్నది. కానీ ఎటు పోతుందో, ఎందుకు పోనిస్తోందో తనకే తెలియదు. ఉదయం నుంచి ఏం తినలేదు. ఆకలిగా ఉంది. కానీ ఎవ్వరూ దాని గురించి మాట్లాడడం లేదు. కనీసం నా కోసం వచ్చినందుకు వారిని నేను కూడా అడగడం లేదు. 'రాకేష్ లంచ్ టైమే కదా, భోజనం చేసి వెళ్లమ'న్నాడు. వాడికున్న ఇంగిత జ్ఞానం కూడా నాకు లేదు. అప్పుడు మాకు ఆకలి లేదు. ఇప్పుడు ఆకలి వేస్తున్నా ఆ ఆలోచన లేదు. అక్కడ తాతయ్య పరిస్థితి ఎలా ఉందో? డాడీకి ఫోన్ చేయాలని ఉంది. కానీ ఎలా చేయను. చేసి ఏం చెప్పను? నజియా దొరికే అవకాశం లేదని చెప్పనా? ఎలా చెప్పాలి?

'హిమాయత్‌నగర్' అని రాసిన సైన్ బోర్డ్ చూస్తున్నది అనన్య.

కార్ ఆగి చాలాసేపు అయిందనేది నేను పది నిమిషాల తర్వాతే గమనించాను.

సమయం 3.33 పీఎం. మ్యాజిక్ టైమ్. 1.11, 2.22, 1.43, 2.34.. మనం టైమ్ చూసినప్పుడు ఇలాంటి అంకెలు కనిపిస్తే ప్రియా దాన్ని మ్యాజిక్ టైమ్ అనేది.

నేను కార్ దిగి సిగరెట్ వెలిగించేందుకు నోట్లో పెట్టుకున్నాను. లైటర్ వెలగడం లేదు. అందులో గ్యాస్ అయిపోయిన్నట్లుంది. మ్యాచ్‌బాక్స్ 'ఎవరిస్తారా' అని చూస్తున్నాను..

ప్రియా..!!!

యస్ ప్రియా..! దూరంగా కనిపిస్తున్నది.

ఆశ్చర్యం!

నేను పరుగున తన దగ్గరికి వెళ్లాను. పిలుస్తున్నా పలకకుండా తను లోపలికి వెళ్లిపోయింది.

తను లోపలికి వెళ్లాక ఆ కేఫ్ బోర్డ్ చూశాను.

మినర్వా కేఫ్!

ప్రియాను వెతుక్కుంటూ లోపలికి వెళ్లాను. లాస్ట్ కార్నర్ టేబుల్ మీద ఒక్కతే కూర్చుంది. వైట్ అనార్కలీ డ్రెస్ వేసుకుంది. ఏంజిల్‌లా ఉంది.

నేను ఆ ఏంజిల్ దగ్గరికి వెళ్లి తన అనుమతి లేకుండానే ఎదురుగా కూర్చున్నాను.

'ప్రియా! మాట్లాడు ప్రియా' అన్నాను. తనేం మాట్లాడలేదు. కనీసం నా వైపు కూడా చూడలేదు.

'ప్రియా! నేను చేసింది తప్పే. కాదనను. కానీ దానికి ఇంత పెద్ద శిక్షా? నువ్వులేకుండా నేను ఉండలేకపోతున్నా ప్రియా'

తను నా వైపు చూసింది.

ఇంతలో బేరర్ నన్ను వింతగా చూస్తూ వచ్చి 'సర్ ఆర్డర్ ప్లీజ్!' అన్నాడు. అమ్మాయిని బతిమిలాడుతుంటే ఎవరైనా అలాగే చూస్తారు మరి.

నేను 'టూ కాఫీ' అన్నాను.

'ఆర్ యూ షూర్ వన్ ఆర్ టూ సర్?' అడిగాడు వాడు. చిరాకేసింది.

'రెండని చెబుతున్నాగా.. వెళ్లు' అన్నాను. మనం ఒకరిని బతిమిలాడుతుంటే.. ఇంకొకరికి లోకువై పోతాం.

వాడు ప్రియను, నన్ను వింత జంతువుల్ని చూసినట్లు చూసి వెళ్లిపోయాడు.

'నవ్వుతున్నారు ప్రియా! ప్లీజ్ మాట్లాడు'

'చెప్పు' అంది ప్రియా.

'ఐ లవ్ యూ ప్రియా. అండ్ ఐ మిస్ యూ' అన్నాను దీనంగా.

ప్రియా నవ్వింది. పెదవులు కదల్లేదు. మొహంలో కనిపించింది. ఆ నవ్వు వెకిలిగా ఉంది.

'జీవితంలో అత్యంత బాధాకరమైన విషయం ఏమిటో తెలుసా? ప్రేమించిన వారికి ఐ లవ్ యూ అని చెప్పాల్సి రావడం. ప్రేమ అనేది ఒక ఎక్స్‌ప్లనేషన్ కాదు కార్తీక్. ఇట్స్

యాన్ ఎక్స్‌ప్రెషన్. మాటల్లో కాదు. చేతల్లో ఉండాలి. అది నువ్వు ఎప్పుడో కోల్పోయావు' అన్నది.

బేరర్ కాఫీ తీసుకొచ్చాడు. రెండూ నా ముందే పెట్టాడు. నేను వాడివైపు కోపంగా చూస్తూ ఒక కప్పు తీసి ప్రియ ముందు పెట్టాను. బేరర్ ప్రియ వైపు అదోలా చూస్తూ వెళ్లాడు.

'అసలు ప్రేమంటే తెలుసా నీకు? ప్రేమంటే కలిసి బతకడం మాత్రమే కాదు. మనం తొలిసారి కలిసిన రోజు గుర్తుందా? ఆరోజు బతుకమ్మ న్యూస్ పేపర్ చూడు. ప్రేమంటే ఏంటో తెలుస్తుంది నీకు. అండ్ మోర్ ఓవర్ నువ్వు వెతుకుతున్నది నీకు దొరుకుతుంది' అని ప్రియ లేచి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

నేను అక్కడే కూర్చున్నాను. కాఫీలో కనిపిస్తున్న ఆటిన్ షేప్ డిజైన్‌ను చూస్తున్నాను.

నన్ను వెతుక్కుంటూ అన్నూ, విన్నూ వచ్చారు.

'ఏంట్రా ఇక్కడ కూర్చున్నావ్?' అడిగాడు వినోద్.

'రెండు కాఫీలు చెప్పావ్ ఎవరికి?' అని అనన్య అడిగింది.

నేను ఏం మాట్లాడలేదు. నా కాఫీ తాగమని విన్నూకు, ప్రియా కాఫీ అన్నూకి ఇచ్చాను.

'వాట్ హ్యాపెండ్ కార్తీక్. అలా అయిపోయావ్. ఎవరొచ్చారు?' మళ్లీ అడిగింది అన్నూ.

'ప్రియా' చెప్పాను నేను.

'ప్రియానా!?' ఆశ్చర్యంగా అడిగారిద్దరు. వినోద్ మొహంలో ఆశ్చర్యం, అనన్య మొహంలో అనుమానం కనిపించింది. ఇద్దరు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

'అవును ప్రియానే' అన్నాన్నేను.

'ఏది?' అడిగాడు వినోద్.

'వెళ్లిపోయింది' చెప్పాను జీరబోయిన గొంతుతో.

'ఏమన్నది ప్రియా?' అనన్య అడిగింది కాఫీ తాగుతూ.

'ప్రేమంటే ఏంటో నాకు తెలియదట. మేం తొలిసారి కలుసుకున్న రోజు గుర్తుందా?

అంది. ఆరోజు బతుకమ్మ న్యూస్‌పేపర్ చూడమంది. ప్రేమంటే ఏంటో తెలుస్తుందట. నేను వెతుకుతున్నది కూడా దొరుకుతుందట!'

'బతుకమ్మ పేపరా? మీరు కలుసుకున్న రోజా? గుర్తుందా ఆ రోజు నీకు?' అన్నూ అడిగింది.

'గుర్తుంది. జూన్ సెకండ్'

'పదా మరి పేపర్ చూద్దాం' అంది హడావిడిగా కాఫీ తాగుతూ.

♦

సిటీ లైబ్రరీ, చిక్కడపల్లి

'జూన్ రెండు, 2009 బతుకమ్మ న్యూస్ పేపర్ కావాలి' లైబ్రేరియన్‌ను అడిగింది అనన్య. ఆయన ఏమీ మాట్లాడకుండా మమ్మల్ని న్యూస్‌పేపర్స్ వింగ్‌కి తీసుకెళ్లాడు. ఆ హాల్ నిండా పెద్ద పెద్ద ర్యాక్స్, వాటిల్లో న్యూస్‌పేపర్ ఫైల్స్ ఉన్నాయి. 2009 అని రాసి ఉన్న ర్యాక్‌లోంచి ఫైల్ తీసి ఇచ్చాడు. 'అక్కడ కూర్చొని చూస్కోండి' అన్నట్లు టేబుల్ వైపు చూపిస్తూ సైగ చేసి వెళ్లిపోయాడు.

అనన్య వేగంగా ఫైల్ తిరగేసింది.

2 జూన్ 2009, మంగళవారం

మొదటి పేజీ.. రెండో పేజీ ఒక్కో పేజీ తిరగేస్తున్నాం..

'ఇదే కావొచ్చు..' అన్నది అనన్య ఫీచర్ పేజీలో ఒక వ్యాసాన్ని చూపిస్తూ.

'రణ దివిటీ రంగక్క' అనే శీర్షిక పెద్ద పెద్ద అక్షరాలతో ఉంది. పేజీ అందంగా డిజైన్ చేసి ఉంది. ఫుల్ పేజీలో దాదాపు సగం పేజీ ఆమె గురించి రాశారు. ఒక పెద్ద ఫొటో వుంది. ఆమె మొహం ముడుతలు పడి ఉంది. కళ్లు ఆకట్టుకునేలా ఉన్నాయి. తల చుట్టూ గుడ్డ చుట్టుకుని ఉంది. అబ్దుల్లా భార్య గుర్తొచ్చింది. ఆమె కూడా ఇలాగే తల చుట్టూ చుట్టుకుంది. పేరేమో రంగక్క.. ఈమెనేమో ముస్లింలా వుంది.

'ఇదే కావొచ్చు.. చదువు' అన్నాన్నేను అనన్యతో.

అనన్య ఆర్టికల్ చదవడం మొదలెట్టింది.

## రణ దివిటీ రంగక్క

**'నీ బాంచెన్ కాల్మొక్తా' అన్న సామాన్యులు తుపాకీ పడితే ఏమైతదో తేలిన రోజులు..**

**'నైజాం సర్కరోడా.. నీ గోరి కడతం కొడుకో..' అంటూ నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యానికి, దొరల, భూస్వాముల అణచివేతలకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం జరుగుతున్న తరుణం..**

**కడుపు మండిన నిరుపేదల ఆవేశం ముందు ఏ ఆయుధం నిలవదని నిజాం గ్రహించి లొంగిపోయిన అనంతర కాలం..**

**సుబేదార్లు, జాగీర్దార్లు.. షేర్వానీలు విడిచి ఖద్దరు చొక్కాలు తొడుక్కుని నయా బానిసత్వానికి తెరలేపిన సమయం..**

**భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం..**

**కూలీ జనం కణకణ రగిలే నిప్పులై.. కరకర పొడిచే పొద్దులై, చరచర పొంగే ఉప్పెనలై ఎగబడిన తీరు ప్రపంచ విప్లవోద్యమానికి కొత్తదారులు వేసింది. ఆ దారుల్లో ఉద్యమోన్ముక్తులైన అనేకమందిలో.. రణ దివిటీ ఈ రంగక్క అలియాస్ నజియా..**

'ది ట్రూ రెవల్యూషన్ ఈజ్ గైడెడ్ బై గ్రేట్ ఫీలింగ్స్ ఆఫ్ లవ్' అంటాడు చే గువెరా.

రంగక్క విప్లవ ప్రస్థానం కూడా ప్రేమ తాలూకు ఆమె భావోద్వేగాలనుంచే మొదలైంది.

ఆపరేషన్ పోలో తర్వాత ఆమె జీవితం ఆగమైంది. ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది నజియా. హిందువైన రామస్వామిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంది. కానీ రామస్వామి నిజాం రాజు బానిస సంకెళ్ల నుంచి ఈ తెలంగాణకు విముక్తి ప్రసాదించేందుకు ఆ రాజునే చంపాలనుకున్నాడు. తన మిత్రులతో కలిసి నిజాంపై బాంబు దాడి చేసి విఫలమయ్యాడు. బాంబు దాడి చేసిన ముగ్గురిలో ఇద్దరిని పోలీసులు పట్టుకుని బంధించారు. ఇక్కడి నుంచి తప్పించుకున్న రామస్వామి ముంబైలో తలదాచుకున్నాడు. ఆయన రాక కోసం వేయి కన్నులతో ఎదురుచూస్తూ కూర్చున్నది నజియా. ఇంట్లో వాళ్లు ఇక అతను రాడని, వేరే పెండ్లి చేయాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. 'నాకు రామస్వామితో పెండ్లి అయినా, కాకపోయినా ఆయనే నా మొగుడు' అని పంతం పట్టి కూర్చుంది నజియా.

**అమ్మేసిన అబ్దుల్లా..**

పోలీస్ యాక్షన్ సమయంలో కొందరు అమాయక ముస్లింలు కూడా బలయ్యారు. అందులో నజియా కుటుంబం కూడా ఉంది. పిచ్చిదానిలా నటించి నజియా తప్పించుకుంది. కానీ ఆమె తల్లిదండ్రులు తుపాకీ తూటాలకు బలైపోయారు. నజియా ఒంటరైపోయింది. అదే సమయంలో అక్కున చేర్చుకుంటానని నమ్మించిన అబ్దుల్లా ఆమెను చెరిచే ప్రయత్నం చేశాడు. అతని భార్య అడ్డు చెప్పడంతో.. నజియాను ఒక దొరకు అమ్మేశాడు. దొర నజియాను లొంగదీసుకునేందుకు శారీరకంగా హింసించాడు. తీవ్ర అనారోగ్యానికి గురైన నజియా ఒక డాక్టర్ సహాయంతో ఆ దొర దగ్గరి నుంచి తప్పించుకుంది.

**రంగక్కగా..**

దొర దగ్గరి నుంచి తప్పించుకున్న నజియా ఆ డాక్టర్ సహాయంతోనే ఉద్యమంలో చేరి తుపాకీ పట్టింది. రంగక్కగా పేరు మార్చుకుని అజ్ఞాతంలో ఉంటూ ఉద్యమాలు చేస్తున్న సాయుధ పోరాట దళంలో చురుగ్గా కదిలింది. కమలా దేవితో కలిసి పనిచేసింది. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా చుట్టు పక్కల పల్లెల్లో గళమెత్తి గర్జించింది. లేవీ ద్వారా బియ్యం కొల్లగొట్టి పేదలకు పంచడంలో పాలు పంచుకుంది. భూస్వాములకు వ్యతిరేకంగా వేలాది మందిలో చైతన్యం తీసుకొచ్చింది.

**నల్లమల కమాండర్‌గా..**

పోరాటం ఉధృతం అవుతున్నా కొద్దీ ఉద్యమకారులపై పోలీసు నిర్బంధం పెరిగింది. మిలటరీ సైన్యం రంగంలోకి దిగింది. తీవ్ర ఒత్తిడి ఫలితంగా చురుకైన పాత్ర పోషిస్తున్న రంగక్కను నల్లమలకు పంపి దళ కమాండర్ బాధ్యతలు అప్పగించింది నాయకత్వం. మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట, అమ్రాబాద్, నాగర్ కర్నూల్, బల్మూర్ ప్రాంతాల్లో దళం పోరాటం సాగించింది. నల్లమలలోని చెంచులు, గిరిజనులూ ఉద్యమంలో భాగస్వామ్యులను చేయించేది. దొరల గడీలపై దాడులు, భూస్వాముల భూముల్లో జెండాలు, ఇలా పేదల పక్షాన చేసిన పోరాటం చాలా ఉంది.

**చనిపోయిందనుకున్నారు..**

నల్లమల అడవుల్లో ఓసారి దళమంతా దాడికోసం వెళ్లింది. జ్వరంతో బాధపడుతున్న రంగక్క మాత్రం అడవిలోనే ఆగాల్సి వచ్చింది. బైనాక్యులర్స్‌తో గమనించిన పోలీసులు

వెంబడించారు. జ్వరంతోనే ఎదురు దాడి చేసి ఆ తర్వాత మూడు కిలోమీటర్లు పరుగులు తీసింది. చీకటి పడడంతో కానుగ ఆకులు కప్పుకుని కనిపించకుండా పడుకుని ఉదయాన్నే చెంచుగూడెం చేరుకుని తప్పించుకుంది. ఆ సమయంలో రంగక్క చనిపోయిందనే కరపత్రాలను పంచారు పోలీసులు. ఇప్పటికీ చాలామంది రంగక్క చనిపోయిందనే అనుకుంటారు.

**అసాధారణ జీవితం..**

పోరాట విరమణ అనంతరమూ రంగక్క దళం కొంతకాలం నల్లమలలోనే వల్లభాపురం, లక్ష్మాపురం ప్రాంతాల్లో గడిపింది. అటు తర్వాత రంగక్క సాధారణ జన జీవితంలోకి అడుగు పెట్టింది. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా ఒక ఫౌండేషన్‌ను స్థాపించి గిరిజన తండాల వారి బాగోగులు చూసుకుంటున్నది. తండాల్లో పాఠశాలలు నెలకొల్పి గిరిజనులకు అక్షరాలు నేర్పిస్తున్నది. అనాథలను అక్కున చేర్చుకుంటూ.. అమ్మగా అసాధారణ జీవితం గడుపుతున్నది.

✍ **రాజేందర్**

**ఫొటోలు : సన్నీ**

♦

'యస్.. నజియా దొరికింది. రాసింది రాజేందర్.. ఇతన్ని అడిగితే వివరాలు చెబుతాడు' అన్నది అనన్య ఆర్టికల్ మొత్తం చదివాక.

ఆ తర్వాత వాళ్లకీ, వీళ్లకీ ఫోన్లు చేసి రాజేందర్ నంబర్ కనుక్కుంది.

రాజేందర్ చెప్పిన చిరునామా ప్రకారం మేం తార్నాక వెళ్లాం.

♦♦♦

# 14

# దేవరకొండ

'ఇంతకుముందు ఉండేదేమో.. ఇప్పుడు లేదు' అన్నాడు వాచ్‌మ్యాన్.

రాజేందర్ చెప్పిన చిరునామా ప్రకారం అక్కడ నజియా దొరుకుతుందన్న ఆశతో వెళ్లాం కానీ మాకు నిరాశే మిగిలింది. నాలుగు నెలల క్రితమే ఆ ఇంటిని కూలగొట్టారట. ఇప్పుడక్కడ అపార్ట్‌మెంట్ కడుతున్నారు.

అటూ ఇటూ తిరిగి కథ మొదటికే వస్తున్నది. దొరికినట్లే దొరుకుతుంది కానీ వెంటనే దూరమైపోతున్నది. వివరాలు తెలిసినట్లే తెలుస్తున్నాయి కానీ వెంటనే దారులు మూసుకుపోతున్నాయి.

ఏం చేయాలి? ఎటువెళ్లాలి? ఏమీ అర్థంకాని నిస్తేజంలో రోడ్డు పక్కన ఆగి ఉన్నాం. దీనంగా.. మా ముగ్గురి మొహాలు వాడిపోయి ఉన్నాయి.

బాగా గాలి వీస్తోంది. వర్షం పడేలా ఉంది.

ఇద్దరు చిన్నారులు ఆడుకుంటున్నారు. మాసిన బట్టలతో, చింపిరి జుట్టుతో రోడ్డు పక్కన గుడిసె ముందు అందంగా, అమాయకంగా ఉన్నారు. నేను కార్ దగ్గర నుంచి కాస్త ముందుకు నడిచి వాళ్లను చూస్తున్నాను.

'ఆ చిన్నారుల బోసినవ్వుల్లో నీకే దారి కనిపించడం లేదా?' అన్నది ప్రియా. తను ఎప్పుడు వచ్చిందో తెలియదు. నా పక్కన నిల్చుంది. నేను చూస్తున్న పిల్లల్నే చూస్తున్నది.

ఆ చిట్టి చిట్టి చేతుల్లో కాగితపు బొమ్మలు. పాప చేతిలో బాతు బొమ్మ, బాబు చేతిలో పావురం బొమ్మ. ఎక్కడో చూసినట్లు ఉన్నాయి ఆ బొమ్మలు.

అలాగే చూస్తున్నాను తదేకంగా. 'ఏం చేస్తున్నావ్ కార్తీక్?' అని అనన్య అడిగినా చూపు తిప్పుకోకుండా.

'కార్తీక్!?' భుజం పట్టుకుని కుదిపింది. ప్రియా అనుకున్నాను, కానీ కుదిపింది అనన్య.

'ప్రియ ఏది?' అడిగాను.

'ప్రియనా? తను ఎప్పుడు వచ్చింది?' అంటూ అనన్య ఆ పిల్లలు ఆడుకుంటున్న బొమ్మలను చూస్తోంది.

'కార్తీక్! ఆ కాగితపు పక్షులు ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది కదా?' అని అడిగింది. కానీ నా కళ్లు ప్రియ కోసం వెతుకుతున్నాయి. ఇలా వొచ్చి అలా వెళ్లిపోయింది.. అప్పుడు.. ఇప్పుడు. అసలు ఎందుకొస్తోంది.. ఎందుకు వెళ్లిపోతోంది?

'యస్ కార్తీక్! ఆ బొమ్మలు.. ఆ బొమ్మలు..' అనన్య ఉద్వేగంగా ఉంది. నోట మాట సరిగా రావడం లేదు.

పరుగున కార్ దగ్గరికి వెళ్లింది. బ్యాక్ సీట్‌లోంచి డైరీ పట్టుకుని పరుగెత్తుకొచ్చింది.

'ఇదిగో.. తాత డైరీలో.. మొదటి పేజీలో.. ఈ బొమ్మ.. అదిగో చూడు ఆ బొమ్మలు ఇలాగే ఉన్నాయి కదా..' అన్నది.

'నిజమే. అలాంటి బొమ్మలే. ఈ క్లూ చెప్పడానికే వచ్చిందా ప్రియ? ఆ పసివాళ్ల నవ్వుల్లో కనిపించే దారి ఇదేనా?' అని ఆలోచిస్తున్నాను.

'కమ్ కార్తీక్!' అంటూ పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ ఆ చిన్నారుల దగ్గరకు

వెళ్లింది అన్నా. 'హాయ్ చిన్నులూ.. ఈ బొమ్మలు వోలిచ్చారు మీకూ..' అని ముద్దు చేస్తూ అడిగింది. తన మూతి ముద్దుగా ముడుచుకుంది.

'మాయి' అని ఆ బాబు బొమ్మ దాసుకున్నాడు. 'అంగో.. ఆ అక్కిచ్చింది' అని చూపించింది పాప.

ఆ గుడిసె అవతల మరికొన్ని గుడిసెలున్నాయి. అందులోని పిల్లలకూ బొమ్మలు ఇస్తున్నది ఒక అమ్మాయి.

అన్నా ఆ అమ్మాయి దగ్గరికి వెళ్తున్నది. నేను తనను అనుసరించాను.

'ఎక్స్‌క్యూజ్‌మీ!' పిలిచింది అనన్య.

'యస్' అని మా వైపు తిరిగింది ఆ అమ్మాయి.

'యువర్ గుడ్‌నేమ్?'

'రోహిత'

'ఈ బొమ్మలు..!?'

'నావే. నేనే చేశాను'

'మరి వీళ్లకెందుకు ఇస్తున్నారు?'

'ఓ.. అదా.. ఆ చిన్నారుల కళ్లలో ఆనందం చూడండి. మంచి బొమ్మలు కొనిచ్చే స్తోమత నాకు లేదు. కనీసం ఈ కాగితపు బొమ్మలైనా..?'

'ఈ బొమ్మలు నువ్వే చేశావా?' అడిగాను నేను.

'అవును' అంది రోహిత.

'ఇలా చేయడం ఎవరు నేర్పించారు నీకు?' అడిగింది అనన్య.

'అదో పెద్ద కథ! షార్ట్‌కట్‌లో చెప్తాను. నేనిప్పుడు ఈ ఉస్మానియా క్యాంపస్‌లో చదువుతున్నాను. కానీ నేనొక అనాథాశ్రమంలో పెరిగాను. అక్కడ నన్ను పెంచిన అమ్మ నాకు ఇవి చేయడం నేర్పించింది' అని చెప్పింది రోహిత.

'ఆ అమ్మ పేరు?' ఆత్రుతగా అడిగింది అన్నూ.

'ఇంతకీ మీరు.. ఇవన్నీ ఎందుకు అడుగుతున్నారు?' అనుమానంగా అడిగింది రోహిత.

'అది చెప్తాం, ముందు అమ్మ పేరు చెప్పు ప్లీజ్' అన్నాన్నేను.

'రంగక్క' చెప్పింది రోహిత.

ఉరుము ఉరిమింది. చినుకులు మొదలయ్యాయి. చిరుజల్లు కాస్తా జోరువానగా మారుతున్నది.

'రంగక్క.. రంగక్క అసలు పేరు నజియానా?' అడిగింది రోహితను అన్నూ గుడిసె కిందికి తీసుకెళ్తూ.

'అవును. మీకెలా తెలుసు?' అంది రోహిత.

'యస్..' ఎగిరి గంతేశాను నేను. జీవితంలో మొదటిసారి నేను వర్షంలో తడుస్తున్నాను. అన్నూ నావైపు చూసి నవ్వింది.

'యాక్చువల్లీ మేం తననే వెతుకుతున్నాం. తన కోసం ముంబై నుంచి వచ్చాం. ఆమె ఇప్పుడు ఎక్కడున్నారో చెప్తావా?' అడుగుతున్నది అన్నూ.

'ఇంతకుముందు ఇక్కడే తార్నాకలో ఉండేది. కానీ ఇప్పుడు దేవరకొండలో ఉంటుంది. ఏదైనా పని ఉన్నప్పుడు మాత్రమే హైదరాబాద్ వస్తది' చెప్పింది రోహిత నా వైపు చూస్తూ.

నా ఫోన్ రింగ్ అవుతున్నది. డాడ్!

'కార్తీక్! వెరీ సీరియస్. లాభం లేదిక. నువ్వు ఫ్లైట్ ఎక్కి ముంబై వచ్చెయ్' అన్నారు.

'డాడ్! ఒక్క గంట.. ఒక్క గంట బతకమను డాడ్ దాదాని. ముందు మీరెళ్లి నజియా దొరికిందని చెప్పండి. తను ఎక్కడుందో తెలిసిపోయింది. ఒక్కగంట డాడ్.. ఒక్కగంట.. ఏ నమ్మకం మీదైతే నేనిక్కడికి వచ్చానో.. ఎందుకోసం తాతయ్య ఊపిరి ఇప్పటిదాక ఆగిందో.. ఆ నమ్మకం నిజమయ్యే క్షణం కోసం ఆగమను.. ఒక్క గంట బతకమను..' అని ఫోన్ కట్ చేస్తూ 'వెళ్దాం దా.. స్పీడప్..' అని అన్నూ దగ్గరికి వెళ్లి చేయి పట్టుకుని లాగాను. 'థ్యాంక్యూ రోహిత' అని చెప్పాను.

'ఆర్ యూ కార్తీక్!' అని అడిగింది రోహిత.

'యస్' అని కార్ దగ్గరికి పరుగున వస్తూ 'విన్నూ.. తియ్యరా కారు' అని అరిచాను.

'దేవరకొండ.. దగ్గర లక్ష్మీబాయి తండా' అంది అన్నూ కార్‌లోకెక్కుతూ.

'నా పేరు తనకెలా తెలుసు?' నేనూ ఎక్కుతూ అడిగాను అన్నూని.

'అవును.. తనకెలా తెలుసు? నేను కూడా చెప్పలేదే!' అంది నాతో 'నువ్వు పోనియ్ స్ట్రెయిట్ అండ్ లెఫ్ట్' అంది విన్నూతో.

వినోద్ కార్ స్పీడ్ పెంచాడు.

రోహితకు నా పేరెలా తెల్సు అనే సందేహంలోంచి బయటికి వస్తూ 'తార్నాక, హైదరాబాద్ టు దేవరకొండ, నల్లగొండ..' గూగుల్ మ్యాప్‌లో సెర్చ్ చేశాను.

ఎన్ హెచ్ 9, వయా ఎల్‌బీనగర్

67 కిలోమీటర్స్..

49 మినిట్స్ టూ రీచ్

వర్షం వల్ల పెద్దగా ట్రాఫిక్ లేదు. బయట ఏం కనిపించడంలేదు. వైపర్లు జర్ర జర్ర తిరుగుతున్నాయి.

కార్ పెట్రోల్ ఇండికేటర్ కన్ను కొడుతోంది అని మళ్లీ ఫుల్ ట్యాంక్ చేయించాడు వినోద్. ఎల్‌బీ నగర్ దాటాక హైవేలో కారు రయ్యిన దూసుకుపోతున్నది.

అనన్య మౌనంగా కూర్చుంది. తను కూడా గూగుల్ మ్యాప్ చూస్తున్నది.

'హైవే మీద చౌటుప్పల్‌లో రైట్ తీసుకోవాలి..' అని వినోద్‌కు చెప్పింది అన్నూ. తర్వాత నా వైపు చూసి చిరునవ్వు నవ్వింది.

'తాతయ్యకు సీరియస్‌గా ఉందట. ఫ్లైట్ ఎక్కి వచ్చెయ్యమన్నారు డాడీ' అన్నాను.

'డోంట్ వర్రీ. ఏం కాదు.. తాతయ్యకేం కాదు.. మనం నజియాను తీసుకునే వెళ్దాం' అన్నది అనన్య, నా తల తన భుజం మీదికి లాగి తల నిమిరింది.

చౌటుప్పల్ దాటాక కాస్త వర్షం తగ్గింది. నారాయణ పూర్‌వైపు వెళ్తున్నాం. సింగిల్ రోడ్డు. అందమైన పల్లెలు.. పచ్చని పొలాలు.. కొండలు.. గుట్టలు.. దాటుకుంటూ వెళుతున్నాం.

'వచ్చేశాం. దేవరకొండ వచ్చేశాం' అంది అన్నూ గూగుల్ మ్యాప్ చూస్తూ.

వినోద్ చౌరస్తాలో కార్ ఆపాడు. అనన్య కార్ దిగి లక్ష్మీబాయి తండాకు ఎలా వెళ్లాలో దారి కనుక్కుంటున్నది.

'ఓ ఇరవై కిలోమీటర్లు ఉంటుందట. మట్టి రోడ్డు కార్ వెళ్లడం కష్టం అంటున్నారు' అంది అన్నూ రూట్ కనుక్కున్నాక వచ్చి కార్ ఎక్కుతూ.

'ఎందుకు వెళ్లదు.. చూద్దాం' అంటూ వినోద్ కార్ స్టార్ట్ చేశాడు.

పది కిలోమీటర్లు తారు రోడ్డు దాటాక మట్టి రోడ్డు మీదుగా వెళ్తున్నాం. గుంటల్లో కార్ ఊగుతూ, మమ్మల్ని ఊపుతూ వెళ్తున్నది. గూగుల్ మ్యాప్ పనిచేయడం లేదు. అన్నూ లెఫ్ట్, రైట్ అంటూ దారి చెబుతున్నది. తనకూ తెలియని చోట కార్ విండో దించి ఆ చిన్న ఊర్లలో ఎవర్నో ఒకర్ని అడుగుతున్నది.

మేమొక చిన్న చెరువు కట్ట మీది నుంచి వెళ్తున్నాం. చెరువు ఎండిపోయి ఉంది. వినోద్ కార్ సడన్ బ్రేక్ వేశాడు.

'వాట్ హ్యాపెండ్?' అంది అనన్య.

'నో రోడ్' అన్నాడు వినోద్.

'వాట్.. రోడ్డు లేదా?' అంటూ అనన్య కార్ దిగింది. నేనూ దిగి చూశాను. చెరువు కట్ట తెగిపోయి ఉంది. కార్ ముందుకు వెళ్లేలా లేదు.

'ఓ.. షిట్' అని కార్ బొనెట్ మీద గుద్దింది అన్నూ.

'ఇప్పుడెలా?' టెన్షన్‌లో సిగరెట్ వెలిగించాను.

'ఇంకెంత దూరం ఉండొచ్చు?' కార్ దిగుతూ అన్నూని అడిగాడు విన్నూ.

'ఇంకెంత.. ఆరేడు కిలోమీటర్లు ఉండొచ్చు.. లాల్ బాయి తండా.. తర్వాత లక్ష్మీబాయి తండా..' అన్నూ చెబుతున్నప్పుడు నా ఫోన్ రింగయింది.

డాడీ కాల్. టైమ్ చూశాను 5 పీఎం. సిగ్నల్ ఒక్కటే పాయింట్ చూపిస్తున్నది.

'హలో డాడ్!'

'...'

'డాడ్!'

'కా...'

'హలో.. హలో..'

'...'

'డాడ్ వినిపిస్తోందా?'

'...'

'హలో.. హలో..'

'డాడ్ ఇక్కడ సిగ్నల్ సరిగ్గా లేదు. వినిపించడం లేదు.. ఐ విల్ కాల్ యూ' అని ఫోన్ కట్ చేసి మెసేజ్ చేశా.

'రేయ్! టైమ్ లేదు ఏం చేద్దాం' సిగరెట్ నలిపి వాళ్ల దగ్గరికి వెళ్తూ అన్నాను.

'రన్ చేద్దామా?' అన్నాడు వినోద్.

'కొన్నిసార్లు కాస్ట్‌లీ కారు ఉన్నా కాలి నడక తప్పదు. ఏం చేద్దాం నడుద్దాం' అన్నది అనన్య.

కోటి రూపాయల లాటరీ తగిలినా వెళ్లి తెచ్చుకోవడానికి బస్సు కిరాయిలకు డబ్బుల్లేవనట్లు ఉన్నది మా పరిస్థితి. ఏం చేయాలి.. 6 కెఎమ్ రన్ చేయగలమా? లేదా ఆలోచించే టైమ్ కూడా లేదు.

'కమాన్ స్టార్ట్ రన్' అన్నాను. పరుగు మొదలుపెట్టే ముందు.. కట్ట కింద చిన్న దారి వెంబటి.. ఒక పాట వినిపిస్తున్నది..

'కోడి బాయె లచ్చుమ్మది.. కోడి పుంజు బాయె లచ్చుమ్మది..' అని పాట.. 'డుగు

డుగు' అని స్కూటర్ చప్పుడు వినిపిస్తున్నది.

'ఎవరో వస్తున్నట్టుంది. ఏదైనా దారి చూపిస్తడేమో అడుగుదాం' అన్నాడు వినోద్.

'కొన్నిసార్లు దేవుడు బజాజ్ చేతక్ మీద కూడా వస్తాడేమో' అన్నది అనన్య.

పరుగున వెళ్లి అడిగాం.. 'లక్ష్మీబాయి తండాకు ఇంకేదైనా దారి ఉందా?' అని.

'కార్ల పోతోళ్లు మీరు గిట్ల ఎందుకొచ్చింద్రు సారూ! ఇది బండి బాటేనాయె.. కారు పోదిట్ల. బండి మీదనే కష్టకష్టంగ పోతం.. కార్ల పోవాల్నంటే.. అంగో అట్ల ఇబ్రహీం పట్నం కెంచి రావాలా? ఇంగొచ్చింద్రు కాబట్టి కారు ఆడ బెట్టి ఇంగో గిట్ల నిమ్మలంగ నడుసుకుంట పోండ్రి' అని చెప్పాడు.

'నిమ్మలంగ కాదు.. జల్ది పోవాలె మేం' అన్నడు వినోద్.

'మరెట్ల పోతరు జల్దీ..?' అన్నాడు ఆ స్కూటర్ ఆయన.

డాడ్ కాల్ చేస్తున్నారు. సిగ్నల్ లేదు. టెన్షన్‌గా ఉంది. తాతయ్యకు ఎలా ఉందో ఏమో.

'నీ స్కూటర్ ఇస్తవా?' అన్నాను కాల్ కట్ చేసి.

'ఓహ్.. బలే ఉంద్రు మీరు.. నా బండి ఎందుకిస్త.. నేను పని మీద పోతున్న సారూ.. ఆడ కొలువు టయమ్ అయితాంది' అన్నడు.

'నీ పని తర్వాతైనా చేసుకోవచ్చు. మేం అర్జెంటుగా వెళ్లాలి. చాలా ముఖ్యమైన పని. ఉట్టిగనే ఏం ఇయ్యొద్దు.. ఈ కార్ తీసుకో' అన్నాన్నేను.

'కారా? నాకెందుకు సారూ కారూ.. నేను ఆర్టీసీ బస్సు తోలుకొని బతికేటోన్ని.. నాకెందుకది?'

'నువ్వుతోలే అట్లాంటి బస్సులు పది కొనుక్కోవొచ్చు. ఈ కార్ విలువేంతో తెలుసా? రెండు కోట్లు!' అని చెప్పాడు వినోద్.

'రెండు కోట్ల రూపాలా?' అని పెద్దగ నోరు తెర్సిండు స్కూటర్ ఆయన.

మేం ముగ్గురుం ఒకరి మొహం ఒకరం చూస్కున్నం. కార్ కీ ఆయన చేతుల పెట్టి

స్కూటర్‌కు కీ తీసుకున్నం.

వినోద్ స్కూటర్ కిక్ కొట్టి స్టార్ట్ చేశాడు. ముగ్గురం ఎక్కినం. అనన్య వెనకాల నేను కూర్చున్న. వినోద్ నుడుపుతున్నాడు. ఫస్ట్ గేర్ వేసి యాక్సిలేటర్ వొదలగానే ముందు చక్రం లేచి దుంకింది. వినోద్ స్కూటర్‌ను బ్యాలెన్స్ చేశాడు. దాని వేగం మెల్లగా పెరిగింది.

'6 కెఎం.. 18.. 20 నిమిషాల్లో చేరుకోవచ్చు' అన్నది అనన్య.

గుంటల్లో ఎగురుకుంటూ.. మట్టి రోడ్డులో దుమ్ములేపుకుంటూ.. ఇసుక బాటలో జారుకుంటూ పోతున్నది స్కూటర్.

లాల్‌బాయి తండా దాటాక బురదలో దిగబడింది స్కూటర్. వినోద్ ఒక కాలు బురదలో పెట్టి స్కూటర్ ఆపాడు. అనన్య రెండు కాళ్లూ స్కూటర్ మీద పెట్టి వినోద్‌ను బిగ్గరగా పట్టుకుంది. నేను ఆ బురదలోకి దిగి వెనకాల నుంచి స్కూటర్ నెట్టాను.

నా చెప్పులకంతా బురద అంటింది. ఆ తడి ఆరక ముందే లాల్‌బాయి తండా దాటి మరో తండాకు వచ్చాం.

'లక్ష్మీబాయి తండా.. ఇదేనా?' తలపాగ చుట్టుకుని చేతుల కర్ర పట్టుకుని పోతున్న పెద్దాయన్ని అడిగాడు వినోద్, స్కూటర్ ఆపి.

'గిదే సారూ! ఓట్ల కోసం వొచ్చింండ్రా ఏంది మీరు? మా ఇంట్ల ఎనిమిదున్నయ్. ముందుగాల మా ఇంటికే రాండ్రి సార్లూ..' అన్నడా పెద్దాయన.

'ఓట్ల కోసం కాదు.. నజియా కోసం..' అన్నాన్నేను.

'నజియానా? నజియా వోలో నాకెర్కలే సారూ'

'నజియా అంటే.. రంగక్క రంగక్క' అన్నది అన్నూ.

'రంగక్కా! రంగక్క కోసానికి వొచ్చింండ్రంటే మీరు మంచోళ్లే.. అయితే మీకు మంచిగ చెప్పాలె. ఇంగో ఇట్ల పోండ్రి.. ఆ తండాలకు దూరంగనే ఎవల్ని అడిగినా సెప్తరు.. సూపిస్తరు.. మీకు గూడా ఆడికిపోంగనే ఎర్కయితది. రంగక్క పెద్దబిడి.. మా ఊరి గుడిలెక్క అన్నట్టు. ఆ దొరసానమ్మ మా తండాకు పెద్దదిక్కు. ఈ తండాకు జరంత రోడ్డు ఏపిచ్చింది.. మా గా ఇంట్ల గీ ఇంట్ల లైటు బుగ్గ ఎల్గుతుందంటే.. గామె చలువే'

ఆ పెద్దాయన చెప్తానే ఉన్నాడు. వినోద్ ఆగేలా లేడు. స్కూటర్ యాక్సిలేటర్ గుంజుతా ఉన్నడు. 'రయ్.. రయ్..'మనిపిస్తున్నడు. ఒక్కసారిగా వొదిలితే స్కూటర్ ముందుకు దుంకి ఉర్కింది.

పెద్ద బడి.. ఆ ఊరి పెద్ద గుడి.. ఆశ్రమం లెక్క ఉన్నది... అందంగా..

చుట్టూ తడకలు కట్టి ఉన్నాయి. గేటు దాటినంక.. కొందరు చిన్న పిల్లలు ఆడుకుంటుండ్రు.. పాడుకుంటుండ్రు..

'అగ్గి పెట్టె గుగ్గి పెట్టె కోడి కొంగ కొమ్మ పిల్ల సల్ల సత్తూ లచ్చీన.. లవలవ.. చెంచో బైటో.. టాంగు టీంగు.. తుమ్మల్ల పెద్దమ్మ తుసుక్కు.. బుసుక్కు..' అని ఎడమ వైపు వేప చెట్టు కింద ఒక పాప పాడుతున్నది.

ఇంకో చెట్టు కింద 'దాగుడు మూతల దండాకోర్.. పిల్లీ వొచ్చే ఎలుకా భద్రం ఎక్కడి దొంగలు అక్కడే.. గప్ చుప్.. సాంబార్ బుడ్డీ...' ఒక అమ్మాయి ఇంకో పాప కళ్లు మూసి అంటున్నది. మిగిలిన పిల్లలు పరుగున వెళ్లి దాసుకున్నారు.

ఆ తర్వాత ఒక పాప కళ్లకు గంతలు కట్టుకొని తిరుగుతున్నది. ఆమె చుట్టూ కొందరు పిల్లలు చప్పట్లు కొడుతున్నారు.

మేం వాళ్లను దాటుకుంటూ పోతున్నప్పుడు గంతలు కట్టుకున్న పాప గుండ్రంగా తిరుగుకుంటూ వచ్చి నన్ను పట్టుకుంది. 'దొంగ దొర్కింది' అని అన్నది. ఆ తర3్వాత గంతలు తీసింది. నన్ను చూసింది.

ముద్దుగా చూసింది. కళ్లు టపటపా కొట్టింది. ఎడమవైపు, కుడివైపు తలవంచి రెండుసార్లు చూసింది. కళ్లు తుడుచుకుని చూసింది.

'నీ పేరు కార్తీకా?' అని అడిగింది.

'నా పేరు ఎలా తెలుసు? అక్కడ తార్నాకలో కాగితపు పక్షులు ఇస్తున్న అమ్మాయి, ఇక్కడ ఈ అమ్మాయి?' అని మనసులో ఏదో సందేహం తొలుస్తున్నది. అడుగుదామని అనుకుంటుండగానే.. ఒక పాప వచ్చి నా చేయి పట్టుకుని 'కాళ్లకు బురదంటింది, ఆడ కడుక్కో' అని చూపించింది.

చెట్లకు నీళ్లు పోస్తున్న ఒక పాప నీళ్లు తెచ్చిచ్చింది.

'అమ్మ కోసం వొచ్చినవా?' ఇంకో పాప అడిగింది. కాళ్లు కడుక్కున్నాక చేయి పట్టుకుని తీసుకెళ్లింది. 'అదిగో అమ్మ' అని చూపించింది.

చుట్టూ పిల్లల్ని కూర్చోబెట్టుకుని ఒక పెద్దావిడ అటువైపు తిరిగి కూర్చుంది. ఆమె చుట్టూ రంగు కాగితాలు ఉన్నాయి. పిల్లల చేతుల్లో రంగు రంగుల కాగితపు పక్షులు ప్రాణం పోసుకుంటున్నాయి. ఆ బొమ్మలు తాత డైరీలో గీసి ఉన్న బొమ్మలే. అనన్య చూపించిన బొమ్మలే. అక్కడ తార్నాకలో ఆ అమ్మాయి పంచుతున్నటువంటి బొమ్మలే.

ఆ పెద్దావిడ పక్కన ఒక కుక్క పిల్ల ఉంది. నన్ను చూసి అది 'కుయ్.. కుయ్..' అని మూలిగింది.

'ఎవరో వచ్చారని' ఆమెతో కూర్చున్న పిల్లలు చెబితే వెనక్కి తిరిగింది ఆవిడ.

ఆమె చూపు నా నుంచి మరలి.. నా వైపు వస్తున్న కుక్క పిల్ల వూపు పడింది.

నేన ఆమెనే చూస్తున్నాను. ఆ మొహం బతుకమ్మ పేపర్ల చూసిన మొహమే..

అడుగు ముందుకు వేద్దామని చూశాను. కానీ నా కాళ్లు కదలడం లేదు. అయినా బలవంతంగా అమె దగ్గరికి అడుగు మొదలెట్టాను.

ఆ కుక్కపిల్ల బుజ్జి బుజ్జి అడుగులు వేసుకుంటూ వచ్చి నా కాలు నాకుతున్నది..

'బుజ్జీ' అని పిల్సింది ఆవిడ. నేను ఆమెకు అందే అంత దగ్గర్లోనే ఉన్నానప్పుడు. ఆ కుక్కపిల్ల తల పట్టుకుని ఆమె ఒళ్లోకి తీసుకుంది. ఆ బుజ్జి నా కాలి ఆరో వేలు నాకింది. ఆమె కుక్కపిల్లను తీసుకుంటున్నప్పుడు ఆశ్చర్యంగా చూసింది నా కాలును, నా ఆరో వేలును. కాసేపు తదేకంగా చూశాక.. ఆమె తల జరంత పైకి లేపుతూ నా చేతి వాచీ చూసి ఆగిపోయింది. ఆల్విన్ వాచీ ఆగిపోయే ఉంది. దాన్నీ తదేకంగా, తన్మయత్వంతో చూసింది. ఆ తర్వాత ఇంకొంచెం తల పైకెత్తి నా మొహం చూసింది.

నా కండ్లల్లకు సూస్కుంట 'కార్తీక్!' అన్నది.

బయటి ఒక ఉరుము ఊరిమింది. నా మనసులోపల ఒక మెరుపు మెరసింది.

కానీ నా పేరు తనకెలా తెలుసు? నేను తన కోసం వెతుక్కుంటూ వస్తున్నాను.. నేనెవరో తెలియదు.. అలాంటి నన్ను ఆమె ఎలా పేరు పెట్టి పిలిచింది?

ఆత్మీయంగా.. అడయినవాడిలాగా.. అంతకు ముందు ఎప్పుడో వచ్చిపోయినవాడిలాగా..

అయినా నేను ఆత్మీయుడినేగా.. అయినవాడినేగా..

అంతకు ముందు రాలేదంతే? అంతే.. అయినా.. ఎలా? నేనిక్కడ..

అక్కడ తార్నాకలో.. ఇక్కడి చిన్నారులకు.. నేను వెతుక్కుంటూ వచ్చిన నజియాకు.. నేనెలా తెలుసు?

ఇన్ని ప్రశ్నలు.. ఇంత మధనం నన్ను తొలికి చిలికి గెలికి నిస్తేజంగా చేస్తున్నప్పుడు..

నేను అట్లనే ఆమె ముందల నిర్జీవంగా కుప్పకూలిపోయాను.

కళ్లల్లో నీళ్లు కట్టలు తెంచుకున్నాయి..

ఉబికి వచ్చాయి.

కన్నీరో.. ఆనంద బాష్పాలో అర్థం చేసుకునే పరిస్థితిలో లేనిప్పుడు.

ఇక్కడొక మాట పుట్టాలి.. నోరు మెదపాలి..

ప్రయత్నించాను.. సాధ్య ంకాలేదు..

మళ్లోసారి. కష్టంగా.. ప్రయత్నించాను.. మెల్లిగా..

'ఆడ దాదా .. చావు బతుకుల మధ్య..' అన్నాను. దీనంగా.. బాధగా.. నా మాటల్ని కన్నీళ్లతో కప్పేసుకుంటూ..

అప్పుడే..

నా జేబులో ఫోన్ రింగయింది. కష్టంగానే ఉంది జేబులో ఫోన్ తీయడం.. అయినా అచేతనంగానే తీసి చూశాను.

డాడీ!

నేను మాట్లాడలేను. మాట్లాడే పరిస్థితిలో లేను..

తీసి అనన్యకు ఇచ్చాను.

తను లిఫ్ట్ చేసి 'అంకుల్! అంకుల్!! ఎవ్రీథింగ్ ఈజ్ ఓకే.. వీ హావ్ రీచ్డ్. అండ్ మెట్. మేం దాదిని కలిశాం. చెప్పండి.. దాదాకు ఈ విషయం' అన్నది వినిపించింది.

'అవునా? అంకుల్ ఒక పనిచేయండి.. స్కైప్ ఆన్ చేయండి' అన్నది.

అనన్య ఫోన్ నా చేతికిచ్చింది.

స్కైప్‌లో దాదా చూస్తున్నాడు. డాడ్ ఆయన మొహం దగ్గర ఫోన్ పెట్టాడు.

తాత కళ్లలోకి చూసి నేను ఫోన్ నజియా వైపు తిప్పాను.

ఆమె తాత కళ్లలోకి చూసింది.

చాలా ఏళ్ల తర్వాత.. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న చూపు.. ఆమె కళ్ళల్లో కనిపించింది.

రెండు కళ్లు మాట్లాడుకోవడం మొదటిసారి చూశాను.

కానీ అవే చివరి మాటలు అనుకోలేదు.

తాత కళ్లు కదల్చడం లేదు. రెప్పలు వాల్చడం లేదు.

'నాన్నా!' అని గట్టిగా అరిచారు డాడీ. బిగ్గరగా ఏడ్చారు ఆ తర్వాత.

ఏం జరిగిందో అర్థమైంది. నేనూ నిస్తేజంగా గోడకు ఒరిగిపోయాను. ఏడుపు..

కళ్లవెంట ఆగని కన్నీరు..

నజియా కళ్ల వెంట రెండు కన్నీటి చుక్కలు మాత్రమే రాలాయి. బహుశా ఇంకి పోయి ఉంటాయి.

ఒక నిశ్శబ్దం..

ఇంతలో ఒక అరుపు..

'భారతికి పురిటి నొప్పులు వొస్తున్నాయి' అని ఒకావిడ వచ్చి చెప్పింది. ఆందోళనగా.. ఆవేదనగా..

వినోద్, అనన్య వచ్చి నా పక్కన కూర్చున్నారు.

తను వెళ్లిపోయాక.. నేనిక శూన్యంలోకి చూస్తున్నాను.

కాసేపటి తర్వాత..

'కార్తీక్! అటు చూడు' అని నా భుజం పట్టుకుని అన్నది అనన్య.

నేను తను చూపిస్తున్న వైపు చూశాను.

గోడకు వేలాడుతున్న ఫొటో వైపు..

ప్రియా ఫొటో..

ఫొటో మీద నుదుట కుంకుమ బొట్టు..

ఫొటోకు పూలమాల.. ఆ పూలు వాడిపోయి ఉన్నాయి.

ఆ ఫొటో పక్కనే ఇంకో ఫొటో.

మరకలు అంటిన టిష్యూ పేపర్‌ను ఫ్రేమ్ కట్టించి పెట్టారు.

అవి రక్తపు మరకలు.. నల్లగా మారి ఉంది ఆ రక్తం.

అది నా రక్తం.

♦♦♦

# 15

# ప్రియమైన నీకోసం..

'రేయ్! నీకేమైనా పిచ్చా? ఆ అమ్మాయి రాదురా? ఇప్పుడు రాలేనని చెప్పమంది. వెయిట్ చేయడం వేస్ట్' వినోద్ ఎప్పటిలాగే అరుస్తూ వచ్చాడు.

**'లేదు. అన్నూ వస్తుంది. ఇక్కడ ఎదురుచూడడం ఇది ఐదో రోజే కావొచ్చు. నాకు అలవాటు కావడానికి ఇంకో పదహారు రోజులూ పట్టొచ్చు. నా జీవితంలో భాగం అయ్యేందుకు ఇంకో ఐదున్నర నెలలు పట్టొచ్చు. కానీ ఐదు రోజులైనా, ఆరునెలలైనా నేను తన కోసం ఎదురుచూడాలి. ఎందుకంటే నన్ను వేధిస్తున్న ప్రశ్నలకు అనన్య మాత్రమే సమాధానం చెప్పగలదు'** – నేను ఎప్పటిలాగే మా హొటల్ భాగమతి వెనకాల కూర్చుని ఐప్యాడ్‌లో రాసుకుంటున్నాను. ఆనందాలు, కోపాలు, బాధల గురించి నేనిప్పుడు మాట్లాడను. మాట్లాడే పరిస్థితిలో కూడా లేను. వాటిని మించిన డిప్రెషన్‌లో, ఫ్రస్టేషన్‌లో ఉన్నాను.

**ప్రియా!**

**ఎవరు నువ్వు?**

ఎందుకొచ్చావ్? నా జీవితంలోకి.

చనిపోయిన వాళ్ల ఫొటోకే కదా దండ వేస్తారు?

కానీ అక్కడ నీ ఫొటోకు వేశారేంటి?

నీకూ, నాకూ మాత్రమే తెలిసిన ఆ రక్తపు మరకల టిష్యూ పేపర్‌ను ఎవరు ఫ్రేమ్ చేయించారు? ఎందుకు?? నేను వెతుక్కుంటూ వెళ్లిన నజియా దగ్గర నీ ఫొటో ఎందుకు ఉంది? నీకూ తనకూ సంబంధం ఏమిటి?

అంతకుముందే కదా నువ్వు కనిపించింది! ఆ రోజు.. రెండుసార్లు.. హిమాయత్‌నగర్ మినర్వాలో.. తార్నాకలో!

నేను మనిషిగా మరల జన్మిస్తున్నానప్పుడే. అంతలోనే మరణించావా? ఎలా??

ఆ ఫొటో చూస్తే.. దానికి వేసిన పూలమాల చూస్తే.. నువ్వు చనిపోయి కూడా చాలా రోజులవుతున్నట్లు అనిపిస్తున్నది. ఈ లోకంలో లేని నువ్వు నాకెలా కనిపించావ్. గుండు సూదుల్లా గుండెకు గుచ్చుకుంటున్న ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎవరు చెబుతారు?

నువ్వు తప్పు!

ప్రియా!

నన్ను నువ్వు వదిలేసి వెళ్లిపోయావ్ అని అందరూ అనుకుంటూ ఉండొచ్చు. వదిలి వెళ్లిపోయినప్పుడు నా కన్నీరు క్యాటర్ పిల్లర్ మాత్రమే అని నువ్వు కూడా అనుకునే ఉంటావ్. కానీ ప్రియా! ఆ కన్నీరు ఇప్పుడు పట్టు పురుగైంది.

అదిప్పుడు కన్నీరా, పన్నీరా? అర్థం చేసుకోలేని విచిత్రమైన పరిసి&థతిలో ఉన్నాను.

ఎందుకంటే బాధలో కూడా ఫ్లేవర్లు ఉంటాయని.. విషాదానికీ పారామీటర్లు ఉంటాయనీ తెలుసుకుంటూ..

నిన్ను నేను వెతుకుతుంటే.. నాకు నేను దొరుకుతున్నాను..

ప్రేమంటే.. కలిసి బతకడం మాత్రమే కాదు.. అన్నావ్ అప్పుడు..

కానీ ఇప్పుడు ప్రేమే కాదు, దానికంటే గొప్పది.. ఇంకేదో ఉందని ఈ అన్వేషణలో

నువ్వు నాకు ఎదురై చెప్పాలనుకున్నావ్! అందుకే ఎదురుపడ్డావు.. అంతేకదా?!

కావొచ్చు. ఏదైనా కావొచ్చు! కానీ వెళ్లిపోయింది నీ నువ్వు. నువ్వు మాత్రమే ప్రియా! నా నువ్వు, నీ నవ్వు ఇంకా నా దగ్గరే ఉంది. ఉన్నాయి. నాతోనే ఉంటాయి కూడా.

నువ్వు నా జీవితంలోకి అందరి అమ్మాయిల్లాగే వొచ్చావనుకున్నాను. అప్పుడు నాకు తెలియదు. నువ్వు అలాంటి అమ్మాయివి కాదని.. మందలో ఒకదానివి కాదనీ వందలో ఒకదానివనీ ఆ తర్వాత తెలిసింది.

అదెప్పుడో తెలుసా?

'నువ్వంటే నాకిష్టం. కానీ నీ మొహం ఇంకెప్పుడూ నాకు చూపించకు' అని చెప్పినప్పుడు.

నువ్వేంటో పూర్తిగా నేను తెలిసీతెలుసుకోలేక నేను కొట్టుమిట్టాడుతున్నప్పుడు.. వెళ్లిపోయావు.

నిర్దాక్షిణ్యంగా.. నిర్మోహమాటంగా.. నిర్మలంగా.. ఒంటరిగా.. నన్నూ ఒంటిరిని చేస్తూ..

ఎక్కడికి పోతావ్? ఎంత దూరం పోతావ్?? కావాలనుకుంటే వస్తావులే అనుకున్నాను.

కానీ ఇప్పుడు అందనంత దూరం.. అందనంత ఎత్తుకు.. వెళ్లిపోయావంటే నమ్మాలా? నమ్మలేకపోతున్నాను. కానీ నమ్మాలి.

ఈ ప్రపంచంలో ప్రతి మనిషీ తన జీవితంలో ఏదో కోల్పోతున్నానని.. ఏదో కోల్పోయానని.. కోల్పోబోతున్నానని అర్థం చేసుకున్నప్పుడు.. అదేంటో తెలుసుకునేందుకు.. ఏదో ఒక క్షణాన ఆలోచన, అన్వేషణ మొదలెడతాడు..

కోల్పోబోతున్నవాడు.. అదేంటో తెలుసుకుని కాపాడుకుంటాడు. కోల్పోతున్నవాడు.. దాన్ని అర్థం చేసుకుని ఆపే ప్రయత్నం మొదలెడతాడు. అప్పటికే కోల్పోయినవాడు.. కోల్పోయిందేంటో తెలుసుకుని దాన్ని తిరిగి పొందేందుకు.. మార్గాలు వెతుక్కోవడం ప్రారంభిస్తాడు.

నేను చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే కోల్పోయి ఉన్నాను. నేను కోల్పోయింది ఏమిటో.. ఎవరినో నాకు అర్థమవుతున్నది. అర్థమైంది కూడా.

ఇప్పుడు తెలుస్తుంది ప్రియా! నువ్వేంటో, నేనేంటో!! నేను కోల్పోయింది ఏమిటో?

అందుకే మరోసారి గుర్తుచేసుకుంటున్నాను. నిన్ను... నేను కోల్పోయినదానినీ..

నీ తొలి పరిచయాన్ని.. నీ మలి కలయికని...

ఆ రోజు..

జూన్ రెండు, నా పుట్టినరోజు..

ఎప్పటిలాగే ఫ్రెండ్స్‌తో పెద్ద పార్టీ ప్లాన్ చేసుకున్నాను.

కానీ డాడీ 'కార్తీక్! నువ్వు ఈ రోజొక ఈవెంట్‌కు వెళ్లాలి' అన్నారు.

'సారీ డాడ్! ఫ్రెండ్స్‌తో పార్టీ ఉంది' అన్నాను.

'పార్టీలు ఎప్పుడూ ఉండేవే.. ఈ పుట్టిన రోజునాడైనా.. ఒక మంచి పని చెసే అవకాశం వచ్చింది. ఒక అమ్మాయి అనాథ పిల్లల కోసం ఫండ్స్ అడిగింది. నువ్వు వెళ్లి ఈ చెక్ వాళ్లకు ఇచ్చిరావాలి' అని చెప్పారు. అవసరమైతే పార్టీ రాత్రికి మార్చుకొమ్మన్నారు. తప్పలేదు. అమ్మాయి అనడంతో అంతో ఇంతో ఆసక్తి కలిగింది తప్ప... కాస్త చిరాగ్గానే వచ్చాను.

అక్కడే నిన్ను చూశాను. నా కళ్లు నిన్ను అంతుకుముందు చూసిన అందరి అమ్మాయిల్లాగే చూశాయి. అందంగా ఉన్నావ్. అమాయకంగా కూడా. ఈజీగా పడిపోతావ్ అనుకున్నాను. నిన్ను నా మనసు నిండా నింపుకుని అక్కడి నుంచి వెళ్లాను. కానీ నువ్వు అందరిలాంటి అమ్మాయివి కాదని అప్పుడు నాకు అర్థం కాలేదు. నిన్ను పొందే ప్రయత్నంలో నేను వేసిన ఎత్తుగడలు పనిచేయనప్పుడు.. నువ్వు పట్టించుకోనప్పుడు భరించలేకపోయాను.

నేను నీవెంట పడుతున్నానని నీకు అర్థమైంది. అప్పటి వరకు నేను అడిగితే వెంటనే ఒప్పుకున్న అమ్మాయిల్నే ఎక్కువగా చూశాను. కానీ నన్నూ తిరస్కరించేవారు ఉంటారని నిన్ను చూశాకే తెలిసింది. నేను చాలాసార్లు డేటింగ‌ఎకు రమ్మని నిన్ను అడిగాను. కానీ నువ్వు ఎన్నిసార్లు అడిగినా ఒప్పుకోలేదు. అలాంటి ఓ రోజు సడన్‌గా నాతో డేటింగ్‌కు ఒప్పుకున్నావు. ముందు ఆశ్చర్యమేసింది. తర్వాత ఆనందపడ్డాను. ఏ అమ్మాయి అయినా నాకు పడిపోవాల్సిందే అని సంతోషించాను. కానీ ఇప్పుడు అర్థమవుతున్నది.. నువ్వు సడనఎగా ఒప్పుకోవడానికి కారణం వేరే ఉందని.

నువ్వు నాతో డేటింగ్‌కు వచ్చిన రోజు నేను చేసింది తప్పే కావొచ్చు. కాదనను. కానీ నీ అమాయకత్వం.. సిగ్గు చూసి ముచ్చటేసింది. ముద్దుగా అనిపించింది. అమ్మాయిలు వద్దూ వద్దూ అంటుంటేనే ఎక్కువగా ముద్దొస్తారు. అంతకు ముందొచ్చిన ఏ అమ్మాయి వద్దూ వద్దూ అనలేదు. నీలో చూసిన ఆ సిగ్గు, బిడియం నేనెప్పుడూ చూడలేదు. నాకు నీలా ఎవరూ అడ్డు చెప్పలేదు. అడ్డు గీతలు గీయలేదు. అయినా అక్కడితో ఆగిపోయి ఉంటే నువ్వు వేరని నేను అప్పుడే అర్థం చేసుకునేవాడినేమో. కానీ అంతలోనే ఒప్పుకున్నావ్. నిన్ను నాకు మౌనంగా అర్పించావ్. అప్పుడు నేను ఈ ప్రపంచాన్ని గెలిచాను అనుకుని సంబరపడ్డాను. కానీ నాది గెలుపు కాదు.. బలుపు అని ఇప్పుడు అర్థమవుతున్నది.

'ప్రతిసారి గెలవాలనుకోవడమే జీవితం కాదు కార్తీక్! ఒక్కసారి ఓడిపోయి చూడు' అని అన్నావ్. అప్పుడైనా నిన్ను నేను అర్థం చేసుకోవాల్సింది.

'అమ్మాయిల్ని పొందడమే గెలుపు కాదు.. అదసలు గెలుపే కాదు.. బలుపు' అని అన్నప్పుడైనా నన్ను నేను తెలుసుకోవాల్సింది.

'డబ్బుంది ఏమైనా చేయొచ్చనే, ఎవరినైనా పొందొచ్చనే పొగరు. డబ్బుతో కొనలేనివి కొన్ని ఉంటాయి కార్తీక్. అవేంటో తెలిసినప్పుడే నీకు జీవితం అంటే ఏమిటో అర్థమౌతుంది. అందుకు ఒక్కసారి ఓడిపోయి చూడు. నీ గెలుపు నిన్ను ఈ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. కానీ ఓటమీ ఈ ప్రపంచాన్ని నీకు పరిచయం చేస్తుంది' అని కూడా అన్నావ్. 'నువ్వెప్పుడైనా ఈ ప్రపంచాన్ని చూశావా.. మనుషుల్ని.. మనసుల్ని? నీ ఇంటి కిటికీ అద్దాల్లోంచి... నీ కార్ విండోలోంచి.. నీ అందాల కళ్లజోడులోంచి చూసేదే అసలైన ప్రపంచం కాదు.. తీసెయ్.. అడ్డుగా ఉన్న ఆ గ్లాస్ అనే ఫిల్టర్ తీసి చూడు..' అని కూడా చెప్పావ్. కానీ ఇదంతా నువ్వు ఒప్పుకోక ముందు చెప్పి ఉంటే నేను వినేవాణ్ణి. ఒప్పుకున్నాక చెప్పావు కాబట్టే నేను పట్టించుకోలేదు. లొంగిపోయిన అమ్మాయిలు చెప్పే ఏ మాటలూ మగాడికి మెదడుకు ఎక్కవేమో. కానీ నాకు ఇప్పుడు ఎక్కుతున్నాయి.. ఆ క్షణాన ఇదంతా నువ్వు నాకెందుకు చెప్పావో అప్పుడు అర్థం కాలేదు. కానీ ఇప్పుడు తెలుస్తున్నది.

ఆరోజు తొలిసారి చూసిన నీ కన్నీరులో.. వాటిని తాకిన తడి జ్ఞాపకాల్లో ఇప్పుడు నన్ను నేను వెతుక్కునే ప్రయత్నం చేస్తున్నాను.

'నువ్వంటే నాకిష్టం. కానీ నీ మొహం ఇంకెప్పుడూ చూపించకు' అన్నావ్. చూపించాల్సిన అవసరం లేదు.. అసలు ఇక నువ్వే నాకు అవసరం లేదు.. అంతా అయిపోయాక అని

ఆరోజు నేను అనుకున్నాను.. కానీ ఆ తర్వాతే తెలియడం మొదలైంది.. నువ్వు.. వొద్దన్నప్పుడు.. వొదిలి వెళ్లిపోతున్నప్పుడు.. పిచ్చిగా ప్రవర్తించాను. ఆ పిచ్చే ప్రేమని.. ఆ ప్రేమే నిజమని.. నేను బతికిన మిగతా ప్రపంచం అంతా అబద్ధమని.. ఆడంబరమని.. అనవసరమని.. ఆ తర్వాతే నాకు తెలియడం మొదలైంది ప్రియా!

అందరి అమ్మాయిలని మర్చిపోయినట్లే.. నిన్నూ మర్చిపోవడానికి ప్రయత్నించినప్పుడు ఎందుకు సాధ్యం కాలేదో.. ఎంత మర్చిపోదామనుకుంటే.. అంతగా ఎందుకు గుర్తొచ్చావో ఇప్పుడు తెలుస్తున్నది.

'ఎందుకు? ఈ అమ్మాయిని మర్చిపోలేకపోతున్నాను? ఏముంది ఈమెలో? ఆకాశం నుంచి ఏమైనా ఊడి పడిందా?'.. అని మొదట్లో అనుకున్నాను. కానీ నేను అనుకోవడం వేరు.. ఇక్కడ అవుతున్నది వేరు.. అని నాకు మెల్ల మెల్లగా తెలిసొచ్చింది. అరవై ఏళ్ల తర్వాత ఒక ఉత్తరం వొచ్చినప్పుడు.. అది చూసి దాదాకు హార్ట్ ఎటాక్ వొచ్చినప్పుడు.. ఆయన హాస్పిటల్‌లో ఉన్నప్పుడు.. నజియాను కలవరిస్తున్నప్పుడు.. హైదరాబాద్ వెళుతున్నప్పుడు.. వెళ్లాక నజియాను వెతుకుతున్నప్పుడు.. ప్రతి క్షణం నువ్వున్నావ్ అని అర్థమవుతున్నది.

అసలు ఈ లోకంలోనే లేని నువ్వు నాకెలా కనిపించావ్? ఇదెలా సాధ్యం?? మలుపు మలుపులో నా వెతుకులాటలో నువ్వున్నావ్. నన్ను గెలిపించావ్. నజియాను చూపించావ్.

అక్కడే నన్ను నేను, నిన్ను నేను తెలుసుకున్నాను. అరవై ఏళ్ల ఆమె ఎదురుచూపుల్లో ప్రేమంటే ఏంటో అర్థం చేసుకున్నాను. నజియా దర్శనం.. ప్రేమకు నిదర్శనం.

ప్రేమంటే కలిసి బతకడం మాత్రమే కాదని.. నువ్వక్కడ.. నీనిక్కడ ఉన్నా.. నువ్వక్కడ.. నీనిక్కడ లేకున్నా.. ప్రేమ ప్రేమగానే ఉంటుందని, ప్రేమ ప్రేమని ప్రేమిస్తూనే ఉంటుందని.. ఇప్పుడు తెలుస్తోంది ప్రియా! నువ్వూ నన్నూ ప్రేమించావని. ఎంతగా ప్రేమించావో తెలుసుకున్నాను. నజియా ఎవరో, తనను ఎందుకు కలిపించాలని అనుకున్నావో.. అర్థం చేసుకుంటున్నాను.

'నువ్వంటే నాకిష్టం.. కానీ నీ మొహం ఇంకెప్పుడూ నాకు చూపించకు..' అన్నావ్‌గా. అందుకేనా నీ ఇష్టాన్ని నజియా దగ్గర వదిలేసి.. నన్ను అక్కడికి రప్పించాలనుకున్నావ్. వచ్చినప్పుడు నా మొహం చూడలేకే నువ్వు వెళ్లిపోయావా!?

ఇదంతా కుట్ర అని నాకు తెలుసు ప్రియా! నన్ను నీ దగ్గరికి చేర్చడానికి ఈ విశ్వమంతా

**కుట్ర పన్ని నాకూ, నీకూ సహాయం చేసిందని నేను నమ్ముతున్నాను. అర్థం చేసుకుంటున్నాను. నేను చేయాల్సిందేమిటో.. నాకు అర్థమవుతున్నది. తీసేయాల్సిన ఫిల్టర్ ఏమిటో తెలిసి వస్తున్నది. ఇరవై నిమిషాల కోసం రెండు కోట్ల రూపాయల విలువైన కారును నేను ఎలా వొదులుకోగలిగానో, నువ్వు లేవని అక్కడ నేను తెలుసుకున్న క్షణాన.. ఓ తల్లి పురిటి నొప్పుల్లో ఎందుకుందో.. ఆ బొడ్డూడని బిడ్డ నా చేతిలోకి ఎందుకు వచ్చిందో.. ఆ పాప రూపంలో నీవెందుకు కనిపించావో.. నాకు జ్ఞానోదయం అయింది–**

'ఎందుకురా ఏడుస్తున్నావ్?' అని ఐప్యాడ్ లాక్కున్నాడు వినోద్.

నేనేం మాట్లాడలేదు. నా కళ్ల వెంట నీరు కారుతుందన్న విషయం కూడా నాకు తెలియలేదు. కన్నీరు తుడుచుకున్నాను.

దూరంగా పార్క్ చేసిన కార్ల వైపు చూశాను. రెడ్ కలర్ ఆడీ ఏ6 కాబ్రియోలెట్. పక్కన నా మెర్సిడాస్ బెంజ్ ఏ 180 సీడీఐ. బ్లాక్ కలర్. ఈ రంగు అన్నూకి అస్సలు ఇష్టం ఉండదు. ఈ ఐదు రోజులుగా నేను అనన్య కోసమే ఎదురు చూస్తున్నాను. అయినా తను రావడం లేదు. ఫోన్ చేశాను, లిఫ్ట్ చేయడం లేదు. మెసేజ్ చేశాను, రిప్లై ఇవ్వడం లేదు. ఈ రోజూ చేశాను. కానీ తను ఇంకా రాలేదు.

వినోద్‌ను చూశాను 'ఏమైందిరా.. ఎందుకేడుస్తున్నావ్ చెప్పు?' అని మళ్లీ అడిగాడు.

నేనేం చెప్పలేదు. అనన్య కోసం పార్కింగ్ వైపు చూశాను. హారన్ పెద్దగా మోగలేదు. ఒకటో నంబర్.. రెండో నంబర్ ప్రమాద హెచ్చరికలూ లేవు. అన్నూ వచ్చేటప్పుడు తన చుట్టూ మోసుకొచ్చే నిశ్శబ్దం లేదు. క్యాంటీన్‌లో సాసర్లు పగలడం లేదు. కాఫీ ఎవ్వరూ మీద పోసుకోవడం లేదు. ముంబై వాతావరణ కాలుష్యంలో ఆమె వంతు పొగ తక్కువగా కనిపిస్తున్నది. గంటన్నర అయినా నా మౌన దీక్ష వదలలేదు. ఎవర్‌నోట్‌లోంచీ బయటికి రాలేదు. కొత్త సామెతలు లేవు. తాతయ్య లేడు. ప్రియా లేదు. నా ఎల్‌ఐసీ లోగోలూ లేవు. నా చేతిలో ఒక విజిటింగ్ కార్డ్ తప్ప.

ఆ కార్డ్‌ను తిప్పి తిప్పి చూస్తున్నాను. దాని మీద 'నజియా – డైరీస్ – హైదరాబాద్' అని ఒకవైపు రాసి ఉంది.

మరోవైపు 'అనన్య.. సైకాలజిస్ట్..' అని ఫోన్ నంబర్ ప్రింట్ చేసి ఉంది.

అనన్య సైకాలజిస్ట్! కావొచ్చు. కానీ విన్నూ గర్ల్ ఫ్రెండ్‌గా నా లైఫ్‌లోకి ఎందుకొచ్చింది?

హైదరాబాద్ వెళ్లడానికి నాకంటే ముందే తను ఎందుకు ఫిక్స్ అయింది?

వినోద్ ఇక్కడే ఉన్నాడు.. పిలిచి అడగొచ్చు. అడిగాను కూడా.. కానీ వాడేం చెప్పడం లేదు. 'నాకు నిజంగా ఏమీ తెలియదు' అని అంటున్నాడు. 'నిజంగా' అనే పదాన్ని బలంగా వాడినప్పుడే తెలుస్తున్నది వాడికి తెలుసని.

తెలిసిన వారిని అడగొచ్చు. తెలియని వారినీ అడగొచ్చు(ద్దు). కానీ తెలిసీ తెలియనట్లు నటించేవారిని ఏమీ అడగొద్దు. అడిగినా వారు చెప్పరు.

ఈ విజిటింగ్ కార్డ్ నాకు ఇచ్చింది డాడీ. అనన్య కార్డ్ ఆయన దగ్గర ఎందుకుంది? డాడీ నాకు చెప్పలేదంటే ఇదంతా కుట్రేనా? విన్నూ దాయడం.. అన్నూ ఏమీ తెలియనట్లు ప్రవర్తించడం ఆ కుట్రలో భాగమేనా?

నన్ను ప్రియ దగ్గరికి, ప్రియ లేదన్న నిజం దగ్గరికి.. తన సమాధి దగ్గరికి చేర్చేందుకు ఈ విశ్వమంతా కుట్ర పన్నిందని నాకు నూరు శాతం అర్థమైంది. కానీ ఇంకా కొన్ని ప్రశ్నలు నన్ను వేధిస్తున్నాయి. అవి ప్రియతోపాటు సమాధి కాకూడదు. నన్ను నేను పూర్తిగా తెలుసుకోవాలి.

ప్రియా ఎలా చనిపోయింది?

నజియాకు ప్రియా ఏమవుతుంది?

నా రక్తపు మరకల ఫొటో అక్కడ ఎందుకు ఉంది?

నా మదిలో రగులుతున్న ఈ ప్రశ్నలకు ఇక సమాధానం చెప్పాల్సింది అన్నూనే. అందుకే తన కోసం ఎదురు చూస్తున్నాను.

అన్నూ వస్తుందని నేను బలంగా కోరుకుంటున్నాను. దీన్ని సాధించడంలో ఈ విశ్వమంతా కుట్ర పన్ని నాకు సహాయం చేస్తుందని నేను నమ్ముతున్నాను.

♦♦♦

# 16

# మరో అనన్యపర్వం

'ప్రియ ఎలా చనిపోయింది?' ఉండబట్టలేక అడిగాను నేను.

'ప్రియ చనిపోలేదు నాగ్! చంపేశాడు' చెప్పింది అనన్య.

'ఎవరు?'

'కార్తీక్'

'కార్తీకా!?'

'అవును కార్తీకే. ప్రియ చావుకు కారణం కార్తీక్'

'నమ్మలేకపోతున్నాను.. ప్రియను కార్తీక్ చంపడమేంటీ?'

'చెప్తాను. కానీ ముందు ఇది చెప్పు.. ఎంత వరకు వచ్చింది పుస్తకం రాయడం?'

'అయిపోవొచ్చింది. కానీ.. కార్తీక్ చెప్పిన కథ ఎక్కడ మొదలైందో అక్కడే ఆగిపోయింది'

చెప్పాను నేను.

'ఊగి ఊగి ఉయ్యాల ఉన్న చోటే ఆగిపోయిందన్నమాట!' నవ్వింది అన్నూ తన ఒళ్లోని టెడ్డీబేర్‌ను పక్కన పెడుతూ 'ఉండు ఇప్పుడే వస్తా' అని వెళ్లిపోయింది.

తను షార్ట్ వేసుకుంది. లూజ్ టీ షర్ట్ ధరించింది. జుట్టు పిచ్చి పిచ్చిగా ముడివేసి క్లిప్ పెట్టింది. కాళ్లకు స్లిప్పర్స్ వేసుకుంది. కాస్త డబ్బున్న వాళ్లు ఇంట్లో కూడా చెప్పులు వేసుకుంటారు ఎందుకో?

నేను అనన్య వాళ్లింట్లో ఉన్నాను. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో పెద్ద ఇల్లు. అప్పుడప్పుడూ రమ్మని ఫోన్ చేసింది కానీ నేనే 'పుస్తకం రాసే పనిలో తీరిక లేకుండా ఉన్నాను. అయిపోయే వరకు రాలేన'ని చెప్పాను. ఇప్పుడు రాకతప్పలేదు.

'సో.. ఎక్కడున్నాం మనం' అంటూ కాఫీ పట్టుకుని వచ్చింది అన్నూ.

'అదీ.. ఉయ్యాల దగ్గర..' అన్నాన్నేను కాఫీ తీసుకుంటూ.

'అవునూ.. పుస్తకంకంటే ఎక్కువ ప్రోమోలే రాస్తున్నట్లుంది ఫేస్‌బుక్‌లో మీరు? వినేవాడు చైనావాడయితే బరాక్ ఒబామా భగవద్గీత చెప్పినట్లున్నాయి మీ ప్రోమోలు' తను కామెంట్ చేసిందో, కాంప్లిమెంట్ ఇచ్చిందో అర్థం కాలేదు. కాఫీ మాత్రం వేడిగా ఉందని అర్థమైంది.

'అనన్యవారు ఆన్‌లైన్‌లో లేరని ఫేస్‌బుక్‌లో స్టేటస్‌లు ఆగవు కదా!' అన్నాన్నేను. తన శైలిలో డైలాగ్ చెప్పే ప్రయత్నం చేశాను. ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు, వీరు వారవుతారు అంటారుగా. ఇదే డైలాగ్ తను ఇంకా కొత్తగా చెప్పేదేమో.

'అసలు నువ్వు పుస్తకం రాస్తున్నావా? ఫేస్‌బుక్‌లో ప్రోమోలు రాస్తున్నావా?' తను టెడ్డీబేర్ మళ్లీ ఒళ్లో పెట్టుకుంది.

'పుస్తకం రాసినదానికంటే ఎక్కువ ప్రోమోలే రాస్తున్నాను..' అన్నాన్నేను నవ్వుతూ.

'అలాగే ఉంది మరి!' అన్నది తను.

'ఆ ప్రోమోలు నేనేం రాయడం లేదు.. మా పబ్లిషర్ రాస్తున్నారు' అన్నాను కాఫీ సిప్ చేస్తూ.

'రాస్తున్నారు.. రాస్తున్నారు.. అభిమాన పాఠకుల పేరుతో.. జనాలను చావగొట్టేలా రాస్తున్నారు..'

'అది తర్వాత మాట్లాడుకుందాం అన్నూ! ముందు నాకు ప్రియా ఎలా చనిపోయిందో చెప్పు?'

'అరె.. ఉండు చెప్తాగనీ.. ఇద్దరు అనన్యలు వచ్చి వెళ్లారట.. నీతో కలిసి బిర్యానీ తినడానికి..' అడిగింది.

'అదీ..' తల దించుకుని నెత్తి నిమురుకున్నాను.

'అబ్బో! సిగ్గు. సిగ్గు పడడం కూడా వచ్చా నీకు?' తన కళ్లు పెద్దవి చేసి నా కళ్లలోకి చూస్తూ అడిగింది.

ముసి ముసిగా నవ్వాన్నేను.

'ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన అనన్యపర్వం పదివేల మందికి రీచ్ అయింది తెలుసా?' అన్నాను. నా మాటల్లో కొంచెం గర్వం కనిపించింది.

'అనన్యపర్వం?'

'అనన్యపర్వం అంటే.. నువ్వు హుక్కా వెలిగిస్తే కిక్కొస్తది.. నిన్ను రగిలిస్తే బుక్కొస్తది.. అని కన్విన్స్ చేశావ్‌గా.. అది పుస్తకం ముందుమాటగా రాశాను.. అది చదివి మా ప్రవీణ్ తన పాపకు నీ పేరు కూడా పెట్టుకున్నాడు'

'అవునా? అయితే ఆ పాపని మీ బుక్‌కు బ్రాండ్ అంబాసిడర్ చేసేస్తారా?'

'బావుందే ఐడియా.. చేసేద్దాం..'

'చేసేస్తారు. చేసేస్తారు.. పుస్తకానికి టీజర్లు, హోర్డింగులు.. విజ్యువల్ ప్రోమోలు..! ఇద్దరమ్మాయిలు మోషన్ పోస్టర్ కూడా చేసినట్లున్నారు?'

'ఊ.. చేశారు.. మోషన్ పోస్టర్ కాదది.. మోషన్ కవర్..'

'కవర్ చేసుకుంది చాలుగానీ.. ఎవరా అమ్మాయి? రైటర్ తర్వాత డాక్టర్ అవుతావా అని నిన్ను అడిగింది చూడు..' అంది అన్నూ. ఫేస్‌బుక్ ఫాలో కావట్లేదు అనుకున్నాను.. కానీ బాగానే ఫాలో అవుతుందన్నమాట. కార్తీక్ మిగిలిన కథ తెలుసుకోవాలంటే అనన్యకు సమాధానం చెప్పాల్సిందే. తప్పదు.

'తను రాజ కుమారి.. తను మా ప్రోమోలు చూసి ఏమన్నదంటే.. అప్పట్లో బమిడిపాటి

కథలు వచ్చేవట. అందులో సుత్తివేలు భార్య పిచ్చిదైపోతుంది. పిచ్చి అంటే ఈ లోకంతో సంబంధం లేనట్లు ఉంటుందట. విషయం ఏంటంటే ఆమె ఒక వీక్లిలో సిరియల్‌కి అడిక్ట్ అయిపోతుంది. అందులో ముగింపు ప్రచురించకుండా ఆపేస్తారు. దానితో ఆమె అలా అయిపోతుందన్నమాట. ఆ ఊరికి కొత్తగా ఒక డాక్టర్ వచ్చారని ఇలా తయారైన వారందరికీ చికిత్స చేస్తున్నారని తెలిసి సుత్తివేలు తన భార్యను తీసుకుని వెళ్తాడు. తర్వాత ఆమె మంచిగా అయితది. అసలు విషయం ఏంటంటే.. ఆ డాక్టరే ఆ సీరియల్ రైటర్. ఆయన కథ ముగింపు చెప్పడంతో వీళ్లు బాగయ్యారన్నమాట. అలా మీరు కూడా మమ్మల్ని పిచ్చి వాళ్లని చేయాలనుకుంటున్నారా? మీ నజియా కోసం వెయిట్ చేయించీ.. అలా మీరు కూడా డాక్టర్ అవతారం ఎత్తి ముగింపు చెబుతారా? అని అడిగింది' అదీ విషయమని చెప్పాన్నేను.

బిగ్గరగా నవ్వింది అన్నూ. పడి పడి నవ్వింది. టెడ్డీ బేర్ పక్కన పడేసి పొట్ట పట్టుకుని మరీ నవ్వింది.

'అవసరమా ఇదంతా?' అంది తన నవ్వు ఇంకా ఆగలేదు. అనన్య నవ్వు విని వాళ్లమ్మ వచ్చి తొంగి చూసి వెళ్లింది.

'అవసరం.. సిగరెట్ ప్యాకెట్ మీద వార్నింగ్.. స్మోకింగ్ కిల్స్ అని రాసి ఉంటుంది. పొగ తాగితే పోతారు అని చెప్పినా కొనేవాళ్లు కొంటూనే ఉంటారు. అలాంటిది ఒక పుస్తకం రాస్తున్నప్పుడు.. ఇది మంచి పుస్తకం కొని చదవండి అని ప్రచారం చేసుకోవడంలో తప్పేముంది? అసలు పుస్తకం అంటేనే మంచి.. ఈ రోజుల్లో చెడు కంటే మంచిదానికే మరింత ప్రమోషన్ అవసరం' అని చెప్పాను.

తను నవ్వడం ఆపి 'యూ ఆర్ రైట్' అంది.

'రాజ కుమారి అన్నట్లు.. కార్తీక్ కథలో ముగింపు లేకుండా పోయేలా ఉంది అన్నూ'

'అదేం కాదు.. కార్తీక్ కథ ఎక్కడ మొదలైందో.. అక్కడే ఆగిపోయింది అన్నావ్ గా.. బావుంటుంది.. కొత్తగా..'

'కొత్తగా కాదు.. చెత్తగా ఉంటది'

'పాపం పోనీలే అని పాత కంప్యూటర్ ఇస్తే పక్కకి వెళ్లి కాన్ఫిగరేషన్ చూశాడట.. నీలాంటి వాడు..' అని బుంగమూతి పెట్టుకుంది. అనన్య హర్ట్ అయిందని అర్థమైంది. 'కావాలంటే మిగిలిన కథ పార్ట్ 2గా రాయ్. ఇంకో పుస్తకంగా..' అన్నది.

'పార్ట్ 2 కాదు.. ఇలా అయితే నేను పార్ట్ 1 కూడా రాయలేను..'

'రాయకు.. ఫ్రిజ్ మీద కోపంతో నీళ్లు తాగడం మానేస్తే.. గొంతు ఎండేది మనకే గానీ ఫ్రిజ్‌కు కాదుగా..'

'అంటే కోపం కాదు అనన్య.. పార్ట్ టూ రాయడానికి ఇదేం బాహుబలి సినిమా కాదు.. రామ్‌గోపాల్ వర్మ రక్తచరిత్ర అంతకన్నా కాదు కదా!?..'

'పార్ట్ 1 చదివిన వాళ్లు పార్ట్ 2 తప్పక చదువుతారు.. పర్లేదు ఆసక్తికరంగా ఉంటుంది.. ఒకే కథని రెండు సార్లు అమ్ముకోవచ్చు. అదే ఇప్పటి మార్కెట్ ట్రెండ్ కదా?'

'మేం ట్రెండ్‌ను ఫాలో అవ్వం.. అలాగనీ సెట్ చేయం.. మేం అదో రకం.. అలా చేస్తే ఆసక్తికరంగా కాదు.. అసంపూర్తిగా ఉంటుంది. పాఠకులకు అసంతృప్తి కలుగుతుంది అన్నారు మా పబ్లిషర్..

'అవునా? అంటే నేను అనేది.. రెండొందల పేజీల పుస్తకానికి 150 రూపాయల ధర పెట్టి అమ్మడం కంటే.. సినిమా టిక్కెట్ల ధరల్లో రెండు చిన్న పుస్తకాలు ఇవ్వొచ్చు కదా అని..'

'సినిమా వేరు, పుస్తకం వేరు. సినిమాలు చూసేవాళ్లందరూ పుస్తకాలు కొని చదివితే ఈ దేశం ఎప్పుడో బాగుపడేది అనన్య. సినిమాలు చూసి బాగుపడ్డవాడు ఉంటాడో లేడో తెలియదు కానీ.. పుస్తకాలు చదివి చెడిపోయినవాడు మాత్రం ఈ ప్రపంచంలో ఎక్కడా కనిపించడు..'

'కరెక్టే.. కానీ....' అనన్య ఇంకేదో చెప్పబోయింది.

'అనన్య ప్లీజ్ స్టాప్. ప్లీజ్..! ముందు నాకు ప్రియా గురించి చెప్పు.. సైకాలజిస్ట్ అనన్య వినోద్ ఫ్రెండ్‌గా కార్తీక్ లైఫ్‌లోకి ఎందుకు వెళ్లిందో చెప్పు.. చనిపోయిన ప్రియా కార్తీక్‌కు ఎలా కనిపించింది.. అదెలా సాధ్యం? ఇవి చెప్పు మిగిలిన విషయాలు తర్వాత మాట్లాడుకుందాం..'

'ఉఫ్' మని తను నిట్టూర్చింది. సోఫాలోంచి లేచి.. బాల్కానీలోకి నడిచింది. నన్ను రమ్మని పిలిచింది.

బాల్కానీలో నాలుగు పూల మొక్కలున్నాయి. ఒక గులాబీ మొక్కకు అంటు కట్టి ఉంది.

'చెప్తాను.. కార్తీక్ గురించి.. ప్రియ గురించి.. నా గురించి..' అని అనన్య చెప్పడం మొదలెట్టింది. తన మాటలు ఇలా గులాబీ మొక్కకు అంటుకట్టినట్లు ఉన్నాయి.

'నేనూ ముందు షాక్ అయ్యాను. ప్రియ వచ్చిందని కార్తీక్ మినర్వా కేఫ్‌లో రెండు కాఫీలు ఆర్డర్ ఇచ్చాడు చూడు.. అప్పుడు. ఆ తర్వాత తార్నాకలో.. ప్రియ ఏది? అన్నాడు కార్తీక్. తను కార్ దగ్గరి నుంచి కాగితపు పక్షులతో ఆడుకుంటున్న పిల్లల్ని చూడడానికి వెళ్లాడు. నేను తనని కార్ దగ్గరి నుంచి వెళ్లినప్పటి నుంచి చూశాను. నాకు కనిపించని ప్రియ తనకెలా కనిపించింది? నేను ఆ పిల్లలతో మాట్లాడుతూ.. కార్తీక్ ప్రియను వెతుక్కోవడం చూశాను. ఆ తర్వాత నజియాను కలిసినప్పుడు ప్రియ ఫొటో కార్తీక్‌కు నేనే చూపించాను.. అసలు ప్రియ ఎవరో.. ఎలా ఉంటుందో తెలియని నేను కార్తీక్‌కు ఎలా చూపించాను? చెప్పు ఎలా చూపించాను?' అని అడిగింది అనన్య.

'అవును కరెక్టే కదా! ప్రియ ఎవరో నీకు తెలియనిది ఆ ఫొటో నువ్వెలా చూపిస్తావ్? అంటే.. ప్రియ నీకు ముందే తెలుసు. తను చనిపోయిందనీ తెలుసు.. కదా?' అడిగాను ఆశ్చర్యంగా. అనుమానంగా.

'యస్! ప్రియ ఎలా ఉంటుందో అప్పుడు నాకు తెలియదు. కానీ తను చనిపోయిందని తెలుసు. ఈ విషయం కార్తీక్‌కు తెలియదు. తన వల్లే చనిపోయిందనే విషయం అసలే తెలియదు. నేను కార్తీక్‌ను మొదటిసారి ఎక్కడ కలిశానో తెలుసా? హొటల్ భాగమతిలో. వినోద్ ఫ్రెండ్‌గా. అంతకంటే ముందు కార్తీక్ వాళ్ల డాడీ భగత్ అంకుల్‌ను కలిశాను. ఆయనే నాకు ప్రియ గురించి, కార్తీక్ గురించి చెప్పారు. ప్రియ కార్ యాక్సిడెంట్‌లో చనిపోయింది. ఆ కార్ డ్రైవ్ చేసింది కార్తీక్. అదీ మద్యం మత్తులో. భగత్ అంకుల్ పోలీసులకు డబ్బులిచ్చి మేనేజ్ చేశారు. కార్తీక్ మీద కేసు కాకుండా చూసుకున్నారు. ప్రియ తన వల్లే చనిపోయిందన్న విషయం తెలియక కార్తీక్ ఇంకా ఆమె కోసం పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఆ సమయంలోనే ఒక సైకాలజిస్ట్‌గా తనను మార్చడానికి అంకుల్ నన్ను పిలిపించారు. నేను సైకాలజిస్ట్‌ని అని చెబితే కార్తీక్ ఒప్పుకోడు. అందుకే అంకుల్ వినోద్‌ను పిలిపించి.. తన గాళ్‌ఫ్రెండ్‌గా పరిచయం చేయమన్నాడు. అలా వెళ్లిన నేను తక్కువ రోజుల్లోనే కార్తీక్‌కు మంచి ఫ్రెండ్ అయ్యాను. ప్రియ ఉందని, తనకోసం తిరిగి వస్తుందని కార్తీక్ ఎదురుచూడడం నేను గమనించాను. కానీ ఆమె ఉన్నట్లు ఊహించు కుంటున్నాడని నేను మినర్వాలోనే చూశాను. ఆ రోజు.. నజియాను కలిశాక గోడకున్న

ప్రియ ఫొటో చూపించాక..'

'ఆగాగు..' అని అనన్య మాటాలకు అడ్డు చెబుతూ 'అసలు ఆ ఫొటో ప్రియదని అని నీకెలా తెలుసు?' అని అడిగాను.

'అదీ.. నేను ముంబైలో తన కాలేజ్‌కు వెళ్లి ప్రొఫైల్ చూశాను. కార్తీక్‌ను స్టడీ చేస్తున్నప్పుడే ప్రియ గురించి కూడా తెలుసుకునే ప్రయత్నం చేశాను'

'ఓకే.. చెప్పు.. చెప్పు.. ఆ ఫొటో చూపించాక..'

'ఫొటో చూపించాక చాలా సేపటి తర్వాత కార్తీక్‌ను ప్రియ సమాధి దగ్గరికి తీసుకెళ్లాం. కార్తీక్ కళ్లలో అప్పుడు నేను పశ్చాతాపం చూశాను. నజియా అప్పుడే పుట్టిన పాపని తీసుకొచ్చి కార్తీక్ చేతిలో పెట్టింది. ఆమె ఎందుకు అలా చేసిందో అప్పుడు తెలియదు. అది తెలుసుకునేందుకు నేను తర్వాత నజియాను కలిశాను. అంతకంటే ముందు.. కార్తీక్ ముంబై వెళ్లిపోయాక నేను మినర్వా కేఫ్‌కు కూడా వెళ్లాను. అక్కడి సీసీ టీవీ ఫుటేజ్ అడిగి తీసుకున్నాను. ప్రియా! మాట్లాడు ప్రియా! అని కార్తీక్ ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కానీ ఎదురుగా ఎవరూ లేరు. బేరర్ కార్తీక్ వింతగా చూశాడు. ఒక్కడే వచ్చి రెండు కాఫీలు ఎందుకు ఆర్డర్ ఇచ్చాడో అర్థం కాక పిచ్చి వాడనుకున్నానని బేరర్ తర్వాత నాతో చెప్పాడు. అప్పుడే నాకు అర్థమైంది.. కార్తీక్ డుల్యూషనల్ డిజార్డర్‌లో ఉన్నాడని. అదొక సైకిక్ ప్రాబ్లమ్. డుల్యూషన్, ఇల్యూషన్‌ల మధ్య కొట్టుమిట్టాడుతూ స్కిజొఫ్రెనియాకు గురయ్యాడు కార్తీక్. ఏది నిజమో.. ఏది అబద్ధమో తెలియక సతమతమవుతున్నాడు. ఇప్పుడూ ఇంకా అలాంటి పరిస్థితుల్లోనే ఉన్నాడు.

'అది సరే.. ఇంతకీ నజియా దగ్గరకు మళ్లీ వెళ్లినప్పుడు ఏం చెప్పింది.. ప్రియ చావుకు కార్తీక్ ఎలా కారణం?.. ఈ ప్రశ్నలకు సమాధానాలు..' అడిగాను నేను.

'నాగ్! నిజంగా.. ప్రియ చావుకు కార్తీక్ కారణం అని నాకు భగత్ అంకుల్ చెబితేనే తెలుసు. కానీ కార్తీక్‌కు ప్రియా ఎక్కడ పరిచయం.. ఎలా పరిచయం.. ఎందుకు తను వదిలేసి వెళ్లిపోయింది.. ఇవన్నీ ఏం తెలియదు. అన్నింటికంటే.. ఆశ్చర్యకరమైన విషయం ప్రియ ఫొటో నజియా దగ్గర ఎందుకుంది..? నజియాకు, ప్రియకు సంబంధం ఏంటి? ఇది తెలుసుకునేందుకే నేను మళ్లీ నజియా దగ్గరకు వెళ్లాను' అనన్య చెప్పడం ఆపేసింది. కాసేపు మౌనంగా ఉంది.

మా మధ్య నిశ్శబ్దం భయంకరంగా ఉంది.. దాన్ని ఛేదించేందుకు 'అన్నూ.. చెప్పు..

*నజియా దగ్గరకు వెళ్లాక ఏం తెల్సింది?' అని అడిగాను.*

*ఒక నిట్టూర్పు తర్వాత అనన్య ఇలా చెప్పడం మొదలెట్టింది.*

*'ప్రియ ఒక అనాథ. నజియా ఆమెను చేరదీసి పెంచింది. సోషల్ వర్క్ అంటే ప్రియకు ఆసక్తి. అందుకోసమే ముంబై టాటా ఇనిస్టిట్యూట్‌లో ఎం.ఏ. చదివేందుకు వెళ్లింది. అక్కడే కార్తీక్ పరిచయం అయ్యాడట. కార్తీక్ తనను ప్రేమిస్తున్నాడని, త్వరలో తీసుకొస్తానని సెలవుల్లో వచ్చినప్పుడు చెప్పిందట. కార్తీక్ ఎవరో తెలిస్తే నువ్వు ఆశ్చర్యపోతావని నజియాతో ప్రియ అందట. ఆ ఆశ్చర్యం కోసం ఎదురు చూస్తున్న నజియా ప్రియ శవమై తిరిగి రావడం చూసి తట్టుకోలేకపోయిందట. ఆ ఆశ్చర్యం వెనుక ఒక విషాదం దాగి ఉందని నజియాకు ఇప్పటికీ తెలియదు. కేవలం నా ఒక్కదానికే తప్ప. ప్రియ చావుకు తాను ప్రేమించిన రామస్వామి మనవడే కారణమని ఆమెకు తెలిస్తే తట్టుకోలేదు.*

*'ఏంటా విషాదం.. ఇంతకీ ప్రియ ఎలా చనిపోయిందో తెలిసిందా?'*

*'తెలుసు.. ప్రియ శవంతో పాటు ఆమె వస్తువులు కూడా తెచ్చి ఇచ్చారట ముంబై పోలీసులు. ఒక కార్ యాక్సిడెంట్‌లో చనిపోయింది, అందుకు కారణమైన వారిని అరెస్టు చేశాం.. అని చెప్పారట. ప్రియ హాస్పిటల్ బెడ్ మీద ఇచ్చిన మరణ వాగ్మూలం రికార్డ్ చేశారట పోలీసులు. ఒక సందేశం నజియాకు చేరాలని ఆమె చివరగా కోరిందట.*

*ఆ సందేశాన్ని ఒక కాగితం మీద రాసిచ్చారు పోలీసులు. ఆ కాగితం నజియా నాకు చూపించింది. దాని మీద ఇలా రాసి ఉంది.*

*యూజర్ నేమ్ : నజియా సుల్తానా*

*పాస్‌వర్డ్ : కార్తీక్ రామస్వామి' అని అన్నూ నా చేయి పట్టుకుని లోపలికి తీసుకొచ్చింది. సోఫా మీద కూర్చుమని సైగ చేశాక, తన ల్యాప్‌టాప్ తీసుకొచ్చింది.*

*'ఆ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ దేనివా? అని చాలారకాలుగా సెర్చ్ చేశాను. వదులుతానా? చివరికి గూగుల్ డ్రైవ్‌ది అని తెలిసింది. అందులో కార్తీక్ గురించి ప్రియ రాసుకుంది. అదేంటో.. ఇదిగో నువ్వూ చదువు' అంటూ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ టైప్ చేసి ఎంటర్ నొక్కింది అనన్య.*

♦♦♦

# 17

# కార్తీక్ ప్రేమలో ప్రియ

కార్తీక్!

నువ్వే నా జీవితం అయిపోతావని నేను ఎప్పుడూ అనుకోలేదు. నిన్ను మొదట్లో కేవలం రిచ్ కిడ్‌గానే చూశాను. నువ్వు చాలాసార్లు నాకు ప్రపోజ్ చేశావు. కానీ నేనెప్పుడూ ఒప్పుకోలేదు. అలాంటి నేను సడన్‌గా నీతో డేటింగ్‌కు ఎందుకు ఒప్పుకున్నానో తెలుసా?

ఆ రోజు.. నువ్వు మా కాలేజ్‌కు వచ్చావ్. 'ప్లీజ్! ఒక్క ఐదు నిమిషాలు మాట్లాడు' అని రిక్వెస్ట్ చేశావ్. నేను అయిష్టంగానే ఒప్పుకున్నాను. కానీ క్యాంటీన్‌లో కూర్చుని మాట్లాడుతున్నప్పుడు నేను గమనించాను. నా బుక్స్ కింద పడితే వంగి తీసుకుం టున్నప్పుడు నీ కాలికి ఆరు వేళ్లు ఉండడం చూశాను. ఆశ్చర్యపోయాను. ఆ తర్వాతే నీ గురించి ఆరా తీయడం మొదలెట్టాను.

నేను టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ వర్క్‌లో చదువుకోవడానికి వచ్చాను. కానీ నేను ఎక్కడి నుంచి వచ్చానో నీకు తెలుసా బావా? నేను ఎవరి దగ్గర పెరిగానో నీకు తెలిస్తే ఆశ్చర్యపోతావ్. నీ గురించి తెలుసుకోవడం మొదలెట్టాకే నాకు అర్థమైంది

నువ్వు నా బావవి అని. మీ కోసం అక్కడ ఒక ప్రాణం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నది. నజియా, ఎవరో నీకు తెలుసా? తెలియకపోవచ్చు. కానీ ఆమె గుండె మీ కోసం ఇంకా రంగక్కగా కొట్టుకుంటోందని తెలుసా?

పాపం తను. ఎన్ని కష్టాలు పడిందో తెలుసా? ఏడ్చి ఏడ్చి ఆమె కళ్లలో కన్నీళ్లు కూడా ఇంకి పోయాయి బావ. ఎవరో ఉన్నారు.. నా కోసం ఎవరో వస్తారని ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. తను ప్రేమించింది మీ తాతయ్యనే అని నీకు తెలుసా బావా?

రామస్వామి ముంబైలో చనిపోయాడని పవార్ చెప్పాడట. కానీ ఆ మాట నజియా ఇప్పటికీ నమ్మదు. 'రామస్వామి చనిపోయాడంటే నమ్మలేకపోతున్నాను. తను ఎక్కడో అక్కడ బతికే ఉంటాడని నాకెందుకో అనిపిస్తోంది' అని తను నాతో చాలాసార్లు అన్నది.

తాతయ్య రామస్వామి కాలికి ఆరు వేళ్లు ఉంటాయని తనే చెప్పింది.

అవే ఆరు వేళ్లు నీ కాలికీ ఉండడం చూసినప్పుడు నా సంతోషానికి అవధులు లేవు. నువ్వు కచ్చితంగా రామస్వామికి సంబంధించిన వాడివే అనుకున్నాను. అదే నిజమైంది. నేను నిర్ధారించుకున్నాను. అందుకే అమ్మకు చెప్పాను. 'నేను కార్తీక్‌ను ప్రేమిస్తున్నాను. త్వరలో తీసుకువస్తాను. తను ఎవరో తెలిస్తే నువ్వు ఆశ్చర్యపోతావు.. ఆనందిస్తావు' అని. ఆ తర్వాతే నేను నీతో డేటింగ్‌కు ఒప్పుకున్నాను.

పెద్ద షిప్పులో.. సముద్రం మధ్యలోకి మనిద్దరమే వెళ్లాం. చుట్టూ నీరు.. పక్కన నువ్వు. ఈ ప్రపంచాన్ని గెలిచినట్లు అనిపించింది నీ తోడు. నాకింకేం అక్కర్లేదు అనిపించింది. ఆ క్షణాన అలా చనిపోయినా పర్లేదనిపించింది.

కానీ నువ్వు.. నిజంగానే నన్ను చంపేశావ్.

నన్ను కోరుకుంది కేవలం అందుకోసమేనా? ఆ ఒక్కపూట కోసమేనా? నేనూ అందరిలాంటి అమ్మాయినేనా?

ఛీ.. చంపేశావ్ బావా.. నన్ను... నా ప్రేమని.

మొండి, నువ్వు అనుకున్నది సాధించడం కోసం ఏదైనా చేస్తావ్. అమ్మాయిల్ని పొందడం కోసం ఎన్ని ఎత్తుగడలైనా వేస్తావ్. ప్రేమతో ఒకటవుదామనుకున్నాను. కానీ రక్తంతో నువ్వు నాతో కలిసి నన్ను వేరు చేశావ్.

నేను ఎందుకు ఒప్పుకున్నానో తెలుసా?

నీ రక్తం చూడలేక.

'అమ్మాయిల్ని పొందడమే గెలుపు కాదు బావా.. అదసలు గెలుపే కాదు.. బలుపు. డబ్బుంది ఏమైనా చేయొచ్చనే, ఎవరినైనా పొందొచ్చు అనే పొగరు. డబ్బుతో కొనలేనివి కొన్ని ఉంటాయి. అవేంటో తెలిసినప్పుడే నీకు జీవితం అంటే ఏంటో అర్థమౌతుంది' అని నేను అన్నప్పుడు కోపంగా అద్దాన్ని కొట్టావు. అది పగిలి నీ చేయి కోసుకుపోయి రక్తం కారుతున్నప్పుడు.. నేను తుడిచేందుకు దగ్గరికొస్తే ఎందుకు తోసేశావ్ బావా?

కోపంగా.. నువ్వు నన్ను అలా తోయడం..

నేను భరించలేకపోయాను. దూరమైపోతావేమో అనుకున్నాను. భయం వేసింది. అందుకే మౌనంగా అందుకు అంగీకరించాను.

ఇదిగో చూడు.. నువ్వు తుడుచుకున్న రక్తపు మరకల టిష్యూ పేపర్‌ను నాతో తెచ్చుకున్నాను. ఫ్రేమ్ కట్టించి నా హాస్టల్ గదిలో పెట్టుకున్నాను.

'నువ్వంటే నాకిష్టం. కానీ నీ మొహం ఇంకెప్పుడూ చూపించకు' అని నేను వచ్చేశాను కానీ నేను నిన్ను మర్చిపోలేను బావా!

నేను ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు?

నేను అమ్మకు ఇచ్చిన మాట ఎలా నిలబెట్టుకోవాలో అర్థం కావడం లేదు..

ప్రేమంటే కలిసి బతకడం మాత్రమే కాదని అమ్మని చూసి తెలుసుకున్నాను. నేనూ నీకోసం అలా బతికెయ్యనా?

అలా కాదు బావా! అక్కడ మీ కోసం ఎదురు చూస్తున్న మనిషి కోసమైనా మళ్లీ నేను నీకు దగ్గరవ్వాలి. కానీ నిన్ను ఇలా స్వీకరించలేను బావా! బాధగా ఉంది. అమ్మాయిల్ని ఆడబొమ్మగా చూసే నీ మనస్తత్వం నాకు నచ్చడం లేదు. 'అమ్మా'యిలో అమ్మ కూడా ఉంటుంది. ఈ అమ్మాయి ఓ అమ్మ కోసం ఉంది. నజియమ్మ అరవై ఏళ్లుగా మీకోసం ఎదురు చూస్తుంది. తనకోసం నువ్వు మారలేవా? అమ్మాయిలతో పొందే ఆనందం కంటే గొప్పది ఇంకేదో ఉందని నీకెలా చెప్పాలి?

నేను ఎలా పెరిగానో తెలుసా బావా? అమ్మ, నేను ఒక్క పూట భోజనంతో ఎన్ని రోజులు బతికామో తెలుసా? మేం రెండు పూటలు తినకపోతే అది నలుగురు చిన్నారులకు

పనికొస్తుందని కడుపు మాడ్చుకున్నామ్. ఉన్నదాంట్లో తింటూ.. అమ్మ అంత మంది అమ్మాయిల్ని చేరదీసి ఎలా చదివిస్తోందో తెలుసా? ఎలా తిండి పెడుతోందో తెలుసా? రూపాయి.. రూపాయికి ఆమె పడే వేదన నాకు తెలుసు.

కానీ నువ్వు నాతో ఒక్క పూట గడిపేందుకు 30 లక్షల రూపాయల షిప్పు బుక్ చేశావు. ఆ డబ్బుతో ఎంతమంది ఎన్నిరోజులు తృప్తిగా భోజనం చెయ్యగలరో తెలుసా నీకు?

ఇదే విషయం అంకుల్‌కు చెప్తే కన్విన్స్ అయ్యారు. అనాథ పిల్లలకు సహాయం చేయండని అడిగితే ఒప్పుకున్నారు. ఆ చెక్ ఇవ్వడానికి నువ్వు వచ్చినప్పుడే కదా నువ్వు నన్ను, నేను నిన్ను మొదటిసారి చూసింది. మన ఆ కలయికకు ఇంకేదో పరమార్థం ఉందని ఇప్పుడు కూడా నీకు అనిపించడం లేదా?

అదేంటో తెలుసుకోలేనంత కాలం.. నీకు నేను దగ్గరవ్వలేను బావా! తెలుసుకున్ననాడు నేను దూరమైపోతే ఏం చేస్తావు బావా?

ఏదో ఒకరోజు ఇది నువ్వు చదవాలని రాస్తున్నాను.

చదివిన రోజు తెలుసుకో..

'కోట్లు పెట్టి కొన్నా బూట్లు బూట్లే' అని.

♦♦

# 18

## కార్తీక్‌తో ఒకరోజు..

**కోట్లు** పెట్టి కొన్నా బూట్లు బూట్లే.. అని కార్తీక్ అర్థం చేసుకున్న ఏడాది తర్వాత..

అనన్య కారులో వెళ్తున్నాం. ఇబ్రహీం పట్నం మీదుగా.

అనన్య నాకు కొత్తగా కనిపిస్తున్నది. ఒక నజియా కోసం.. కథలో మరో కథానాయికగా. తను బ్లూ జీన్స్ మీద వైట్ టాప్ వేసుకుంది, మేం తొలిసారి ముఖాముఖి కలిసినప్పుడు వేసుకున్న డ్రెస్ అదేనని అనుకున్నాను, కానీ కాదు.

మాతాపితరుల సేవా కేంద్రం దాటాక 'ఇంతకీ ప్రియ ఎలా చనిపోయిందో తెలియలేదు నాకు' అన్నాను.

అనన్య అదోలా చూసింది. ఆ చూపు ఏమిటో అర్థం కాలేదు.

'అప్పుడు నాకూ తెలియదు' అన్నది.

'ఇప్పుడు తెలుసా?' అని అడిగాను.

'తెలుసు' అన్నది.

'చెప్పు మరి?'

తాను నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.. 'మరీ, దీనికంటే ముందు నీకు ఇంకో అనుమానం వచ్చి ఉండాలి కదా?' అని అడిగింది.

'ఏంటది?' అన్నాన్నేను.

'కార్తీక్‌ను బావా అని ప్రియ ఎందుకు పిలిచింది.. అనే అనుమానం రావాలిగా?'

'రావాలి.. వచ్చింది.. కానీ అడగను'

'ఎందుకో?' అని తన కనుబొమ్మలు దగ్గరికి చేసి, మూతి ముందుకు తెచ్చింది.

'సముద్రంలో ఉప్పు ఉంటుంది. కానీ ఉప్పులో సముద్రం ఉండదుగా' అన్నాన్నేను.

'అదేంటి! ఈ డైలాగ్ ఇక్కడెలా సింక్ అవుతుంది?' అని ఆశ్చర్యపోయింది.

'మరి.. నువ్వు చెప్పే డైలాగ్‌లు ఎన్నిసార్లు సింక్ అయ్యాయి చెప్పు' అడిగాను.

'యూ..' అని స్టీరింగ్ మీద ఎడమ చేయి తీసి నా భుజం మీద కొట్టింది.

నేను నవ్వాను.

'చెప్పు.. ప్రియ చావుకు కార్తీక్ ఎలా కారణం?' మళ్లీ అడిగాను నేను.

'కార్తీక్‌నే అడుగుదువు పదా!' అన్నది.

'కార్తీక్‌నా?'

'అవును కార్తీక్‌నే'

'అదేంటి.. కార్తీక్ ఇక్కడెందుకు ఉంటాడు?' ఆశ్చర్యంగా అడిగాను నేను.

'కార్తీక్ ఇప్పుడు.. ఇక్కడే ఉంటున్నాడు. దేవరకొండ లక్ష్మీబాయి తండాలో' చెప్పింది అనన్య.

'అవునా! నజియాతో ఉంటున్నాడా?'

'అవును.. కార్తీక్ ఇప్పుడు మారిపోయాడు. పూర్తిగా మారిపోయాడు. ముంబైలో ఆ కార్లు, బంగ్లాలు వదిలివచ్చాడు. ఇప్పుడు తండాల్లో మామూలు మనిషిగా బతుకుతున్నాడు. ఒక రైతుగా.. ఒక బడి పంతులుగా..'

'నమ్మలేకపోతున్నాను.. సిగరెట్ వెలిగించేందుకు లైటరే అక్కర్లేదు. అగ్గిపెట్టె ఉన్నా సరిపోతుందన్నమాట?'

'లైటర్.. అగ్గిపెట్టె?'

'ఈ డైలాగ్ ఇక్కడ సింక్ అవుతది. కార్తీక్ వెలగడానికి అంటే.. మారడానికి లైటర్‌లా లెటరే కాదు.. అగ్గిపెట్టెలా ఒక యూజర్‌నేమ్ పాస్‌వర్డ్ పనిచేసింది కదా..' అన్నాను.

'అవును.. కార్తీక్‌ను మార్చడానికి నాకు ఆరు నెలలు పట్టింది. మినర్వా సీసీ టీవీ ఫుటేజ్‌ను నేను ఎంత వింతగా చూశానో.. కార్తీక్ కూడా ఇప్పుడు అంతే వింతగా తనను తాను చూసుకుంటున్నాడు'

'అవునా! ఇంతకీ ప్రియ ఎలా చనిపోయిందో చెప్పలేదు' అడిగాను నేను.

'అబ్బా.. నువ్వు అటీటు పోయి ఫైనల్‌గా అక్కడికే వస్తావు కదా!' అన్నది అనన్య.

'మరి.. చెప్పొచ్చుగా..'

'అదే మాట కార్తీక్‌ను అడిగితే ఏమంటాడో తెలుసా? మద్యం మత్తులో చేసిన ఆ గత జన్మ తప్పు ఇప్పుడు నేను గుర్తు చేసుకోను అంటాడు..'

'మద్యం మత్తులో గత జన్మ తప్పు...? కార్తీక్ కారులో ప్రియ ఎందుకు వెళ్లింది?'

'మన కలయిక పరమార్థం ఏమిటో తెలుసుకోలేనంత కాలం నిన్ను నేను కలవలేను బావా! అని ఆ ఉత్తరంలో రాసింది కదా..? గూగుల్ డ్రైవ్‌లో..'

'కార్తీక్ ఇప్పుడు తెలుసుకున్నాడు కదా?'

'అనన్య ప్లీజ్! ఇప్పుడు కాదు.. అప్పుడు.. ఇక నిన్ను కలవను అని ప్రియ నిర్ణయించుకున్న తర్వాత.. మళ్లీ కార్తీక్‌తో ఎందుకు వెళ్లింది..?'

'ఎంతైనా మరదలు కదా! బావే వచ్చి అడుగుతున్నప్పుడు ఎలా కాదంటుంది?'

*'బావా! నిజంగానే ప్రియ కార్తీక్ మరదలా?'*

*'కాదా మరి?'*

*'ఎలా? ఎవరి కూతురు??'*

*'తెలియదు'*

*'మరి?'*

*'తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాడు'*

*'పార్ట్ 2?'*

*'కాదు.. కార్తీక్ ఒక కన్‌క్లూజన్ ఇచ్చాడు'*

*'ఏంటది?'*

*'నిన్ను నువ్వు తెలుసుకోవడం ఎప్పటికీ పూర్తికాదు'*

♦♦♦

# మాకు రాయండి..

కృతజ్ఞతలు. ఈ కథ పూర్తిగా చదివినందుకు ధన్యవాదములు. ఇప్పుడు మీ మనసులో ఏమనిపిస్తుందో.. ఈ కథ గురించి ఒక నాలుగు మాటలు రాయండి. మీ విలువైన అభిప్రాయం మాకు చాలా ముఖ్యం. మీ నుంచి వచ్చిన అభిప్రాయాల్లో మంచి అభిప్రాయం పంచుకున్న వారికి వాసిరెడ్డి పబ్లికేషన్స్ తరపున ఒక విలువైన బహుమతి అందుకోవచ్చు.

చిరునామా :
**నగేష్ బీరెడ్డి**
కేరాఫ్ వాసిరెడ్డి పబ్లికేషన్స్
బీ-2, టెలికాం క్వార్టర్స్, కొత్తపేట,
హైదరాబాద్ - 500060
సెల్ : *90005 28717*

# యాది.. మనాది

ఇది చదువుతున్నారంటే.. కచ్చితంగా ఇవి తెల్లకాగితం మీద రాసిన నల్ల అక్షరాలు మాత్రమే కాదని మీరు గ్రహించినట్లు నేను భావిస్తున్నాను. 208 పేజీల 'ఒక నజియా కోసం...' మీరు ఈ పుస్తకం చదవడం మొదలెట్టినప్పుడు 176వ పేజీలో ఆమె దొరికాక కూడా 205వ పేజీ చదువుతున్నందుకు కచ్చితంగా నేను మీకు రుణపడి ఉంటాను. నన్ను, నా పుస్తకాన్ని చదివిన మీరు.. ఇక పై నాకు ఆత్మీయులు. మీ గురించి ఇక్కడ రాయలేకపోతున్నందుకు కాస్త బాధగానే ఉంది.

ఇక్కడ నేను కొందరిని తప్పకుండా యాదికి తెచ్చుకోవాలి. ఈ పుస్తకం మీ చేతిలో ఉండడానికి వారు ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో.. కారణం కాబట్టి.

2010లో ఒకరోజు... జర్నలిస్టుగా.. విధి నిర్వహణలో భాగంగా ఒక వృద్ధాశ్రమానికి వెళ్లాను. మన అదృష్టం కొద్దీ చాలా వృద్ధాశ్రమాలు కమర్షియల్‌గా ఉంటాయి. దురదృష్టం కొద్దీ కొన్ని స్వచ్ఛందంగా సేవ చేసేవి కూడా ఉంటాయి. అలాంటి వాటిల్లో ఒకటి మాతాపితరుల సేవా కేంద్రం. అయినవారు ఎవరూ లేరని నిర్ధారించుకున్న వృద్ధులకు మాత్రమే అక్కడ చోటు ఉంటుంది. అలా ఎవరూ లేక.. ఇక ఎవరో వస్తారని ఎదురు చూడకుండా బతికే వాళ్లని నేను చూశాను. కానీ వారిలోనే ఒక పెద్దావిడ.. నా ఈ కథకు ప్రాణం పోసింది. ఆమె పేరు కనకమ్మ.

కనకమ్మ గురించి ఆ ఆశ్రమ నిర్వాహకుడు చాలాసేపు చెప్పాడు. ఆమెను ఎక్కడి నుంచి తీసుకొచ్చాడో.. ఆమె ఏమేం మాట్లాడిందో అన్నీ చెప్పాడు. కానీ ఆమె చెప్పిన ఒక మాట.. నా ఈ కథకు స్ఫూర్తి.

ఎవరూ లేని పండుటాకులు వారు. వారికీ ఓ గుండె చప్పుడు ఉంటుందని తెలిసింది. కనకమ్మ దగ్గర ఒక చిన్న బంగారు ఉంగరం ఉంది. ఎన్నేళ్లుగా.. ఎన్నాళ్లుగా... దాచి పెడుతున్నదో తెలియదు కానీ.. దాని గురించి ఒకరు వస్తారని.. వస్తే ఆయనకు ఇమ్మని.. లేదంటే.. ఇంతలోనే తను చనిపోతే సాంప్రదాయం ప్రకారం తన నోట్లో పెట్టి పూడ్చేయమని చెప్పింది. ఇక్కడ పూడ్చడం గురించి.. కాదు.. ఆమె ఒకరి కోసం ఎదురు చూస్తున్నది.. అనే పాయింట్ నన్ను ఐదేళ్లు కకావికలం చేసింది. ఆ వచ్చేది ఎవరో నాకు తెలియదు. ఎందుకొస్తారో కూడా తెలియదు. కానీ వస్తాడు అనే ఒక నమ్మకం మీద ఆమె బతుకుతున్నది. ఈ నేపథ్యం నుంచి ఒక కథ వేళ్లానుకోవడం మొదలైంది.

ఆమెనే అడిగితే కథ ఇంకోలా ఉండేదేమో.. కానీ నేనెప్పుడూ అడగలేదు. అసలు ఆమె బతికి ఉందో లేదో.. కూడా తెలుసుకునే ప్రయత్నం నేను ఇంత వరకూ చేయలేదు. ఎందుకంటే... ఆమె నా ఊహల్లో చనిపోకూడదు. తెలుసుకోవడం ఎంత సేపు.. ఆ ఆశ్రమ నిర్వాహకుడికి ఒక్క ఫోన్ కొడితే.. ఇప్పటికీ నిమిషాల్లో తెలుసుకోవచ్చు. కానీ ఆమె నా దృష్టిలో చనిపోకూడదు.. ఇంకే బతికే ఉంది. బతికే ఉండాలి. ఎందుకంటే ఆమే నా హీరోయిన్. ఈ కథలో కథానాయిక. ఆ కనకమ్మ.. నజియాగా నా ఊహల్లో ప్రాణం పోసుకుని బతికే ఉంది.

ఐదేళ్ల వేదన.. ఎన్నో నిద్ర లేని రాత్రులు.. మరెన్నో మలుపుల తర్వాత పుస్తకం ఇలా రూపుదిద్దుకుంది. ఈ కథలో కార్తీక్ నమ్మే మాటే నేనూ నమ్ముతాను. ఐదేళ్లుగా కదలని కథ.. ఐదు రోజుల్లో ఎందుకు కదిలిందో.. రాయడం మొదలు పెట్టాక.. ఎంత వేగంగా జరిగిందో.. నాకు తెలుసు.

నువ్వు ఏదైనా సాధించాలని బలంగా.. సంకల్పించుకుంటావో.. దాన్ని సాధించడంలో ఈ విశ్వం అంతా కుట్ర పన్ని నువ్వు సాధించడంలో సహాయం చేస్తుంది.

నాలో పరుసవేదిని చూసిన త్రిమూర్తులను రాచకొండ సాక్షిగా గుర్తుచేసుకుంటున్నాను.

రాయడం మొదలు పెట్టాక.. ఆదరణ పెరుగుతున్నా కొద్దీ నా బాధ్యత పెరిగింది. కథ మారుతూ ఉంది. మనుషులు.. చుట్టూ ఉండేవాళ్లు.. ఒత్తిడులు.. కోపాలు.. తాపాలు.. కన్నీరు.. కొన్ని వేల మరణాల తర్వాత ఒక జననం.. ఈ పుసక్తం. మొత్తంగా చాలా వేగంగా ఆ సంకల్పంతోనే జరిగింది.

ఒక నజియా కోసం.. ఎందరినో దూరం చేసుకున్నాను. ఎందరో దగ్గరయ్యారు కూడా. ఒక్కొక్కరిని పేరు పేరునా ఈ సందర్భంలో నేను యాదికి తెచ్చుకోవాలి.

'మహా యజ్ఞం చేస్తున్నావని పెన్ను పట్టి, ఎంత వరకు వొచ్చింది నజియా అని వెన్ను తట్టి ప్రోత్సహించిన గురు సమానులు నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్ రెడ్డి గారిని ముందుగా గుర్తు చేసుకోవాలి. అనన్యపర్వంలో చేతిలో అభరణం.. నిజ జీవితంలో చెయ్యి ఆయనదే.

నన్ను స్వేచ్ఛగా పుస్తకం రాసుకోనిచ్చిన నమస్తే తెలంగాణ యాజమాన్యానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

నా మానాన నన్ను కొడుకుగా గుండెల్లో దాచుకుని.. రచయితగా వొదిలేసిన మా అమ్మానాన్నలు.. సుజాత, సీతారాం రెడ్డి గార్లను..

నా భార్య నాగలక్ష్మి, నా కొడుకు గూగుల్ అలియాస్ అలోక్ బీరెడ్డిని..

నమస్తే 'జిందగీ' టీమ్ సౌమ్య నాగపురి, దాయి శ్రీశైలం, ప్రవీణ్ కుమార్ సుంకరి, అజహర్ షేక్, బాలు జాజాలను..

తమ్ముడు ప్రవీణ్ కూతురు చిరంజీవి అనన్యను..

పుస్తకం విడుదల రోజు వేసుకొమ్మని అందమైన టీషర్ట్ పంపించిన అజ్ఞాత అనన్యను..

క్యూరియాసిటీ కోసం కథతో డిస్టెన్స్ మెయింటెన్ చేసిన మా ఆపరేషన్స్ జీఎం.. అంతకు మించి ఆత్మీయుడు సీహెచ్ శ్రీనివాస్ అన్నను..

ఒక గెలుపు కోసం మలుపు చూపిన.. శాంతాపూర్ చిరంజీవి ప్రసాద్‌ను..

కథ అడకకుండా కథనంతో ఎన్నోసార్లు కలిసిన కందుకూరి రమేష్ బాబు భయ్యాను..

ప్రణీ ఫిల్మ్స్ తమ్ముడు ప్రణీత్ యండ్లూరిని..

శ్రావణ్ బావ, గడ్డం వినోద్ కుమార్, కిషన్ బంటి, కిరణ్ కుమార్ దాసరి సహాయం ఎప్పటికీ మర్చిపోలేనిది..

ఆసక్తిగా చదవడానికి అయిన కాడికి అందుకుని, మరో భాగం కోసం ఎదురు చూసిన నా అల్లుడు సాయి అభినవ రెడ్డిని..

ఎంతోమంది మిత్రులను పొందే అవకాశం కల్పించిన ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మా మార్క్ జుకెర్‌బర్గ్‌ను..

ఎడోబ్ వ్యవస్థాపకులు జాన్ వార్నాక్, చార్లెస్ గెస్కేను..

ఏడేళ్ల నుంచి 7.0 తప్ప మరో కొత్త వెర్షన్ తీసుకురాకపోయినప్పటికీ వోల్డ్ వెర్షన్‌లోనే వండర్ ఫుల్ ఫాంట్స్ ఇచ్చిన అనూ ఫాంట్స్ వారిని..

ప్రమోషన్ పోస్టులకు విసుక్కోకుండా లైకులు కొట్టి, కామెంట్లు చేస్తూ నన్ను రీఛార్జ్ చేసిన ఫేస్‌బుక్ మిత్రులకు, చూసి లైక్ కొట్టినా, కామెంట్ రాయని మిగిలిన మిత్రులను.. చూసీ చూడనట్లు.. తెలిసీ తెలియనట్లు ఉన్న మిగిలిన అందరినీ గుర్తు చేసుకుంటున్నాను.

♦♦♦